ఈనాడు

విజయవాడ 9-8-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 361
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





అందమైన పట్టుచీరల
కానుకలతో ఈ రాఖీ పండుగను
ఆనందంగా జరుపుకోండి...
Raksha Bandhan
అభిమానుల కోరికపై
1 కాదు, 2 కాదు లక్షల వెరైటీలు
శ్రావణ మాసంలో
ఆషాడం ధరలకే
శ్రావణ వేడుకలు
పండుగలు & వివాహ వేడుకలకై
కంచి పట్టుచీరల
సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్
తూకం పద్ధతిలో చీరల అమ్మకం
SUPER SRAVANAM KG SALE
ప్రతి పోచంపల్లి ఫ్యాన్సీ సారీస్ కొనుగోలుపై
2వ చీర ₹9 మాత్రమే
MRP ₹999/-
PER KG ₹400 PURE GEORGETTE SAREES
PER KG ₹500 PAVITRA SILK SAREES
PER KG ₹600 PATIYALA SILK SAREES
PER KG ₹800 ANIKA PATTU / NEELAM SILK SAREES
PER KG ₹950 JK PATDLA SILK SAREES
PER KG ₹1000 IKKAT SILK SAREES
PER KG ₹1100 ARMANI / SALONI SILK SAREES
PER KG ₹1200 ANU SILVER SILK SAREES
PER KG ₹1800 RM SILK SAREES
SRAVANAM SPECIAL KG PATTU SAREES
PER KG ₹1500 VASTRAKALA PATTU SAREES
PER KG ₹2300 PACIDI/LEPAKSHI PATTU SAREES
PER KG ₹2700 EKKATH PATTU SAREES
DESIGNER SAREES
1150 ₹345 DESIGNER SAREE COLLECTION
1250 ₹375 DESIGNER SAREE COLLECTION
1350 ₹405 DESIGNER SAREE COLLECTION
1450 ₹435 DESIGNER SAREE COLLECTION
1650 ₹495 DESIGNER SAREE COLLECTION
DESIGNER SAREE COLLECTION 70% OFF KOLKATA WORK SAREES
LADIES WESTERN WEAR & LEISURE WEAR
Buy 4 ₹500 NIGHTY
Buy 2 ₹999 COTTON DRESS MATERIAL
Buy 2 ₹1499 PATIYALA SUIT SET
Buy 3 ₹1599 PLAZZO SUIT SET
Buy 2 ₹1999 LEHANGAS
Buy 1 ₹245 GIRLS COTTON FROCKS
Buy 3 ₹695 GIRLS COTTON FROCKS
Buy 1 ₹445 GIRLS NIGHT WEAR
Buy 2 ₹795 GIRLS NIGHT WEAR
Buy 4 ₹450 BOYS SHORTS
Buy 5 ₹500 GIRLS T-SHIRTS
BOYS WEAR
Buy 1 ₹295 Buy 3 ₹745 BOYS T-SHIRT-NICKER
₹600 BOYS SHORTS
895 ₹448 BOYS CAPRI
695 ₹348 BOYS SHIRTS
1295 ₹648 BOYS PANTS
Buy 1 ₹445 Buy 2 ₹795 BOYS NIGHT WEAR
Buy 4 ₹550 BOYS SHORTS
Buy 4 ₹600 BOYS 3/4 PAJAMA
645 ₹323
1195 ₹598
GIRLS WEAR
Buy 4 ₹550 GIRLS T-SHIRTS
Buy 3 ₹550 GIRLS SHORTS
Buy 4 ₹595 BOYS T-SHIRTS
Buy 4 ₹600 GIRLS SHORTS
Buy 4 ₹650 GIRLS 3/4 PYJAMA
50% OFF GIRLS SKIRTS
MENS WEAR
*Conditions apply
ARROW FLYING MACHINE Buy 1 30% OFF Buy 1 GET 1 FREE
BLACKBERRYS Buy 1 30% OFF Buy 2 40% OFF Buy 4 GET 50% OFF
Pepe Jeans U.S. POLO ASSN. celio KILLER Buy 1 30% OFF Buy 1 GET 1 FREE
Arvind LINEN CLUB OCM GIZA HOUSE Raymond SÖKTAS DIGJAM
SUITING & SHIRTING 50% OFF
CRIMSOUNE CLUB Buy 1 30% OFF Buy 2 40% OFF Buy 4 GET 50% OFF
INDIAN TERRAIN Buy 1 20% OFF Buy 2 30% OFF Buy 3 GET 2 FREE
MONTE CARLO Buy 1 30% OFF Buy 2 40% OFF Buy 2 GET 2 FREE
turtle benetton Buy 1 30% OFF Buy 1 GET 1 FREE
Allen Solly parx Buy 1 20% OFF Buy 2 30% OFF Buy 2 GET 2 FREE
spykar Being Human Buy 1 40% OFF Buy 2 50% OFF
PETER ENGLAND Buy 1 25% OFF Buy 2 GET 1 FREE Buy 3 GET 2 FREE
అన్ని రకాల వస్త్రాలపై Upto 70% OFF
కంచి పట్టు చీరలు
కంచి సొసైటీ ధరలకే అమ్మకం
ధర్మవరం, ఆరణి, కంచి, ఉప్పాడ, పైతాని, పోచంపల్లి, పటోళ, రాజ్‌కోట్, జైపూర్, కోల్‌కత్తా, బెనారస్, ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, క్యాటలాగ్ శారీస్.
మెన్స్ ఎత్నిక్ వేర్ & కిడ్స్‌వేర్ పై అద్భుతమైన ఆఫర్లు.
R.S. Brothers™
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
TOLL FREE 1800 570 1999
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia

ఈనాడు

విజయవాడ 9-8-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 361 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వరాల తల్లికి వ్రతాల మాల!



తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆస్థాన మండపంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం కనులపండువగా జరిగింది. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేసి, బంగారు చీరను అలంకరించారు. ఉదయం వ్రత పూజలు నిర్వహించారు. సాయంత్రం అలంకార కోలీమండపైన అమ్మవార స్వర్ణరథంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, తిరుచానూరు

మాకూ ఓ రాఖీ



రాఖీ పండగ అనగానే అన్నా చెల్లెళ్లు లేదా అక్కా తమ్ముళ్ల మధ్య అనుబంధమే గుర్తుకొస్తుంది. సోదరులకు ప్రేమతో రక్షాబంధనంగా రాఖీ కట్టి దీవెనలతో పాటు కానుకలు అందుకుంటారు. వారి మధ్య ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక ఇది. తోడబుట్టినవాళ్ల మధ్య ఉండే ఈ ముచ్చట కేవలం అన్నాచెల్లెళ్లకే ఎందుకు పరిమితం కావాలి! అక్కాచెల్లెళ్ల మధ్య కూడా అదే ఆత్మీయత ఉంటుంది కదా అంటున్నారు ఈ కాలపు అమ్మాయిలు. న్యూక్లియర్ ఫ్యామిలీస్‌గా మారిన నేటి సమాజంలో అన్నదమ్ములు లేని అమ్మాయిలు తమ అక్కకో లేక చెల్లెలికో లేదంటే కజిన్‌కో 'రక్షాబంధనాన్ని' కట్టి మురిపెంపడుతున్నారు.

వివరాలు వసుంధర లో

క్రికెటోత్సాహం



విశాఖలో ఏపీఎల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ప్రముఖ మహిళా క్రికెటర్ మిథాలీరాజ్, ఏపీ తెదేపా, భాజపా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాధవ్, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నటుడు వెంకటేష్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్, చాముండేశ్వరీనాథ్ తదితరులు

5లో



రష్యాతో బంధం మరింత బలోపేతం

మోదీ-పుతిన్ నిర్ణయం.. ● ఇరువురు నేతల ఫోన్ సంభాషణ

అమెరికా సుంకాల మోత వేళ కీలక పరిణామం

దిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడుతున్న వేళ...రష్యాతో తన స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ అడుగులువేస్తోంది. భారత ప్రధాని మోదీ శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక బంధం బలోపేతంపై మాట్లాడారు. పెట్టుబడులు, వాణిజ్యం, ఆర్థిక విషయాలపై చర్చించుకున్నారని దిల్లీ, మాస్కోల నుంచి విడివిడిగా విడుదలైన అధికారిక ప్రకటనలు తెలిపాయి. ఇరు దేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో వారు తమ నిబద్ధతను చాటుకున్నట్లు తెలిసింది. ఉక్రెయిన్‌తో యుద్ధం తాజా పరిస్థితిని పుతిన్ వివరించగా శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న తన సూచనను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 'మిత్రుడు పుతిన్‌తో ఫలప్రదమైన సంభాషణ కొనసాగింది. పలు అంశాలపై వివరంగా మాట్లాడుకున్నాం. ఉక్రెయిన్ తాజా పరిణామాలు వివరించినందుకు కృతజ్ఞతలు' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రధాని మోదీ తెలియజేశారు. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని సమీక్షించామన్నారు. ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు వచ్చే పుతిన్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నట్లు రాసుకొచ్చారు. పుతిన్ భారత్ పర్యటన తేదీలపై కసరత్తు చేస్తున్నట్లు మాస్కో పర్యటనలో ఉన్న జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ వెల్లడించారు.

జిన్‌పింగ్, పుతిన్ సంభాషణ

ఉక్రెయిన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో సంభాషించారు. ఉక్రెయిన్ సంక్షోభం తాజా పరిస్థితిని వివరించడంతో పాటు ఇటీవల ఇదే అంశంపై అమెరికాతో కొనసాగిన సంప్రదింపుల వివరాలను జిన్‌పింగ్‌కు పుతిన్ తెలిపినట్టు రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెలాఖరులో చైనాలో నిర్వహించే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు పుతిన్ హాజరుకానున్నారు.

సుంకాల సమస్య తేలితేనే..

అప్పటిదాకా భారత్‌తో చర్చల ప్రసక్తే లేదు: ట్రంప్



వాషింగ్టన్: భారత్‌పై ఇప్పటికే రెండు దఫాల్లో 50 శాతం సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇంకా శాంతించలేదు. సుంకాల సమస్య పరిష్కారమయ్యేవరకూ భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలకు సిద్ధమవుతామని ప్రకటించారు. 'ఆ సమస్య తేలనంత వరకూ భారత్‌తో సంప్రదింపులు ఉండవు' అని శ్వేతసౌధం ఓవల్ ఆఫీసులో గురువారం తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అమెరికా (మిగతా 2లో)

అది వ్యవస్థీకృత దోపిడీ

ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఈసీ రాజద్రోహం

మా సమయం వచ్చినప్పుడు ఎవర్నీ విడిచిపెట్టం

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యలు
- బెంగళూరులో నిరసన ర్యాలీ
- మీ ఆరోపణలపై డిక్లరేషన్ ఇవ్వాలంటూ రాహుల్‌కు ఎన్నికల సంఘం సూచన
- లేదంటే జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్



రాజ్యాంగమే మార్గదర్శకమని ప్రకటిస్తున్న ఖర్గే, రాహుల్

ఈనాడు, బెంగళూరు, దిల్లీ: ఎన్నికల సంఘం(ఈసీ), భాజపాపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమాన్ని (ఎస్ఐఆర్) వ్యవస్థీకృత ఓట్ల చోరీగా అభివర్ణించారు. ఈ దిశగా ఈసీ చేస్తున్నది రాజద్రోహం. ఐదుకు పాల్పడుతున్న వారిపై మా సమయం వచ్చినప్పుడు వదిలిపెట్టే దిలేదని హెచ్చరించారు. 'పేదల ఓటు హక్కులను హరించే లక్ష్యంతో ఈసీ.. భాజపాతో బహిరంగంగా కుమ్మక్కు. అవుతోందని తీవ్ర ఆరోపణలు చేశారు. కర్ణాటకలో పోటుచేసుకున్న ఓట్ల అక్రమాలపై స్థానిక ప్రభుత్వం విచారణ చేపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఓట్ల చోరీ అంశంపై తన సంతకంతో కూడిన రాతపూర్వక డిక్లరేషన్‌ను దాఖలు చేయాలని రాహుల్‌కు ఈసీ సూచించింది. తన యూట్యూబ్ చానల్‌లో విడుదల చేసిన వీడియోలోనూ, కర్ణాటక రాజధాని బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో 'ఓట్ల దోపిడీని నిరసిస్తూ కాంగ్రెస్ శుక్రవారం చేపట్టిన ర్యాలీ లోనూ ఆయన మాట్లాడారు.

'ఒక వ్యక్తి–ఒక ఓటు'ను కాలరాస్తున్న ఈసీ

'ఎన్నికల సమయంలో ఓట్ల దోపిడీకి పాల్పడటం ఓ నేరం. మీరు ఈ నేరం నుంచి తప్పించుకోలేరు. డేటాను దాచలేరు. కర్ణాటక ప్రభుత్వం ఈ అక్రమాలపై (మిగతా 2లో)

గాజా సిటీ స్వాధీనానికి

ఇజ్రాయెల్ పచ్చజెండా

నెతన్యాహు ప్రతిపాదనకు భద్రతా క్యాబినెట్ ఆమోదం

ఖండించిన ప్రపంచ దేశాలు

జెరూసలెం: దాదాపు 22 నెలలుగా కొనసాగుతున్న గాజా యుద్ధంలో మరో కీలక మలుపు. ఇప్పటివరకు హమాస్ నియంత్రణకు, బందీల విడుదలకు సైనిక ఆపరేషన్లను నిర్వహిస్తున్న ఇజ్రాయెల్ ఇక గాజాను పూర్తిగా తన సైనిక నియంత్రణలో తెచ్చుకునే దిశగా పావులు కదుపుతోంది. అందులో భాగంగా గురువారం భద్రతాపరమైన ఇజ్రాయెల్ క్యాబినెట్... గాజా సిటీని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రతిపాదించిన ఈ ప్రణాళికకు క్యాబినెట్‌లో మెజారిటీ సభ్యులు ఆమోదముద్ర వేశారు. "గాజా సిటీ స్వాధీనానికి ప్రత్యామ్నాయంగా తెచ్చిన ప్రతిపాదనను హమాస్ ఓటమి (మిగతా 2లో)



పాడేరులో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు

- ఐటీడీఏ పరిధిలో ఐదేళ్లలో విస్తరించేలా నూతన ప్రాజెక్టు
- ఉచితంగా విత్తనాల పంపిణీ
- నేడు సీఎం చంద్రబాబు పర్యటన

ఈనాడు, అమరావతి: గిరిజనుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోడు భూముల వ్యవసాయం చేయలేక ఇబ్బందులు పడుతున్న గిరిపుత్రులను 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు కాఫీ సాగు వైపు విస్తృతంగా మళ్లించి జీవనోపాధిగా మార్చారు. రానున్న ఐదేళ్లలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించేలా తాజాగా కొత్త ప్రాజెక్టుకు (2025-26 నుంచి 2030-31) ఆమోదం తెలిపారు. అంతర పంటగా మిరియాల సాగునూ లక్ష ఎకరాల్లో ప్రోత్సహించనున్నారు. మరో 75 వేల ఎకరాల్లో



ఇప్పటికే సాగవుతున్న కాఫీ పంటను పునరుద్ధరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాడేరులో శనివారం నిర్వహించే ఆదివాసీ దినోత్సవం కార్యక్రమంలో ఈ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రకటించనున్నారు. దీనికయ్యే మొత్తం వ్యయం రూ.202 కోట్లు.

ఉపాధి పథకం కింద షేడ్ ప్లాంటేషన్

■ 2015-16లో తెదేపా ప్రభుత్వం ప్రారంభించిన కాఫీ ప్రాజెక్టు 2023-24 నాటికి పూర్తయింది. 25 వేల ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో సాగు చేశారు. కూటమి ప్రభుత్వం సాగు విస్తరణపై దృష్టి పెట్టి అనుకూల భూములను గుర్తించింది.

■ లక్ష ఎకరాలు సాగుకు అనుకూలమని గుర్తించి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

■ కాఫీ పంట సాగుకు నీడ అవసరం. వెంటనే సాగు చేపట్టేలా 50 వేల ఎకరాలు సహజ షేడ్ కలిగి ఉన్నాయి.

■ మిగిలిన భూమిలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.108 కోట్లు వెచ్చించి షేడ్ ప్లాంటేషన్ చేయనున్నారు.

ఏటా రూ.1.50 లక్షల ఆదాయం

సాగుకు అవసరమైన విత్తనాలను కాఫీ బోర్డు నుంచి కిలోకు రూ.400 చొప్పున వెచ్చించి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఉచితంగా గిరిజన రైతులకు అందించనుంది. సాగు ప్రారంభించిన నాలుగేళ్ల నుంచి రైతుకు ఆదాయం ఉంటుంది. అంతర పంటగా సాగు చేసే మిరియాలతో కలిపి ఏటా రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం దక్కనుంది.

'సృష్టి' కేసులో మరో ముగ్గురు?

ఇప్పటికే కేజీహెచ్‌కి చెందిన ముగ్గురు వైద్యుల అరెస్టు

వీరిని కస్టడీకి తీసుకుని విచారించే అవకాశాలు

తాజాగా ముగ్గురు దళారుల అరెస్టు

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: సరోగసీ ముసుగులో ఎంతోమందిని మోసం చేసిన 'సృష్టి సంతానసాఫల్య కేంద్రం' కేసులో విశాఖ కేజీహెచ్‌కు చెందిన ముగ్గురు వైద్యులు అరెస్టవడం కలకలం రేపింది. ఇదే కేసులో మరో ముగ్గురు వైద్యుల పాత్ర ఉన్నట్లు గుర్తించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వారి బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలపై ఆరా తీస్తున్నారు. అరెస్టయిన కేజీహెచ్ వైద్యుల నుంచి ఆ ముగ్గురి సమాచారం రాబట్టేందుకు కస్టడీకి కోరే అవకాశాలున్నాయి. (మిగతా 2లో)

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు

జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్

వీరి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర



జస్టిస్ హరినాథ్ జస్టిస్ కిరణ్మయి జస్టిస్ సుమతి జస్టిస్ విజయ్

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న నలుగురికి శాశ్వత న్యాయమూర్తుల హోదా లభించింది. శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌ల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం ఆమోదముద్ర వేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నలుగురూ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 2023 అక్టోబరు 21 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అదనపు న్యాయమూర్తులుగా వీరి పదవీకాలం అక్టోబరు 20తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ఇటీవల కేంద్రానికి సిఫార్సు చేసింది. (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

శిక్ష నిందితులకా.. నాకా?

స్వేచ్ఛగా తిరుగుతున్న నిందితులు

హింస లేని పులివెందులను ప్రజలు కోరుకుంటున్నారు

మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత

అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఆంక్షల నిర్ణయం ఉపసంహరణ

ఆయనపై అపవాదు మోపటం తమ ఉద్దేశం కాదన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

సీజేఐ జోక్యంతో వివాదానికి తెర

గుట్టుచప్పుడు కాకుండా చల్లేయడమే!

చెరువుల్లో చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు

ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుందన్న నిపుణులు

తమిళనాడు నూతన విద్యావిధానంలో హిందీకి చోటులేదు!

ద్విభాషా విధానానికే మొగ్గు

యాసిడ్ తరలిస్తున్న ఆటో బోల్తా

ద్రావణం మీద పడి భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

నెల రోజుల్లో కొత్త రైల్వేజోన్ నోటిఫికేషన్!

- డిసెంబరు లేదా సంక్రాంతికి అపాయింటెడ్ డే?
- ద.మ.రైల్వే పునర్విభజన, ద.కోస్తా జోన్ ఏర్పాటు వేగవంతం
- కొత్త జోన్‌కి పీహెచ్‌ఓడీల నియామకం షురూ

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పునర్విభజన.. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు ప్రక్రియ వేగం అందుకుంది. కొత్త జోన్‌కు జూన్‌లో జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించిన రైల్వేబోర్డు ఇప్పుడు విభాగాధిపతుల(పీహెచ్ఓడీ)ల నియామకంపై దృష్టి సారించింది. ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (పీసీఈఈ)గా ఏపీ శర్మను బుధవారం నియమించింది. కొద్దిరోజుల క్రితం ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ (పీసీఎంఈ)గా అమిత్‌గుప్తాకు పోస్టింగ్ ఇచ్చింది. ఫైనాన్స్ విభాగ అధిపతిగా తూర్పుకోస్తా జోన్‌లో పనిచేస్తున్న ఓ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇలా వరుస నియామకాలు చేస్తోంది. మిగతా విభాగాలకు సైతం కొద్దిరోజుల్లోనే పీహెచ్ఓడీలను నియమించనున్నట్లు సమాచారం.

నోటిఫికేషన్ వెలువడిన 3–4 నెలల్లో..

పీహెచ్ఓడీల నియామకం పూర్తికాగానే ద.మ.రైల్వే పునర్విభజన, దక్షిణ కోస్తా కొత్త జోన్ ఏర్పాటుపై నోటిఫికేషన్ రానుంది. ఇది ఆగస్టు నెలాఖరులోగా లేదా సెప్టెంబరు తొలి వారంలో వస్తుందని రైల్వే వర్గాల సమాచారం. నోటిఫికేషన్ వెలువడిన 3-4 నెలల్లో 'అపాయింట్‌మెంట్ డే'ను ప్రకటిస్తారని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు. ఆ రోజు నుంచి ద.మ., ద.కోస్తా జోన్‌ల కార్యకలాపాలు వేర్వేరుగా జరుగుతాయి.

■ దక్షిణ కోస్తా అపాయింటెడ్ డే వచ్చే డిసెంబరులో లేదా (మిగతా 2లో)



జోన్లవారీగా డివిజన్లు..

రైల్వే జోన్	సవరించిన పరిధి
దక్షిణ మధ్య	సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్
దక్షిణ కోస్తా	విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్
తూర్పు కోస్తా	ఖుర్దారోడ్, సంబల్‌పూర్, రాయగడ (కొత్త డివిజన్)

ఇదీ సంగతి!



వెరీ సింపుల్! నాలాగే గ్రాఫ్ చేయండుకే.. అందరికోసం తగ్గులు పెట్టుకే.. నేను చేసినట్టే తనని నోబెల్‌కి సిఫార్సు చెయ్యి.. సరేనా!!

ప్రాచీన ఆలయాల రక్షణకు దీక్ష

- శ్రీకాళహస్తి, సింహాచలం, శ్రీశైలం గుడుల పరిరక్షణ
- పురాతన పద్ధతిలో మరమ్మతులు
- 200 ఏళ్ల వరకు ఢోకా లేకుండా పనులు
- పుణె ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సేవలు

ఈనాడు, కర్నూలు: భారతదేశం అంటేనే ఎన్నో పురాతన ఆలయాలకు ప్రసిద్ధి. అక్కడున్న అద్భుత శిల్పకళా సౌందర్యం.. కట్టడాల కోసం ఇక్కడి నుంచే కాకుండా దేశవిదేశాల నుంచి ఎంతోమంది భక్తులు, యాత్రికులు వస్తుంటారు. వందల ఏళ్లనాటి ప్రాచీన ఆలయాల పరిరక్షణ, మరమ్మతుల బాధ్యతలను భారతీయ పురావస్తుశాఖ (ఏఎస్ఐ) చేపడుతోంది. ఆ శాఖ పరిధిలో లేని ఆలయాలు, కట్టడాలు కూడా మరెన్నో ఉన్నాయి. అవి ఎక్కడైనా పాడైతే వాటిని నిర్వహిస్తున్న సంస్థలు అవగాహన లేమితో సిమెంట్, కాంక్రీటు వంటి వాటిని ఉపయోగించి మరమ్మతులు చేయిస్తుండడంతో వాటి నాణ్యత దెబ్బతింటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పుణెకు చెందిన 'శ్రీ వెంకటేశ్వర చారిటబుల్, రిలిజియస్ ట్రస్ట్' మన రాష్ట్రంలోని కొన్ని ప్రముఖ ఆలయాలను ప్రాచీన పద్ధతిలో మరమ్మతులు చేపట్టి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. ఆ ట్రస్ట్ ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు తెలుగువారు కావడంతో మన రాష్ట్రంలోని ఆలయాల పునరుద్ధరణకు (మిగతా 2లో)



ప్రాచీన పద్ధతిలోనే పనులు..

● ఎలాంటి నిర్మాణం శిథిలం కావడానికైనా ప్రధాన కారణం పైకప్పు దెబ్బతినడం. ప్రాకారాలు, గాలిగోపురాలు, రాతి స్తంభాలు, దూలాలు కూడా నీరు చొరబడితే పగుళ్లు ఏర్పడి కాలక్రమేణా దెబ్బతింటుంటాయి.

● వందల, వేల ఏళ్ల కిందట నిర్మించిన ఆయా కట్టడాలు.. అనాటి పద్ధతుల్లో నిర్మాణ సమయంలో ఉపయోగించిన పదార్థాలతో మరమ్మతులు చేస్తేనే అవి మరికొన్ని సంవత్సరాలపాటు చెక్కుచెదరవు.

● 'శ్రీ వెంకటేశ్వర చారిటబుల్, రిలిజియస్ ట్రస్ట్' ఈ మరమ్మతు పనులను ఉచితంగా చేయడానికి ముందుకు వచ్చింది.

అది వ్యవస్థీకృత దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేపడుతుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో ఒకటైన 'ఒక వ్యక్తి-ఒక ఓటు'ను ఎన్నికల కమిషన్ కాలరాస్తోంది' అని రాహుల్ 'ఓట్ల దోపిడీ' ర్యాలీలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మహారాష్ట్ర విధానసభ ఎన్నికల్లో ఓట్ల దందాకు సంబంధించిన సాక్ష్యాలను బయటపెట్టారు. అక్కడ లోక్‌సభలో ఓటేయని కోటి మంది ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేశారని వివరించారు. ఇదే తరహా అక్రమాలు కర్ణాటకలోనూ చోటు చేసుకున్నాయన్నారు. ఒకే వ్యక్తి కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్‌ల్లో ఓటు వేసినట్లు తమ అధ్యయనంలో తేలిందని వెల్లడించారు. ఇలాంటి ఓట్ల దోపిడీ దేశమంతా విస్తరించిందన్నారు. ఎన్నికల కమిషన్ పదేళ్ల ఓటర్ల జాబితాకు సంబంధించిన డిజిటల్ పత్రాలు, వీడియో చిత్రాలను బయటపెట్టాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఒకవేళ వారు బయటపెట్టకుంటే భాజపా విజయానికి నేరుగా సహకరించినట్లేనని ప్రకటించారు. తన సంతకంతో కూడిన డిక్లరేషన్‌ను సమర్పించాలన్న ఈసీ డిమాండ్‌ను రాహుల్ తప్పుపట్టారు. రాజ్యాంగాన్ని రక్షిస్తానంటూ పార్లమెంటులో తాను ప్రతిజ్ఞ చేశానని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్‌ల్లో ఈసీ వెబ్‌సైట్లు పనిచేయడంలేదని, అందులోని సమాచారంపై ప్రజలు ప్రశ్నించడం మొదలెడితే వారి వ్యవస్థ కుప్పకూలుతుందని గ్రహించడమే దానికి కారణమన్నారు.



బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

చోరీని పట్టుకున్నామనే ఎస్ఐఆర్ తీసుకొచ్చారు

'మేము ఈసీ చేస్తున్న చోరీని పట్టుకున్నాము. అది తెలుసు కాబట్టే ఈసీ బిహార్‌లో ఎస్ఐఆర్‌ను తీసుకువచ్చింది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఈసీ, భాజపా కుమ్మక్కు అయ్యాయి' అని రాహుల్ తన యూట్యూబ్ వీడియోలో పేర్కొన్నారు. దేశంలోని వివిధ నియోజక వర్గాల్లో జరిగిన 'ఓట్ల చోరీ'పై కాంగ్రెస్ చేసిన దర్యాప్తుపై యూట్యూబ్ వీడియోలో వివరించారు. 'ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఈసీ తీరు రాజద్రోహం. మా సమయం వచ్చినప్పుడు, వాళ్లను కచ్చితంగా పట్టుకుంటాం. ఎవర్నీ విడిచిపెట్టం' అని రాహుల్ హెచ్చరించారు.

సోమవారం దిల్లీలో ర్యాలీ : ఖర్గే

ఎన్నికల వ్యవస్థను పరిరక్షించటమే తమ లక్ష్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ర్యాలీలో ప్రకటించారు. సోమవారం దిల్లీలో కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఈసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఈ అక్రమాలపై డేటాతో పాటు విచారణ చేపట్టాలని వినతిపత్రాన్ని అందిస్తామని తెలిపారు. మరోవైపు ఓట్ల చోరీ అంశంపై దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించేందుకు అనుసరించాల్సిన వ్యూహాన్ని నిర్ణయించడానికి కాంగ్రెస్ సోమవారం ఖర్గే నివాసంలో సమావేశం నిర్వహించనుంది.

సంతకం చేయకపోతే విశ్వాసం లేనట్టే: ఈసీ

తన ఆరోపణల మేరకు ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అక్రమ చేరికలు, తొలగింపుల వివరాలను తమకు అందజేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ (ఈసీ) శుక్రవారం కోరింది. ఓట్ల చోరీ విశ్లేషణ వాస్తవమని భావిస్తే తన సంతకంతో కూడిన డిక్లరేషన్‌ను దాఖలు చేయాలని సూచించింది. ఈ మేరకు ఈసీ వర్గాలు వెల్లడించాయి. డిక్లరేషన్ సమర్పించని పక్షంలో ఆయన జాతికి క్షమాపణ చెప్పాలని పేర్కొంది. సుప్రీం కోర్టు పరిష్కరించిన ఎన్నికల అక్రమాలపై పాత ఆరోపణలను రాహుల్ రీసైక్లింగ్ చేస్తున్నారని వ్యాఖ్యానించింది.

బిహార్ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలేవి?

మరోవైపు బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాలో ఓట్ల చేర్పులు, తొలగింపులపై ఇప్పటివరకు ఏ పార్టీ తమను సంప్రదించలేదని ఈసీ శుక్రవారం స్పష్టం చేసింది. ఓట్ల తొలగింపుపై విమర్శలు చేస్తున్న రాహుల్ సైతం ముసాయిదాపై ఇంతవరకు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని తెలిపింది. ముసాయిదాపై రాహుల్ తన అభ్యంతరాలను ఇప్పుడు కాకుండా ఎప్పటిలాగే బిహార్ ఎన్నికలు పూర్తయ్యాక మాత్రమే ఇస్తారేమోనని ఈసీ వ్యంగ్యాస్త్రాలు విసిరింది.

ప్రాచీన ఆలయాల రక్షణకు దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సొంత నిధులను వెచ్చిస్తున్నారు. పురావస్తుశాఖలో 38 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి కట్టడాల పరిరక్షణ విభాగ సంచాలకుడిగా ఉద్యోగ విరమణ చేసిన ఆర్.ఎస్.జామ్‌వాల్ ఈ ట్రస్ట్‌లో కీలకంగా వ్యవహరిస్తూ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఏయే ఆలయాల్లో?

- శ్రీకాళహస్తిలో రూ.6 కోట్లతో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో పైకప్పు పనులు చేశారు.
- సింహాచలంలో రూ.4 కోట్ల వ్యయంతో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టిన పైకప్పు పనులు పూర్తికావచ్చాయి.
- శ్రీశైలంలో 24 వేల చదరపు అడుగుల్లో పైకప్పు, స్తంభాల మరమ్మతు పనులు మొదలు పెట్టారు.
- తిరుపతిలో విజయనగర రాజుల కాలంలో నిర్మించిన అలిపిరి పాదాల మండపానికి మరమ్మతుల కోసం రూ.3 కోట్ల వరకు వెచ్చించనున్నారు.



పురాతన పద్ధతిలో కరక్కాయలు, బెల్లం, బెండకాయలు, సున్నం, జిగురు తదితరాలు వేసి తయారుచేస్తున్న మిశ్రమం

ఇలా చేస్తారు..

సున్నం, బెల్లం, కరక్కాయలు, బెండకాయలు, ఒకరకమైన చెట్టు జిగురు, జనపనార, మినపపప్పు తొట్లలో వేసి 20 రోజులపాటు నానబెడతారు. వాటన్నింటినీ కలిపి చిక్కటి జిగురులా తయారుచేస్తారు. ఆ మిశ్రమాన్ని పైకప్పుపై పూసి బంగాళా పెంకులు అతికిస్తారు. ఇక చుక్క నీరు కూడా లోపలకు చొరబడదు. చోళులు, పల్లవులు, కాకతీయులు, విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ఆలయాలు, కట్టడాలకు ఈ విధానాన్నే అనుసరించేవారు. ఇలా మరమ్మతు చేస్తే కనీసం రెండు శతాబ్దాలపాటు చెక్కుచెదరవు.

పురావస్తుశాఖ ప్రమాణాల ప్రకారమే చేస్తున్నాం

పురావస్తుశాఖ ప్రమాణాల ప్రకారమే పనులు చేస్తున్నాం. పురాతన పద్ధతులను అనుసరిస్తున్న కారణంగా ఆ ఆలయాలకు మరో 200 ఏళ్ల వరకు ఢోకా ఉండదు. – కె.మునిరత్నంరెడ్డి, సంచాలకుడు, శాసనాల విభాగం, పురావస్తు శాఖ

'సృష్టి' కేసులో మరో ముగ్గురు?

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు ఇదే కేసులో మధ్యవర్తులుగా వ్యవహరించిన విజయ, సరోజ, రత్న అనే ముగ్గురు మహిళలను తాజాగా అరెస్టు చేశారు.

వైకాపా నేత సోదరుడు కీలకం

'సృష్టి' కేసులో అరెస్టయిన డాక్టర్ వాసుపల్లి రవి కేజీహెచ్ ఎనస్థీషియాలజీ విభాగాధిపతిగా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. ఈయన మాజీ ఎమ్మెల్యే, వైకాపా విశాఖ దక్షిణ నియోజకవర్గ బాధ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ సోదరుడు. వైకాపా హయాంలో డాక్టర్ రవికి బదిలీ అయినా.. కొద్దిరోజుల్లో డిప్యుటేషన్‌పై తిరిగి కేజీహెచ్‌కే వచ్చారు. డాక్టర్ రవికి 'సృష్టి' బాగోతంలో డాక్టర్ నమ్రత భారీగా డబ్బులు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది.

కలిసి చదువు... కలిసి అక్రమాలు

డాక్టర్ రవి, ఇదే కేసులో అరెస్టయిన గైనకాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషాదేవి, డాక్టర్ నమ్రత కలిసి ఆంధ్ర వైద్యకళాశాల 1988 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. డాక్టర్ ఉషాదేవి సృష్టి కేంద్రంలో ప్రసూతి వైద్యం అందించేవారు. పిల్లల ఆరోగ్య స్థితిని పీడియాట్రీషియన్ డాక్టర్ విద్యుల్లత పర్యవేక్షించేవారని తెలుస్తోంది.

అమ్మిందెవరు? కొన్నదెవరు?

2018 నుంచి 2023 వరకు విశాఖ జడ్పీ రోడ్డులో ఒక భవంతిలో సృష్టి ఆసుపత్రి కొనసాగింది. 2023 తర్వాత దానిపక్కనే ఉన్న మరొక భవనంలోకి మార్చారు. కొత్త భవనంలో బోర్డు పెట్టకుండా 5,6 అంతస్తులను అద్దెకు తీసుకున్నారు. శిశువిక్రయాల్లో 80% అరకు, పాడేరు, ఒడిశా వంటి ఏజెన్సీ ప్రాంతాల నుంచి పిల్లలను తెచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సరోగసీ కోసం వచ్చిన వారి అండాలు.. వీర్యం సేకరించి, అద్దెగర్భం ఎవరిదో చూపించకుండా కథ నడిపేవారు. ఏజెన్సీలో గర్భిణులను గుర్తించి ముందస్తు ఒప్పందాలు చేసుకున్నాక, కాన్పు చేసి ఆ పిల్లలను డబ్బులిచ్చినవారికి 'సరోగసీ' పేరుతో అప్పగించారు. ఏజెన్సీలో పిల్లలను ఎవరు అమ్మారు? ఎవరు కొన్నారనే కోణంలో ఆరా తీస్తున్నారు.



గతంలో విశాఖ జడ్పీ రోడ్డులో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వహించిన భవనం ★ 2023 తర్వాత ఈ భవనంలో కొనసాగించారు

పాత టైరు.. పనికొస్తుంది గురూ!

ఆయిల్, కార్బన్, ఇనుముతో ఆదాయం

బాయిలర్లు, తారు ప్లాంటుల్లో వినియోగం



ఆయిల్ తీయడానికి సిద్ధం చేసిన టైరు ముక్కలు



టైర్ల నుంచి వేరుచేసిన ఇనుము

ఈనాడు, అమరావతి: అరిగిపోయిన టైర్లు ఎందుకూ పనికిరావని అనుకుంటే పొరపాటే.. వాటినుంచి చాలానే తీస్తున్నారు. ఆయిల్, కార్బన్, ఇనుము.. ఇవన్నీ వాటినుంచి వస్తున్నాయి. వీటిని తీసే పరిశ్రమలు విజయవాడ, విశాఖల్లో ఉన్నాయి. ముందుగా టైర్లను ముక్కలుగా కోస్తారు. అందులో ఉన్న ఇనుమును వేరు చేస్తారు. యంత్రంలో వేసిన టైర్లను 250-370 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడకబెడతారు. తర్వాత కార్బన్ వేరుచేసి ద్రవాన్ని కండెన్సర్‌లోకి పంపించి చల్లబరుస్తారు. ఆయిల్‌ను వడకట్టి నిల్వ చేస్తారు.



టైర్ల నుంచి తీసిన ఆయిల్

ఆదాయం, పర్యావరణ హితం: లీటర్ ఆయిల్ నాణ్యత, డిమాండ్ బట్టి రూ.65 వరకు అమ్ముతారు. 3వేల లీటర్లకు రూ.1.95 లక్షల వరకు ఆదాయం. ఐరన్ కేజీ రూ.16 చొప్పున రూ.12వేలు, కార్బన్ కేజీ రూ.6చొప్పున రూ.17,850 ఆదాయం వస్తుంది. రూ.2.25 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఈ పరిశ్రమలు విజయవాడ ఆటోనగర్‌లో నాలుగు, ఇబ్రహీంపట్నం మండలంలో రెండు ఉన్నాయి. విశాఖలోనూ ఒకట్రెండు చోట్ల ఉన్నాయి. ఈ మొత్తం ప్రక్రియలో ఏదీ వృథా కాదు.. పర్యావరణానికి కీడు చేసేదీ లేదు. పాతటైర్ల వల్ల కలిగే కాలుష్యాన్ని నివారిస్తున్నారు.

ఏం చేస్తారు?

టైర్ ఆయిల్‌ను తారు తయారీలో డీజిల్‌కి ప్రత్యామ్నాయంగా వాడతారు. డీజిల్ లీటర్ రూ.100కి పైగా ఉండగా ఇది రూ.65కే వస్తుండడంతో పెట్టుబడి తగ్గుతుంది. ఇంకా, అల్యూమినియం పాత్రలు, బెల్లం తయారీకి బాయిలర్స్‌లో వాడతారు. ఇనుమును ఛత్తీస్‌గఢ్, రాయపూర్‌లోని పరిశ్రమలకు ఎగుమతి చేస్తారు. కార్బన్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపుతారు. సిమెంట్ తయారీలో సున్నపురాయి, లేటరైట్‌ను వేడి చేసేందుకు బొగ్గుతో పాటు కార్బన్‌ను వేస్తారు. దీంతో పెట్టుబడి భారం తగ్గుతుంది.

గాజా సిటీ స్వాధీనానికి ఇజ్రాయెల్ పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

సాధ్యం కాదని, బందీల విడుదల కూడా జరగదని భద్రతా క్యాబినెట్‌లో మెజారిటీ మంత్రులు అభిప్రాయపడ్డారు'' అని నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గాజా యుద్ధం ముగించడానికి ఐదు సూత్రాల ప్రణాళికను కూడా క్యాబినెట్ ఆమోదించింది. ఆ ఐదు సూత్రాలేంటంటే.. 1.హమాస్ నిరాయుధీకరణ 2.బందీల విడుదల 3.గాజా నిస్సైనికీకరణ 4.గాజా భద్రతపై నియంత్రణ 5. హమాస్ లేదా పాలస్తీనా అథారిటీ లేని పౌరపాలన ఏర్పాటు చేయడం. గాజా యుద్ధాన్ని తక్షణం ముగించాలని.. హమాస్ చెరలోని 50 మంది బందీల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్ వ్యాప్తంగా ప్రదర్శనలు జరుగుతున్న సమయంలో ఈ వివాదాస్పద నిర్ణయాన్ని క్యాబినెట్ తీసుకోవడం గమనార్హం. గాజా సిటీని స్వాధీనం చేసుకోవాలని ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బ్రిటన్, చైనా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, బెల్జియం, జోర్డాన్, మాల్దీవులు, పోర్చుగల్ సహా పలు దేశాలు ఖండించాయి. గాజా యుద్ధంలో ఉపయోగించే సైనిక పరికరాలను తాము టెల్ అవీవ్‌కు సరఫరా చేయబోమని జర్మనీ పేర్కొంది.

ట్రంప్‌తో ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా: నెతన్యాహు

అమెరికా, భారత్ మధ్య సుంకాల విషయంలో ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆసక్తికరవ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఎలా వ్యవహరించాలో ప్రధాని మోదీకి కొన్ని సలహాలు ఇస్తానని అన్నారు. ''మోదీ, ట్రంప్.. ఇద్దరూ నాకు ప్రియమిత్రులే. ట్రంప్‌తో వ్యవహరించే విషయంలో మోదీకి కొన్ని సలహాలు ఇస్తా. అయితే, ఆ విషయాన్ని వ్యక్తిగతంగా మాత్రమే చెబుతా'' అని నెతన్యాహు పేర్కొన్నారు. గురువారం ఇజ్రాయెల్ ప్రధాని భారత జర్నలిస్టులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికా-భారత్ సంబంధాలు చాలా దృఢంగా ఉన్నాయని పేర్కొన్నారు. సుంకాల సమస్యను పరిష్కరించుకోవాలని ఇరుదేశాలకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో రూ.32,982 కోట్ల రైల్వే పనులకు డీపీఆర్

1,336 కి.మీ. మేర లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

వీటిలో 205 కి.మీ. కొత్త లైన్లు

మిగిలినవి రెండో, మూడో, నాలుగో లైన్లు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వివిధ మార్గాల్లో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, ప్రస్తుతమున్న లైన్లకు అదనంగా మరికొన్ని కలిపి మొత్తం 1,336.60 కి.మీ. మేర రైల్వే లైన్ల నిర్మాణానికి ఆ శాఖ అధికారులు.. రైల్వేబోర్డుకు ప్రతిపాదనలు పంపారు. వీటికి రూ.32,982 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో భద్రాచలం-కొవ్వూరు 70.30 కి.మీ., ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ-శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం 105.31 కి.మీ., అట్టిపట్టు-పుత్తూరు 30 కి.మీ. (ఏపీ పరిధిలో) కలిపి మొత్తం 205.61 కి.మీ. కొత్త లైన్లు ఉన్నాయి. మిగిలినవి.. వివిధ ప్రధాన మార్గాల్లో రద్దీ పెరగడంతో అదనంగా రెండు, మూడో, నాలుగో లైన్ల నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపారు.

భద్రాచలం-కొవ్వూరు లైన్ రైల్వే నిధులతోనే.. భద్రాచలం-కొవ్వూరు కొత్త లైన్‌లో భాగంగా.. సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు 118.9 కి.మీ. నిర్మాణం చేయాల్సి ఉంది. భద్రాచలం రోడ్డు నుంచి సత్తుపల్లి వరకు ఇప్పటికే లైన్ నిర్మించారు. మిగిలిన 118.9 కి.మీ.లో తెలంగాణ పరిధిలో 48.58 కి.మీ., ఏపీ పరిధిలో 70.315 కి.మీ. ఉంది. ఈ మార్గం సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, పొంగుటూరు, చిన్నయ్యగూడెం, దేవరపల్లి మీదుగా కొవ్వూరు వద్ద విజయవాడ-విశాఖపట్నం లైన్‌లో కలుస్తుంది. ఈ ప్రాజెక్టుకు రూ.1,695.71 కోట్లు అవుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయంలో కొంత భాగం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు భరించాలని, లేకపోతే ఈ ప్రభుత్వాలే భూమిని సేకరించి ఇవ్వాలని రైల్వేబోర్డు తెలిపింది. కానీ, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం ఈ ప్రాజెక్టును పూర్తిగా రైల్వే నిధులతోనే చేపట్టాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది.

డీపీఆర్ అందజేసిన ప్రాజెక్టులివి

ప్రాజెక్ట్	కి.మీ.	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
భద్రాచలం-కొవ్వూరు కొత్త లైన్	70.30	1,695.71
ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ-ప్రశాంతినిలయం కొత్త లైన్	105.31	2,505.89
అట్టిపట్టు-పుత్తూరు కొత్త లైన్ (ఏపీ పరిధిలో)	30	179.17
నిడదవోలు-దువ్వాడ మధ్య మూడో లైన్	205.70	3,497.71
నిడదవోలు-దువ్వాడ మధ్య నాలుగో లైన్	230	10,294.46
నల్లపాడు-కృష్ణా కెనాల్ స్టేషన్ల మధ్య మూడో, నాలుగో లైన్లు	33.62	1,151.41
ఓబుళవారిపల్లి-రేణిగుంట మధ్య మూడో లైన్	53.97	1,365.04
ఓబుళవారిపల్లి-గుంతకల్లు మధ్య మూడో లైన్	254	3,606.70
ఓబుళవారిపల్లి-గుంతకల్లు మధ్య నాలుగో లైన్	256	5,207.98
ఇందుపల్లి, దుగ్గిరాల వద్ద బైపాస్‌లు	36.8	1,895.03
రేణిగుంట వద్ద రైల్ ఓవర్ రైల్ బ్రిడ్జ్	20	902.88
బళ్లారి-చిక్కజాజూరు రెండో లైన్ (ఏపీ పరిధిలో)	40.90	680.67
మొత్తం: 12 ప్రాజెక్టులు	1,336.6	32,982.65

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఈ నలుగురిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్.. ఈ నలుగురితో శాశ్వత న్యాయమూర్తులుగా త్వరలో ప్రమాణం చేయించనున్నారు.

■ ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులు నలుగురు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులైనట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

సుంకాల సమస్య తేలితేనే..

(మొదటి పేజీ తరువాయి)

మరిన్ని వెసులుబాట్లు కోరుకుంటుందా అని విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ జవాబిచ్చారు. ఈ నెల 25న దిల్లీలో భారత్, అమెరికాల మధ్య ఆరో దఫా ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు జరగాల్సి ఉంది. వ్యవసాయం, పాల ఉత్పత్తుల అంశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నందునే భారత్‌పై 25 శాతం సుంకాలతో పాటు అదనంగా పెనాల్టీ విధిస్తున్నట్లు గత వారం ప్రకటించిన ట్రంప్ మళ్లీ అదే కారణాన్ని చూపుతూ మరో 25 శాతం సుంకాల భారాన్ని మోపారు. అంటే రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేంత వరకూ వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు కూడా జరపరాదన్నది ట్రంప్ ఆలోచనగా తెలుస్తోంది.

గ్రహం అనుగ్రహం

9–8–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
పూర్ణిమ: మ. 1-31 తదుపరి బహుళ పక్ష పాడ్యమి
శ్రవణ: మ. 3-32 తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: రా. 7-32 నుంచి 9-07 వరకు
అమృత ఘడియలు: ఉ. 6-34 వరకు తిరిగి తె. 5-07 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 5-44 నుంచి 7-25 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.44; సూర్యాస్తమయం: సా.6.27
శ్రావణ పూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ, రాఖీ పూర్ణిమ, హయగ్రీవ జయంతి

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: విశాఖపట్నం చేపల రేవు సమీపంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎల్లాజీ, రంగారావు పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రావు తెలిపారు. మరో బాధితుడు సన్యాసిరావు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పులివెందులలో పోలింగ్ కేంద్రాలను మార్చొద్దు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైకాపా వినతి

ఈనాడు, అమరావతి: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా 6 పోలింగ్ కేంద్రాలను మార్చాలని ఎన్నికల అధికారి నిర్ణయించడం తగదని వైకాపా పేర్కొంది. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోకుండా చేసేందుకు కావాలనే ఈ కేంద్రాలను మారుస్తున్నారని ఆరోపించింది. 6-11 నంబర్ల పోలింగ్ కేంద్రాలను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించినట్లు వైకాపా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు.

రక్షణ కల్పించడంలో పోలీసుల వైఫల్యం: ఎమ్మెల్సీనైన తనకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ విమర్శించారు. హతమార్చేందుకే తనపైన, తమ పార్టీకి చెందిన వేల్పుల రాముపైన తెదేపా వర్గీయులు పాశవికంగా దాడి చేశారని ఆరోపించారు. నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజును విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఆయనతోపాటు పార్టీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, కవురు శ్రీనివాస్ ఉన్నారు. తర్వాత వారంతా అక్కడే విలేకర్లతో మాట్లాడారు.

నెల రోజుల్లో కొత్త రైల్వేజోన్ నోటిఫికేషన్!

(మొదటి పేజీ తరువాయి)

జనవరిలో (సంక్రాంతికి) ఉండొచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు.

■ ఆపరేషన్స్, కమర్షియల్, భద్రత, విజిలెన్స్, ఆర్పీఎఫ్, సివిల్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్స్, సిగ్నల్-టెలికాం, పర్సనల్, స్టోర్స్ విభాగాలకు పీహెచ్‌ఓడీలను నియమించాల్సి ఉంది.

విభజన తర్వాత..

ద.మ.రైల్వేలోని మూడు డివిజన్లతో పాటు.. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగంతో కలిపి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పడనుంది. ద.మ.రైల్వేలో 6 డివిజన్లు మూడుకు పరిమితమవుతాయి.

■ **రాయచూరు-వాడి సెక్షన్ (108 కి.మీ.):** ప్రస్తుతం గుంతకల్లు డివిజన్ పరిధిలో ఉంది. సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీచేస్తూ రైల్వేబోర్డు నిర్ణయం తీసుకుంది. కర్ణాటక నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైళ్లకు జోన్ ఇంటర్‌ఛేంజ్ పాయింట్లు రెండు నుంచి ఒకటికి తగ్గుతాయి. యడ్లాపూర్, యెమరాస్‌లోని థర్మల్ పాయింట్లకు బొగ్గురవాణా సులభం అవుతుంది.

■ **విష్ణుపురం-పగిడిపల్లి, విష్ణుపురం-జాన్‌పహాడ్ (142 కి.మీ.):** గుంటూరు డివిజనలో ఉన్న ఈ సెక్షన్లు సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అవుతుంది. సింగరేణి ప్రాంతం నుంచి విష్ణుపురం వరకు బొగ్గు రవాణా నిరంతరాయంగా కొనసాగుతుంది.

■ **కొండపల్లి-మోటుమర్రి (46 కి.మీ.):** సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ అవుతుంది. కొండపల్లి నార్ల తాతారావు పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా సాఫీగా జరుగుతుంది.

రూ.183 కోట్లతో దక్షిణకోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం

● 2024 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం భూమి అప్పగించింది

● దీని పరిధిలో గుంతకల్లు, గుంటూరు, విజయవాడ, వాల్తేర్ డివిజన్లు

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నం కేంద్రంగా రూ.183.58 కోట్లతో దక్షిణకోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన పలు ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. ''విశాఖపట్నం ముడసర్లోవలో 52.2 ఎకరాల భూమిలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం ఇటీవల పునాది వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమిని 2024 ఆగస్టులో రైల్వేకు అప్పగించింది. రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులను రూ.183.58 కోట్ల అంచనా వ్యయంతో మంజూరుచేశాం. జనరల్ మేనేజర్‌ను నియమించాం. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం(వాల్తేరు) రైల్వే డివిజన్లతో దక్షిణకోస్తా రైల్వేజోన్ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడును కవర్‌చేస్తుంది. ఈ రైల్వేనెట్‌వర్క్.. సహజవనరులున్న ప్రాంతం, విశాఖపట్నం పోర్టుతోపాటు తూర్పుకోస్తాలో పలు పోర్టులను కలుపుతూపోతుంది'' అని వివరించారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.5	29.0
తాడేపల్లిగూడెం	36.2	27.2
గుంటూరు	36.0	28.0
ఒంగోలు	35.7	26.6
నరసాపురం	35.6	26.4
తిరుపతి	35.4	22.6
విశాఖపట్నం	34.4	27.0
విజయవాడ	34.0	25.4
విజయనగరం	33.0	25.0
అనంతపురం	32.2	24.1


షార్‌లో నిర్వహించిన పరీక్ష

‘కలాం 1200’ తొలి స్టాటిక్ టెస్ట్ విజయవంతం

శ్రీహరికోట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరోస్పేస్ లిమిటెడ్‌కు చెందిన విక్రమ్-1 వాహకనౌక మొదటి దశ ‘కలాం 1200’ మోటారుకు సంబంధించిన తొలి స్టాటిక్ టెస్ట్ విజయవంతమైంది. ఈ టెస్ట్‌ను శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో శుక్రవారం నిర్వహించారు. విక్రమ్-1 వాహకనౌకకు సంబంధించిన వివిధ వ్యవస్థల్లో ఇదో ప్రధాన మైలురాయని ఇస్రో పేర్కొంది. ఈ మోటారు 11మీటర్ల పొడవు, 1.7 మీటర్ల డయా మోనోలిథిక్ కాంపోజిట్, 30 టన్నుల ప్రొపెల్లెంట్ ద్రవ్యరాశితో ఉంటుందని తెలిపింది.

పసుపు సాగుకు ప్రోత్సాహం

- 90 శాతం రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు
- ప్రాజెక్టుకు ప్రభుత్వ ఆమోదం

ఈనాడు, అమరావతి: సీతంపేట ఐటీడీఏ పరిధిలో పసుపు సాగును ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పసుపు విత్తనాలు, సాగుకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాలను 90 శాతం రాయితీతో అందించనుంది. మిగతా 10 శాతం లబ్ధిదారుని వాటాగా రైతు చెల్లించాలి. ఈ మేరకు 2026-27 ఏడాదికి సమగ్ర పసుపు ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏ పరిధిలోని 1000 ఎకరాల్లో పసుపు సాగు చేయనున్నారు. దీంతో 2 వేల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. దీని కోసం రూ.7.93 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రాజెక్టులో జాప్యం కాకుండా సాగుకు అవసరమైన పరికరాలు, ఇతర సామగ్రిని స్థానికంగా ఐటీడీఏ స్థాయిలోనే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చింది.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

- త్వరలో ‘అక్షర ఆంధ్ర’ కార్యక్రమం!
- మూడేళ్లలో 75లక్షల మంది వయోజనులను భాగం చేసేలా ప్రణాళిక

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు వయోజన విద్యాశాఖ ‘అక్షర ఆంధ్ర’ కార్యక్రమాన్ని చేపట్టింది. గతేడాది ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించిన సర్వేలో 81.14లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కింద నిధులు కేటాయించినందున మూడేళ్లలో 75 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు వయోజన విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఆమోదం లభించిన తర్వాత ఈ నెలలోనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని భావిస్తోంది.

అమలు ఇలా..

- గ్రామంలో స్వచ్ఛందంగా పనిచేసే ఒక్కో వాలంటీర్‌కు 10మంది చొప్పున నిరక్షరాస్యులను కేటాయిస్తారు.
- మొత్తం కార్యక్రమం వంద గంటలు ఉంటుంది. ఇందులో వీడియోలు 15గంటలు, తరగతి బోధన 40, వర్క్‌షీట్ ప్రాక్టీస్ 45గంటలు ఉంటుంది.
- అభ్యాసకుల సమయాన్ని అనుసరించి ఉదయం, రాత్రి తరగతులు నిర్వహిస్తారు. బ్యాంకింగ్, రవాణా, వ్యవసాయం, ఆరోగ్యం, పోషకాహారం, పిల్లల సంరక్షణ, ఆర్థిక అక్షరాస్యతలాంటి వాటిపై అదనంగా బోధిస్తారు.
- విద్యతోపాటు టైలరింగ్, ఆహార శుద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తారు.
- ఏడాదికి రూ.41.25లక్షల చొప్పున మూడేళ్లకు రూ.123.75కోట్లు ఖర్చు చేస్తారు. ఇందులో కేంద్రం 60%, రాష్ట్రం 40% నిధులు కేటాయిస్తాయి.

నిరక్షరాస్యుల్లో మొదటి ఐదు జిల్లాలు

జిల్లా	నిరక్షరాస్యులు (లక్షల్లో)
కర్నూలు	5.75(22%)
ప్రకాశం	4.45(19%)
పల్నాడు	4.38(21%)
అనంతపురం	4.30(17%)
శ్రీకాకుళం	3.79(16%)

చదువురాని వారు 81లక్షలు

- గ్రామ, వార్డు సచివాలయాల సర్వే-2024 ప్రకారం 15-59ఏళ్ల మధ్యలో చదువురాని వారు 81,14,598మంది ఉన్నారు. మొత్తం జనాభాలో ఇది 15.63%గా ఉంది. 15ఏళ్ల పైనుంచి అన్ని వయసుల వారిని తీసుకుంటే 1,20,68,709మంది ఉన్నారు.

అక్షరాస్యత రేటు

సర్వే	జాతీయ సరాసరి (శాతం)	ఏపీ సరాసరి (శాతం)	అత్యధిక అక్షరాస్యత ఉన్న రాష్ట్రం
జనగణన-2011	74.04	67.41	కేరళ(94%)
ఎన్ఎస్‌సీ-2017	77.7	66.4	కేరళ(96.2%)
పీఎల్ఎఫ్ఎస్-2023-24	80.9	72.6	మిజోరం(98.2%)

డీఎస్ఎన్ఎల్‌యూ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు


- నామినేట్ చేసిన హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్



ఈనాడు, అమరావతి: విశాఖపట్నం-సబ్బవరం వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ‘జనరల్ కౌన్సిల్’ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు నియమితులయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ కులపతి (ఛాన్స్‌లర్) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్.. ఆదినారాయణరావును జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ చేస్తూ ఈ నెల 6న ప్రొసీడింగ్స్ జారీచేశారు. ఈ నేపథ్యంలో ఆదినారాయణరావుకు డీఎస్ఎన్ఎల్‌యూ ఉప కులపతి (వైస్ ఛాన్స్‌లర్) డాక్టర్ డి.సూర్యప్రకాశరావు సమాచారమిచ్చారు.

- ఆదినారాయణరావు 1979లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 1979-82 వరకు బాపట్లలో ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత ప్రాక్టీసును హైకోర్టుకు మార్చారు. 1996-2000 మధ్య కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 1990లో బార్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలు అందించారు. 2011లో హైకోర్టు సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2013 నుంచి సుప్రీంకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. రాజ్యాంగ సంబంధ కేసులతోపాటు, క్రిమినల్, సివిల్, ఎన్నికల, సర్వీసు, మధ్యవర్తిత్వం తదితర కీలక కేసుల్లో వాదనలు వినిపించిన అనుభవం ఆయనకు ఉంది.

నూతన టెక్స్‌టైల్స్ పాలసీతో రూ.పది వేల కోట్ల పెట్టుబడులు, 1.51 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం సాగుతోందని పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య తెలిపారు.







సివిల్స్-2024 విజేతలకు సర్వీస్ కేటాయింపు

తెలుగు రాష్ట్రాల నుంచి 12 మందికి ఐఏఎస్.. ఏడుగురికి ఐపీఎస్

ఈనాడు, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్-2024లో విజేతలుగా నిలిచిన 875 మంది అభ్యర్థులకు ర్యాంకు, రిజర్వేషన్ ఆధారంగా యూపీఎస్సీ సర్వీస్‌లను కేటాయించింది. ఏప్రిల్‌లో వెల్లడైన సివిల్స్-2024 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 50 మందికిపైగా ఎంపికయ్యారు. వారిలో 12 మందికి ఐఏఎస్, ముగ్గురికి ఫారిన్ సర్వీస్, ఏడుగురికి ఐపీఎస్ కేటాయించారు. మిగిలిన వారికి ఐఆర్ఎస్, గ్రూపు ఏ సర్వీస్ దక్కింది. తొలి 100 లోపు ర్యాంకుల్లో ఐదుగురు తెలుగు అభ్యర్థులుండగా.. వారందరికీ ఐఏఎస్ కేటాయించారు.



ఈనాడు

న్యాయంకోసం... ఆడపడుచు ఆక్రోశం!

నేరాన్ని నేరంగా గుర్తించడంలో, దానికి బాధ్యులైన వారిని దండించడంలో నిష్పక్షపాతంగా వ్యవహరించడం ఆధునిక ప్రజాస్వామ్య రాజ్య ప్రధాన లక్షణం. అది మేడిపండు చందమైతే వ్యవస్థలపై ప్రజావిశ్వాసం సడలిపోతుంది. అంతిమంగా అది అరాచకాన్ని సృష్టిస్తుంది. అలాంటి సామాజిక కల్లోలం తలెత్తకూడదంటే- సత్వర న్యాయాన్ని ప్రజల ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగంగా అభివర్ణించిన న్యాయపాలిక ఆదేశాలకు మన్నన దక్కాలి. కానీ, సంవత్సరాల తరబడి దేకుతున్న కేసుల మూలంగా మన దేశంలో న్యాయం నిరాకరణకు గురవుతూ, బాధితుల గుండెలను కోసేస్తోంది. అలాంటి తీవ్ర ఆవేదనే వై.ఎస్.వివేకానంద రెడ్డి కుమార్తె సునీత మాటల్లో మొన్న వ్యక్తమైంది. 'మా నాన్న మళ్లీ రారు. హంతకులకు శిక్షపడేలా ఇంకెన్ని రోజులు న్యాయపోరాటం చేయాలి' అన్న ఆమె ప్రశ్నకు జవాబు ఇచ్చేదెవరు? ఒక మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ సీఎంకు సోదరుడైన వివేకాను హత్య చేసినవారినే ఇప్పటికీ శిక్షించలేకపోతే ఇక సామాన్యుల గతేంటి? తన తండ్రిని కిరాతకంగా కడతేర్చిన రాక్షసులను బోనెక్కించడానికి ఓ ఆడబిడ్డ ఆరేళ్లుగా ఒంటరిగా పోరాడాల్సి రావడం; అనేక వేధింపులూ బెదిరింపులను ఎదుర్కొంటూ ఆమె అలా న్యాయంకోసం కన్నీళ్లతో కొంగుచాచి అర్థించాల్సిన దుస్థితి దాపురించడమంటే- చట్టబద్ధమైన పాలన ఉన్నట్టా? లేనట్టా?

వివేకా హంతకులెవరో అందరికీ తెలుసు. నెత్తుటి మరకలను తుడిచేసి, సాక్ష్యాధారాలను చెరిపేసి ఆయన మరణానికి కారణం గుండెపోటు అని ప్రచారం చేసిన జగన్నాటక సూత్రధారులెవరో కూడా జనానికి తెలుసు. వివేకా హత్యకు కుట్ర చేసిన కాలాంతకులు వై.ఎస్.అవినాష్‌రెడ్డి, వై.ఎస్.భాస్కరరెడ్డి, డి.శివశంకర్‌రెడ్డిలేనని సీబీఐ తేల్చిచెప్పింది. అందుకు అనేక ఆధారాలనూ ఆ సంస్థ సేకరించింది. గూగుల్ టేకవుట్, సీసీ టీవీ ఫుటేజీ, సెల్‌ఫోన్లలోని సమాచారం... ఇట్లా ఎలక్ట్రానిక్ డేటాను భారీగా సేకరించి విశ్లేషించి మరీ అపరాధులెవరో సీబీఐ గుర్తించింది. వివేకా హత్య గురించి ప్రపంచానికి తెలియకముందే ఆ సంగతి జగన్ చెవిలో పడిందన్న కీలకాంశాన్నీ వెలుగులోకి తెచ్చింది. అయినప్పటికీ అసలు నిందితులు హాయిగా తిరుగుతున్నారంటే లోపం ఎక్కడుంది? సీఎంగా జగన్ తన అధికారాన్ని, ఏపీ పోలీసులను అడ్డుపెట్టి అవినాష్‌రెడ్డిని కాపాడారని ఆయన సోదరి వై.ఎస్.షర్మిలే చెప్పారు. వైకాపా అధినేత నిరంకుశాధికారం నిరుడు నేలమట్టమైన తరవాతా సునీతకు న్యాయం జరగడంలో సుదీర్ఘ జాప్యమెందుకు జరుగుతోంది? దీనికి జవాబు తెలుసుకోవడానికి ఏపీ ప్రజానీకం మొత్తం ఎదురుచూస్తోందిప్పుడు!

సొంత బాబాయ్ హత్య కేసుకు సంబంధించి జగన్ ఆడిన దొంగ నాటకాలు అన్నీ ఇన్నీ కావు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కావాలని గొంతు చించుకున్న ఆయన- సీఎం కాగానే 'సిట్' అంటూ ఏదో మసిపూసి మారేడుకాయ చేయబోయారు. పట్టువదలని సునీత పోరాటంతో కేసు సీబీఐ చేతిలోకి వెళ్లడంతో కేంద్ర దర్యాప్తు సంస్థకే చుక్కలు చూపించారు. అవినాష్‌రెడ్డిని నిందితుడిగా తేల్చిన సీబీఐ- కుట్రలో ఇంకెవరైనా ఉన్నారేమో తెలుసుకోవడానికి ఆయనను అరెస్టు చేసి విచారించడం చాలా అవసరమని రెండేళ్ల కిందట తెలంగాణ హైకోర్టుకు విన్నవించింది. అదే సీబీఐ మూడు రోజుల క్రితం సుప్రీంకోర్టుకు సమాచారమిస్తూ- వివేకా హత్యకేసులో తమ దర్యాప్తు పూర్తయిందని పేర్కొంది. అంతిమ కుట్రదారును తేల్చేలా దర్యాప్తును కొనసాగించాలంటున్న సునీత గోడు ఇక అరణ్యరోదనమేనా? న్యాయానికి అన్యాయం జరిగే పరిస్థితి రాకుండా న్యాయవ్యవస్థ, సీబీఐ, ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. వివేకా ప్రాణాలుతీసి చట్టంతో పరిహాసాలాడుతున్న వారందరినీ కటకటాల్లోకి నెట్టాలి!



నైపుణ్యాలను పెంచుకుంటూ, మేధోపరంగా మనల్ని మనం మెరుగుపరచుకుంటూ ఉండాలి. అలాగని సైన్స్ అండ్ టెక్నాలజీతో బుర్రని నింపేయకూడదు. విజ్ఞానంతో పాటు వినోదమూ కావాలి. భౌతిక, భావోద్వేగపరమైన అవసరాలనూ సమన్వయం చేసుకున్నప్పుడే జీవితం అర్థవంతంగా ఉంటుంది.

– అనూ ఆగా, వ్యాపారవేత్త

ఆత్మీయ రక్ష

శ్రావణపౌర్ణమి పర్వదినం నాడు జరుపుకొనే రాఖీపండుగ తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక. ఇంటి ఆడపడుచును మహాలక్ష్మి స్వరూపంగా భావించి ఆదరించే సంస్కృతి మనది. దానికి ఘనమైన నిదర్శనమే రక్షాబంధనం. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలను ఇనుమడింపజేసే ఈ పండుగలో భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యం ప్రకటితమవుతుంది. ఆడపిల్లల విషయంలో అన్నదమ్ములు ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలో గుర్తుచేస్తుంది. భారతీయ ధార్మిక గ్రంథాల్లోని వివిధ ఘట్టాలు రాఖీపండుగ ప్రాశస్త్యానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. త్రేత, ద్వాపర యుగాల్లో అక్కాచెల్లెళ్లే కాకుండా మాతృమూర్తి, అర్ధాంగి, ఇతర బంధువర్గ మహిళలు కూడా పురుషులకు రక్ష కట్టడం ఆనవాయితీ. కాలక్రమంలో ఆ సంప్రదాయం సోదరి, సోదరుల మధ్య రక్షాబంధనానికే పరిమితమైపోయింది.



రక్షాధారణలో ఆ జగద్రక్షకుడి రక్షణ దాగి ఉంటుందని సనాతన ధర్మం ఘోషిస్తోంది. ఓ మారు దేవేంద్రుడు రాక్షసులపై యుద్ధానికి సన్నద్ధమవుతుంటాడు. అప్పుడు ఆయన అర్ధాంగి శచీదేవి శ్రీమహావిష్ణువును పూజించి, భర్తకు అభయాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తుంది. వీర తిలకం దిద్ది రక్ష కట్టి సాగనంపుతుంది. ఇంద్రాణి రక్షాకంకణ ప్రభావంతో ఇంద్రుడు దిగ్విజయుడై అమరావతికి తిరిగొస్తాడు. ఈ ఉదంతాన్ని ధర్మరాజుకు గుర్తుచేస్తూ, అన్ని అశుభాలు రక్షాబంధనంతో తొలిగిపోతాయని సాక్షాత్తూ శ్రీకృష్ణభగవానుడే చెప్పాడన్నది పురాణ కథనం.

అంతర్యామి

శ్రీకృష్ణపరమాత్మ అవతార లీలల్లోనూ అన్నాచెల్లెళ్ల అనురాగబంధం సుమగంధమై పరిమళించింది. ఒకసారి గోకులనందనుడి వేలికి గాయమైనప్పుడు ద్రౌపది తన వస్త్రాన్ని చించి కట్టు కట్టింది. సోదరి స్పందనకు సంతసించిన సత్యాపతి, ఆ వస్త్రాన్నే రక్షాబంధనంగా భావించాడు. కౌరవుల నిండు కొలువులో పాంచాలికి అవమానం జరిగినప్పుడు ఆపద్బాంధవుడై అనుగ్రహించి రుణం తీర్చుకున్నాడు. మతాలకు అతీతంగా ఎందరో మహారాజులు రక్షాబంధన ఆచారానికి పెద్దపీట వేశారు. మహిళలకు పూజ్యస్థానాన్నిచ్చి, వారి మనోభావాలను గౌరవించారు, మనోభీష్టాలను నెరవేర్చారు. రక్షా శబ్దమే రాఖీ అయిందని పరిశోధకుల భావన. దేవతలను ఆదుకునేందుకు శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తిని బంధించాడు. ఆ విష్ణుబలమే రక్షాబంధనంలో నిక్షిప్తమై ఉందని నమ్మే భక్తులు రాఖీపౌర్ణమి శుభవేళ వామనావతార ఘట్టాన్ని స్మరించుకోవడం ఆనవాయితీ.

రక్షాబంధన పండుగను జంధ్యాలపూర్ణిమ, భద్రా అని కూడా పిలుస్తారు. కన్నడిగులు నార్లీపూర్ణిమ అని, తమిళులు, మలయాళీలు పావతి పూర్ణిమ పేర్లతో జరుపుతారు. పురుషుడు పరకాంతలో తోబుట్టువును చూసుకోగలిగే సంస్కారాన్ని అలవరచుకోవటమే రక్షాబంధనంలోని పారమార్థిక లక్ష్యం. పున్నమినాటి చంద్రుడిలా ఈ అన్నాచెల్లెళ్ల అనుబంధాలు కలకాలం శోభాయమానమై వర్ధిల్లాలని ఆశిద్దాం!

– బి.సైదులు

అబద్ధాల కోటను బద్దలు కొట్టాల్సిందే!

పహల్గాం ఉగ్రదాడిని తిప్పికొడుతూ భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాక్ సైన్యాధ్యక్షుడు మునీర్‌కు విందు భోజనం ఏర్పాటు చేయడం వంటి పరిణామాల క్రమంలో వెలువడిన 'ఎకానమిస్ట్' కథనం ఆసక్తి రేపుతోంది. మునీర్ ఇమేజ్‌ను అమాంతం పెంచడం కోసం రావల్పిండి సమాచార యంత్రాంగం సమన్వయంతోనే దీన్ని వండివార్చినట్లు అర్థమవుతోంది. ఒక పద్ధతి ప్రకారం ఇలాంటి కథనాలను ప్రచారంలోకి తేవడంలో పాక్ సైన్యం ఆరితేరింది. తమ పట్ల సానుభూతి కనబరచే మేధావివర్గాన్ని విదేశీ జర్నలిస్టులను పెంచిపోషించడమే కాదు- మధ్యవర్తుల ద్వారా తన సైనిక



బ్రిటన్ కేంద్రంగా వెలువడే 'ది ఎకానమిస్ట్' తాజాగా పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్‌ను ఆకాశానికెత్తుతూ ప్రత్యేక కథనం ప్రచురించింది. మునీర్ ఎదుగుదలను, తీరును వివరిస్తూనే ఆయనను అత్యంత విధేయుడిగా, కార్యదక్షత కలిగిన ధీరుడిగా, ఉగ్రవాదం నుంచి కాపాడే కోటగా ఒక అసాధారణ రీతిలో చిత్రీకరించింది. మునీర్‌ను పశ్చిమ దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా పేర్కొంది. ఈ కథనం ద్వారా ఏం చెప్పదలిచారనేదే కాదు, ఎందుకు చెప్పారన్నదీ గ్రహించాలి.

నాయకులకు ప్రచారం కల్పించడమెలాగో దానికి బాగా తెలుసు. మునీర్- పాకిస్థాన్‌ను రాజకీయ గందరగోళం నుంచి రక్షించడంతోపాటు ఉగ్రవాదాన్ని నియంత్రించగల సమర్థుడని, పశ్చిమ దేశాలతో సంబంధాలను పునరుద్ధరించగలరంటూ యథాప్రకారం 'సైనికుడు-రక్షకుడు' నమూనాలో ఆయనను చిత్రీకరించారు. దీనికి పశ్చిమాసియా, వాషింగ్టన్‌లలోనూ కొందరు విశ్లేషకులు వంత పాడుతూ మునీర్‌ను భౌగోళిక రాజకీయ ప్రయోజనకారిగా అభివర్ణిస్తున్నారు.

నిర్ణయాధికారం మునీర్‌దే!

ట్రంప్ అంశాన్నీ ఇక్కడ గమనించాలి. వాణిజ్యం, భద్రతా సహకారం, సరిహద్దుల నియంత్రణ వంటి అంశాల్లో తక్షణ ఫలితాలకు భరోసా ఇవ్వగల బలమైన వ్యక్తులతో వ్యవహారం చక్కబెట్టడాన్ని ఆయన బాగా ఇష్టపడతారు. ట్రంప్ యంత్రాంగం మునీర్‌ను పాకిస్థాన్ కొత్త ముఖంగా పరిగణించడం ద్వారా దౌత్యమార్గాన్ని సులభతరం చేసుకోవడంతో పాటు ఇస్లామాబాద్‌లోని నిజమైన అధికార కేంద్రంతో శ్వేతసౌధానికి ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరిచింది. ఈ విషయాలన్నింటినీ ఇండియా నిశితంగా గమనించాలి. ఎక్కడైనా విధానంలో మార్పు రావడానికి ముందు దృక్పథంలో మార్పు కనిపిస్తుంది. ప్రస్తుతం వాషింగ్టన్‌లో మునీర్ పరపతి పెరుగుతోంది. కాబట్టి, ఇటువంటి కథనాలను తిప్పికొట్టకపోతే, అవి చెప్పిందే నిజమనే భావన స్థిరపడుతుంది. నిజానికి మొన్న మేలో భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణ చోటుచేసుకున్న తరవాత మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా కట్టబెట్టారు. సంస్థాగత గుర్తింపుగా దీన్ని పైకి చెబుతున్నా, దాని వెనక ఉద్దేశం మాత్రం సుస్పష్టం. మునీర్‌ను గౌరవించడం ద్వారా భారత్‌ను పాకిస్థాన్ ఓడించిందనే ప్రచారాన్ని తన ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ఒక ఎత్తయితే- పాక్‌లో తిరుగులేని రాజకీయాధికారం సైన్యాధిపతిదేనని చాటుకోవడం మరొక ఎత్తు. ఏదిఏమైనా ఆసిమ్ మునీర్ పాకిస్థాన్‌లో సిసలైన నిర్ణాయాధికారిగా అవతరించారనడంలో సందేహం లేదు. అయితే వాషింగ్టన్‌తో మునీర్ నెగ్గుకురావడమనేది ఎన్నో షరతులపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా మునీర్ అమెరికాపై దీర్ఘకాలిక బాధ్యతలేవీ పెట్టకుండా, కేవలం స్వల్పకాలిక ఫలితాలతో సరిపెట్టుకుంటూ ఉండాల్సి వస్తుంది. మునీర్ వాషింగ్టన్‌ను ఆశ్రయించినా, చైనాను ఆయన వంతపాడాల్సి ఉంటుంది. బీజింగ్ పాకిస్థాన్‌కు రక్షణ భాగస్వామి మాత్రమే కాకుండా ఉదారంగా రుణాలిచ్చే దాతన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఒకవేళ ఆయన గరిష్ఠ లబ్ధి కోసం చైనా, అమెరికాలను పోటాపోటీగా వాడుకొంటే కాలం నాటి పంథాను పునరుద్ధరిస్తారేమో చూడాలి. 1970లో అమెరికా దౌత్యవేత్త కిసింజర్ చైనాకు తలుపులు తెరవడానికి పాకిస్థాన్ సాయపడింది. ఆ తరహాలో రెండు ప్రపంచ శక్తుల మధ్య వారధిగా ఇస్లామాబాద్‌ను నిలపవచ్చని మునీర్ భావిస్తుండవచ్చు. కానీ, ఇప్పుడు దుకు అవకాశాలు తక్కువే. వాషింగ్టన్‌కు మునీర్ చేసిన ప్రతిపాదనపై బీజింగ్ ప్రస్తుతానికి మౌనం పాటిస్తోంది. కానీ, తన పట్ల పాక్ వైఖరి మారితే మాత్రం- డాలా నిధుల అందజేతకు కోత విధించడంతో పాటు వ్యూహాత్మకంగా దూరం పాటించే అవకాశముంది. పాకిస్థాన్ ఆయుధాల సరఫరా, మారకద్రవ్య, వాణిజ్య ప్రాధాన్యాల గురించే కాదు... ప్రాంతీయ స్థిరత్వానికి ఉపకరించే శక్తిగా పాకిస్థాన్ సైనిక నమూనాను వాషింగ్టన్ పరిగణిస్తుండటమూ ఇండియాకు ఆందోళనకరమైనదే. భారత్ పట్ల మునీర్ వైఖరి ఏప్రిల్‌నాటి తన ప్రసంగంలోనే తేటతెల్లమైంది. కశ్మీర్‌ను పాకిస్థాన్ జీవనాడిగా ఆయన పేర్కొన్నారు. ఒక దేశంలో హిందువులు ముస్లింలు ఎలా కలిసి ఉంటారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన వాడిన భాష ఒకనాటి పాకిస్థాన్ సైనిక నియంత జియా-ఉల్-హక్ సైద్ధాంతిక భావజాలాన్ని ప్రతిధ్వనించింది. మునీర్ నేతృత్వంలో పాక్ సైన్యంలో మత ఛాందస, జాతీయవాద భావాలు ఎగదన్నుతాయని అర్థం చేసుకోవచ్చు. ఆయన ప్రసంగం తరవాత భారత్ విషయంలో పాక్ సైబర్ జోక్యం అధికమైంది. కశ్మీర్‌లో భారత సైనిక కార్యకలాపాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం పెరుగుతోంది. అయితే, భారత్ ఇప్పుడు వీటన్నింటినీ సహించే స్థితిలో లేదన్న వాస్తవాన్ని మునీర్ గుర్తుంచుకోవాలి. ఎంత వేగంగా, శక్తిమంతంగా, లక్ష్యాత్మకంగా భారత్ స్పందించగలదో ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.

భారత్ ఇప్పుడేం చేయాలి?

తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ ఆచితూచి వ్యవహరించాలి. మొదటగా వాషింగ్టన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలి. పాక్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టేలా అమెరికన్ చట్టసభ సభ్యులు, మేధావులు, మీడియాతో సంప్రదింపులు నిర్వహించాలి. రెండోది, భారత్ తన రక్షణ దౌత్యాన్ని వైవిధ్యీకరించాలి. ఫ్రాన్స్, ఇజ్రాయెల్, జపాన్, ఆస్ట్రేలియాలతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవాలి. మూడోది- తప్పుడు కథనాలు, ప్రచారంపై ఎదురుదాడి సాగించడం. ప్రాంతీయ స్థిరీకరణ శక్తిగా పాకిస్థాన్‌ను చిత్రీకరించడం ఎందుకు సరికాదో సాక్ష్యాధారాలతో సహా తిప్పికొట్టాలి. మునీర్‌కు ఇప్పుడు సంస్థాగతంగా మద్దతు, అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తున్నాయి. కాబట్టి, న్యూదిల్లీ అతిగా స్పందించకూడదు. అలాగని, తక్కువ అంచనా వేయకూడదు. మునీర్ వైఖరి ఎటువంటిదో గుర్తించడం, ముందుముందు పాకిస్థాన్ ఎలా వ్యవహరిస్తుందో గ్రహించి దానికి సిద్ధపడటమే ఇప్పుడు భారత్ చేయాల్సిన పని!



రాకేశ్ భాటియా

విశ్రాంత బ్రిగేడియర్

ఏ మాటకామాట చెప్పుకోవాలి. ఎవరైనా పొగిడితే భలే ఉంటుంది కదా! ఇంద్రుడు చంద్రుడని పొగిడించుకుంటే గానీ, అడుగైనా ముందుకు పడనివారూ, ముద్ద దిగని వారూ ఉంటారు. అందుకేగా రాజులు, రారాజులు వంది మాగధులను పెట్టుకునేవారు. ఇదేదో రాజుల వ్యవహారం అనుకోలేం. మన ప్రబంధ ప్రణయ భావసాహిత్యమంతా రమణీమణుల అందచందాలపై పొగడ్తలే

ఆహో... ఓహో..!



కదా! కోరిన వరాలు పొందాలంటే బోళా శంకరుడినైనా దేవదేవుడినైనా పొగడాల్సిందే. అంతో ఇంతో పొగడందే, అమ్మయినా అప్పచ్చులు పెడుతుందా? మనమంతా ఆ పొగడ్త సంస్కృతికి వారసులమే.

వాస్తవానికి పొగడటం, పొగిడించుకోవడం రెండూ కత్తి మీద సాముల్లాంటివే. కొందరు నేరుగా ముఖాన పొగిడేస్తే, మరికొందరు చాటుమాటుగా పొగుడుతారు. ఇంకొందరు, చిన్నచిన్న మోతాదుల్లో ఒక మత్తుపదార్థాన్ని అలవాటు చేసినట్టు, వారికి పొగడ్తలను అలవాటు చేసి, తమ పనులు చక్కబెట్టుకుంటారు.

పొగుడుతున్నారన్న అనుమానం ఇసుమంత రానివ్వకుండా, మునగచెట్టు ఎక్కించేయగల సమర్థులు ఉంటారు. దబ్బున కిందకుపడి నడుం విరగ్గొట్టుకున్నాక గానీ, ఆ మైకం వదలదు మనసు. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. మితిమీరిన పొగడ్తల వెనుక ఆంతర్యం గ్రహించలేకపోతే తరువాత నెత్తీనోరు కొట్టుకుని ఏం లాభం? కొందరేమో నోటితో పొగుడుతూ, నొసటితో వెక్కిరిస్తారు. కాస్త మెలకువగా ఉంటే వీరిని ఇట్టే పట్టేయచ్చు. అందుకే కాబోలు, స్థితప్రజ్ఞులు పొగడ్తకైనా, తెగడ్తకైనా తొణకరు బెణకరు. మనబోటి సామాన్యులమేమో చీటికిమాటికి 'ఆహో..! ఓహో..!' అని అనిపించుకోవాలని ఆరాటపడుతుంటాం. చిన్నప్పుడు అమ్మానాన్నల నుంచి, బడిలో ఉపాధ్యాయులు, పెద్దయ్యాక ఉద్యోగంలో, స్నేహబృందంలో పొగడ్తలకోసం చకోరపక్షుల్లా ఎదురు చూస్తుంటామన్నది సత్యం. ఎవరూ పొగడకపోతే సెల్ఫ్ డబ్బా ఉండనే ఉంది. తరతరాల పొగడ్త జిడ్డు ఎంత ఉతికినా వదిలేది కాదు.

మంచి పని చేసినప్పుడో, ఏదైనా సాధించినప్పుడో ప్రశంసో ప్రమోషనో, అవార్డో రివార్డో ఏదో ఒక ప్రతిఫలం ఆశించడం సహజం. కాకపోతే అది అత్యాశగా మారకూడదు. పొగిడించుకోవడం మొదలెడితే మనం గ్రహించేలోపలే అదొక వ్యసనమై కూర్చొంటుంది. ఒక్కోసారి పొగడ్తల ఉలితో చెక్కిన శిల్పాల్లా, 'మనం కాని మనం' ఆవిష్కృతమవుతాం. పొగడ్తల బూజును విదుల్చుకుని పూర్వస్థితిని చేరుకోవడం కఠిన సవాలు. అతిపొగడ్త ఆరోగ్యానికి మంచిది కాదు. అలాగే, ఎవరూ పొగడకపోవడం కూడా. అసలు గుర్తింపే దక్కలేదని దిగులుతో కుంగుబాటుకు లోనవుతారు చాలామంది. చిన్న ప్రశంస, ఒక ప్రోత్సాహక వాక్యం, ఎంత సంతోషాన్నిస్తాయో! ఆత్మబలాన్ని అమాంతంగా పెంచేస్తాయి.

ఏది ఏమైనా, పిల్లల పెంపకంలోనూ, మన వ్యక్తిత్వ నిర్మాణంలోనూ పొగడ్త పాత్ర పొగడ్తదే. అసలే సెల్ఫీ కాలం. అడిగి మరీ పొగిడించుకోవడం ఈ కాలపు ధర్మం! అయితే పొగడ్తకీ, ప్రశంసకీ నడుమనున్న ఆ చిన్న గీతను తెలుసుకుని మసలుకున్నవారే ధన్యులు. చెప్పొచ్చేదేంటంటే... పొగడ్తకి పొంగిపోకుండా, తెగడ్తకి కుంగిపోకుండా ఉండగలవాడే నేర్పరి సుమతీ అని!

– చంద్రలత

ప్రయాణమంటే నరకం

రైలు ప్రయాణికుల్లో సింహభాగం సాధారణ బోగీల్లోనే ప్రయాణిస్తున్నారు. వీరి సంఖ్యకు అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచట్లేదు. దాంతో అవి కాలుపెట్టడానికి సందులేనంతగా కిక్కిరిసిపోతుండటంతో సగటు జీవి నరకం అనుభవించాల్సి వస్తోంది. ఇంకోపక్క ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా స్లీపర్, ఏసీ కోచ్‌లు పెరగకపోవడం వల్ల పెద్దమొత్తంలో టికెట్లు క్యాన్సిల్ అవుతున్నాయి. కొవిడ్ సంవత్సరాలతో పాటు మిగిలిన ఏళ్లలో జనరల్ బోగీల్లో ప్రయాణించిన వారి సంఖ్య...

(కోట్లలో)



2020–21	99
2021–22	275
2022–23	553
2023–24	609
2024–25	651

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఆదివాసీ సాధికారతకు సాంకేతికత

ఆధునిక సాంకేతికతల రాకతో నేడు సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అయితే, టెక్నాలజీ అందించే ప్రయోజనాలు అందరికీ సమానంగా అందుతున్నాయా? అనే ప్రశ్న బలంగా వినపడుతోంది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని 'సాంకేతికత ద్వారా ఆదివాసీ సాధికారత' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తోంది.

ప్రపంచంలో 90కి పైగా దేశాల్లో 47.6 కోట్ల మంది ఆదివాసీలు నివసిస్తున్నారు. భారతదేశ జనాభాలో వారి సంఖ్య సుమారు 8.6శాతం. ప్రభుత్వాలు పలు పథకాలు, విధానాల ద్వారా ఆదివాసీ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నా, చివరి మైలు వరకూ చేరడంలేదు. విభిన్న భౌగోళిక పరిస్థితులు, భాషాపరమైన అంతరాలు, సదుపాయాల కొరత మూలంగా పలు ఆదివాసీ తెగలవారు విద్య, ఆరోగ్యం, ఉపాధి విషయాల్లో ఇంకా వెనకబడే ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆదివాసీ సమాజ సాధికారతకు సాంకేతికతను శక్తిమంతమైన సాధనంగా వినియోగించాల్సిన అవసరముంది.

డిజిటల్ దారుల్లో...

ఏ సమాజ అభివృద్ధికైనా మూలం- విద్య. పట్టణాలూ గ్రామాలకు దూరంగా ఉండే గిరిజన తండాలకు చదువులు పెద్దగా దరిచేరలేదు. అయితే, ఇటీవలి కాలంలో డిజిటల్ టెక్నాలజీ విద్యారంగంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చింది. డిజిటల్ పరికరాల వాడకం ద్వారా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరును సమర్థంగా పర్యవేక్షించడం వీలవుతోంది. దీక్షా, స్వయం, యూట్యూబ్ వంటి వేదికల ద్వారా ఇంటి దగ్గర ఉండి చదువుకోవడం వీలవుతోంది. ఇవన్నీ ఆదివాసీ పిల్లల చదువుకు కొత్త దారులను తెరిచినా, మారుమూల తండాలకు వీటిని దరిచేర్చడం ముఖ్యం. కొండ ప్రాంతాల్లో సాధారణంగా సికిల్ సెల్, మలేరియా వంటి వ్యాధుల తీవ్రత ఎక్కువ. అయితే, వీటిని సమర్థంగా గుర్తించేందుకు టెలిమెడిసిన్, మొబైల్ హెల్త్ యూనిట్లు, పోర్టబుల్ డయాగ్నస్టిక్ కిట్లు, మొబైల్ అంబులెన్స్ వంటి పరిష్కారాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి పట్ల గిరిజనులందరికీ అవగాహన కల్పించడం చాలా అవసరం.

మధ్యప్రదేశ్‌లో లహరి బాయి అనే బైగా తెగ మహిళ సంప్రదాయ జ్ఞానాన్ని డిజిటల్ సాధనాల ద్వారా ఇతరులకు పంచుతూ చిరుధాన్యాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె అరకలు, సామలు వంటి 150కి పైగా రకాల చిరుధాన్యాలను సేకరించి, ఇతరులకు అందజేస్తుండటం విశేషం. ఇలాంటి వారిని ప్రోత్సహించాల్సి ఉంది.



గోండీ, బైగా, వర్లీ వంటి ఆదివాసీ చిత్రలేఖన రీతులు వర్చువల్ ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ గ్యాలరీల ద్వారా ప్రాచుర్యం పొందుతున్నాయి. డిజిటల్ మ్యూజియాలు, ఆడియో-విజువల్ ఆర్కైవ్స్ వంటివి ఆదివాసీల భాషలను, పాటలను, గాథలనూ భద్రపరచి యువతలో తమ సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తున్నాయి. గిరిజన ఉత్పత్తులు, హస్తకళా వస్తువులు ట్రైఫెడ్, వనధన యాప్‌లు, ఇతర ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నేరుగా మార్కెట్‌కు చేరుతున్నాయి. యూపీఐ, మొబైల్ వాలెట్ల ద్వారా ఆర్థిక లావాదేవీలూ పెరుగుతున్నాయి. కానీ, వీటి ద్వారా లబ్ధి పొందుతున్న గిరిజనులు తక్కువేనని చెప్పాలి. డిజిటల్ సాంకేతికతల వల్ల ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత పెరగడంతో గిరిజనులు మోసపోవడం బాగా తగ్గింది. మరోవైపు, ఆదివాసీ పర్యాటకం ఇటీవల చాలామందిని ఆకర్షిస్తోంది. హోమ్‌స్టే, కళా ప్రదర్శనలు వంటి వాటికి వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వేదికలు, గూగుల్ మ్యాప్స్ ప్రాచుర్యం కల్పిస్తున్నాయి.


అధిగమించాల్సిన సవాళ్లెన్నో...

ఆదివాసీ సమాజాన్ని నేటికీ అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. మారుమూల గిరిజన తండాలకు విద్యుత్, రహదారి సదుపాయాలు సరిగ్గా ఉండటంలేదు. నిరక్షరాస్యతకు తోడు డిజిటల్ ఉపకరణాలు, ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడం, వాటిని ఎలా ఉపయోగించాలో తెలియకపోవడం వంటి సవాళ్లున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీల్లో ఇబ్బందులు, సైబర్ మోసాల బారినపడే ముప్పు అక్కడ ఎక్కువ. డిజిటల్ మీడియా ప్రభావం వల్ల ఆదివాసీ యువత తమ సంప్రదాయ, సాంస్కృతిక మూలాలకు క్రమంగా దూరమవుతుండటం విచారకరం. పర్యాటకం వల్ల గిరిజన ప్రాంతాల్లోనూ పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది. స్థానిక ఆదివాసీ భాషల్లో డిజిటల్ కంటెంట్, అధికారిక సేవల యాప్‌లు అందుబాటులో లేకపోవడం పెద్ద లోటు. కాబట్టి, ఆదివాసీ భాషల్లో డిజిటల్ కంటెంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు 'టెక్ ఫర్ ట్రైబల్స్' వంటి కార్యక్రమాల ద్వారా యువతకు డిజిటల్ నైపుణ్యాలను మప్పాలి. సమాచార భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచాలి. సాంకేతికత ఆదివాసీల అభివృద్ధికి సాధనంగా మారాలంటే- అది వారి భాష, సంస్కృతి పట్ల గౌరవంతో రూపుదిద్దుకోవాలి. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక పురోగతి మాత్రమే కాదనీ, అది సంప్రదాయ పరిరక్షణతో కూడిన ప్రగతియాత్ర అని గుర్తించాలి. ఆ దిశగా కృషి చేసినప్పుడే- సాంకేతిక ఫలాలు ఆఖరి మైలు రాయిని చేరి ఆదివాసీ సమాజం అభివృద్ధి మార్గంలో పరుగులు పెడుతుంది.

– డాక్టర్ రమేష్ బుద్ధారం

సహాయ ఆచార్యులు, ఇందిరాగాంధీ జాతీయ ట్రైబల్ యూనివర్సిటీ, మధ్యప్రదేశ్

అన్నయ్యకి రాఖీ..!



'కీర్తీ.. ఇక్కడ ఒక్కదానివే కూర్చుని ఏం చేస్తున్నావమ్మా! అందరూ బయట ఉన్నారు కదా!' అంటూ దగ్గరికి వచ్చారు తాతయ్య. 'ష్..! మెల్లగా మాట్లాడండి తాతయ్యా. మళ్లీ అన్నయ్య వస్తే వినిపిస్తుంది?' అంది కీర్తి. 'అలాగే కానీ.. ఇంతకీ నువ్వేం చేస్తున్నావు?' మళ్లీ అడిగారు తాతయ్య. 'నేనా.. అన్నయ్య కోసం రాఖీ తయారు చేస్తున్నా. ఇప్పుడే బయటికి వెళ్లాడు వచ్చేలోపు చేసేయాలి' బదులిచ్చింది కీర్తి. 'ఓ.. నేనేమైనా సాయం చేయనా?' అన్నారు తాతయ్య. 'మరేం పర్లేదు కానీ.. సరదాగా ఏవైనా కబుర్లు చెప్పండి' అంది కీర్తి. 'ఏం కబుర్లు చెప్పను.. రాఖీ పండుగ అంటే అన్నాచెల్లెళ్లకి, అక్కాతమ్ముళ్లకి సంబంధించింది కదా. అయితే ఇద్దరు అన్నాచెల్లెళ్ల గురించి చెప్పనా?' అన్నారు తాతయ్య.

'చెప్పండి.. చెప్పండి' ఉత్సాహంగా అంది కీర్తి. 'విలియమ్ హర్షెల్, కెరొలైన్ హర్షెల్ అన్నాచెల్లెళ్లు. ఇద్దరూ కలిసిమెలిసి చదువుకునేవారు, ఆడుకునేవారు. కెరొలైన్‌కి చిన్నప్పుడు ఆరోగ్యం బాగోలేకపోవడంతో వాళ్లమ్మ స్కూల్‌కి పంపించలేదు. దాంతో సంగీతం మీద పట్టున్న విలియమ్.. ఇంట్లోనే చెల్లికి, సంగీతం, గణితం నేర్పించడం మొదలుపెట్టాడు. కొన్నిరోజుల్లోనే ఇద్దరూ కలిసి మంచి ప్రదర్శన కూడా ఇచ్చారు. తరవాత చదువు మీద దృష్టి పెట్టి.. శాస్త్రవేత్త అయ్యారు విలియమ్. యురేనస్ గ్రహాన్ని కనిపెట్టింది ఆయనే. ఆయన అంత మంచి స్థాయికి రావడానికి కెరొలైన్ చాలా సాయం చేసేదట. ఆ తరవాత అన్నయ్య ప్రోత్సాహంతో కెరొలైన్ కూడా శాస్త్రవేత్త అయింది. ప్రపంచంలోనే మొదటి మహిళా ఖగోళ శాస్త్రవేత్తగా నిలిచింది తెలుసా!' అని చెప్పారు తాతయ్య. 'అవునా! భలే ఉన్నారు తాతయ్య ఈ అన్నాచెల్లెళ్లు.. ఒకరి గెలుపులో ఇంకొకరు సాయం చేసుకుంటూ చివరికి ఇద్దరూ ఉన్నత స్థానానికి చేరుకున్నారు' అంది కీర్తి. 'అంతేగా మరి! ఇంతకీ.. నీ రాఖీ తయారు చేయడం పూర్తయ్యిందా?' అన్నారు తాతయ్య. 'అయిపోయింది తాతయ్యా! ఇక అన్నయ్య రాగానే కట్టేయడమే!' అంది కీర్తి.

– హరిప్రియ

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'అల్లం'లో ఉంటాను కానీ 'బెల్లం'లో లేను. 'కల'లో ఉంటాను కానీ 'కలం'లో లేను. 'వారం'లో ఉంటాను కానీ 'వాన'లో లేను. 'వేటు'లో ఉంటాను కానీ 'వేట'లో లేను. ఇంతకీ నేనెవర్ని?
2. నేనో మూడక్షరాల పదాన్ని. 'సంత'లో ఉంటాను కానీ 'చెంత'లో లేను. 'గమ్యం'లో ఉంటాను కానీ 'సౌమ్యం'లో లేను. 'మతి'లో ఉంటాను కానీ 'మనం'లో లేను. నేనెవర్ని?

[illegible]

మాతృభాష ప్రాధాన్యాన్ని చాటి చెప్పండి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ప్రధాని మోదీ ఉద్బోధ



ప్రధాని నరేంద్ర మోదీకి లక్ష్మీదేవి ప్రతిమను అందజేస్తున్న మాధవ్

ఈనాడు, దిల్లీ: మాతృభాష తెలుగు ప్రాధాన్యం గురించి రాష్ట్ర పర్యటనల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏపీ భాజపా నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఉద్బోధించారు. మాతృభాషలో చదువుల వల్ల శాస్త్రీయ జిజ్ఞాస పెరగడంతోపాటు, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్న విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారి ప్రధానమంత్రిని కలిసి పార్టీకి, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని కితాబిచ్చారు. అధికారంలోకి వస్తే అంతు తేలుస్తామంటూ అధికారులను బెదిరిస్తున్న వైకాపా నాయకులపై పోలీసులు కేసులు పెట్టడాన్ని సమర్థించారు. "ప్రధానమంత్రి నరేంద్రమోదీని తొలిసారి కలిసిన సందర్భంలో రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, ప్రజలకు ఎదురవుతున్న సవాళ్లు ఏమిటనే దానిపై చర్చించాం. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మూలకూ వెళ్లాలి, ప్రతి వర్గానికీ చేరువ కావాలని ఆయన చెప్పారు. ప్రధానంగా మాతృభాష తెలుగును ప్రోత్సహించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ప్రధాని అడిగారు. ట్రంప్ సుంకాల ప్రభావం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆక్వా, పొగాకు ఉత్పత్తులపై పడుతుందని చెప్పాను. ప్రధాని స్పందిస్తూ మనకు ఇదో సంక్లిష్ట సమయం, ఎగుమతులకు అవకాశాలున్న దేశాలపై మనం దృష్టిసారించాల్సి ఉంది అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషిస్తున్నట్లు ప్రధానికి తెలిపాను" అని చెప్పారు. ఆగస్టు 30న స్ఫూర్తి పేరుతో సంచార జాతుల సదస్సు నిర్వహించబోతున్నట్లు మాధవ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 36 సంచార జాతులకు డీఎన్‌టీ సర్టిఫికెట్లు, స్థిర నివాసం, విద్య, సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వైకాపా అరాచకాల బాధితులను కలుస్తామని చెప్పారు.

ఏపీఎల్ సీజన్-4 ప్రారంభం

ఏపీ క్రీడాహబ్‌గా మారుతుందన్న కేంద్రమంత్రి



హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ నృత్య ప్రదర్శన

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) సీజన్-4 క్రికెట్ పోటీలను విశాఖపట్నం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం రాత్రి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సినీ నటుడు, ఏపీఎల్ ప్రచారకర్త వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ... "ఏపీఎల్‌కు విశాఖ వేదిక కావడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఆంధ్ర క్రికెట్ సంఘాన్ని, క్రీడా పోటీలను నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కూటమి పాలనలో ఆంధ్ర క్రికెట్ సంఘం కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతూ ఏపీఎల్ సీజన్-4ను ప్రారంభించడం అభినందనీయం. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రం క్రీడాహబ్‌గా తయారవుతుంది' అని చెప్పారు. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. విశాఖ స్టేడియం హోం జట్టుకు బాగా కలిసొస్తుందన్నారు. ఈ టోర్నీలో ప్రతిభ చూపేవారికి ఐపీఎల్‌లో అవకాశాలు దక్కుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి, ఎంపీ సానా సతీష్, విశాఖ, విజయనగరం ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాసరావు, మహిళా క్రికెటర్ మిథాలీరాజ్ తదితరులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన హీరోయిన్ ప్రగ్యాజైస్వాల్ నృత్య ప్రదర్శన, లేజర్ షో ఆకట్టుకున్నాయి. తొలిమ్యాచ్‌లో కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ జట్లు తలపడ్డాయి.

ఎంపీ, ఎమ్మెల్యేల కోర్టులో 19 కేసులు పెండింగ్

ఈనాడు, దిల్లీ: ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదయిన కేసుల విచారణ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఉన్న కోర్టులో 19 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో బాపట్ల తెదేపా ఎంపీ కృష్ణప్రసాద్ తెన్నేటి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 2020 నుంచి 2025 జూన్ 30 వరకు ఈ కోర్టులో 128 కేసులు నమోదైనట్లు చెప్పారు. అంతకుముందు నమోదైనవాటితో కలిపి ఇదే సమయంలో ఇక్కడ 211 కేసుల విచారణను పూర్తిచేసినట్లు వెల్లడించారు.

రైతు సమస్యలు పట్టవా?

విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు, పాలకులు మారినా రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని.. బడాబాబులకు పెద్దపీట వేస్తున్నారని ఏపీ కోకో రైతుల సంఘం గౌరవాధ్యక్షుడు, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. ఏలూరులోని అన్నే భవన్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్రంలో 10 వేల ఎకరాలకు సంబంధించిన కోకో రైతుల సమస్యలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు గురించి చర్చించారు. కోకో గింజల ధర తగ్గింపుపై అన్ని జిల్లాల్లోని కలెక్టర్లు, ఉద్యానశాఖ జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసి ఆందోళనలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. కోకో బోర్డును ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు కిలో ధరను రూ.500 నుంచి రూ.350కి తగ్గించడం వల్ల రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాల వారీగా డైరెక్టర్లను నియమించి నాబార్డు ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25 తరవాత పెదవేగి మండలం విజయరాయిలో రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. కోకో బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేసి దేశీయంగా కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర లభించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఇథనాల్‌తో సమస్య వచ్చిన ఒక్క వాహనం ఉందా?: గడ్కరీ

దిల్లీ: ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చను కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం ఖండించారు. ఇథనాల్‌తో సమస్య వచ్చిన ఒక్క వాహనాన్నైనా చూపించగలరా అని విమర్శకులకు సవాలు విసిరారు. ఓ సదస్సులో పాల్గొన్న గడ్కరీకి ఇథనాల్ అంశంపై ప్రశ్న ఎదురవగా ఈ విధంగా స్పందించారు. 'పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడంతో దేశంలో ఏ వాహనమైనా సమస్య ఎదుర్కొందా? అలాంటి ఒక్క వాహనం చూపించండి. ఇవి పెట్రోలియం కంపెనీలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాలు కావొచ్చు. ఇథనాల్‌తో ఇప్పటివరకూ వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ సమస్య తలెత్తలేదు" అని స్పష్టం చేశారు.

మూడు నెలల్లోనే రెండంతస్తుల భవనం

నిర్మాణంలో సరికొత్త పద్ధతి ● గడ్డర్లతో బీమ్‌లు, పిల్లర్లు



చిలకలూరిపేటలో కట్టిన కొత్త తరహా భవనం

రెండంతస్తుల భవనం కట్టాలంటే దాదాపు ఏడాది పడుతుంది. కానీ, మూడు నెలల్లోనే దాన్ని పూర్తిచేయొచ్చని తెలుసా? ప్రస్తుతం వాణిజ్య సముదాయాలు, షాపింగ్‌మాల్స్, రెస్టారెంట్లు ఇలాగే కడుతున్నారు. మనకు కావాల్సిన మందంలో గడ్డర్లను ప్లాంట్ నుంచి నిర్మాణ ప్రాంతానికి తెచ్చి అమర్చే విధానాన్ని ఫ్యాబ్రికేషన్ ఎరక్షన్ వర్క్ అని పిలుస్తారు. ఇలాంటి నిర్మాణాలు తొలుత కేరళలో ప్రారంభమయ్యాయి. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల కడుతున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మూడు భవనాలను కాకినాడకు చెందిన ఓ కంపెనీ నిర్మిస్తోంది.

ఏమిటీ కొత్త శైలి?

మన ఇంటి నిర్మాణంలో కాలమ్ బాక్స్‌లు పోసి అందులో కాంక్రీటు పోస్తారు. వారం రోజుల తర్వాత సెంట్రింగ్ ఏర్పాటుచేసి శ్లాబు వేస్తారు. అది 21 రోజులు ఆరిన తర్వాత సెంట్రింగ్ తీసి, గోడలు కడతారు. కొత్త నిర్మాణంలో ఇవేవీ ఉండవు. పిల్లర్లు, బీమ్‌లనూ గడ్డర్లతోనే నిర్మిస్తారు. 12 ఎంఎం మందమున్న గడ్డర్లను వాడుతారు. ఈ విధానంలో ఒకేసారి రెండు శ్లాబులు వేయొచ్చు. మొదట ఇనుపరేకులు వేసి వాటిపై సెంట్రింగ్ అమర్చి, ఆపై కాంక్రీటుతో శ్లాబు వేస్తారు. మెట్ల నిర్మాణంలోనూ గడ్డర్లనే వాడుతున్నారు.

ప్రయోజనాలెన్నో..

సమయం ఆదా

సాధారణశైలిలో నిర్మించే ఆరంతస్తుల భవనం పూర్తికావడానికి రెండేళ్లు పడితే కొత్త పద్ధతిలో భవనాన్ని 14 నెలల్లోనే పూర్తిచేస్తారు.

ఖర్చు తక్కువ

ఫ్యాబ్రికేటెడ్ శైలిలో బీమ్‌లు, గడ్డర్లు ఉంటాయి. గోడలకే ఇటుకలు వాడతారు. నీరు, సిమెంట్ వాడకం బాగా తగ్గుతుంది. మన్నిక మాత్రం తక్కువ. కాంక్రీట్ నిర్మాణాలు 35-40 ఏళ్లుంటే గడ్డర్ల నిర్మాణాలు 25-30 ఏళ్లుంటాయి. అందుకే హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లనే ఇలా కడుతున్నారు.

పాత ఇనుము కింద సొమ్ము

భవిష్యత్తులో కూల్చేసినా.. ఇనుమును తిరిగి వినియోగించుకోవచ్చు. సాధారణ భవనాన్ని కూల్చేశాక వృథా ఎక్కువ ఉంటుంది. ఫ్యాబ్రికేషన్ భవనంలో గడ్డర్లను పాత ఇనుముగా అమ్ముకోవచ్చు.

ఖర్చు తక్కువే

కాంక్రీటు భవనాలతో పోలిస్తే ఖర్చు తక్కువే. సిమెంట్‌తో నిర్మించే భవనానికి రూ.5 కోట్లయితే గడ్డర్లతో నిర్మించే భవనానికి రూ.4కోట్లు అవుతుందని సివిల్ ఇంజినీర్లు చెబుతున్నారు.

త్వరగా కావాలనుకునే వారికి అనుకూలం

ఫ్యాబ్రికేటెడ్ తరహా నిర్మాణంలో సమయం, ఖర్చు ఆదా అవుతుంది. మొత్తం ఇనుప గడ్డర్లనే పిల్లర్లు, బీమ్‌లకు వాడడంతో సిమెంట్, నీరు అవసరం ఉండదు. మన్నిక ఒక్కటే ప్రతికూల అంశం.

–సంతోష్ అద్దూరి, సివిల్ ఇంజినీర్



బేస్‌మెంట్ స్థాయిలో ఇలా



బీమ్‌లు ఇవే



రెండుగోడల మధ్య పిల్లర్

- ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ఆదివాసీ గ్రామాల అనుసంధానం

- రూ.2,404 కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణం
- నేడు పాడేరుకు సీఎం చంద్రబాబు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంజంగి గ్రామంలో శనివారం నిర్వహించే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. తొలుత మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత స్థానిక గిరిజన సంప్రదాయ వేడుకల్లో పాల్గొంటారు. ఆదివాసీల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకుంటారు. వచ్చే ఐదేళ్లలో పాడేరు ఐటీడీఏ పరిధిలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించే కొత్త ప్రాజెక్టును ఆయన ప్రకటించనున్నారు. అనంతరం కాఫీ ప్లాంటేషన్ పెంపకందారులతో మాట్లాడతారు. లగిసపల్లె వద్ద ఏర్పాటు చేసే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. పలు ప్రాజెక్టులకు ఒప్పందాలను కుదుర్చుకోనున్నారు. తర్వాత పార్టీ శ్రేణులతో మాట్లాడతారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, వంతెనల నిర్మాణంతోపాటు ఆదివాసీ ప్రాంతాలు, నివాసాలకు అనుసంధానం కోసం రానున్న ఐదేళ్లలో రూ.2,404 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మొత్తంతో 2075కు పైగా గిరిజన గ్రామాలను అనుసంధానించనుంది. రూ.41 కోట్లతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రోడ్ల కారిడార్లను చేపట్టనుంది. జలజీవన్ మిషన్ కింద గిరిజన ప్రాంతాల్లోని 13,816 ఆవాసాలకు మంచినీటి సరఫరా కోసం రూ.2,373 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టింది. 2026 నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. చింతూరు ఐటీడీఏలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 నుంచి 100 పడకల ఆసుపత్రిగా మార్చనుంది. సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్‌పురం, శ్రీశైలం ఐటీడీఏ ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాల కోసం రూ.50 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసింది. త్వరలోనే వీటి నిర్మాణాలు పూర్తి కానున్నాయి. పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.

గిరిజన యువత కోసం స్టడీ సర్కిళ్లు

డీఎస్సీ సహా వివిధ పోటీ పరీక్షలకు గిరిజన యువతను సన్నద్ధం చేసేందుకు విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో ప్రభుత్వం స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసింది. గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చేందుకు రూ.150 కోట్లు వెచ్చిస్తోంది. 520కి పైగా పాఠశాల భవనాల నిర్మాణం కోసం రూ.64 కోట్లు ఖర్చు చేస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా పూర్ణపాడు-కొమరాడ మధ్య నాగావళి నదిపై రూ.10 కోట్లతో హైలెవల్ వంతెనను చేపట్టనుంది. కాఫీ పల్పింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్లాంటేషన్ విస్తరణకు రూ.202 కోట్లు వ్యయం చేయనుంది. పలు పర్యాటక ప్రాజెక్టులను చేపట్టనుంది. ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది.







సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులు ● సూర్యుడి చుట్టూ గ్రహాలు, వాటి ఉపగ్రహాలు తిరిగే విధానం తెలిపే ప్రయోగం ● గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ప్రయోగాలు చేద్దాం.. పాఠాలు నేర్చేద్దాం!

సూర్యుడి చుట్టూ గ్రహాలు ఎలా తిరుగుతాయి..? విద్యుత్తు ఎలా వస్తుంది...? సైకిల్ చక్రాలు వృత్తాకారంలో ఉంటేనే తొక్కగలమా..? ఇలాంటి ఎన్నో సందేహాలను కళ్లముందే తీర్చేస్తోంది.. అగస్త్య ఫౌండేషన్. నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న పిల్లలను ఒక్కసారి చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలోని ఈ ఫౌండేషన్‌కు తీసుకెళ్తే సరి. చిట్టి బుర్రల్లోని కఠిన సందేహాలు చిటికెలో మాయమవుతాయి. అక్కడున్న భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, రోబోటిక్స్ ప్రయోగ పరికరాలను పిల్లలు ఒక్కసారి చూస్తే వదిలిపెట్టరు. శిక్షకులు ఒక్కో ప్రయోగాన్ని వివరించి, వారితోనే చేయిస్తారు. ఉపాధ్యాయులకూ సబ్జెక్టు నైపుణ్యంపై శిక్షణ ఇస్తుంటారు. 2002 ఆగస్టు 15న ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని నిత్యం 500 మంది సందర్శిస్తుంటారని ఫౌండేషన్ సీఈఓ సురేష్, ఏఓ నాగరాజు తెలిపారు. – ఈనాడు చిత్తూరు



రోడ్డు ఇలా ఉంటే చక్రాలు చతురస్రాకారమైనా సరే..



ముఖ్యమంత్రి చంద్రబాబుతో వరలక్ష్మి, ఆమె సోదరుడు రంగనాథ్

మొక్కు చెల్లించి.. సీఎంను కలిసిన గాయని వరలక్ష్మి

ఈనాడు, అమరావతి: చంద్రబాబు సీఎం అయితే 108 ఆలయాల్లో సంకీర్తనా గానం చేస్తానన్న మొక్కు చెల్లించుకొన్న గాయని వరలక్ష్మి ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం ముఖ్యమంత్రిని కలిశారు. అన్నవరం దేవస్థానంలో తొలి...విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో చివరి కచేరీ చేసినట్టు తెలియజేశారు. మంగళగిరిలో పుట్టి...ముంబయిలో స్థిరపడ్డట్టు వివరించారు. ఈ సందర్భంగా సీఎం ఆమెను అభినందించారు. వరలక్ష్మి లాంటి అభిమానుల నమ్మకాన్ని నిలుపుతూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు.



మీకున్నది భాగస్వామ్యమేనా..?

వ్యాపారంలోనైనా, జీవితంలోనైనా మీ భాగస్వామితో ఉన్న బంధం వాస్తవ విలువ తెలుసుకోవాలని అనుకుంటున్నారా..? అయితే మీరు మీ లక్ష్యాలను సాధించడంలో తన వంతు సహాయం చేసేందుకు అతడు/ఆమె ఆరాటపడుతున్నారో లేదో గమనించండి. అలాంటి ఆరాటమేదీ తనలో లేకపోతే- మీ మధ్య భాగస్వామ్యం కాకుండా, కేవలం లావాదేవీలే ఉన్నట్టు లెక్క!

– శరణ్ శ్రీవత్స, వ్యాపారవేత్త

గుట్టుచప్పుడు కాకుండా చల్లేయడమే!

- చెరువుల్లో చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు



చేపల చెరువులో వేయడానికి సిద్ధం చేసిన కోడి మాంసం వ్యర్థాలు

ఈనాడు, విశాఖపట్నం: కోడి మాంసం వ్యర్థాలు చేపలకు వేయకూడదని 2016 నుంచి మత్స్యశాఖ నిషేధం ఉన్నా.. వాటిని వేసి చేపలు పెంచే చెరువుల సంఖ్య రాష్ట్రంలో బాగా పెరిగింది. కోళ్ల వ్యర్థాలతో ప్రధానంగా ఫంగాస్, రూప్‌చంద్ జాతికి చెందిన చేపలను పెంచుతున్నారు. దాంతో వాటిని తినేవారికి అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో కొందరు ముఠాగా ఏర్పడి దుకాణదారుల నుంచి కోళ్ల పేగులు, చర్మం, కాళ్లు, ఇతర వ్యర్థాలను సేకరించి డ్రమ్ముల్లో నిల్వ చేసి చెరువులకు సరఫరా చేస్తున్నారు. దీంతో చికెన్ దుకాణాల వద్ద వ్యర్థాలకు డిమాండ్ పెరిగింది.

నెలకు రూ.90 లక్షలపైనే దందా

కృష్ణా, బాపట్ల జిల్లాలతో పాటు ఏలూరు, వినుకొండ తదితర ప్రాంతాలకు తెలంగాణ నుంచి కోళ్ల వ్యర్థాలు లారీల్లో వస్తున్నాయి. హైదరాబాద్‌లో చికెన్ దుకాణాల నుంచి కిలో రూ.4 చొప్పున వీటిని సేకరిస్తున్నారు. అక్కడే గోప్యంగా గోదాంలలో వ్యర్థాలను నిల్వచేసి, అనంతరం కిలో రూ.12 చొప్పున చెరువులకు సరఫరా చేస్తున్నారు. మరోవైపు విశాఖ నుంచి రోజూ పది వేల కేజీల వ్యర్థాలు సేకరిస్తుండగా, వాటిలో అధికభాగం గోదావరి జిల్లాల్లోని చేపల చెరువులకు వెళుతోంది. గత నెల రోజుల వ్యవధిలో విశాఖ నుంచి కాకినాడ తరలిస్తున్న సుమారు 21 కోళ్ల వ్యర్థాల వాహనాలను అధికారులు సీజ్ చేశారు. పది డ్రమ్ములతో ఉండే బొలేరో వాహనం కాకినాడకు చేర్చితే రూ.30 వేలు తీసుకుంటున్నారు. ఇలా రోజుకు పది వాహనాల చొప్పున నెలకు రూ.90 లక్షలపైనే కోళ్ల వ్యర్థాల దందా జరుగుతోంది.



హైదరాబాద్ నుంచి వచ్చిన వాహనంలో చికెన్ వ్యర్థాల మూటలు

త్వరగా పెరుగుతాయని..

సాధారణంగా చేపల పెంపకానికి వాడే ఆహారం (పెల్లెట్స్) ధర కిలో రూ.40 పైనే ఉంది. దీన్ని ఎకరానికి పదివేల చేప పిల్లలున్న (చిన్నసైజు) చెరువులో రెండు బ్యాగులు (100 కేజీలు), పెద్దసైజు చేపలు ఉన్న చోట్ల అయితే పది బ్యాగులు ప్రతిరోజూ వేయాల్సి ఉంటుంది. అదే చికెన్ వ్యర్థాలు అయితే ఎకరా చెరువుకు 2 క్వింటాళ్లు వేస్తే వారం వరకు ఆహారం వేయాల్సిన అవసరం ఉండదు. మరోవైపు పెల్లెట్స్ కంటే కోళ్ల వ్యర్థాలు తక్కువ ధరకు లభిస్తుండడంతో పాటు చేపలు సైతం త్వరగా పెరుగుతుండటంతో అటువైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రజారోగ్యం బలి

చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేయడం వల్ల సూక్ష్మ క్రిములు అందులో పెరుగుతాయని 2006లో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. విశాఖకు చెందిన విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఏడీఎంఈ) పీవీ సుధాకర్ మాట్లాడుతూ.. "ట్రమటోడా జాతికి చెందిన సిస్టోజోమా, క్లొనార్క్‌సైనెన్స్ అనే సూక్ష్మ జీవులు, ఫేషియోలాప్సిస్ బుస్కీ అనే క్రిములు కోళ్ల వ్యర్థాల నుంచి వాటిని తిన్న చేపల్లో ఎక్కువగా చేరే అవకాశం ఉంది. కోళ్ల మలవిసర్జనలో ఈకోలి బ్యాక్టీరియా ఉంటుంది. దాంతో కోళ్ల వ్యర్థాలు చెరువుల్లో వేయటం వల్ల నీరు కలుషితం కావడమే కాకుండా, ఆ చేపలను తిన్నప్పుడు మనిషి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయి' అని చెప్పారు.

పంచాయతీలకు రూ.1,121 కోట్లు విడుదల చేసి నివేదిక ఇవ్వండి

- రాష్ట్రానికి కేంద్రం లేఖ

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను విడుదల చేసి నివేదిక పంపాలని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తాను దిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులను ఇటీవల కలిసి నిధుల విడుదలలో జాప్యంతో పంచాయతీల్లో తలెత్తుతున్న సమస్యలపై ఇచ్చిన వినతిపత్రంపై స్పందించి రాష్ట్రానికి లేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు.

మాయదారి రంగులు.. ముంచేసే హంగులు!



వేడి వేడి బిర్యానీ..
ఆకర్షణీయమైన రంగులో
పొగలుగక్కుతూ ఊరిస్తుంటే..!
ఎర్రటి మంచూరియా..
రా రమ్మని పిలుస్తుంటే..!
అందమైన జిలేబీ..ఆహ్వానాలు
పంపుతుంటే..! వద్దని వారించలేం
కదా...! కానీ 'రంగు'లతో
మాయచేసే ఆ పదార్థాలు
అనారోగ్యంలో
ముంచేస్తాయి జాగ్రత్త!

కుంకుమపువ్వు లేకుండా జఫ్రానీ బిర్యానీ తయారవుతోంది. మంచూరియా, చికెన్65 వంటి ఆహార పదార్థాలను తింటే.. గోరింటాకు పెట్టుకున్నట్టుగా చేయి పండిపోతోంది. వంటకాల్లో ఇష్టానుసారం ఉపయోగిస్తోన్న నిషేధిత రంగులతో ఆహార ప్రియులకు దీర్ఘకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు తినే వంటల్లోనూ రంగులు కలుస్తున్నాయని.. ప్రజలు మేల్కొనకపోతే.. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏం చెబుతోంది..

ఎఫ్ఎస్ఎస్ఏఐ (భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ) పెరుగుతోన్న జనాభా, ఆహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశంలో ఎనిమిది రకాల సింథటిక్ రంగుల వినియోగానికి అనుమతి ఇచ్చింది. మిఠాయిలు, కేకులు, బ్రెడ్డు, జామ్, బిస్కట్లు, రకరకాల పానీయాలు, ఐస్ క్రీమ్‌లు, క్యాండీస్, చాక్లెట్లు, తీపి పదార్థాల్లోనే వీటిని వాడాలి. అది కూడా.. కేజీ ముడి పదార్థంలో ఒక గ్రాము రంగును మాత్రమే వేయాలి. వంటగదిలో తయారు చేసుకునే ఆహార పదార్థాల్లో వాడకూడదు.

15శాతం కల్తీవే..

ఏప్రిల్ 10, 2025న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిత్వశాఖ 2021 నుంచి సెప్టెంబరు 2024 మధ్య నమోదైన ఆహార కల్తీ కేసుల వివరాలను వెల్లడించింది. పరీక్షించిన నమూనాల్లో తెలంగాణలో 15శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 8.82 శాతం కల్తీలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని చాలా హోటళ్లలో బిర్యానీ, చికెన్65, మంచూరియా, కబాబ్‌లలో రంగులను వెదజల్లుతున్నారు. అలా చేయకపోతే వినియోగదారులు ఇష్టపడట్లేదని హోటళ్ల యజమానులు చెబుతున్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టంలో 2024లో వచ్చిన సవరణ ప్రకారం.. అధికంగా రంగులు ఉపయోగిస్తే మూడు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా పడుతుంది. అయినా ఎవరూ పట్టించుకోవట్లేదు.

ఏం చేయాలి?

అతిగా రంగులు వాడిన ఆహార పదార్థాలను తరచుగా తినడం వల్ల గుండె సంబంధిత సమస్యలు, జీర్ణాశయ వ్యాధులు, అలర్జీలు, క్యాన్సర్ల వంటి దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. అందుకే వీలైనంత వరకు బయట తినకపోవడం మేలు. బయట కూడా కంటికి ఇంపుగా కనిపించేవి కాకుండా సహజ రంగులతో తయారైన పదార్థాలకే ఓటేయాలి. హోటళ్లకు వెళ్లినప్పుడు రంగులు కలపని ఆహార పదార్థాలు ఏమేమి అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలి.

ఫిర్యాదులు ఇక్కడ...

ఆంధ్రప్రదేశ్‌లో కల్తీల కట్టడికి టోల్ ఫ్రీ నెంబర్: **18004253857**, హెల్ప్ డెస్క్: **08645297245**

తెలంగాణలో ఫిర్యాదులకు. **91001 05795** నంబరును సంప్రదించొచ్చు.

జీ మెయిల్.. **diripmtg@gmail.com**, **fssmutg@gmail.com**

ఎక్స్.. **@cfs_telangana**

ఇన్‌స్టా.. **@cfs_telangana**

జీహెచ్ఎంసీకి చేయాలంటే... ఫోన్ నంబరు.. **040 2111 1111**

జీమెయిల్.. **foodsafetywing.ghmc@gmail.com**

ఎక్స్.. **@afcghmc, @ghmconline**

సహజ రంగులు ఉన్నాయ్..

- బీట్‌రూట్, క్యారెట్‌తో ఎరుపు, వంగపూత, నారింజ రంగుల్లో ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చు.



- పసుపును ఉపయోగిస్తే పచ్చని పదార్థాలు తయారవుతాయి.



- పొదిన, కరివేపాకు వంటి పొడులు లేదా గుజ్జుతో.. ఆకుపచ్చని ఆహార పదార్థాలు తయారవుతాయి. రంగుతోను, మంచి వాసన, రుచి వస్తాయి.



- కుంకుమ పువ్వుతో ఎరుపు, పసుపు రంగు వస్తుంది.



– ఈనాడు, హైదరాబాద్, అమరావతి





బారికేడ్లకూ కళ్లుంటాయ్!

బారికేడ్లకు కెమెరా ఏర్పాటు చేసి పోలీసు కంట్రోల్ రూం నుంచి ఆపరేట్ చేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు పల్నాడు పోలీసులు. ఈ విధానంతో మంచి ఫలితాలు వస్తున్నాయంటున్నారు. ట్రాఫిక్ కూడళ్లలో ఈ బారికేడ్ పెడుతున్నారు. దానికి పైభాగంలో సీసీ కెమెరా పెట్టారు. విద్యుత్తు కోసం సోలార్ పలకలు అమర్చారు. రెండు మైక్‌లు బిగించారు. ట్రాఫిక్ రద్దీ ఎలా ఉంది, ఏమైనా ప్రమాదం జరిగిందా.. అని కంట్రోల్ రూంలోనే సీసీ కెమెరా ఫుటేజీని చూస్తున్నారు. నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట, రద్దీ కూడళ్లు, రైల్వే స్టేషన్ రహదారిలో వీటిని ఏర్పాటు చేశారు. వీటితో ట్రాఫిక్ ఉల్లంఘనలనూ గుర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి 200 ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఇదే తొలి ప్రయోగమని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. – ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ఏఐ ఆటలో ఓపెన్ విజయం



క్రీడాకారులు చెస్ పోటీల్లో తలపడడం మామూలే. మనుషులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం మధ్య చదరంగం నిర్వహిస్తే? తాజాగా అలాంటి పోటీలే జరిగాయి. గూగుల్‌కు చెందిన కాగిల్ వేదికగా మూడు రోజుల పాటు ఆసక్తికరంగా సాగిన ఈ ఏఐ సమరంలో ఓపెన్ ఏఐకి చెందిన ఓ3 టైటిల్ ఎగరేసుకుపోయింది. ఫైనల్లో గ్రోక్4పై ఓ3 విజయం సాధించింది. ఈ టోర్నీలో ఓ3 ఒక్క గేమ్ కూడా చేజార్చుకోకపోవడం విశేషం. సామ్ ఆల్ట్‌మన్, ఎలాన్ మస్క్ కలిసి ఓపెన్ ఏఐ సంస్థను స్థాపించారు. 2018లో ఆ సంస్థ నుంచి వైదొలిగిన మస్క్ తర్వాత కొన్నేళ్లకు 'ఎక్స్'ను కొన్నారు. 'ఎక్స్'కు చెందిన ఏఐ వ్యవస్థ 'గ్రోక్'. ఏఐ చెస్ టోర్నమెంట్‌లో మూడో స్థానాన్ని గూగుల్‌కు చెందిన జెమిని 2.5 ప్రో సొంతం చేసుకుంది. ఓపెన్ ఏఐకే చెందిన ఓ3, ఓ4మిని, గ్రోక్ 4, గూగుల్‌కు చెందిన జెమిని 2.5 ప్రో, జెమిని 2.5 ఫ్లాష్‌తో పాటు.. కిమి కె2, క్లాడ్ ఓపస్, డీప్‌సీక్ ఆర్1 ఈ పోటీల్లో టైటిల్ కోసం పోరాడాయి. గతంలో కంప్యూటర్లతో చెస్ ఛాంపియన్లు తలపడిన సంఘటనలు ఉన్నాయి. 1997లో రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్‌పై డీప్ బ్లూ సూపర్ కంప్యూటర్ ఆరు గేమ్‌ల పోరాటంలో పైచేయి సాధించడం సంచలనం రేపింది. –స్పోర్ట్స్ డెస్క్



అవిశ్రాంత వేడుక


ఉద్యోగ విరమణ అనంతరం కొందరికి కుటుంబ సభ్యుల నుంచి నిరాదరణ, సమాజం పట్టించుకోకపోవడం వంటివి ఎదురవుతుంటాయి. ఇలాంటి వయోధికుల స్థితిని విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య గమనించారు. పెన్షనర్ల సామాజిక ఉన్నతికి వేడుకలు చేసినట్లయితే వారు ఆనందంతో పాటు శారీరకంగా ఉత్సాహవంతులుగా మారతారని భావించి.. తన ఆలోచనను కోదాడ సంఘ సభ్యులతో పంచుకున్నారు. వివిధ శాఖల పింఛనుదారులకు కుల మతాలకు అతీతంగా సామూహిక జన్మదిన వేడుకలు చేద్దామని ప్రతిపాదించారు. నాడు అధ్యక్షుడిగా ఉన్న వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఉన్న లక్ష్మీనర్సయ్యతోపాటు సభ్యులు ఏకగ్రీవంగా సమ్మతి తెలిపారు. ఒకే నెలలో పుట్టినరోజు ఉన్న వారందరికీ అదే నెల చివరి వారంలో ఒక రోజు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల మధ్య సామూహికంగా జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నారు. వారిని సన్మానించి, సమాజానికి, ప్రభుత్వానికి చేసిన సేవను వివరిస్తారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తారు. 2023 ఏప్రిల్‌లో కోదాడలో మొదటిసారి నిర్వహించారు. నేటికీ ఈ పద్ధతి కొనసాగుతోంది. కోదాడ సంఘం నుంచి ప్రేరణ పొంది హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి వంటి ప్రాంతాల్లోనూ ఇలాంటి వేడుకలు జరుపుతున్నారు. – న్యూస్‌టుడే, కోదాడ పట్టణం

గుర్రాలకు పటేల్ సాబ్



ఎంతటి మొండి గుర్రమైనా.. ఆయన చెప్పినట్లు తలూపాల్సిందే. అశ్వక తర్ఫీదులో నలభై ఏళ్ల అనుభవం సొంతం కాగా.. ఇటీవలే 500వ గుర్రానికి శిక్షణ ఇచ్చారు నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన ప్రకాశ్ పటేల్. వీరి కుటుంబానికి తాతల కాలం నుంచే అశ్వాలుండేవి. కాలక్రమేణా వాహన సదుపాయాలు మెరుగయ్యాయి. క్రమంగా తమ వద్ద నున్న గుర్రాలను వారు వదిలించుకున్నారు. చివరగా ఇంట్లో మిగిలిన ఒకే ఒక గుర్రాన్ని 1973లో అమ్మేశారు. అదే సమయంలో యువకుడైన ప్రకాశ్ పటేల్ ఇదంతా చూస్తూ తట్టుకోలేకపోయారు. తన వద్దనున్న రూ.250తో ఎవరికీ తెలియకుండా మరో గుర్రాన్ని కొనితెచ్చుకున్నారు. కాలక్షేపం కోసం తర్ఫీదు ఇచ్చేవారు. ఎవరైనా కొత్తవారొస్తే నమస్కరించడం, పాటలకు నృత్యం చేసేంతగా అశ్వాన్ని మచ్చిక చేసుకున్నారు. ఆయన నైపుణ్యాల గురించి నలుగురికీ తెలిసింది. పోలీసు శాఖ పిలుపుతో 1988 నుంచి 1991 వరకు హైదరాబాద్‌లో ఉండి సైనిక గుర్రాలకు శిక్షణ ఇచ్చారు. తిరిగొచ్చాక కూడా వ్యాపకాన్ని వదల్లేదు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చేవారి అశ్వాలకు శిక్షణ ఇస్తున్నారు.

– ఈనాడు, నిజామాబాద్



ఇది ధర్మ సాగరమే!

ఎత్తైన కొండలు.. మధ్యలో కోనేరు. కట్టపై కాకతీయులు నిర్మించిన శివ, వైష్ణవాలయాలు. ఇటీవల కట్టిన పెద్దమ్మతల్లి దేవాలయం.. మైదాన ప్రాంతంలో బతుకమ్మ తల్లి విగ్రహం, రిజర్వాయర్‌కు దూరాన గుట్టపై క్రైస్తవులు నిర్మించిన సహాయ మాత ఆలయం ఇలా అన్నీ ఒకే ప్రాంతంలో ఉన్నాయి. ధర్మానికి ప్రతీకలుగా.. ఆధ్యాత్మికతకు ఆనవాళ్లు నిలుస్తున్నాయి. వరంగల్ త్రినగరికి అతి సమీపంలో ఉన్న ధర్మసాగర్ రిజర్వాయర్‌ను చూస్తే మనసు పులకరిస్తుంది.. సముద్రాన్ని తలపించేలా ఇది సహజ సిద్ధంగా ఏర్పడింది. దేవాదుల ఎత్తిపోతల పథకంలో రిజర్వాయర్‌గా మార్చడంతో దీని విస్తీర్ణం పెరిగింది. కట్ట కిందివైపు పచ్చగా పరుచుకున్న పచ్చిక బయళ్లు చూడగానే చూపరులను ఆకట్టుకుని ఆహ్లాదాన్ని పంచుతాయి.

– న్యూస్‌టుడే, ధర్మసాగర్ (హనుమకొండ)

మట్టికి సింగారం



వివిధ రకాల ఆభరణాలతో కూడిన పూసల దండలు మనం చూస్తాం. కానీ విజయనగరంలో మట్టితో చేసిన పూసల దండలు కనిపిస్తున్నాయి. వీటి తయారీ వెనుక ఉన్నదీ అందరూ వృద్ధులే కావడం విశేషం. జిల్లా కేంద్రంలోని బాబామెట్ట సమీపంలో డా. ఖలీల్ బాబు ఓ వృద్ధాశ్రమాన్ని నడిపిస్తున్నారు. ఇక్కడ 35 మంది వరకు వృద్ధులు ఉంటున్నారు. వారికి ఏదైనా ఉపాధి చూపించాలనే ఉద్దేశంతో మట్టితో పూసల దండల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం తొలుత భీమిలి, కడియం, దిల్లీలోని పలు ప్రాంతాల నుంచి రెండు రకాల మట్టిని(ఎర్ర, బంక) తీసుకొస్తారు. ఆ మట్టిని మూడు విడతల్లో జల్లెడ పడతారు. వ్యర్థాలను ఏరివేసిన తర్వాత మిగిలిన మట్టిని యంత్రంలో వేస్తారు. నీటిని కలుపుతూ ముద్దలా వచ్చేలా చూస్తారు. ఆ తర్వాత ఉండలుగా చుట్టి పూసలు చేస్తున్నారు. వాటిని బట్టీలో వేసి కాల్చుతారు.



చివరగా సహజసిద్ధ రంగులు అద్దుతారు. ఇక్కడ పూసల దండలే కాకుండా జపమాలలు, నీళ్లసీసాలు, కుండలు, వంటపాత్రలు, ఆట వస్తువులు తయారుచేస్తున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు అమెరికా, మలేసియా, సింగపూర్ దేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయని, ఈ ఆదాయాన్ని సైతం వృద్ధుల సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు ఖలీల్ బాబు తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం (మయూరికూడలి)




సేవల్ని గుర్తుచేసే సమయం

కరోనా కాలంలో నగరపాలక సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు, వైద్య సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. వారి సేవలకు గుర్తుగా కర్నూలు నగరపాలక సంస్థ నగరంలోని విశ్వేశ్వరయ్య కూడలిలో రూ.25 లక్షలతో రోబో ఆకృతిలో క్లాక్ టవర్ ఏర్పాటు చేసింది. 2022 మార్చి 19న దీన్ని ప్రారంభించింది. వివిధ విభాగాల సిబ్బంది 24 గంటలూ శ్రమించారని ప్రతీకాత్మకంగా క్లాక్ టవర్‌ను తీర్చిదిద్దింది. నెత్తిన పోలీస్ టోపీ, ఓ చేతిలో చీపురి, మరో చేతిలో స్ప్రేయర్, నోటికి మాస్క్, రెండు వైపులా గడియారాలతో ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

బుర్రకూ లిథియంతో ఛార్జ్!

దిల్లీ: లిథియంతో తయారైన బ్యాటరీలు ఆధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు ఆయువులు ఊదుతున్నాయి. అయితే మెదడు ఆరోగ్యంగా పనిచేయడానికి కూడా ఈ మూలకం అవసరమని పరిశోధకులు తేల్చారు. ఇది లోపిస్తే అల్జీమర్స్ వ్యాధి ఉత్పన్నం కావొచ్చని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ రుగ్మతకు చికిత్స చేయడానికి ఒక కొత్త మార్గం లభించినట్లయింది. తాగునీరు సహా పర్యావరణంలో లిథియం చాలా స్వల్ప పరిణామంలో ఉంటుంది. ఐరన్, జింక్, కాపర్ వంటి మూలకాలను 'ట్రేస్ మెటల్స్'గా పిలుస్తారు. ఇవి మెదడు పనితీరును ఆరోగ్యంగా ఉంచడంలో కీలకమని శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే లిథియం కూడా మెదడులోని ముఖ్య కణాలన్నింటినీ ఆరోగ్యంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన శాస్త్రవేత్తలు వివరించారు. తద్వారా అది బుర్రను.. వార్ధక్యంతో వచ్చే నాడీ క్షీణత బారి నుంచి రక్షిస్తుందని పేర్కొన్నారు. తీవ్ర మతిమరుపు (డిమెన్షియా), అల్జీమర్స్ వ్యాధి ముప్పును తగ్గిస్తుందని తెలిపారు. ఎలుకలు, మానవ మెదడు కణజాల నమూనాలు, కొందరి వాలంటీర్ల నుంచి సేకరించిన రక్తాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ మేరకు తేల్చారు. అల్జీమర్స్ బాధితుల్లో జ్ఞాపక శక్తి, ఆలోచన ప్రక్రియ, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. రోజువారీ పనులనూ చేసుకోలేని స్థితికి చేరుకుంటారు.





పక్షి రాజ్ పన్నాలాల్

ఝార్ఖండ్ అడవుల్లో నిశ్శబ్ద వాతావరణం ఉన్నా.. ఒక స్వరం మాత్రం నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. డజన్లకొద్దీ పక్షులు ఆ పిలుపును గుర్తిస్తాయి. స్థానికులు ప్రేమగా 'బర్డ్ మ్యాన్' అని పిలుచుకునే పన్నాలాల్ రాగానే పక్షులు ఆయనను చుట్టేస్తాయి. రామ్‌గఢ్ జిల్లాలోని సరయ్యా కుంద్రు గ్రామానికి చెందిన పన్నాలాల్ ఓ సాధారణ రైతు. పక్షులపై ఉన్న మక్కువతో గత పాతికేళ్లుగా ఆయన తన సొంత డబ్బుతో 45కు పైగా పక్షి జాతులకు ఆహారం అందిస్తూ వాటి సంరక్షణకు కృషి చేస్తున్నారు. చాలాసార్లు గాయపడిన, అనారోగ్యంతో ఉన్న పక్షులను చేరదీసి వైద్యం అందించి, సపర్యలు చేశారు. పక్షుల శబ్దాలను గుర్తించి వాటికి అర్థమయ్యేలా ఆయన కూడా నోటితో ధ్వనులు చేస్తారు. ఝార్ఖండ్‌లోని విద్యాలయాలకు వెళ్లి విద్యార్థులకు పక్షుల కథలు చెబుతారు. కెమెరాలు, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా లేకుండా ప్రకృతితో మమేకం కావడమెలాగో నేర్పుతున్న పన్నాలాల్ ఎల్లప్పుడూ ఆకుపచ్చ దుస్తులు ధరిస్తూ పక్షులు తనను కూడా అడవిజీవిగా గుర్తించాలని కోరుకుంటారు.

–ఈటీవీ భారత్

పుప్పొడి.. పరాగమంజరి

కంటికి కనిపించే పూలల్లో పుప్పొడిలో సంప్రదాయ.. ఆధునిక ఆకృతులున్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం ఆచార్యులు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, పరిశోధక విద్యార్థిని శివానిలు గుర్తించారు. రెండేళ్ల క్రితం తమ ప్రయోగశాలలో వచ్చిన ఓ చిన్న ఆలోచనతో వీరిద్దరూ ఈ పరిశోధన ప్రారంభించారు. చేనేత కుటుంబానికి చెందిన శివాని తొలుత మందారం పూలలోని పుప్పొడి తీసుకొచ్చి మైక్రోస్కోప్‌తో చూశారు. అందులో రోజువారీ డిజైన్ల కంటే భిన్నమైన ఆకృతులు కనిపించాయి. అనంతరం గునుగు, గడ్డిచామంతి, మోదుగ, రాఖీ పుష్పం, దోస, గుమ్మడిపూలు, లిల్లీ, గులాబీపూల పుప్పొడిని సేకరించారు. మైక్రోస్కోప్‌లో వాటి రంగులు, ఆకృతులను క్షుణ్ణంగా పరిశీలించారు. లక్షల సంఖ్యలో భిన్నమైన ఆకృతులున్నాయని తెలుసుకున్నారు. ఈ ఆకృతులను చేనేత చీరలు, దుస్తులు, పోచంపల్లి, గద్వాల్ పట్టుచీరలపై ముద్రిస్తే సంప్రదాయబద్ధంగా ఉండడమే కాకుండా కొనుగోలుదారులను ఆకర్షించనున్నాయని అంచనా వేశారు. మైక్రోస్కోప్ చిత్రీకరించిన ఆకృతులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి వాటిని దుస్తులపై ముద్రించారు. దీనికి పరాగ మంజరి అని పేరు పెట్టారు. గతేడాది దరఖాస్తు చేయగా.. శుక్రవారం పేటెంట్ లభించిందని ఓయూ వృక్షశాస్త్ర విభాగం ఆచార్యులు ఎ.విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ ఆకృతులను చేనేత, పట్టు వస్త్రాల ముద్రణకు పరిశీలించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించనున్నామని ఆయన చెప్పారు.



టీ-షర్ట్‌పై ముద్రించిన ఆకృతి

–ఈనాడు, హైదరాబాద్

ఔరా.. రాఖీ!



సోదరి, సోదర ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకను మంచిర్యాల నగరంలోని అభ్యాస పాఠశాల వినూత్నంగా నిర్వహించింది. 50 అడుగుల రాఖీని తయారు చేసి ఔరా అనిపించారు. పండగ శుభాకాంక్షలు తెలుపుతూ చేపట్టిన ఈ కార్యక్రమం అబ్బురపరిచింది. 50 మంది ఉపాధ్యాయులు శ్రమించారు. 1,200 మంది చిన్నారులు ఇందులో భాగస్వాములయ్యారని ప్రిన్సిపల్ సాన సుధతి, కరస్పాండెంట్ గిరీశ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ

ఖతర్నాక్.. పఫర్ ఫిష్



విశాఖలోని రుషికొండ తీరంలో శుక్రవారం రెండు సముద్ర ముళ్ల కప్పలు (పఫర్ ఫిష్‌లు) కనిపించాయి. ఏవైనా వీటిపై దాడి చేస్తే గాలిని పీల్చుకొని బంతిలా మారిపోతాయి. అప్పుడు వాటి చర్మంపై మొనదేలిన ముళ్లు వస్తాయి. అవి గుచ్చుకుంటే తీవ్రమైన నొప్పి ఉంటుంది. ఆ భయానికే వీటి జోలికి ఏ జీవులూ వెళ్లవు. ఇవి సముద్రంలో చిన్న చేపలు, నాచు తిని మనుగడ సాగిస్తాయని విశాఖ సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు తెలిపారు. పఫర్ ఫిష్‌లతో ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆ రెండింటిని మత్స్యకారులు సాగర జలాల్లో వదిలారు.

–న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం ఆగస్టు 9, 2025



అంతరాలయానికి పుష్పాలంకరణ



పవిత్రోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో పవిత్రోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జగన్మాతకు వేకువజామున సుప్రభాత సేవ, స్నపనాభిషేకం అనంతరం వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు సర్వదర్శనం ప్రారంభించారు. యాగశాలలో ఈవో శీనానాయక్ దంపతులతో స్థానాచార్య శివప్రసాదశర్మ గణపతి పూజ చేయించారు. వరలక్ష్మీ దేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో మధ్యాహ్నం దర్శన టిక్కెట్ల విక్రయాలు నిలిపివేశారు. అన్నీ క్యూలైన్లలో భక్తులకు ఉచిత దర్శనం కల్పించారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసిన అధికారులు క్యూలైన్లో వేచి ఉన్న వారికి మజ్జిగ, తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

స్పాట్స్ అండ్ గైడ్స్ తాత్కాలిక ప్రాధాన్య క్రమం వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ప్రత్యేక కేటగిరీ స్పాట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ ముగిసింది. తాజాగా అభ్యర్థుల తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. ఆ కేటగిరిలో మొత్తం 66 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారిలో ముగ్గురికి అర్హత లేకపోగా, మరో నలుగురు హాజరు కాలేదు. మిగిలిన 59 మందికి సంబంధించి తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని వెల్లడించామని, ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 11వ తేదీ నాలుగంటల్లోగా తెలియజేయాలని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

పెనుగంచిప్రోలులో భారీ వర్షం

పొంగిన వాగులు.. రాకపోకలకు ఆటంకం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగిపొర్లాయి. 148.2 మి.మి వర్షపాతం నమోదయ్యింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగుల్లో వరద ఉద్ధృతి పెరిగింది. కూచివాగు, దూడ్ల వాగు, గండివాగులతో పాటు, పెనుగంచిప్రోలు చెరువు నిండి అలుగు పారడంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 10 గంటల వరకు పలు అనిగండ్లపాడు, లింగగూడెం, ముచ్చింతాల, పెనుగంచిప్రోలు-ముండ్లపాడు మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనిగండ్లపాడు, ముచ్చింతాల గ్రామాల్లో కూచివాగు వరద పోటెత్తి వందల ఎకరాల్లో నాట్లు వేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. మక్కపేట వద్ద రైల్వే అండర్‌పాస్‌లో భారీగా నీరు చేరడంతో అర్ధరాత్రి పలు వాహనాలు వరదలో చిక్కుకున్నాయి. తెలంగాణ ఎగువ ప్రాంతాల్లో సైతం వర్షాలు కురవడంతో మునేరులో వరద ఒక మోస్తరుగా పెరిగింది.



అనిగండ్లపాడు వద్ద కూచివాగు పొటెత్తడంతో కల్వర్టుపై నీరు



జలకళను సంతరించుకున్న పెనుగంచిప్రోలు చెరువు

జిల్లా సరిహద్దుల్లో కుండపోత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు.. ఎన్టీఆర్ జిల్లాలోని మండలాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. పెనుగంచిప్రోలులో అత్యధికంగా 148.2, జగ్గయ్యపేట 110.2, విస్సన్నపేట 68.4, వత్సవాయి 66.8, నందిగామ 59.2, ఎ.కొండూరు 50.4, రెడ్డిగూడెం 34.8, గంపలగూడెం 34.2, తిరువూరు 26.8, కంచికచర్ల 18.6, మైలవరం 14.6, జి.కొండూరు 11.8, చందర్లపాడు 10.8, వీరులపాడు 8.2, ఇబ్రహీంపట్నంలో అత్యల్పంగా 3.2 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. కానీ విజయవాడ, విజయవాడ గ్రామీణ మండలంలో మాత్రం వర్ష చాయలు లేవు.

కొట్టుకుపోయిన ద్విచక్ర వాహనచోదకుడు



నందిగామ గ్రామీణం, వీరులపాడు, న్యూస్‌టుడే: నందిగామ మండలం దాములూరు శివారు కూడలి వద్ద వైరా, కట్టలేరు వరదలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు కొట్టుకుపోగా.. ఈత రావడంతో క్షేమంగా ఒడ్డుకు చేరాడు. వీరులపాడు మండలం వి.అన్నవరానికి చెందిన **దొండపాటి పాపారావు** గురువారం రాత్రి నందిగామలో తన మిత్రుడి కుమారుడి వివాహానికి హాజరయ్యాడు. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తిరిగి గ్రామానికి వస్తూ చప్టా మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు ప్రయత్నించి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈత రావడంతో క్షేమంగా బయటపడ్డాడు. వరదలో ద్విచక్రవాహనం, రూ.25 వేల నగదు కొట్టుకుపోయాయి.

కొనసాగుతున్న వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం కాస్త తగ్గింది. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 47,255 క్యూసెక్కుల ప్రవాహం రాగా, 40 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 29,000 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాలవలకు 18,255 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలవకు 10,342, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 7,713, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలవ నుంచి రైవస్ 5,017, బందరు 1,982, కేఈబీ 1,832, ఏలూరు కాలువకు 1,511 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా నదిలో ఎగువన పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీరు వస్తోంది. దీనికి తోడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హద్దుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. నది ఎగువన ప్రవాహ తీవ్రత పెరిగింది. పులిచింతల (వజినేపల్లి) నుంచి 51,313, పాలేరు నుంచి 5,431, కీసర (మునేరు) నుంచి 12,189 క్యూసెక్కులు.. వెరసి 68,933 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. బుడమేరు నుంచి ప్రవాహం లేదు.

ఎగ్జిబిషన్‌కు.. తొలగిన అడ్డంకులు

ఈనాడు, అమరావతి

విజయవాడకే తలమానికం ✪ ఈసారి దసరా అదిరేలా..

విజయవాడ నగరంలో దశాబ్దాలుగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కొనసాగిన ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్‌ను మళ్లీ ఏర్పాటు చేయడానికి ఉన్న అడ్డంకులన్నింటినీ తొలగిస్తున్నారు. ఎగ్జిబిషన్‌కు రూ.వందల కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఒకప్పుడు విజయవాడకే తలమానికంగా ప్రదర్శన ఉండేది. 2013లో చివరిసారి నగరంలోని స్వరాజ్య మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎగ్జిబిషన్ సొసైటీకి కమిటీ ఏర్పాటు విషయంలో వివాదం నెలకొంది. దీంతో 12 ఏళ్లుగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం మళ్లీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసేందుకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చొరవతో ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ వరుస సమావేశాలు ఏర్పాటు చేసి వివాదాలన్నీ పరిష్కరించారు. కొత్తగా కొంత మంది సభ్యులతో అడ్‌హక్ కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ దసరాకు ఈ కమిటీ ఆధ్వర్యంలోనే మళ్లీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.



కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

రూ.250 కోట్లకు పైగా ఆస్తులు..

సొసైటీకి రూ.250 కోట్లకు పైగా విలువైన ఆస్తులు 2013 నాటికే ఉన్నాయి. గత 12ఏళ్లుగా ఎగ్జిబిషన్ సొసైటీకి సంబంధించిన ఆదాయం లెక్కలు సరిగా లేవు. గతంలో కృష్ణా ఎగ్జిబిషన్ సొసైటీ కమిటీకి అధ్యక్షుడిగా జిల్లా కలెక్టర్ ఉండగా, పోలీసు కమిషనర్, నగర ప్రజాప్రతినిధులతో పాటు మరో 150 మంది సభ్యులుండేవారు. వీరిలో వ్యాపారులు 20 శాతం, పారిశ్రామిక 70శాతం, వ్యవసాయ రంగం నుంచి 10 శాతం సభ్యులున్నారు. ఈ కమిటీ కాలం తీరినా పునరుద్ధరించే ప్రయత్నం ఇన్నాళ్లూ చేయలేదు. తాజాగా మళ్లీ పునరుద్ధరించడంతో 60 మంది సభ్యులుగా చేరారు. 2012లో నిబంధనల ప్రకారం కమిటీ ఎన్నిక జరగలేదంటూ అప్పటి కలెక్టర్‌గా ఉన్న రిజ్వీ రద్దు చేశారు. కానీ ఆయన వెంటనే బదిలీపై వెళ్లిపోవడంతో అప్పటి నుంచి ఆ ప్రక్రియ అక్కడితో ఆపేయడమే కాకుండా, కనీసం ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేయడం లేదు.

అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో లెక్కలు..

సొసైటీకి విజయవాడ ఆటోనగర్‌లో 5వేల గజాల స్థలంలో రెండు ఫంక్షన్ హాళ్లున్నాయి. తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ పక్కన నదిని ఆనుకుని 23 ఎకరాలు, గూడవల్లిలో మూడున్నర ఎకరాలు, పోరంకిలో ఎకరన్నర ఉన్నాయి. కొలనుకొండలో ఓ పాలిటెక్నిక్ కళాశాల కూడా ఉంది. ఈ కళాశాలకు సంబంధించిన నిధులు రూ.కోట్లలో పక్కదారి పట్టినట్లు ఆరోపణలున్నాయి. 12ఏళ్లుగా వీటికి సరిగా లెక్కలు లేవు. సొసైటీకి సంబంధించిన అన్ని రికార్డులను డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహానికి వెంటనే అప్పగించాలంటూ పాత కమిటీకి కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ లెక్కలన్నీ పక్కాగా కట్టాలంటూ ఆదేశించారు.

గొల్లపూడిలో దేవాదాయ స్థలం ఖరారు

గొల్లపూడిలోని 39 ఎకరాల భూమిని తాజాగా ఎగ్జిబిషన్ ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. ఈ స్థలం ప్రస్తుతం రైతుల ఆధీనంలో కౌలులో ఉంది. అటు రైతులు, ఇటు దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి.. దసరాకు ఎగ్జిబిషన్ పెట్టేందుకు ఖరారు చేశారు. గొల్లపూడి నుంచి జక్కంపూడి వైపు వెళ్లే మార్గంలో ఈ స్థలం ఉంది.

ప్రత్యేక గ్రేడ్ పంచాయతీగా మైలవరం

మైలవరం: మైలవరం ఇక మీదట ప్రత్యేక గ్రేడ్ పంచాయతీ కానుంది. జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేసిన ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. డిప్యూటీ ఎంపీడీవో లేదా ఈఓఆర్డీను ప్రత్యేక ఈవోగా నియమించనున్నారు. పొందుగల, వెల్వడం, పుల్లూరు, చంద్రగూడెం, చంద్రాల గ్రామ పంచాయతీలు గ్రేడ్ 1 పంచాయతీలుగా వర్గోన్నతి పొందనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

12న ఉద్యోగ మేళా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు విజయవాడ ఎంజీ (బందరు) రోడ్డులోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. '24×7.ఎఐ' మల్టీ నేషనల్ కంపెనీలో వాయిస్ ప్రాసెస్ అసోసియేట్, నాన్-వాయిస్ చాట్ ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. బి.టెక్, బి.కాం, బీఎస్సీ, ఎంసీఏ, డిగ్రీ, పీజీ 2023, 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులు. లేదా ఏదైనా ఎక్స్‌పీరియన్స్ (బీపీవో) 0 నుంచి 2 సంవత్సరాల అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులు. జీతం నెలకు రూ.17,770 నుంచి రూ.22,000 వరకు ఉంటుంది. రూ.5,000 బోనస్, ఉచిత ప్రయాణం (పిక్ అండ్ డ్రాప్), మొదటి మూడు నెలల ప్రొబెషన్ కాలం పూర్తయిన తర్వాత శాలరీ ఇంక్రిమెంట్ ఉంటుందని వివరించారు. 12న ధ్రువీకరణ పత్రాల నకళ్లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98494 65427 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

నాన్నని నమ్మేస్తే.. మందేసి అమ్మేసి..

కిడ్నాప్ నాటకాన్ని గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: తాగుడుకు బానిసైన ఓ కసాయి తండ్రి ఏకంగా మూడేళ్ల వయసున్న కూతురిని రూ.5వేలకు విక్రయించి.. ఆనక కిడ్నాప్, తప్పిపోయిందని నాటకాలాడాడు. ప్రభుత్వ రైల్వే పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించి సీసీ కెమెరాల సాక్షిగా అడ్డంగా దొరికిపోయాడు. ప్రభుత్వ రైల్వే పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారిని రక్షించి తల్లికి అప్పగించారు. విక్రయించిన తండ్రి, కొన్న ఇద్దరు కటకటాలపాలయ్యారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన జరిగింది.

తాగుడుకు బానిసై: బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేటకు చెందిన మస్తాన్‌కు వెంకటేశ్వరమ్మతో వివాహమైంది. వీరికి ఎనిమిది మంది సంతానం. ఇద్దరు అబ్బాయిలు, ఆరుగురు అమ్మాయిలు. తాగుడుకు బానిసైన మస్తాన్.. ఏ పనీ చేయకుండా నిత్యం భార్యతో గొడవ పడుతూ కొడుతుండేవాడు. స్థానికంగా సైకిళ్ల దొంగతనాలు చేస్తూ వచ్చే డబ్బుతో మద్యం తాగేవాడు. డబ్బుల కోసం మూడేళ్ల కిందట కుమార్తెల్లో ఒకరిని వేటపాలెంలో అమ్మాడు. ఈ నెల 6న ఉదయం భార్య వెంకటేశ్వరమ్మ ఉంటున్న ఇంటికి వెళ్లి అక్కడ ఆడుకుంటున్న మూడేళ్ల శ్రావణిని తీసుకుని చీరాల వచ్చాడు. అక్కడ రైలెక్కి విజయవాడలో దిగాడు. రెండు రోజుల పాటు ప్లాట్‌ఫారం పైనే ఉన్నాడు. అక్కడ భిక్షాటన చేసుకుంటూ పొట్ట పోసుకునే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చిన్నారి అనే మహిళ, ప్లాట్‌ఫారంపై మజ్జిగ ప్యాకెట్లు విక్రయించే ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసులు పరిచయం అయ్యారు. తాను కుమార్తెను పెంచలేకపోతున్నానని, మీరు కొనుగోలు చేస్తే భిక్షాటనకు అయినా పనికొస్తుందని వారిద్దరిని మస్తాన్ అడిగాడు. దీంతో వారు అంగీకరించి 7న రూ.5వేలు చెల్లించి బాలికను తీసుకున్నారు. అదే రోజు వీరు బాలికను తీసుకుని విజయవాడ బస్టాండుకు వెళ్లి రాజమహేంద్రవరం బస్సు ఎక్కారు.



చిన్నారిని కొనుక్కుని తీసుకెళ్తూ.. (సీసీ పుటేజీ దృశ్యం)

భిక్షాటన కోసం: అనంతరం బాలిక తండ్రి ఆ డబ్బుతో తాగాడు. రాత్రి 11 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఉన్న జీఆర్పీ స్టేషన్‌కు వెళ్లి తన కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేశాడు. అప్పటికే తాగి ఉండడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. భార్య ఏది అని అడగ్గా.. బిడ్డను కన్న వెంటనే చనిపోయిందని సమాధానమిచ్చాడు. తర్వాత మాట మార్చి భార్య వేరుగా ఉంటోందని, తమది బాపట్ల జిల్లా వేటపాలెం అని చెప్పాడు. కుమార్తె తప్పిపోయిందని మరోసారి చెప్పాడు. చిరునామా ఆధారంగా వేటపాలెం పోలీసుల ద్వారా ఆరా తీస్తే అసలు విషయం తెలిసింది. ఈలోగా రైల్వేస్టేషన్, బస్టాండులోని సీసీ కెమెరాలను జీఆర్పీ సీఐ రమణ వెతికితే ఇద్దరికి బాలికను అప్పగించినట్లు, వారు బస్టాండుకు వెళ్లి రాజమహేంద్రవరం బస్సు ఎక్కినట్లు తేలింది. వెంటనే ఆ బస్సు డ్రైవర్ నంబరు తీసుకున్న పోలీసులు అతనితో ఫోన్‌లో మాట్లాడారు. బాలికతో పాటు మహిళ, మరో వ్యక్తి ఉన్నట్లు డ్రైవర్ పోలీసులకు చెప్పాడు. అలా డ్రైవర్‌తో మాట్లాడుతూనే రాజమహేంద్రవరం పోలీసులను అప్రమత్తం చేశారు. రాజమహేంద్రవరం బస్టాండులో బాలికతో పాటు చిన్నారి, శ్రీనివాసులును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తాము బాలికను ఇక్కడ విక్రయించేందుకు తీసుకొచ్చామని వెల్లడించారు. అనంతరం పాపను క్షేమంగా విజయవాడకు తీసుకొచ్చారు.



చిన్నారి శ్రావణితో జీఆర్పీ సీఐ జేవీ రమణ

నిందితుల అరెస్టు: బాలిక తల్లి నంబరు తీసుకుని పోలీసులు ఆమెతో మాట్లాడి విజయవాడకు పిలిపించి ఆమెకు అప్పగించారు. తండ్రి మస్తాన్‌తో పాటు నిందితులైన బొల్లా శ్రీనివాసులు, సడేల చిన్నారిపై కేసు నమోదు చేసినట్లు విజయవాడ జీఆర్పీ సీఐ జేవీ రమణ విజయవాడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పాపను తల్లి వెంకటేశ్వరమ్మకు అప్పగించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.



అధునాతన సౌధం.. అమరావతికి ఆభరణం

రాజధాని అమరావతిలో వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా నిలిచిపోయిన భవన నిర్మాణాలు కూటమి ప్రభుత్వం వచ్చాక ఊపందుకున్నాయి. రాజధాని అమరావతిలో తొలి శాశ్వత భవనం ఏపీసీఆర్డీఏ కార్యాలయం ప్రారంభానికి సిద్ధం అవుతోంది. రాయపూడిలో సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తుల్లో అధునాతన సౌకర్యాలు, హంగులతో నిర్మిస్తున్నారు. సీఆర్డీఏ కార్యాలయం త్వరలో ప్రారంభించి అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఇంటీరియర్ పనులు పూర్తవడంతో పాటు, ఫర్నీచర్, సోఫాలు కార్యాలయానికి చేరుకున్నాయి. అధునాతన హంగులు, విద్యుత్తు కాంతులతో మెట్ల మార్గం రూపొందిస్తున్నారు. సీఆర్డీఏ కార్యాలయం ఎంతదూరం నుంచి చూసినా కనిపించేలా అమరావతి అంటే ఏ అనే అర్థం వచ్చేలా తయారు చేశారు. **- ఈనాడు అమరావతి**

భూముల రీసర్వే సాగేదెలా?

జిల్లాలో సర్వేయర్ల కొరత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భూముల రీ సర్వే కీలకంగా మారింది. ఇలాంటి తరుణంలో జిల్లాలో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రయోగాత్మక గ్రామాల్లో చేపట్టిన రెండో విడత రీసర్వే జులై 31తో ముగియాల్సి ఉంది. ప్రభుత్వ భూములను రీ సర్వే చేశారు. 16 ప్రయోగాత్మక గ్రామాలకు గాను, ఇప్పటి వరకు 11 గ్రామాల్లో తుది నోటిఫికేషన్లు ఇచ్చారు. మిగతా 5 గ్రామాల్లో నోటిఫికేషన్లు ఇచ్చే ప్రక్రియ జరుగుతోంది. రీసర్వే పూర్తయిన గ్రామాలు, మండలాల్లో సరిహద్దులను గుర్తించే పనులు సాగుతున్నాయి. రానున్న డిసెంబరు నుంచి జిల్లాలో 145 గ్రామాల్లో ప్రైవేటు భూముల రీసర్వే చేయనున్నారు. 2027 డిసెంబరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. కానీ సర్వేయర్ల కొరత వెంటాడుతోంది.

8 మండలాల్లో ఉద్యోగాల ఖాళీ: జిల్లాలో 8 గ్రామీణ/అర్బన్ మండలాల్లో సర్వేయర్లు లేరు. విజయవాడ సెంట్రల్, పశ్చిమ రెవెన్యూ మండల కార్యాలయాలు, వత్సవాయి, నందిగామ, చందర్లపాడు, రెడ్డిగూడెం, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో సర్వేయర్లు లేరు. జిల్లాలో మొత్తం 284 మంది గ్రామ సర్వేయర్లకు గాను, ప్రస్తుతం 222 మంది ఉన్నారు. 62 మంది లేరు. ఇలా మండల, గ్రామ సర్వేయర్ల కొరత ఆ శాఖను వెంటాడుతోంది.

భూసేకరణకు మార్గం సుగమం

ఈనాడు, అమరావతి: భూసేకరణకు లైన్ క్లియర్ అయింది. గుంటూరు-బీబీనగర్ రైల్వేట్రాక్ డబ్లింగ్ ప్రక్రియలో పురోగతి నెలకొంది. సుమారు రూ.2,853 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి గతేడాది డిసెంబర్‌లో గెజిట్ ప్రచురితం కావడం.. ఈ ఏడాది జనవరిలో పత్రికా ప్రకటన విడుదల చేయడం తెలిసిందే. ఆమేరకు అభ్యంతరాలుంటే తెలపాలని పేర్కొనగా..ఎలాంటి అభ్యంతరాలు వెల్లడి కాలేదు. దీంతో భూసేకరణ చేపట్టడానికి మార్గం సుగమమైంది. గుంటూరు-బీబీనగర్ మధ్య 239 కిలోమీటర్ల మేర వేయనున్న ఈ రెండోలైనుకు సంబంధించి..గుంటూరు జిల్లాలో మేడికొండూరు మండలం సిరిపురం, విశదల, మందపాడు..తాడికొండ మండలం బండారుపల్లి..గుంటూరు పశ్చిమ మండలంలో నల్లపాడు గ్రామీణం, చిన్న పలకలూరుల్లో భూమిని సేకరించనున్నారు.

వైఎస్ విగ్రహం తొలగించారని వైకాపా నేతల దౌర్జన్యం

నందిగామ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నిరసన

ఈనాడు, అమరావతి, నందిగామ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ గాంధీసెంటర్‌లో గత వైకాపా ప్రభుత్వంలో రోడ్డు మధ్యలో అడ్డంగా ఏర్పాటు చేసిన వై.ఎస్.ఆర్. విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు గురువారం అర్ధరాత్రి దాటాక తొలగించారు. నిత్యం వాహనాల రద్దీతో కిటకిటలాడే ఐదు రోడ్ల కూడలిలో అడ్డంగా ఈ విగ్రహం ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అందుకే తొలగించి మున్సిపల్ కార్యాలయంలో ఉంచారు. శుక్రవారం విషయం తెలుసుకున్న వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, నల్లగట్ల స్వామిదాసు, నాయకులు గౌతంరెడ్డి, ఇంటూరి చిన్నా తదితరులు కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. వైఎస్ విగ్రహం తొలగించిన దిమ్మెపైకి ఎక్కి మరీ హడావుడి చేశారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిని నెట్టేశారు. పైగా నాయకులందరినీ దిమ్మె పైకి ఎక్కాలంటూ అవినాష్ రెచ్చగొట్టారు. ఓ మొబైల్ వైఎస్ఆర్ విగ్రహాన్ని తీసుకొచ్చి దిమ్మెపై పెట్టి హల్‌చల్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని దౌర్జన్యానికి దిగారు.

నందిగామ మున్సిపల్ కార్యాలయ ప్రధాన ద్వారం తాళాలను వైకాపా నేతలు పగలగొట్టారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిని తోసేసి, బారికేడ్లను, గేట్లను నెట్టుకుంటూ లోపలికి వెళ్లిపోయారు. కార్యాలయ ప్రధాన ద్వారం గ్రిల్స్‌ను సైతం నెట్టేశారు. సెలవు కావడం వల్ల ఉద్యోగులు ఎవరూ లేరు. ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నించగా.. అది బరువుగా ఉండడంతో సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. దీనికి బాధ్యులైన వారిని ఎవరినీ వదిలి పెట్టేది లేదంటూ బెదిరింపులకు దిగారు. వైకాపా అధికారంలోకి రాగానే తొలగించిన వైఎస్సార్ విగ్రహాన్ని తిరిగి అక్కడే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు చేరుకుని విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీఐ వై.వి.వి.ఎల్.నాయుడికి ఫిర్యాదు చేశారు.

నాడు మహనీయుల విగ్రహాలు తొలగించి.. గాంధీసెంటర్‌లో గాంధీ, అంబేడ్కర్, జ్యోతిరావుపులే విగ్రహాలుండేవి. ఇవి రోడ్డు మధ్యలో ఉన్నాయని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయంటూ వైకాపా హయాంలో తొలగించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. గాంధీసెంటర్‌ను అభివృద్ధి చేయడానికేనంటూ సెలవిచ్చారు. మహనీయుల విగ్రహాలను తీసుకెళ్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని టాయిలెట్ల వద్ద పడేశారు. ఆ తర్వాత.. మున్సిపల్ నిధులు రూ.16 లక్షల వెచ్చించి.. అదే స్థానంలో వైఎస్సార్ విగ్రహం, పైలాన్, నవరత్న పథకాలు, జగన్ చిత్రాలను ఏర్పాటు చేశారు. వాస్తవంగా గతంలో ప్రముఖుల విగ్రహాలు ఓ పక్కగా ఉండేవి. వైఎస్ విగ్రహాన్ని భారీ పైలాన్‌తో సహా ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు ఇదే అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలోనే తాజాగా మున్సిపల్ పాలకవర్గంలో తీర్మానించి, ట్రాఫిక్‌కు అడ్డంకిగా ఉన్న విగ్రహాన్ని తొలగించాలని నిర్ణయించారు. విగ్రహం, పైలాన్, దిమ్మెలను తాజాగా తొలగించారు.



దిమ్మె వద్ద మొబైల్ వైఎస్సార్ విగ్రహం పెట్టి నిరసన తెలుపుతున్న వైకాపా నేతలు



మున్సిపల్ కార్యాలయంలోకి బారికేడ్లను తోసుకుంటూ వెళ్తున్న వైకాపా కార్యకర్తలు

విత్తనాల రాఖీ.. నక్షత్రాల జోడీ!

సోదరి, సోదరుడి మధ్య అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిర్వహించే రాఖీ పౌర్ణమి... ఈ వేడుక కలకాలం గుర్తుండేలా పర్యావరణహితంగా, భవిష్యత్తు తరాలకు ప్రయోజనం కలిగేలా చేసుకుంటే బాగుంటుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పిలుపు మేరకు నగరంలోని నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ముందుకొచ్చారు. వివిధ రకాల విత్తనాలతో రాఖీలను బొమ్మల రూపంలో తయారు చేసి భళా అనిపించారు. సాధారణానికి భిన్నంగా, వినూత్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. రాఖీ కట్టే సోదరి, తన సోదరుడి జన్మ నక్షత్రం తెలుసుకొని, వారి నక్షత్రానికి ఏ మొక్క ఉంటుందో ఆ విత్తనాలతో తయారు చేసిన రాఖీని కట్టాలని సీఎం సందేశాన్ని ఇచ్చారు. చేతికి ఉన్న రాఖీని తీసేటప్పుడు అందులోని విత్తనాలు మన ఇంటి ఆవరణలో లేదా అనుకూలమైన బహిరంగ ప్రాంతాల్లో నాటితే పెరిగే మొక్కలతో పచ్చదనం పరిఢవిల్లుతుంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇలా చేస్తే రాష్ట్రం హరితాంధ్రప్రదేశ్‌గా మారుతుందని సూచించారు. దీంతో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు రాఖీ పౌర్ణమికి మనకు బాగా ఉపయోగపడే అందుబాటులో ఉండే 9 రకాల విత్తనాలు సేకరించి వాటిని కళాత్మకంగా బొమ్మల రూపంలో తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన రాఖీలను తమ సోదరులకు కడతారని విద్యార్థినులు తెలిపారు.



తయారీలో నిమగ్నమైన విద్యార్థినులు

నక్షత్రం-మొక్క..

అందులో ముఖ్యంగా అశ్విని-రేగు, కృత్తిక-మేడి, రోహిణి-జాజి, ఆశ్లేష-రావి, మఖ-మర్రి, పుబ్బ-మోదుగ, హస్త-కుంకుడు, ఉత్తరాభాద్ర-వేప, రేవతి-ఇప్ప, ఆరుద్ర-వేప విత్తనాలతో వివిధ రకాల రాఖీలను తయారు చేశారు

- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ సిటీ



వివిధ రకాలతో ఇలా..

గుడిలో సెల్‌గోల..





దేవాలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్లో వీడియోలు, ఫొటోలు తీసే పనిలో బిజీబిజీ..

ప్రధాన దేవాలయాల్లో రీల్స్ చేయడం, సెల్‌ఫోన్ల వాడకంపై నిషేధం విధిస్తూ ఇప్పటికే దేవాదాయశాఖ చర్యలు మొదలు పెట్టింది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో భక్తులు విచ్చలవిడిగా సెల్‌ఫోన్లు వాడుతూ ఇన్‌స్టారీల్స్, ఫొటోలు తీసుకుంటూ పరిసరాలన్నీ షూట్ చేస్తున్నారు. సెల్‌ఫోన్స్ ఆలయంలోకి రాకుండా కట్టడి చేసే వ్యవస్థ సరిగా లేక అందరూ దేవాలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్లు వాడుతూ కనిపిస్తున్నారు. ఫొటోగ్రఫి, సెల్‌ఫోన్లు, వీడియోలు తీయడం నిషిద్ధం అనే నినాదాలు కేవలం బోర్డులకే పరిమితం అవుతున్నాయి. -ఈనాడు, అమరావతి

జీజీహెచ్‌లో అరుదైన మెదడు శస్త్ర చికిత్స



రోగి పరిస్థితిని వివరిస్తున్న సూపరింటెండెంట్ ఏవీ రావు. పక్కన వైద్యులు ఏడుకొండలరావు, బాబ్జీశ్యామ్‌కుమార్ తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతానికి చెందిన కందని రమేష్ అనే కారు డ్రైవర్.. అపస్మారక స్థితిలో పదిరోజుల కిందట విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. అతడి మెదడులోని రక్త నాళాల్లో ఏర్పడిన బుడగలాంటి కణితి పగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు వైద్యులు నిర్ధారించుకుని న్యూరో సర్జరీ విభాగాధిపతి డా.బాబ్జీశ్యామ్‌కుమార్ సారథ్యంలోని బృందం శస్త్రచికిత్స చేసి, అన్యూరిజం క్లిప్ అమర్చడంతో అతడు శుక్రవారం సాయంత్రానికి కోలుకున్నాడు. విజయవాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు.. రోగిని పరీక్షించి, అతడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటువంటి శస్త్ర చికిత్సలు జీజీహెచ్‌లో భవిష్యత్తులో మరిన్ని చేస్తామని, ప్రైవేటు ఆసుపత్రిలో ఈ వైద్యం రూ.లక్షలతో కూడుకున్నదని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యూరో సర్జరీ విభాగం వైద్యుల బృందం డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ రాంబాబు, డాక్టర్ శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ద్విచక్ర వాహనాల దగ్ధం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన వాహనాలు

పటమట, న్యూస్‌టుడే: బందరు రోడ్డులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. . కేఎఫ్‌సీ భవనం సెల్లార్‌లో తెల్లవారుజామున 4 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సెల్లార్‌లో నిలిపి ఉంచిన ఏడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. దీనిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

ఖననానికీ స్థలం కరవాయె..

మునేరులో వెంటాడిన వరద కష్టాలు

అష్టకష్టాల మధ్య యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మునేరులో వరద ఉద్ధృతి కొనసాగుతుండడంతో ఓ యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం దొరక్క కుటుంబ సభ్యులు, బంధువులు నానా అవస్థలు పడిన ఘటన శుక్రవారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో చోటుచేసుకుంది. స్థానిక బైపాస్ రోడ్డుకు చెందిన తిరుపతమ్మ దేవాలయంలో నాయీబ్రాహ్మణునిగా పనిచేసే కొలిపాక రాము(32) కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతదేహానికి మునేరులో అంత్యక్రియలు నిర్వహించేందుకు సమాయత్తమవగా.. వరద అడ్డుగా నిలిచింది. వంతెన పక్కగా నది మధ్యలో కొంత మేర ఇసుక తిన్నెలు ఉండడంతో అక్కడ కట్టెలతో చితి పేర్చారు. మృతదేహాన్ని చితి వద్దకు తీసుకుపోయే దారిలేక ఏమి చేయాలో పాలుపోక చాలాసేపు వంతెనపైనే ఉంచారు. ఆ సమయంలో నదిలో వరద ఉద్ధృతి పెరిగితే పేర్చిన చితి కూడా కొట్టుకుపోతుందనే ఆందోళన బంధువుల్లో వ్యక్తమయ్యింది. చివరికి నిచ్చెన సాయంతో మృతదేహాన్ని కిందకు దింపేందుకు బంధువులంతా తీవ్రంగా శ్రమించి చితి వద్దకు చేర్చి కార్యక్రమాన్ని పూర్తి చేశారు.



వంతెనపై నుంచి మృతదేహాన్ని కిందకు దింపుతున్న బంధువులు

కుటుంబానికి అండగా ఉంటాడనుకుంటే అర్ధాంతరంగా..

ఆ తల్లిదండ్రులకు సంతానం లేకపోతే ఆరు నెలల బాలుడిని తీసుకొచ్చి గారాబంగా పెంచుకున్నారు. తిరుపతమ్మ ఆలయంలో కేశఖండనశాలలో రాము నాయీబ్రాహ్మణునిగా విధులు నిర్వహిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉండాల్సిన యువకుడు అనారోగ్యంతో అర్ధాంతరంగా మృతి చెందడంతో వారంతా శోకసంద్రంలో మునిగారు.

సృష్టిలో ముప్పేట మోసాల దందా!

విచారణలో డా. నమ్రత మాయలు బహిర్గతం

ఈనాడు, హైదరాబాద్ రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సంతానం లేని దంపతులే లక్ష్యంగా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ముప్పేట మోసాలకు తెగబడినట్లు పోలీసుల విచారణలో బహిర్గతమైంది. ఐదో రోజు పోలీసు కస్టడీలో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత నుంచి కీలక విషయాలు సేకరించినట్లు సమాచారం. సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టిపై నమోదైన తొమ్మిది కేసుల్లో గోపాలపురం పోలీసులు 26 మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న సంజయ్ కోసం గాలిస్తున్నారు. ఐవీఎఫ్, సరోగసీ చికిత్సతో కన్నబిడ్డల్ని ఎత్తుకోవాలనే దంపతుల ఆశను డాక్టర్ నమ్రత తెలివిగా సొమ్ము చేసుకుంటూ వచ్చారు. గతంలో ఆమె పలుమార్లు జైలుకెళ్లినా.. విడుదల కాగానే ఇతరుల పేర్లతో క్లినిక్‌లు ప్రారంభించి పెద్దఎత్తున దందా సాగించారు. ఏపీ, తెలంగాణల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచిత కన్సల్టింగ్ పేరుతో సంతానం లేని దంపతులను ఆకట్టుకున్నారు. అక్కడకు వచ్చిన వారిని వైద్య పరీక్షలకు సికింద్రాబాద్ రప్పించారు. ఇక్కడ ఐవీఎఫ్ చికిత్స అందించి ఫలితం లేదని సరోగసీ పేరుతో విశాఖపట్నం పంపారు. అక్కడి మేనేజర్ కల్యాణి వీరితో బేరసారాలు సాగించి సరోగసీ బిడ్డకు రూ.30-60 లక్షలు వసూలు చేసేది. అప్పటికే ఏజెంట్ల ద్వారా పేద కుటుంబాల్లోని గర్భిణులకు రూ.1-4 లక్షలు ఆశచూపి పుట్టబోయే శిశువులను తమకు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకునేవారు. వారికి పుట్టిన బిడ్డలను సరోగసీ పిల్లలేంటూ దంపతులకు అప్పగించేవారు. రెండో తరహా మోసం సరోగసీ చికిత్స పేరుతో డబ్బు తీసుకొని అద్దె గర్భంలోనే బిడ్డ చనిపోయాడంటూ వసూలుచేసిన సొమ్ము తిరిగి చెల్లించకుండా ముఖం చాటేసేవారు. సరోగసీ కోసం ఇప్పటికే వందలాది మంది రూ.లక్షలు చెల్లించినా.. వారికి పిల్లల్ని ఇవ్వకుండా వాయిదా వేస్తూ వస్తున్నారు. తమ వద్దకు వచ్చే వారిని ఇలా మూడు రకాలుగా మోసగించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇవే అంశాలను డాక్టర్ నమ్రత విచారణలో పోలీసుల ఎదుట అంగీకరించినట్లు సమాచారం. కొన్ని విషయాలు మాత్రమే గుర్తున్నాయంటూ పూర్తి వివరాలు వెల్లడించలేదని తెలిసింది. నిందితురాలి నుంచి మరింత సమాచారం సేకరించేందుకు రెండోసారి మరో ఐదురోజులు కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేయనున్నారు.



ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత

అమ్మింది.. కొన్నది ఎవరో?

శిశు విక్రయాల్లో జరిగిన లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పిల్లల్ని తల్లిదండ్రుల నుంచి కొనుగోలు చేసిన ఏజెంట్ల నుంచి కొంతమేర సమాచారం సేకరించారు. దాని ఆధారంగా పిల్లల్ని అమ్మిన, కొనుగోలు చేసిన తల్లిదండ్రుల్లో కొందరి వివరాలు రాబట్టారు. పిల్లలు ఎవరి ఆధీనంలో ఉన్నారనేది గుర్తించేందుకు సిద్ధమయ్యారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్యాంకు ఖాతాలు, రికార్డులు, రోగుల వివరాలు ఆధారంగా మరికొందరి ప్రమేయంపై ఆరా తీస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో మరో 5-6గురు వైద్యులు ఫెర్టిలిటీ కేంద్రంలో కన్సల్టింగ్ అధికారులుగా పనిచేసినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఒక్కొక్కరుగా అరెస్టవుతుండటంతో కొందరు దళారులు, పిల్లల్ని విక్రయించిన తల్లిదండ్రులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు సమాచారం.

జమకాని నిధులు.. పంచాయతీల్లో వెతలు

సీఆర్‌డీఏ, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రూ.కోట్లు విడుదల కాని వైనం

గొల్లపూడి, న్యూస్‌టుడే



గొల్లపూడి గ్రామం

ఆర్థిక భారంతో విజయవాడ చుట్టు పక్కల ఉన్న గ్రామ పంచాయతీలు కునారిల్లుతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన వాటాలు రాకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయి. విజయవాడలో భూముల రేట్లు పెరగడంతో ఎక్కువ మంది శివారు ప్రాంతాల వైపు దృష్టి సారిస్తున్నారు. అలాగే బిల్డర్లు సైతం శివారు ప్రాంతాల్లో భవన నిర్మాణాలను చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ గ్రామీణ మండలం పరిధిలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో గొల్లపూడి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, ఎనికేపాడు గ్రామాలు జాతీయ రహదారి వెంబడి ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో భవన నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. వాటికి సీఆర్‌డీఏ అనుమతులు మంజూరు చేయాల్సి ఉండగా..ఇందు కోసం ఫీజుల రూపంలో రూ.లక్షలను సీఆర్‌డీఏ వసూలు చేస్తుంటుంది. అందులో కొంత వాటా డబ్బులను డెవలప్‌మెంట్ ఛార్జీల రూపంలో గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సి ఉంది. ఆ వాటా డబ్బులను గత కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీలకు సీఆర్‌డీఏ చెల్లించడం లేదు. ఫలితంగా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిధుల కొరత ఏర్పడుతుంది.

రూ.100 కోట్లు పైగానే బకాయిలు... గ్రామ పంచాయతీలకు దాదాపు రూ.100 కోట్లు పైగానే సీఆర్‌డీఏ వాటాల రూపంలో చెల్లించాల్సి ఉంది. అందులో ఒక్క గొల్లపూడి గ్రామ పంచాయతీకే కోట్లాది రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఆ నగదును సీఆర్‌డీఏ చెల్లిస్తే పంచాయతీలకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు వీలు కలుగుతుంది. అలాగే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి కూడా రూ.2కోట్లు రావాల్సి ఉంది. గ్రామాల్లో స్థలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి వసూలు చేసే ఫీజు లోనుంచి కొంత వాటాను పంచాయతీలకు ఇవ్వాలి. ఆ డబ్బులు కూడా గత కొన్నేళ్లుగా చెల్లించని పరిస్థితి. ఒక్క గొల్లపూడి గ్రామ పంచాయతీకే కాకుండా విజయవాడ చుట్టు పక్కల ఉన్న అనేక పంచాయతీలకు కూడా ఇదే విధమైన పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఆ నిధులను పంచాయతీలకు జమ అయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

'చట్టబద్ధంగానే విగ్రహం తొలగింపు'

నందిగామ, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా పాలనలో విగ్రహాల వివాదాలతోనే మొండితోక సోదరులు రాజకీయాలు చేశారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య విమర్శించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చట్టబద్ధంగా గాంధీసెంటర్‌లో మున్సిపల్ అధికారులు విగ్రహం తొలగిస్తే వైకాపా నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాలను తొలగించి టాయిలెట్ల పక్కన పెట్టిన విషయాన్ని నందిగామ ప్రజలు మర్చిపోలేదనే విషయాన్ని గమనించాలన్నారు. గాంధీసెంటర్‌లో అన్ని విగ్రహాలను ఒకే వేదికపై పెట్టాలని తెదేపా మొదటి నుంచే గట్టిగా కోరిందని చెప్పారు. దీనికి విరుద్ధంగా వైఎస్ఆర్ విగ్రహాన్ని పెట్టడం వల్లే వివాదం తలెత్తిందన్నారు. చివరికి మహాత్మాగాంధీ విగ్రహాన్ని అడ్డంగా లేకపోయిన తొలగించారన్నారు. వైకాపా నాయకులు ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

పది రోజుల్లో రెండోసారి

కట్లేరు వంతెనపై మళ్లీ పెరిగిన వరద.. నిలిచిన రాకపోకలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎగువున కురిసిన భారీ వర్షంతో కట్లేరుకు శుక్రవారం ఉదయం నుంచి వరద నీరు చేరడంతో వినగడప వంతెన వద్ద మళ్లింపు రోడ్డుపై మధ్యాహ్నం నుంచి ప్రవాహం పెరిగింది. వారం రోజుల కిందట కూడా వరద నీరు మళ్లింపు రోడ్డుపై ప్రవహించడంతో నాలుగు రోజుల పాటు రాకపోకలు నిలిచాయి. పది రోజుల వ్యవధిలో రెండో సారి అంతరాయం కలిగింది. గురువారం రాత్రి నుంచి ఎగువున ఉన్న ఖమ్మం జిల్లాతో పాటు తిరువూరు, గంపలగూడెం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షం నీరు వాగులు, వంకలు ద్వారా కట్లేరు చేరింది. క్రమేణ ప్రవాహ ఉద్ధృతి పెరుగుతూ వినగడప వంతెన వద్ద రాకపోకలు ఆపేసింది. వంతెన వద్ద రెండు పక్కలా ఎస్సై శ్రీను ఆధ్వర్యంలో స్టాప్ బోర్డులు పెట్టి రాకపోకలు ఆపేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో గంపలగూడెం నుంచి ఏటి అవతల ఉన్న కనుమూరు, వినగడప, నారికింపాడు, తండా, అనుముల్లంక, కొత్తపల్లి గ్రామాల ప్రజలతో పాటు మైలవరం, విజయవాడ, నూజివీడు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆ గ్రామాలతో పాటు విజయవాడ, నూజివీడు వైపు వెళ్లాల్సిన ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు వ్యయప్రయాసలకోర్చి తిరువూరు మండలం మీదుగా ప్రయాణాలు సాగించారు.



కట్లేరు వద్ద మళ్లింపు రోడ్డుపై నడిచి వెళ్తున్న ప్రజలు

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -99 రిటైల్ ధర 121 చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 500 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

మహా ధర్నా విజయవంతానికి పిలుపు

గాంధీనగర్, న్యూస్‌టుడే : సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ధర్నా చౌక్‌లో నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీనగర్‌లోని కార్యాలయంలో కార్యక్రమ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా బోర్డును ఏర్పాటు చేయకపోవడం విచారకరం అన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక సమస్యల వల్ల భవన నిర్మాణరంగ కార్మికులు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించారని చెప్పారు. నేతలు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.హరికృష్ణారెడ్డి, షేక్ మీరావలి, సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? మైలవరం జలితెర్నగర్ పాఠశాల సమీపంలో రహదారి పక్కనే చెత్త పేరుకుపోయి ఇబ్బందిగా ఉంది. -నాగేశ్వరమ్మ, మైలవరం ✔ కార్మికులను పంపి, తొలగింపజేస్తాం -ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, మైలవరం

? గుంటుపల్లి చిండల వద్ద ప్రధాన మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందికరంగా ఉన్నాయి. -గోపాలనాయుడు, స్థానికుడు ✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -మురళి, గ్రామ కార్యదర్శి

? మూలపాడు తాగునీటి సరఫరా ట్యాంకును నిర్దేశిత రోజుల్లో శుభ్రం చేయకపోవడంతో కుళాయిల్లో కలుషిత నీరు వస్తోంది. ట్యాంకును శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి. -బాబురావు, స్థానికుడు ✔ ప్రతి 15 రోజులకోసారి ట్యాంకును శుభ్రం చేస్తున్నాం. గ్రామస్థుల సూచన మేరకు ఒకటి రెండు రోజుల్లో తిరిగి శుభ్రం చేయిస్తాం. -అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



★ ఆత్కూరు గ్రామంలోని మురుగుకాలువల్లో పూడిక తీయక దోమలు, దుర్వాసనతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు న్యూస్‌టుడే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 6వ తేదీన కథనంలో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్యదర్శి శ్యామ్ పారిశుద్ధ్య సిబ్బందితో మురుగుకాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. తమ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం

★ రంగాపురం గ్రామంలోని ఎస్సీకాలనీ ఎంపీపీ పాఠశాల దగ్గర డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారడంలేదని అధ్వానంగా మారిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు తెలిపిన సమస్యను రంగాపురం పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామారావుకు తెలుపగా స్పందించారు. పంచాయతీ సిబ్బందిని పంపి పూడిక తొలగింపు పనులు చేయించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

★ విస్సన్నపేట మండలం నర్సాపురం గ్రామ పంచాయతీలో ప్రధాన వీధుల వెంట చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పంచాయతీ అధికారులకు తెలుపగా సర్పంచి మారెపోగు నాగమణి, సెక్రటరీ స్వాతి స్పందించారు. క్లాప్ మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను వాహనాలకు ఎత్తి డంపింగ్ యార్డ్‌కి తరలింపజేశారు.
-న్యూస్‌టుడే, విస్సన్నపేట

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మూడు గంటల పాటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ ఆలయం రోడ్డు, వాసవీ మెడికల్ కాంప్లెక్స్, ల్యాంకోకాలనీ ప్రాంతం, టింబర్ డిపోలు ప్రాంతాల్లో ఉదయం 7:30 నుంచి 10:30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గణపవరం, వెల్వడం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 9 న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు రామ్మోహనరావు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట ఎంఈవో1గా నియమితులైన కె.శంకరరావు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుని ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను, విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ పథకాలను తెలుసుకుని పాఠశాలల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.



ఎమ్మెల్యే కొలికపూడిని సత్కరిస్తున్న ఎంఈవో 1

బురద పనులకు.. రాం రాం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం మండలంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతాయి. నాట్ల కోసం అధిక శాతం రైతులు ఉత్తరాది రాష్ట్రాల కూలీలపైనే ఆధారపడుతున్నారు. వ్యవసాయ పనులకు వచ్చే స్థానిక కూలీల సంఖ్య ఏటికేడు తగ్గుతుండడం..గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈజీఎస్ ద్వారా చేపట్టే పొలం పనుల్లో 75 శాతం కూలిని రైతులు భరించేలా..25 శాతం ప్రభుత్వం చెల్లించేలా వ్యవసాయ పనులు చేపట్టాలన్న నీతి ఆయోగ్ సిఫార్సులు ఇప్పటికీ అమలుగాక ఇక్కట్లు పెరుగుతున్నాయి.

తప్పని సరైంది..: వ్యవసాయ పనులకు ఇటీవల కొన్నిరకాల యంత్రాలు వస్తున్నా చాలా పనులను కూలీలతో చేయించాల్సి వస్తోంది. మన దగ్గర కూలీలు బురదలో పనికి రాకపోవడంతో బెంగాల్ రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల వారిపై ఆధారపడాల్సి వస్తుందని అన్నదాతలు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 4 వేల నాలుగు వేల ఎకరాల్లో సాధారణ వరి సాగవుతుంది. ప్రస్తుతం దాదాపు 1,300 ఎకరాల్లో పూర్తి చేశారు.

అనుసంధానం చేయాలి: ప్రస్తుతం ఉద్యాన పంటలకు గుంతలు తీయడం, పందిరి కూరగాయల సాగు, ఫీడర్ ఛానళ్లు, నీటినిల్వ కందకాల తవ్వకం, ఇంకుడు గుంతలు తవ్వకం తదితర వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు అవకాశం కల్పించారు. వరినాట్లు, కోతలు, కలుపు తీతలు తదితర పొలం పనులను ఉపాధి హామీ పనులతో అనుసంధానం చేయాలని కర్షకులు కోరుతున్నారు. గతంలో ఉపాధి హామీ పనులు లేకపోవడంతో అవసరమైనంత వరకు గ్రామాల నుంచి కూలీలు నాట్లుకు వచ్చేవారు. ఉపాధి హామీ పనులు రావడంతో ఎక్కువగా అటే పోతున్నారు. ఏడాది మొత్తం ఉండే ఉపాధి పనులను కాదని సీజన్‌లో నాట్లకు రాకపోవడంతో బెంగాల్ కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

బెంగాలీ కూలీలే దిక్కు

ఉద్యాన పనులకు ప్రాధాన్యం.. వరినాట్లకు దూరం



గుంటుపల్లిలో నాట్లు వేస్తున్న కూలీలు

నైపుణ్యంతో పని

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు పనిలో ఎంతో నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. దమ్ము మడిలో పైపైనే వరి నాట్లు వేయడం వల్ల వేరు వ్యవస్థ దృఢంగా పెరిగి దుబ్బులో పిలకల సంఖ్య ఎక్కువగా ఉండడంతో దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. దీంతోపాటు నారు తీసేందుకు నాట్ల మధ్య బాటలకు ప్రత్యేక కూలీలు అవసరం లేకుండా వారే అన్ని పనులు ఏకకాలంలో చేయడం వల్ల సమయం ఆదాతో పాటు ఖర్చు తగ్గుతుందని రైతులు తెలిపారు. నాట్లు వేసే విస్తీర్ణాన్ని కూడా వారి వద్ద ఉన్న సెల్ యాప్ సాంకేతికతను ఉపయోగించుకుని కొలుస్తున్నారు.

వైభవంగా దీపాలంకరణ సేవ

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు చేయగా భక్తులు దర్శించుకున్నారు.



శేషాచల శ్రీనివాస ఆలయంలో గిరిప్రదక్షిణ నేడు

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో శనివారం ఉదయం 9 గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారు జన్మించిన శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని శ్రావణమాసం, పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ భక్తజనంతో శ్లోకగానం జరిపిస్తామని అర్చకులు శ్యామ్ సుందరాచార్యులు, గుడి కమిటీ అధ్యక్షుడు వెంకట్రావు వివరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో గజలక్ష్మి, శ్రీనివాస స్వామి మూలవిరాట్‌లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తిరుపతమ్మకు శ్రావణమాస సారె



సారెతో ఆలయానికి వచ్చిన భక్తులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలుకు చెందిన భక్తులు తిరుపతమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వాసిరెడ్డి బెనర్జీ, ఆలయ పాలకవర్గ సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదగాలని సీఐ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక రెజోనెన్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి ఏడాదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి జ్ఞాపిక అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, సీఈవో కె.గౌతమ్, ఏజీఎం గురుప్రసాద్, ప్రిన్సిపాళ్లు మూర్తి, కృష్ణకిషోర్, ఎస్ఎస్‌కే, గౌతమ్ స్కూల్ డైరెక్టర్లు జి.మోహనరావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

విజయవాడ పాతాసుపత్రి: విసన్నపేట మండలం తెల్లదేవరపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని శుక్రవారం పరిశీలించారు. గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం గురుకులాన్ని సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. భోజనశాల, వండిన ఆహారాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి ఇక్కడి పరిస్థితి వివరిస్తానని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గురుకులం ప్రిన్సిపల్ శ్యామల, సబ్ యూనిట్ అధికారి బాబూరావు, సూపర్‌వైజర్ వీరభద్రరావు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భోజనశాలలో ఆహారాన్ని పరిశీలిస్తున్న డా.ఎం.సుహాసిని, తదితరులు

హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక పరిధిలోని పుట్టలమ్మగుట్టలో శుక్రవారం తెదేపా పురపాలికశాఖ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని వివరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కూడా అమలు చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వం సాధించిన విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు సాంబమూర్తి, నాగరాజు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొండపర్వ గ్రామంలో తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మట్టా వేణుగోపాల్, పీఏసీఎస్ ఛైర్మన్ పామర్తి లక్ష్మీనారాయణ, గ్రామ అధ్యక్షుడు ఎం శ్రీధర్, మల్లయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు, కార్యకర్తలు



విస్సన్నపేట: ప్రచారంలో పాల్గొన్న తెదేపా శ్రేణులు

జాతీయోద్యమ నాయకులకు నివాళి

పెనుగొలను, న్యూస్‌టుడే: క్విట్ ఇండియా దినోత్సవాన్ని మండంలోని పెనుగొలనులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయోద్యమంలో పాల్గొన్న నాయకుల చిత్రపటాలను ప్రదర్శించారు. విద్యార్థులు, గ్రామస్థులు జాతీయ నాయకులకు నివాళులర్పించారు.



చొచ్చుకొస్తున్నాయ్.. కత్తిరించండి



మండలంలోని దుందిరాలపాడు-తునికిపాడు మధ్య ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా పెరిగిన కంప చెట్ల కొమ్మలు రహదారిపైకి చొచ్చుకు రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రులు దారి కనిపించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలూ ఉన్నాయి. స్థానికంగా ర.భ శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో రహదారులపై పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంప చెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గంపలగూడెం**

ప్రమాదకరంగా రహదారి



గొల్లపూడి మైలురాయి సెంటర్ వద్ద జాతీయరహదారి కూడలి ప్రమాదకరంగా మారింది. రహదారిపై గోతులు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ఆ మార్గంలో వెళ్తుంటాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువ మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గొల్లపూడి**

వానొస్తే వరద.. ఇంకిపోతే బురద



మండలంలోని కోడూరు నుంచి మారేపల్లి వెళ్లే తారు రోడ్డు బురదమయంగా తయారైంది. దీంతో అటుగా రాకపోకలు సాగించడం గ్రామస్థులకు నరక ప్రాయంగా మారింది. కోడూరు నుంచి మారేపల్లి, పోలిశెట్టిపాడు గ్రామాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి ఇది. రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు పారుదలకు కాల్వలు కూడా సక్రమంగా లేవు. దీంతో వర్షం కురిస్తే వరద నీరు..తర్వాత బురదతో అవస్థలు పడుతున్నారు. పాలకులు నిధులు మంజూరు చేసి ఈ మార్గాన్ని సీసీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోడూరు(ఎ.కొండూరు)**

గుంత పూడిస్తే.. ప్రమాదం ఆపినట్లే



మండలంలోని గానుగపాడులో ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. డ్రెయినేజీ వ్యవస్థ మరింత దారుణంగా ఉంది. కాల్వలు పూడుకుపోవడంతో మురుగు నీరు పారుదల లేదు. పలు చోట్ల మురుగు రహదారిపైకి చేరుతోంది. చింతలపాడు నుంచి గానుగపాడు వెళ్లేటప్పుడు గ్రామ ప్రవేశం వద్ద పెద్ద గుంత ఏర్పడి అందులో నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందుల పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డుపై గుంతలు పూడ్పించాలని, వీధుల్లో డ్రెయినేజీలు బాగుజేయించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గానుగపాడు(తిరువూరు)**

వరములీయమ్మా.. మహాలక్ష్మి



మైలవరం రేణుకమ్మ ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



తిరువూరు కనకదుర్గ గుడిలో కరెన్సీ నోట్లలో అలంకరణ



తిరువూరు: రాజ్యలక్ష్మీదేవి



ఊటుకూరు కోదండ రామాలయంలో

మైలవరం, న్యూస్‌టుడే: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో, ఆలయాల్లో పూజలు, వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక రేణుకమ్మ ఆలయం, కోట మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో పూజలు చేశారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలంలోని పలు దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం, నర్సాపురం శ్రీ సూర్య లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం, పుట్రేల శ్రీ మారెమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మి వ్రతాలు చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: శ్రావణ శుక్రవారం సందర్భంగా గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లో భక్తులు వరలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళలు తమ గృహాల్లో అమ్మవారి ప్రతిమలకు పిండి వంటలు, చీరెలు, జాకెట్లు, పూలు, పండ్లు, గాజులు సమర్పించి పూజలు చేపట్టారు. తిరువూరు పట్టణం, నెమలి, ఊటుకూరు, పెనుగొలను తదితర గ్రామాల్లో ఆలయాల్లో అర్చకులు రాజ్యలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డిగూడెంలో మహాలక్ష్మీ అమ్మవారి సేవ(పూజ)కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలతో గ్రామంలో గ్రామోత్సవం జరిపించారు.



నర్సాపురం సూర్యాలయంలో కుంకుమార్చన

ఏళ్లు గడిచినా..తరగని అభిమానం

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రేవిడిచర్లకు చెందిన రామాల భాగ్యలక్ష్మి 20 ఏళ్ల నుంచి గంపలగూడెం మండలం అనుముల్లంకకు వచ్చి తన నలుగురి తోబుట్టువులకు రాఖీ కడుతున్నారు. ఇద్దరు సోదరులు ఏడేళ్ల కిందట మృతి చెందగా..ఏటా రాఖీ పౌర్ణమినాడు వారి చిత్రపటాలకు రాఖీ కట్టి తన ప్రేమానురాగాలను చాటుకుంటున్నారు. స్తోమత మేరకు తమ సోదరికి బహుమతులు అందించిన ఆమె ఆనందాన్ని పంచుకుంటామని సోదరుడు తిరువూరు శ్రీవాహిని కళాశాల అధ్యాపకుడు మద్దాల పాపారావు తెలిపారు.



అనుముల్లంకలో అన్న పాపారావుకు రాఖీ కట్టిన భాగ్యలక్ష్మి

అనురాగాల మది..అపురూపమైనది

గంపలగూడెం, న్యూస్‌టుడే

అనురాగాల మది.. అన్నింటా తోడుండే అపురూపమది..వెన్నంటే ఉండే ఆప్యాయ పలకరింపులవి.. కష్టంలో అండగా..ఆనందంలో తోడుగా..ప్రతిక్షణం వీడని నీడగా ఉండేదే తోబుట్టువుల బంధం. రాఖీ పండగ వస్తే ఎక్కడున్నా నా అన్నకు, నా తమ్ముడికి రాఖీ కట్టాలని వేచి చూసే ఆ ఇంటి ఆడపిల్ల కల సాకారమయ్యేది రాఖీపౌర్ణమి నాడే. నేడు రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కొందరి అనుభవాలు మీతో పంచుకుంటూ..

రాఖీ కోసం 150 కి.మీ ప్రయాణం

గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం నుదురుపాడుకు చెందిన చెలికాని చంద్రప్రియ తిరువూరు శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ బీటెక్ చదువుతోంది. 16 ఏళ్లుగా తన తమ్ముడు భవనచంద్ర దుర్గాప్రసాద్‌కు రాఖీ కడుతోంది. నా తమ్ముడు రాఖీ కట్టించుకునేందుకు 150 కి.మీ ప్రయాణం చేసి నాదగ్గరకు వస్తాడని ఈ పండగ మాకు ఎంతో అమూల్యమైనదని ఆనందం వ్యక్తం చేసింది.



సాగర్ జలాలు వచ్చేశాయ్

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే:

ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌లో పక్షం రోజులు ముందుగానే సాగర్‌జలాలు సవ్వడి చేస్తున్నాయి. వాస్తవంగా ఏటా ఆగస్టు రెండోపక్షం నుంచి ఖరీఫ్ పంటలకు సాగర్‌జలాలు మధిర శాఖ కాల్వకు విడుదల చేస్తారు. ఈ ఏడాది నాగార్జునసాగర్ డ్యామ్‌లో వరద నీరు భారీగా చేరింది. వారం రోజులనాడు సాగర్ జలాశయం గేట్ల నుంచి తెలంగాణ మంత్రులు ఎడమ కాల్వకు నీరు విడుదల చేయగా పాలేరు జలాశయానికి నీరు చేరింది. అక్కడి నుంచి 1వ తేదీన ప్రధాన కాల్వకు విడుదల చేశారు. దీంతో 15 రోజుల ముందుగానే ఖరీఫ్ పంటలకు సాగర్‌జలాలు చేరువయ్యాయి. మంగళవారం నుంచి మధిర బ్రాంచి కెనాల్‌కు సాగర్‌జలాల సరఫరా ప్రారంభమైంది. ఖమ్మం జిల్లా కప్పలబంధం 72వ కి.మీ నియంత్రిక నుంచి మధిర శాఖ కాల్వకు గురువారం 838 క్యూసెక్కులు విడుదల చేశారు.

54 వేల ఎకరాల్లో సాగు

మధిర బ్రాంచి కెనాల్ ఆయకట్టులో ఏటా ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలు 54వేల ఎకరాల్లో సాగు చేస్తారు. తిరువూరు, గంపలగూడెం మండలాల రైతులు వరి, మిరప, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు సుమారు 39 వేలు ఎకరాల్లో సాగు చేస్తారు. ఇప్పటికే సాగర్ కాల్వల ఆయకట్టులో రెండు మండలాల రైతులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న, వరి, పత్తి, ఉద్యాన పంటల సాగు పూర్తి చేశారు. మిరప మొక్కలు నాటడం కూడా ఆరంభించారు. వారం రోజుల నుంచి ఎండలు పెరగ్గా..వర్షం కూడా లేదు. దీంతో ఆయకట్టులో సాగైన వరి, పత్తి పంటలకు నీటి తడులు అందించాల్సిన తరుణంలో సరఫరా చేస్తున్న సాగర్‌జలాలు ఉపయుక్తంగా ఉంటాయని హాలికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టులోని పంటలకు ఉపయుక్తం



సాగర్ కాల్వ ఆయకట్టులో సాగు చేసిన పత్తి

వేలం ప్రకటన

మహారాజశ్రీ 15వ అడిషినల్ జిల్లా జడ్జి గారి కోర్టు, నూజివీడు

ఇ.పి.నెం. 10/2023 ఇన్ ఓ.ఎస్.నెం. 43/2015

బిట్వీన్: గోగం రాజేశ్వరి మరియు ... డిక్రీ హోల్డర్

గంపా శ్రీహరి ... జడ్జిమెంట్ డెటార్

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయుట ఏమనగా..

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ది. 04-09-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు శ్రీ కోర్టువారి సమక్షంలో వేలం జరుపుటకు నిర్ణయించినారు. కావున ఆసక్తి కలిగిన వారు ది. 04-09-2025వ తేదీనాడు స్వయంగా కోర్టుకు వచ్చి వేలంలో పాల్గొనవచ్చును.

శ్రీ గంపా గంగరాజు గారి కుమారుడు శ్రీ గంపా శ్రీహరి అనువారు పైన తెలిపిన దావా నందు జె.డి.ఆర్. అయియున్నారు. వారు డి.హెచ్.ఆర్.కు చెల్లించవలసిన మొత్తమును రాబట్టుకొనుటకు గానూ క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిని వేలం వేయుటకు గానూ శ్రీ కోర్టు వారి ఎదుట వేలం వేయుటకు నిర్ణయించినారు.

షెడ్యూల్: ఎన్.టి.ఆర్.జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, తిరువూరు మండలం, నడింతిరువూరు గ్రామములో ఆర్.ఎస్.నెంబరు: 242/1బి నందు గల 203-55 చదరపు గజముల నివేశన స్థలము అందున డోరు నెంబరు: 18-66 (అసెస్‌మెంటు నెంబరు: 3862) మరియు విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్లు 1) 7985 & 2) 5059 లు గల ఆర్.సి.సి. డాబా ఇంటికి హద్దులు:

తూర్పు: 55 లింకులు గల నగర పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** ఐనాల వెంకటేశ్వరరావు, ఐనాల విజయలక్ష్మి గార్లకు చెందిన గల నివేశన స్థలము (99 లింకులు), **పడమర:** రావూరి నాగభూషణం గారికి చెందిన నివేశన స్థలము (48 లింకులు), **ఉత్తరం:** కుందుర్తి కోటేశ్వరరావు గారి నివేశన స్థలము (97 లింకులు)

డి.హెచ్.ఆర్. విలువ: రూ. 25,00,000/-లు

అమీనా విలువ : రూ. 30,00,000/-లు

ప్రస్తుత ఆస్తి విలువ: రూ. 9,26,158/-లు

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో యీ ప్రకటన జారీ చేయబడినది.

సం/- పి.దుర్గారావు

నూజివీడు (డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాది)

తేది: 08-08-2025 నూజివీడు, సెల్: 90004 37707

10న కొలికపూడి జన్మదిన వేడుకలు

విసన్నపేట, న్యూస్‌టుడే : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను విస్సన్నపేట నూజివీడు రోడ్డులో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నామని తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

విలేకరినని బెదిరించిన వ్యక్తిపై కేసు

గానుగపాడు, చౌటపల్లి(తిరువూరు): మండలంలోని గానుగపాడు సమీప కట్లేరు నుంచి ఇంటి అవసరాలకు ఉచిత ఇసుక తీసుకెళుతున్న రైతు గుర్రాల మార్రెడ్డిని..విలేకరినంటూ బెదిరించి రూ.4 వేలు వసూలు చేసిన చౌటపల్లికి చెందని చావల దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేవీ జీవీ.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. సంఘటన మంగళవారం జరగగా బాధిత రైతు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. రైతు నుంచి నిందితుడు డబ్బు అక్రమ వసూళ్లకు చెందిన ఆధారాలు ఉన్నాయని ఎస్సై వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: శ్రీరాంపురం గ్రామానికి చెందిన చిన్ని నాగమణికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ 20 వేల విలువైన చెక్కును శుక్రవారం తెదేపా నాయకుడు నాదెళ్ల చెన్న కేశవరావు(కేసీబాబు) అందజేశారు. కార్యక్రమంలో ధర్మ చెరువు నీటి సంఘం అధ్యక్షుడు సాంబశివరావు, నాయకులు చావా భాస్కరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

4.5 కి.మీ.ల గూడ్స్ రైలు!



ఇంటర్నెట్ డెస్క్: రైల్వేశాఖ దేశంలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలును ప్రవేశపెట్టింది. సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా తూర్పు మధ్య రైల్వే ఈ 'రుద్రాస్త్ర' రైలును ఈ నెల 7న పట్టాలెక్కించింది. ఈ వీడియోను రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈ రైలు పొడవు 4.5 కిలోమీటర్లు. ఇందులో 354 వ్యాగన్లు, 7 ఇంజిన్లు ఉన్నాయి.

బడుల్లో అల్లం, వెల్లుల్లి సాగు



ఈటీవీ భారత్: ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు, డాబాలపై అల్లం, వెల్లుల్లి సాగు చేపట్టాలని పశ్చిమబెంగాల్ విద్యాశాఖ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును ప్రస్తుతం ప్రయోగాత్మకంగా హుగ్లీ జిల్లాలో అమలుచేస్తున్నారు. విద్యార్థులకు నిపుణులు ఈ సాగులో శిక్షణ ఇస్తున్నారు. స్కూళ్లలో పండించే అల్లం, వెల్లుల్లిని మధ్యాహ్న భోజన పథకానికి వినియోగిస్తారు.

దంపతులుగా 'అక్కాచెల్లెళ్లు'



లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో అదృశ్యమైన ఓ యువతి ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబానికి అనూహ్యమైన అనుభవం ఎదురైంది. ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి తనకు సోదరి వరసైన మరో అమ్మాయిని పెళ్లాడి.. తిరిగొచ్చింది. ఏడాదిగా తాము ప్రేమలో ఉన్నామని, కుటుంబ సభ్యులు తమ ప్రేమను వ్యతిరేకించడంతో పారిపోయి పెళ్లి చేసుకొన్నట్లు యువతి పోలీసులకు తెలిపింది.

బ్రిటన్‌లో ఏఐ ఎంపీ



ఇంటర్నెట్ డెస్క్: కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రజా సమస్యలు తీర్చడానికి ఉపయోగించాలన్న సదుద్దేశంతో బ్రిటన్‌కు చెందిన మార్క్ సెవార్డ్స్ అనే ఎంపీ సరికొత్త ఆలోచన చేశారు. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండేందుకు తన ఏఐ వెర్షన్‌ను రూపొందించుకున్నారు. ఇందులోని చాట్‌బాట్ నుంచి తన తరఫున సలహాలు, సూచనలు, ఆదేశాలు వెలువడుతాయని సెవార్డ్స్ చెప్పారు. తన కార్యాలయానికి, నియోజకవర్గ ప్రజలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఏఐ వెర్షన్ సహాయపడుతుందన్నారు.

అరెస్టుకు సాయం చేస్తే రూ.430 కోట్లు



నికోలస్

మయామి: వెనుజువెలా దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్టు చేసేందుకు సాయం చేస్తే 50 మిలియన్ డాలర్ల(సుమారు రూ.430 కోట్లు) నజరానా ఇస్తామని అమెరికా ప్రకటించింది. మదురో ప్రపంచంలోనే అతిపెద్ద మాదకద్రవ్యాల సరఫరాదారుల్లో ఒకరని, ఫెంటానిల్ కలిపిన కొకైన్‌ను అమెరికాలో వ్యాప్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం నుంచి ఆయన తప్పించుకోలేడని అమెరికా అటార్నీ జనరల్ పామ్‌బాండీ హెచ్చరించారు.

80 ఏళ్ల వృద్ధుడిపై వలపు వల




ముంబయి: వలపు వలలో చిక్కుకుని 80ఏళ్ల వృద్ధుడు రూ.9కోట్లు పోగొట్టుకున్నాడు. ముంబయికి చెందిన బాధితుడికి 2023లో షార్వీ అనే మహిళతో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. ఆమె పలు మార్లు డబ్బు వసూలుచేసింది. షార్వీ స్నేహితురాలినంటూ కవిత, షార్వీకి సోదరి అంటూ దినాజ్, దినాజ్ స్నేహితురాలినంటూ జాస్మిన్.. ఇలా మరో ముగ్గురు ఆ వృద్ధుడి నుంచి డబ్బులు వసూలు చేశారు. మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు షాక్‌కు గురై ఆస్పత్రి పాలయ్యాడు.

కొత్త ఐటీ బిల్లు ఉపసంహరణ

11న సభలో తాజా ముసాయిదా

దిల్లీ: ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సభలో ప్రవేశపెట్టిన కొత్త ఐటీ బిల్లు- 2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ఉపసంహరించుకున్నారు. బైజయంత్ పాండా సారథ్యంలోని 31 మంది సభ్యులతో కూడిన సెలక్ట్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు బిల్లును సవరించి ఈ నెల 11న మళ్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. సెలక్ట్ కమిటీ ముసాయిదా బిల్లుకు పలు మార్పులు సూచించింది. ఇందులో చాలా సిఫార్సులను పొందుపరిచి మరింత సరళంగా, స్పష్టంగా తాజా ముసాయిదాను సోమవారం సభ ముందుంచుతారు. మతపరమైన, ధార్మిక ట్రస్టులకు ఇచ్చే అనామక విరాళాలపై పన్ను మినహాయింపు కొనసాగడాన్ని కమిటీ సమర్థించింది.

అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఆంక్షల నిర్ణయం వెనక్కు..



ఆయనపై అపవాదు మోపటం తమ ఉద్దేశం కాదన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

దిల్లీ: సివిల్ వివాదంలో క్రిమినల్ స్వభావ వర్తనను సమర్థించిన అంశంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌కు ఉద్దేశించిన తీవ్రమైన వ్యాఖ్యలను సర్వోన్నతన్యాయస్థానం శుక్రవారం ఉపసంహరించుకుంది. ఆ జడ్జిని ఇబ్బందిపెట్టడం కానీ, ఆయనపై అపవాదు మోపటం కానీ తమ ఉద్దేశం కాదని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ నెల 4న తాము వెలువరించిన ఆదేశాలను పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ లేఖ రాసిన నేపథ్యంలో జస్టిస్ ప్రశాంత్‌పై వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు వివరించింది. హైకోర్టులు కూడా దేశ న్యాయవ్యవస్థలో భాగమేనని, కొన్ని పరిమితులు దాటినప్పుడు న్యాయపాలన గౌరవాన్ని కాపాడడానికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటుందని జస్టిస్ పార్దీవాలా స్పష్టం చేశారు. జస్టిస్ ప్రశాంత్ కుమార్‌పై వ్యాఖ్యలు తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమేనని పునరుద్ఘాటించింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్‌ క్రిమినల్ కేసుల విచారణ బాధ్యతలు చేపట్టవద్దని సూచించడం, సీనియర్ జడ్జితో కలిపి ధర్మాసనంలో కూర్చోబెట్టాలని సుప్రీంకోర్టు నిర్దేశించడం.. హైకోర్టు రోస్టర్‌లో జోక్యం చేసుకోవడమేనని అలహాబాద్ న్యాయమూర్తులు మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆ రెండు సూచనలను వెనక్కి తీసుకోవడంతో వివాదం సమసిపోయింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ తీసుకున్న తాజా నిర్ణయాన్ని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ స్వాగతించింది. తన తప్పును సుప్రీంకోర్టు సరిదిద్దుకుందని పేర్కొంది.

అమెరికాతో ఆయుధ కొనుగోలు చర్చలను నిలిపివేయలేదు

భారత్ స్పష్టీకరణ


దిల్లీ: ప్రధాన ఆయుధ కొనుగోళ్లకు సంబంధించి అమెరికాతో చర్చలను నిలిపివేసినట్లు వచ్చిన వార్తలను రక్షణ మంత్రిత్వశాఖ కొట్టిపారేసింది. అవి తప్పుడు, కల్పిత కథనాలని పేర్కొంది. ఆయుధ కొనుగోళ్ల ప్రక్రియలు నిర్దేశిత విధానాల ప్రకారమే కొనసాగుతున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. భారత ఎగుమతులపై భారీగా సుంకాలు విధించిన అమెరికా నుంచి ఆయుధాలు, విమానాల కొనుగోలు ప్రక్రియలను నిలుపుదలలో ఉంచినట్లు భారత అధికారులు చెప్పారంటూ.. అంతకుముందు రాయిటర్స్ వార్తా సంస్థ ఒక కథనాన్ని వెలువరించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలో అమెరికా సందర్శించనున్నారని, ఆ సందర్భంలో ఆయుధ కొనుగోళ్లపై ప్రకటన చేయాల్సి ఉందని ఆ కథనం తెలిపింది.

షాంఘై సదస్సుకు మోదీ.. స్వాగతించిన చైనా



బీజింగ్: ఈ నెలాఖరులో చైనాలోని తియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీఓ)కు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి ఆయన షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది. తన పర్యటనలో భాగంగా మోదీ ఆగస్టు 29న జపాన్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్‌లో జరగనున్న ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు. ఈ విషయంపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మోదీ పర్యటనపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్‌ను మీడియా ప్రశ్నించగా.. "షాంఘై సదస్సుకు మోదీని చైనా స్వాగతిస్తోంది" అని ఆయన బదులిచ్చారు.

విలయ సాక్షుల శాంతిగీతం



యమగుచి జాకోబ్ బేసర్

టోక్యో: వారిద్దరూ విభిన్న ధ్రువాలు. ఒకరు మృత్యుంజయుడు, మరొకరు మృత్యుకారకుడు. వీరి భయంకర అనుభవాలకు వేదిక జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి. ప్రపంచ చరిత్రను మార్చిన అమెరికా అణుదాడులకు ప్రత్యక్ష సాక్షులు. వారిద్దరే సుటోమో యమగుచి(జపాన్), జాకోబ్ బేసర్ (అమెరికా). అది 1945 ఆగస్టు 6. అమెరికా యుద్ధ విమానాలు రంగంలోకి దిగిన వేళ.. మొదటి అణుబాంబు 'లిటిల్ బాయ్'ను జారవిడిచిన హిరోషిమా నగరంలోనే జపాన్ నౌకాదళ ఇంజినీరు యమగుచి కూడా ఉన్నారు. ఆ అణుబాంబును మోసుకెళ్లిన అమెరికన్ బీ-29 యుద్ధ విమానానికి రాడార్ నిపుణుడు జాకోబ్ బేసర్. యమగుచి హిరోషిమాలో వ్యాపార పని ముగించుకొని స్వస్థలం నాగసాకి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా అణుబాంబు దాడి జరిగింది. ఈ మారణహోమంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. రైలులో నాగసాకి చేరుకున్నారు. ఆగస్టు 9న నాగసాకిపై కూడా అణు దాడి జరిగింది.

హిరోషిమా, నాగసాకిలపై దాడులకు అణుబాంబులను మోసుకెళ్లిన అమెరికన్ బీ-29 యుద్ధ విమానాల్లో పనిచేసిన ఒకే ఒక్క వ్యక్తి జాకోబ్. జపాన్‌పై బాంబులు వేసిన వీరుడిగా అప్పట్లో ఆయన్ను కీర్తించేవారు కూడా. ఇదంతా గతం. ఇంతటి భిన్న ధ్రువాలైన వీరిద్దరూ చివరికి అణ్వాయుధాల తయారీ, వినియోగానికి వ్యతిరేకంగా గళం విప్పడం గమనార్హం. బాంబు దాడుల్లో రేడియేషన్‌కు గురి కావడంతో జాకోబ్‌కు క్యాన్సర్ వచ్చింది. అనంతర కాలంలో ఆయన ప్రపంచ శాంతి కోసం తపించారు. 90 ఏళ్లు వచ్చిన నాటి నుంచి 2010లో తాను మరణించేంత వరకూ యమగుచి శాంతి కోసం తన అనుభవాలను ప్రపంచానికి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ కూడా చాలాసార్లు ఇంటర్వ్యూలు ఇచ్చారు. బతికున్నప్పుడు వీరిద్దరూ ఎన్నడూ కలుసుకోలేదు. కానీ ఇప్పుడు వీరి కుటుంబ సభ్యులు వారిద్దరి ఆశయాలను కలిసి ముందుకు తీసుకువెళ్తున్నారు. జాకోబ్ మనవడు అరే బేసర్, సుమోటో యమగుచి మనవరాలు కోసుజు హరాడా తమ తాతయ్యల అనుభవాలను ఓ పుస్తకంగా ప్రజల ముందుకు తీసుకువస్తున్నారు. అణు దాడి పరిణామాలు, ప్రభావాలపై నేటి తరానికి అవగాహన కల్పిస్తున్నారు.



డిపాజిట్ చేస్తారా.. విత్‌డ్రా చేసుకుంటారా?

భావోద్వేగాలకు లొంగిపోకుండా క్రమశిక్షణను ఎంచుకున్న ప్రతిసారీ.. 'మెరుగైన భవిష్యత్తు' అనే ఖాతాలో మీరు ఎంతో కొంత మొత్తాన్ని డిపాజిట్ చేసుకున్నట్టు లెక్క. క్రమశిక్షణను పక్కనపెట్టి, భావోద్వేగాలకు అనుగుణంగా నడుచుకున్న ప్రతిసారీ.. ఆ ఖాతా నుంచి కొంత సొమ్మును విత్‌డ్రా చేసుకున్నట్టే.

– లీలా హర్మోజీ, వ్యాపారవేత్త

'మెరిట్' పథకానికి రూ.4,200 కోట్లు

- ఉజ్వల్‌కు రూ.12 వేల కోట్లు
- కేంద్ర మంత్రిమండలి కీలక నిర్ణయాలు



దిల్లీ: దేశంలో మౌలికవసతుల కల్పనకు, సాంకేతిక విద్యాభివృద్ధికి కేంద్ర మంత్రిమండలి శుక్రవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.52,667 కోట్ల విలువైన ప్రాజెక్టులు, పథకాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా సాంకేతిక విద్యలో పరిశోధనలు ప్రోత్సహించేందుకు తెచ్చిన మెరిట్ పథకానికి రూ.4,200 కోట్లు బడ్జెట్ కేటాయించింది. ఈ మొత్తాన్ని రానున్న ఐదేళ్లలో ఖర్చు చేయనున్నారు. మల్టీ డిసిప్లనరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (మెరిట్) పేరుతో అమలయ్యే ఈ పథకంతో దేశంలోని 175 ఇంజినీరింగ్ కళాశాలలు, 100 పాలిటెక్నిక్‌లు లబ్ధి పొందనున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనకు మంత్రిమండలి రూ.12,060 కోట్లు కేటాయించింది. సబ్సిడీ ధరలకే ఎల్పీజీ సిలిండర్లు అందించే ఈ పథకంతో దేశవ్యాప్తంగా 10.33 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

విద్యార్థుల జాతి వివరాలు ఇవ్వాల్సిందే

- విద్యా సంస్థలకు ట్రంప్ కార్యవర్గం ఆదేశాలు

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలను శ్వేత జాతీయులకు అనుకూలంగా మార్చేందుకు ట్రంప్ సర్కారు మరో చర్య తీసుకొంది. తమ విద్యార్థుల జాతి, లింగం, టెస్ట్ స్కోర్, గ్రేడింగ్ పాయింట్ల సగటు వివరాలను ఇక నుంచి విద్యాశాఖకు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అధ్యక్షుడు ట్రంప్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. కాలేజీల్లో అడ్మిషన్ల సమయంలో జాతిని పరిగణనలోకి తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ 2023లో అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విద్యాసంస్థలు ఉల్లంఘిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఆ తీర్పును అమలుచేయాలంటూ అమెరికాలోని సంప్రదాయవాదులు ఎప్పటినుంచో చేస్తున్న డిమాండ్‌కు అనుకూలంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు.

విపక్షాల ఆందోళనలతో ఉభయ సభలు వాయిదా



లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

దిల్లీ: బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు పట్టుబడుతున్న విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో లోక్‌సభ, రాజ్యసభల కార్యకలాపాలను శుక్రవారానికి ముగించి వాయిదా వేశారు. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు కొందరు "ఎస్ఐఆర్ వాపస్ లో.. ఎస్ఐఆర్ పే చర్చా కరో" అని నినదిస్తూ లోక్‌సభ స్పీకరు టేబులును చుట్టుముట్టి దరువేశారు. స్పీకరు స్థానంలో ఉన్న తెదేపా సభ్యుడు కృష్ణప్రసాద్ తెన్నేటి దీన్ని తీవ్రంగా ఆక్షేపిస్తూ "ఇదేమీ డోలు కాదు. మీరిలా చేయడం సరికాదు" అని వ్యాఖ్యానించారు. ఉదయం 11 గంటలకు సభ సమావేశం కాగానే స్పీకరు ఓం బిర్లా జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మృతికి సంతాపం తెలుపుతూ నివాళులు అర్పించారు. బిహార్ ఓటరు జాబితాల సవరణ, కర్ణాటకలో ఓట్ల చోరీ గురించి రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను కేంద్ర సహాయమంత్రి రవనీత్ సింగ్ బిట్టూ "చోర్ మచాయే షోర్" (దొంగే దొంగ అని అరుస్తున్నాడు) అంటూ తిప్పికొట్టారు. ఎస్ఐఆర్, ఓట్ల చోరీ అంశాలపై పార్లమెంటు ఆవరణలోనూ వరుసగా 13వ రోజు ఇండియా కూటమి ఎంపీలు నిరసన ప్రదర్శన కొనసాగించారు.

ఇంధన భద్రతపై బహుముఖ వ్యూహం: జైశంకర్

ప్రభుత్వం ఇంధన భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలకు సరసమైన ధరలకు ఇంధనం అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటుందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలిపారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో భౌగోళికంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ చర్యల గురించి అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి బదులిస్తూ ఈ విషయంలో తాము బహుముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు. 'క్విట్ ఇండియా' ఉద్యమ 83వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఆధ్వర్యంలో రాజ్యసభ దేశ స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులర్పించింది.

మన్‌కీ బాత్ రాబడి రూ.34.13 కోట్లు



దిల్లీ: ప్రధాని మోదీ ఆకాశవాణిలో నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమం ఇప్పటివరకూ రూ.34.13 కోట్లు ఆర్జించినట్లు ప్రభుత్వం తెలిపింది. "ప్రధాని మోదీ ప్రజలతో నేరుగా సంభాషించడానికి ఉద్దేశించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆకాశవాణి తన సొంత వనరులతో రూపొందించింది. ఇది మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ రూ.34.13 కోట్లు ఆర్జించింది. ఈ కార్యక్రమాన్ని ఆకాశవాణిలో వినడానికి ప్రేక్షకులు ఆకర్షితులవుతున్నారు. ప్రత్యక్ష ప్రసారాలు, ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి రావడంతో ప్రేక్షకుల ఆదరణ పెరిగింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు చేరువయ్యేలా దీన్ని అందుబాటులోకి తెస్తాం" అని ప్రభుత్వం పేర్కొంది.

మతం దాచి పెళ్లాడితే పదేళ్ల జైలు



ఈటీవీ భారత్: మతాంతర వివాహాలపై హరియాణా ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మతాన్ని దాచిపెట్టి పెళ్లి చేసుకునేవారిపై మతమార్పిళ్ల నిరోధక చట్టం 2022 ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించింది. వివాహం కోసం జరిగే మతమార్పిడిని ఈ చట్టం నిరోధిస్తుంది. అతిక్రమిస్తే రూ.4 లక్షలదాకా జరిమానాతోపాటు పదేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. చట్ట ప్రకారం మతమార్పిడికి సంబంధిత వ్యక్తులు అధికారులకు దరఖాస్తు చేసుకొని, నిర్ణీత గడువుదాకా నిరీక్షించాల్సి ఉంటుంది. బలవంతంగా, మోసపూరితంగా జరిగే మతమార్పిళ్లను రద్దు చేస్తారు. వ్యక్తుల మతస్వేచ్ఛను అడ్డుకోవడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ఆ పేరుతో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడమే లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

ఓబీసీ క్రీమీలేయర్ ఆదాయ పరిమితిని సవరించాలి

స్థాయీసంఘం సిఫార్సు

దిల్లీ: ఓబీసీలపై విధించిన క్రీమీలేయర్ ఆదాయ పరిమితిని సవరించాల్సిన సమయం ఆసన్నమైందని పార్లమెంటరీ స్థాయీ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. అయితే ఆ పరిమితిని సవరించే ప్రతిపాదనేదీ తమ పరిశీలనలో లేదని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారికత శాఖ స్పష్టంచేసింది. ప్రస్తుత ఆదాయ పరిమితి కారణంగా అర్హులైన ఓబీసీలు ఎందరో రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేకపోతున్నారని స్థాయీ సంఘం శుక్రవారం పార్లమెంటుకు సమర్పించిన ఎనిమిదో నివేదికలో పేర్కొంది. క్రీమీలేయర్ ఆదాయ పరిమితిని చివరిసారిగా 2017లో రూ.6.5 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచారని సంఘం గుర్తుచేసింది. ఈ పరిమితిని మూడేళ్లకు ఒకసారి గానీ, అంతకు ముందే కానీ సమీక్షించాలని సిబ్బంది, శిక్షణ శాఖ నిబంధనలు పేర్కొంటున్నాయని తెలిపింది. "ప్రస్తుత ఆదాయ పరిమితి చాలా తక్కువగా ఉంది. చాలా తక్కువ మంది ఓబీసీలు మాత్రమే దీని పరిధిలోకి వస్తున్నారు" అని భాజపా ఎంపీ గణేశ్ సింగ్ అన్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ఆదాయాల నేపథ్యంలో ఆదాయ పరిమితిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. స్థాయీ సంఘం తన ఆరో నివేదికలో మొత్తం 12 సిఫార్సులు చేయగా అందులో పదింటిని ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటి వరకూ ఆమోదించని ప్రతిపాదనల్లో క్రీమీలేయర్ ఆదాయ పరిమితి సవరణ ఒకటి. నియామకాలు, పదోన్నతుల్లో ఓబీసీ ప్రాతినిధ్యాన్ని పెంపొందించాలన్న తమ సిఫార్సుపై కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ చర్యలు తీసుకోకపోవడాన్ని స్థాయీ సంఘం ఎత్తిచూపింది.

ఈ నెల 16లోపు నకిలీ ఓటరు కార్డు సమర్పించండి

తేజస్వీకి ఎన్నికల సంఘం తుదిగడువు

పట్నా: నకిలీ ఓటరు కార్డు సమర్పించాలని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన ఎన్నికల సంఘం తుది గడువును కూడా విధించింది. ఈ నెల 16 లోపు కార్డును సమర్పించాలని శుక్రవారం లేఖ రాసింది. ప్రభుత్వానికి చెందిన నకిలీ పత్రం ఉంచుకోవడం నేరమని అందులో పేర్కొంది. ఈ నెల 2న విలేకరుల సమావేశంలో బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి మాట్లాడుతూ.. ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)తో తయారైన ఎన్నికల జాబితాలో తన పేరు గల్లంతైందని పేర్కొన్నారు. తన దగ్గర ఉన్న ఎపిక్ నంబరుతో ఆన్‌లైన్‌లో వెదికితే ఎలాంటి ఫలితమూ ఇవ్వలేదని తెలిపారు. దీనికి వెంటనే ఎన్నికల సంఘం స్పందిస్తూ తేజస్వీ దగ్గర ఉన్న ఓటరు కార్డు నకిలీదని పేర్కొంది. దాన్ని దర్యాప్తు కోసం స్వాధీనం చేయాలని ఆదేశించింది.

చొరబాటుదారులు కాంగ్రెస్-ఆర్జేడీ ఓటర్లు



అమిత్‌షా ఆరోపణ

సీతామఢీ(బిహార్): బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులే ప్రతిపక్ష కాంగ్రెస్-ఆర్జేడీ కూటమికి ఓటుబ్యాంకు అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ఆరోపించారు. చొరబాటుదారులతో కూడుకున్న ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆయన సీతామఢీలో జరిగిన ఒక ర్యాలీని ఉద్దేశించి పేర్కొన్నారు. "ఓటరు జాబితా ముమ్మర సవరణ గతంలో అనేక పర్యాయాలు జరిగింది. కానీ రాహుల్ గాంధీ కానీ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కానీ దాన్ని విమర్శించలేదు. తమ ఓటు బ్యాంకును రక్షించుకోడానికే వారు ఇప్పుడు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నారు" అని హోం మంత్రి అన్నారు. స్థానికుల ఉద్యోగాలను హరిస్తున్న అక్రమ ఓటర్లను రాహుల్ గాంధీ, లాలూ ప్రసాద్ (యాదవ్)లు రక్షించాలని చూస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

రామాయణ కాలంలో జనక మహారాజు సీతను కనుగొన్న ప్రదేశంగా భక్తులు విశ్వసించే "పునౌరా ధామ్" అభివృద్ధికి రూ.882.87 కోట్లతో చేపట్టిన పనులకు అమిత్‌షా ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. భూమి పూజ అనంతరం అమిత్‌షా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో రూ.137 కోట్లు పాత ఆలయ పునరుద్ధరణకు, మిగిలిన మొత్తం పర్యాటక సదుపాయాల అభివృద్ధికి వెచ్చిస్తామని అధికారి ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా అమిత్‌షా సీతామఢీ - దిల్లీ అమృత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు.



వరదల కారణంగా ధ్వంసమైన ధరాలీ గ్రామం నుంచి ప్రజలను తరలిస్తున్న సైనికులు

ఉత్తర కాశీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

ఉత్తర కాశీ: ఆకస్మిక వరదలతో అల్లాడిన ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో ముఖ్యంగా ధరాలీ గ్రామంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వరదల్లో తప్పిపోయిన వారి కోసం జాగిలాలు, డ్రోన్ల సాయంతో అధికారులు గాలింపును వేగవంతం చేశారు. శుక్రవారం మధ్యాహ్నానికి 250 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దీంతో ఇప్పటివరకు రక్షించిన వారి సంఖ్య 650కు చేరుకుంది. తొమ్మిది మంది సైనిక సిబ్బంది, ఏడుగురు పౌరుల జాడ ఇంకా తెలియరాలేదని ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ(యూఎస్‌డీఎంఏ) వెల్లడించింది. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు జిల్లాలోని భాగీరథి నదిపై సైన్యం వంతెనను నిర్మించింది.

పార్కింగు గొడవ.. సినీనటి సోదరుడి హత్య



ఆసిఫ్ ఖురేషీ, హ్యూమా ఖురేషీ

దిల్లీ: ఆగ్నేయ దిల్లీలోని భోగాల్ ప్రాంతంలో గురువారం రాత్రి ఆసిఫ్ ఖురేషీ (42) అనే కోళ్ల వ్యాపారిని అదే వీధిలో నివాసం ఉంటున్న అన్నదమ్ములు పదునైన 'ఐస్ పిక్'తో పొడిచి హత్య చేశారు. తన ఇంటి గేటు ముందు పార్కింగు చేసిన స్కూటరును పక్కకు జరపమని ఆసిఫ్ కోరడంతో మాటామాట పెరిగి జరిగిన ఈ దాడి సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. మూడు నెలల కిందట కూడా పార్కింగు వివాదంతోనే బాధితుడిపై ఆ ఇద్దరూ దాడి చేసినట్లు డీసీపీ హేమంత్ తివారీ తెలిపారు. రజనీకాంత్ 'కాలా' చిత్రంలో నటించిన హ్యూమా ఖురేషీకి ఆసిఫ్ వరుసకు సోదరుడు అవుతారు. నిందితులు ఉజ్వల్ (19), గౌతమ్ (18)లను పోలీసులు అరెస్టు చేశారు.

రాహుల్ వాదనలు తప్పని 'ఈసీ'కెలా తెలుసు?: ప్రియాంక

దిల్లీ: ఎన్నికల్లో రిగ్గింగ్‌కు సంబంధించి రాహుల్ చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్ (ఈసీ) రాహుల్‌ను కోరడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర, హరియాణా మొదలైన రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపించిన వెంటనే ఈసీ ఆ విషయంలో దర్యాప్తు చేయడం మానేసి.. రాహుల్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని దబాయిస్తోందన్నారు. అసలు దర్యాప్తే చేయనప్పుడు ఆయన వాదనలు తప్పని ఈసీకి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. తాము సమర్పించిన ఆధారాలు ఈసీ ముందే ఉన్నాయని.. వాటిని పరిగణనలోకి తీసుకొని దర్యాప్తు చేయాలని సూచించారు.

రాహుల్ అనుమానాలు తీవ్రమైనవే: శశిథరూర్

దిల్లీ: భాజపా, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై ఆ పార్టీ సీనియర్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. రాహుల్ లేవనెత్తిన అనుమానాలు తీవ్రమైనవేనని శుక్రవారం 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. "అన్ని పార్టీలు, ఓటర్ల ప్రయోజనాల దృష్ట్యా రాహుల్ లేవనెత్తిన సందేహాలను తప్పకుండా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. మన ప్రజాస్వామ్యం చాలా విలువైనది. నిర్లక్ష్యంగా లేదా ఉద్దేశపూర్వకంగా దాని విశ్వసనీయతను దెబ్బతీయాలని చూసే చర్యలను ఎన్నటికీ అనుమతించకూడదు. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని థరూర్ రాసుకొచ్చారు. గత కొంత కాలంగా కాంగ్రెస్ విధానాలను విభేదిస్తూ వస్తోన్న శశిథరూర్ తాజాగా రాహుల్‌కు మద్దతు పలకడం గమనార్హం.

కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్టుంది

రాహుల్ ఓట్ల రిగ్గింగ్ ఆరోపణలపై భాజపా

దిల్లీ, భోపాల్: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓట్ల రిగ్గింగ్ జరిగిందన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలను భాజపా శుక్రవారం తప్పుపట్టింది. తాను ప్రదర్శించిన ఆధారాలు అణుబాంబు అన్న ఆయన వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయంది. అంతేకాకుండా తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్నట్టుందని ఆక్షేపించింది. కొత్త ఓట్లు భారీగా పెరిగిన పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎక్కువ స్థానాలు గెలుచుకున్నాయని గుర్తు చేసింది. అధికార భాజపాకు సహకరించిన ఎన్నికల కమిషన్ అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత స్థాయి వ్యక్తి నుంచి ఇటువంటివి ఊహించలేదన్నారు.

మాకూ ఓ రాఖీ!



చిన్ని చిన్ని గిల్లికజ్జాలు... కలిసి చేసే చిలిపి పనులు. ఒకరిపై మరొకరు అమ్మానాన్నలకు ఫిర్యాదులు చేసుకుంటారు. మళ్లీ అంతలోనే ఒక్కటైపోతారు. తోబుట్టువుల మధ్య కనిపించే అనుబంధమే ఇదంతా! అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్యేనా ఈ అనుబంధం? అక్కాచెల్లెళ్ల మధ్యా ఉంటుంది. అలాంటప్పుడు రాఖీ వీళ్లకీ కావాలిగా!

కొత్త దుస్తులు వేసుకుని... సోదరుడిని కూర్చోబెట్టి, నుదుటిన బొట్టు పెట్టి, రాఖీ కడతారు. తీపి తినిపించి హారతిస్తారు. వెంటనే 'రాఖీ కట్టాగా... నా గిఫ్ట్ ఏది?' అంటూ ప్రశ్న దూసుకొచ్చేస్తుంది. 'అయ్యో మర్చిపోయా' అనగానే గిల్లికజ్జాలు. ఆపై దాచిన కానుకను తీసిస్తే ఆనందంతో గంతులు. ఆ అల్లరి, పండగ వాతావరణం... ఎంత చూడముచ్చటగా ఉంటుంది? అలాంటప్పుడు ఒకమ్మాయి, ఇద్దరూ అమ్మాయిలే ఉన్న కుటుంబాల్లో 'నాకూ అన్నయ్యో, తమ్ముడో ఉంటే ఎంత బాగుండేది' అన్న మాటలు సహజంగానే వినిపిస్తాయి. ఆ లోటు తీర్చుకోవడానికి కజిన్స్‌కి రాఖీ కట్టి ఆనందించేవారూ బోలెడుమందే.

అసలు రక్షాబంధన్ అంటే ఏంటి? తోబుట్టువుల మధ్య అనుబంధానికి చిహ్నం. కష్టసుఖాలు, బాధ- ఆనందాల్లో కలిసి ఉంటామని చేసుకునే బాస. మరి ఆ అనుబంధం అక్కాచెల్లెళ్ల మధ్యా ఉంటుంది కదా. అలాంటప్పుడు రాఖీ అక్కాచెల్లెళ్లూ కట్టుకోవచ్చు అంటూ 'సిస్టర్ హుడ్' నినాదానికి తెర లేపుతున్నారు కొందరు అమ్మాయిలు. నిజానికి అక్కాచెల్లెళ్ల మధ్య అనుబంధమే వేరు. నోరు విప్పి చెప్పాల్సిన పనిలేదు. ముఖం చూసి అవతలివారి మనసు అర్థం చేసుకోగలరు. అవసరమైతే అక్క అమ్మ అవుతుంది. చెల్లి స్నేహితురాలు అవుతుంది. తమకంటూ కుటుంబాలొచ్చినా, దూరాలు పెరిగినా... ఆ అనుబంధం మాత్రం మారదు. 'నీతో నాకు క్షణం పడదేమో! ప్రతిక్షణం కయ్యానికి కాలు దువ్వుతా. కానీ నీకు సమస్య ఎదురైతే ప్రపంచాన్ని ఎదిరించడానికైనా నేను సిద్ధం' అంటూ రాఖీలు కట్టుకుంటూ బాసలూ చేసుకుంటున్నారు.

రాఖీ కట్టగానే సోదరుడు 'నీకు నేను రక్ష' అంటూ మాటిస్తాడు. కాకపోతే అక్కాచెల్లెళ్లు 'నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష' అంటూ మాట ఇచ్చిపుచ్చుకుంటారు. దీనికి తగ్గట్టే 'సిస్టర్‌హుడ్', 'బిగ్, లిటిల్ సిస్' అంటూ అమ్మాయిలకు తగ్గట్టుగా రాఖీలూ వస్తున్నాయి. చక్కగా సిద్ధమై వాటిని ఒకరికొకరు కట్టుకుంటూ తమ మధ్య అనుబంధాన్నీ, ప్రేమనీ పెంచుకుంటున్నారు. కృతీసనన్, తాప్సీ వంటి వాళ్లంతా ఈ బాటలో నడుస్తున్నవారే. ఇది కేవలం రక్తసంబంధీకుల మధ్యే అనుకునేరు! మనసుకు దగ్గరైన, అన్ని సమయాల్లో ఓ తోబుట్టువులా తోడు నిలిచే సోదరీమణులకూ ఈ రాఖీలు కడుతున్నారు. మరి మీకూ ఉన్నారా అలాంటి ఓ సోదరి? అయితే ఆమెకీ కట్టేయండి ఓ ప్రత్యేకమైన రాఖీ!





వసుంధర

vasundhara@eenadu.in

పూలతో ఫేమస్ అయ్యా!



ఈ రోజుల్లో ప్రతి సందర్భాన్నీ ఆడంబరంగా జరుపుకోవాలనుకుంటున్నారు. ఫొటోలు, రీల్లలో అందమైన బ్యాక్‌గ్రౌండ్ కనిపించాలనుకుంటున్నారు. ఈ క్రమంలోనే అలంకరణలకు ప్రాధాన్యం పెరిగింది. దాన్నే అందిపుచ్చుకుని జెయింట్ ఫ్లవర్స్‌ని తయారు చేస్తూ వ్యాపారంలో రాణిస్తున్నారు బెంగళూరుకి చెందిన విభాజైన్. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



విభాజైన్

చిన్నప్పటి నుంచీ చేసే ప్రతి పనినీ సృజనాత్మకంగా ఉండాలని అనుకునేదాన్ని. మా అమ్మయ్య పెళ్లికి చేసిన డెకరేషన్ చూశాక ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్ తయారీపై ఆసక్తి మొదలైంది. అయితే, కొవిడ్ సమయంలో కాస్త సమయం దొరకడంతో మొదట హాబీగా మొదలుపెట్టా. తర్వాత కుటుంబ సభ్యులు, తెలిసినవాళ్ల ఇళ్లలో జరిగే వేడుకల కోసం చేసిచ్చేదాన్ని. కాలక్రమంలో అది కాస్తా పెరిగి పెద్దదై... ఒక వృత్తిగా, విజయవంతమైన వ్యాపారంగా మారింది. ఈ ప్రయాణం ప్రారంభించే ముందు వరకూ నేను ప్రముఖ సంస్థలో హెచ్ఆర్‌గా పనిచేశా. మొదట్లో పేపర్/క్రాఫ్ట్ పేపర్ వంటివి ఉపయోగించి పూలు, అలంకరణ వస్తువుల్ని చేసేదాన్ని. కానీ, మారుతోన్న వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టు కొత్త రకాలను తీసుకురావడం ఆరంభించా. మరెన్నో రకాల మెటీరియల్స్ ఉపయోగించి కొత్త డిజైన్స్ తీసుకొచ్చా. పెద్ద పరిమాణంలో తయారు చేసిన జెయింట్ ఫ్లవర్స్ నాకంటూ ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. వినియోగదారుల ఆలోచన, డిజైన్లు, బడ్జెట్, పూల సంఖ్య, సైజులు, రంగులు... వంటివన్నీ తెలుసుకుని వారి అవసరానికి తగ్గట్టుగా కస్టమైజ్ చేస్తా. కస్టమర్లకు వాటిని అందించడంతోనే నా పని అయిపోయిందనుకోను. కస్టమర్ అలంకరణకు తుది రూపు వచ్చేవరకూ సహాయం చేస్తాను. వ్యాపారంలో సాధారణంగా అందరికీ ఎదురయ్యే సవాళ్లే నేనూ చూస్తుంటా. ఈ రంగంలో రాణించాలంటే ఓపిక, సమస్యల్ని పరిష్కరించుకునే నేర్పు అవసరమని నా అభిప్రాయం. అందుకే, సమస్యల్ని పెద్దగా చేసి చూడను. ఇక, నాకు కుటుంబం అండ ఉండటంవల్లే దేశవిదేశాలకు మా డెకార్ ప్రొడక్ట్స్‌ని పంపించగలుగుతున్నాం. ఒకప్పుడు ఉద్యోగం మానేయడం సరైన నిర్ణయం కాదేమో అన్నవారంతా... ఇప్పుడు ఆదాయంతోపాటు పేరూ సంపాదించుకోవడంతో అభినందిస్తున్నారు.



శోధిత

మనసు నొప్పిస్తున్నారా?

జీవనశైలి, ఒత్తిళ్లు.. కారణమేదైనా ఇప్పటికీ కొంతమంది తల్లిదండ్రులు పిల్లలపై అరుస్తుంటారు. ఇంకాస్త కోపం ఎక్కువైతే రెండు దెబ్బలూ వేస్తుంటారు. ఆ క్షణం ఫీలయినా, ఎప్పుడైనా ఒక్కసారే కదా! వాళ్లే మర్చిపోతారులే అని సర్దిచెప్పుకొంటుంటారు. నిజానికి ఈ అలవాటు దీర్ఘకాలంలో పిల్లల్లో మానసిక సమస్యలకు దారితీస్తుందని లివర్‌పూల్ జాన్ మూరెస్ యూనివర్సిటీ చేసిన తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందుకోసం శాస్త్రవేత్తలు 18ఏళ్లలోపు పిల్లల్ని ఎంచుకుని, వారిలో ఆశావాదం, సమస్యను పరిష్కరించే నైపుణ్యం, ఇతరులతో అనుబంధం ఏర్పరచుకునే తీరు... వంటివన్నీ పరిశీలించారు. బాల్యంలో వెర్బల్ అబ్యూజ్‌కి గురైన చిన్నారులు పెద్దయ్యాక మానసిక సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం 1.6రెట్లు అట. అదే ఫిజికల్ అబ్యూజ్ ఎదుర్కొన్న వాళ్లయితే ఈ రిస్క్ 1.5రెట్లు అట. ఇక ఈ రెండూ అనుభవించిన వాళ్లలో ఈ ప్రమాదం రెండురెట్లకంటే ఎక్కువట. కాబట్టి, పిల్లలకు అవసరమైనవన్నీ అందించటమేకాదు, మన భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితేనే వాళ్లకు మంచి భవిష్యత్తు అందించగలం.





పేదరికంలో పుట్టి.. పవర్ లిఫ్టర్‌గా ఎదిగి

కూలి పనులకోసం హైదరాబాద్ తీసుకువెళ్లిన తండ్రి.. తల్లితోపాటు తననీ అక్కనీ అర్ధాంతరంగా వదిలేశాడు. తల్లి పాచి పనులు చేస్తూ తమని పోషించడం చూసిన ఆమెలో పేదరికాన్ని జయించాలన్న సంకల్పం పుట్టింది. నిరంతర కృషితో జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్ స్థాయికి ఎదిగింది ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన తిరుపతమ్మ.



తండ్రి వదిలేసినప్పుడు తిరుపతమ్మ వయసు 3ఏళ్లు. ఒకటి నుంచి మూడో తరగతి వరకు హైదరాబాద్‌లో, ఆ తర్వాత జగ్గయ్యపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. ఇంటర్, డిగ్రీ సైతం అక్కడే పూర్తి చేసింది. కూతురిలోని క్రీడా నైపుణ్యాన్ని గుర్తించిన తల్లి కొండమ్మ ఆమెని అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్‌గా చూడాలని తపించేవారు. ఇళ్లలో పాచిపనులు, ఇతర కూలి పనులు చేసి వచ్చిన సొమ్ములోనే తిరుపతమ్మ వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ, ప్రత్యేక ఆహారం కోసం కేటాయించేవారు. ఇద్దరు పిల్లల్ని చదివించే స్థోమత లేక పెద్ద కూతురి చదువు మాన్పించి పెళ్లి చేశారు. తిరుపతమ్మ క్రీడల్లో చురుకుగా ఉండడం చూసిన జగ్గయ్యపేట హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు గంటా వెంకటేశ్వర్లు ప్రోత్సహించారు. మొదట కబడ్డీలో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటింది.

అయితే, తన శారీరక దారుఢ్యానికి వెయిట్ లిఫ్టింగ్ సరిగ్గా సరిపోతుందని వెంకటేశ్వర్లు సూచించడంతో సాధన మొదలు పెట్టింది.

'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఇండియా'గా

తిరుపతమ్మ పాఠశాల స్థాయి నుంచే పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేది. మొదటిసారే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికై కాంస్య పతకం సాధించింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని వరుసగా బంగారు పతకాల పంట పండించింది. ఇప్పటి వరకు 40 పతకాలు సాధించింది. జాతీయ స్థాయిలో 20 పతకాలు అందుకుంది. జూన్‌లో కర్ణాటకలోని దావణగెరెలో జరిగిన 43వ జాతీయ స్థాయి పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తిరుపతమ్మ జూనియర్ విభాగంలో నాలుగు కేటగిరిల్లో పాల్గొంది. ఇందులో మూడు విభాగాల్లో బంగారు, ఒక విభాగంలో రజిత పతకం అందుకుంది. మొత్తం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి 'స్ట్రాంగ్ ఉమన్ ఆఫ్ ఇండియా' అవార్డ్ దక్కించుకుంది.

ఆర్థిక ఇబ్బందులతో...

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఉన్నా.. అడుగడుగునా పేదరికం అడ్డుపడుతూనే ఉందామెకు. పోటీలకు వెళ్లేందుకు దారి ఖర్చులకూ అప్పు చేయాల్సిన పరిస్థితి. కర్ణాటక పోటీల్లో విజయం సాధించడంతో అంతర్జాతీయ ఎంపిక పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా, ఆర్థిక ఇబ్బందుల వల్ల విరమించుకుంది. త్వరలో దేశంలోనే జరగనున్న అంతర్జాతీయ ఎంపిక పోటీలకు ప్రస్తుతం సిద్ధమవుతోంది.

– ఉప్పాల రాజాపృథ్వీ, అమరావతి

సైనిక సోదరులకు రక్షా బంధన్!





ముస్కాన్



అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. వాళ్లు సుఖ సంతోషాలతో ఉండాలనే కాదు, తమకు రక్షగా ఉండాలని కోరుకుంటూ దీన్ని కడతారు. అయితే, తోడబుట్టిన వారికీ, రక్త సంబంధీకులకూ, అన్న అని పిలిచేవారికీ రాఖీని కట్టడం మామూలే. కానీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తోన్న **ముస్కాన్ హండా** మాత్రం... సరిహద్దుల్లో ఉన్న సైనికులకు రాఖీ పంపాలనుకున్నారు. వాటిని పంపించడమే కాదు... లింక్డిన్‌లో ఓ భావోద్వేగ లేఖనూ రాసి పోస్ట్ చేశారు. 'మా ఇంట్లో నేనే పెద్ద కూతుర్ని. నాకు సొంత అన్నదమ్ములు లేరు. కానీ, ఈ ఏడాది రాఖీ కట్టాలనుకుంటున్నా. అయితే, అది తెలిసినవారికో, బంధువులకో కాదు, మనకి చాలా దూరంగా నిలబడి... రక్షణ కల్పిస్తోన్న సైనిక సోదరులకు! వాళ్లెవరూ నాకు రక్త సంబంధీకులు కాకపోవచ్చు. సరిహద్దుల్ని కాపాడుతూ, మనల్ని సురక్షితంగా ఉంచుతూ వారి జీవితాన్ని త్యాగం చేస్తోన్న వాళ్లనే సోదరులుగా భావిస్తున్నా. అక్కడ ఉన్న ప్రతి అన్న ఈ పండక్కి ఇంటికి రాలేడు... ప్రతి సోదరీ అక్కడికి వెళ్లి స్వయంగా రాఖీ కట్టలేదు. అందుకే, నేను భారత సైనిక సోదరులకు రక్షా బంధన్‌లను పంపించా. కుటుంబాలను విడిచిపెట్టి, అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులు, ప్రమాదకర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. సౌకర్యాలు లేవని ఫిర్యాదులు చేయరు. విరామం లేకుండానే విధులు నిర్వరిస్తారు. సోదర ప్రేమను పంచుకోవడానికీ, రాఖీ వెచ్చదనాన్ని వారికి అందించడానికీ అంతకు మించిన అర్హతలేమున్నాయి. అందుకే, నేనీ పనిచేశా. మీరూ చేయొచ్చు' అని పోస్ట్ చేయగా... దేశ సరిహద్దుల్లోని సైనిక సోదరులకు నైతిక మద్దతు అందించే ఈ ఆలోచనకు అభినందనలు వెల్లువెత్తాయి. మేము సైతం పంపిస్తామంటూ స్పందించారు.

ఉత్తిత హస్త పాదంగుష్టాసనం



ఉత్తిత అంటే విస్తరించిన, హస్త(చేయి), పాద(పాదము) అంగుష్ట(బొటనవేలు) పదాల కలయికతో దీనికా పేరు వచ్చింది. ఇది బ్యాలెన్సింగ్ ఆసనం.

మ్యాట్‌పైన నిటారుగా నిల్చొని పాదాలను రెండు అంగుళాల దూరంలో ఉంచి చేతులను పక్కనే ఉంచి ఈ ఆసనాన్ని మొదలుపెట్టాలి. ఇప్పుడు నిదానంగా ఎడమ కాలి మీద శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ కుడి మోకాలిని కొంచెం పైకి ఎత్తండి. తర్వాత కుడి చేత్తో కుడికాలి బొటనవేలిని పట్టుకోండి. ఎడమ చేతిని ఎడమవైపుగా నడుముపైన ఊతంగా ఉంచండి. ఇప్పుడు కుడి కాలిని నిదానంగా శరీరానికి ముందు వైపుగా మోకాలు ఒంపు లేకుండా సాగదీయండి. దృష్టిని ముందువైపే నిలపండి. కళ్లు మూసుకోవద్దు. తలను, వెన్నెముకను నిటారుగా ఉంచి ఇదే భంగిమలో సాధారణ స్థాయిలో శ్వాస తీసుకుంటూ 10-15 సెకన్లు ఉండేందుకు ప్రయత్నించండి. తర్వాత నిదానంగా చేతిని వదిలి యథాస్థానానికి వచ్చి నడుమును గుండ్రంగా తిప్పుతూ విశ్రాంతి తీసుకోండి. ఇప్పుడు ఇంకోవైపు ఆసనాన్ని పునరావృతం చేయండి.

జాగ్రత్తలు: మోకాళ్లు, చీలమండల సర్జరీలు అయినవాళ్లు చేయరాదు.

ఉపయోగాలు: కాళ్లకు, చీలమండలకు బలాన్ని ఇస్తుంది. ఏకాగ్రతను పెంచుతుంది. తుంటి కండరాలకు బలాన్ని చేకూరుస్తుంది. మనసును స్థిరంగా ఉంచుతుంది.

ఆహారం: కండరాలకు బలాన్ని ఇచ్చే ప్రొటీన్లు, ఎముకలు బలంగా ఉండేలా కాల్షియం, విటమిన్-డి లోపం లేకుండా చూసుకోవాలి. గుడ్లు, పాలు, ఆకుకూరలు, విత్తనాలు, గింజలు రోజూ తీసుకోవాలి.

శక్తి ముద్ర



మ్యాట్‌పైన పద్మాసనం, వజ్రాసనం లేదా కాళ్లు రెండు మడుచుకొని కూర్చోండి. రెండు చేతుల బొటనవేళ్లను లోపలికి మడిచి, వాటిపైన చూపుడు, మధ్య వేళ్లను మూసి ఉంచండి. ఆపైన ఉంగరం వేళ్లు, చిటికెన వేళ్ల కొనలను ఒకదానితో ఒకటి కలిపి ఉంచండి. ఈ ముద్రను ఛాతీ ముందుగా ఉంచి, కళ్లను మూసి శ్వాసమీద ధ్యాస పెట్టండి. ఇలా 20 నిమిషాలు సాధన చేయండి.

జాగ్రత్తలు: ఇది నిదానంగా చేయాల్సిన ముద్ర. పరగడుపున చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

ఉపయోగాలు: ఆటల పోటీల్లో, పరీక్షల్లో ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించి నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమికి పనిచేస్తుంది. శరీరానికి ప్రాణశక్తి పెంచుతుంది. భావోద్వేగాలను నియంత్రిస్తుంది.

ఆహారం: తృణధాన్యాలు, పండ్లు, ఎక్కువగా తీసుకోవాలి. క్రీడాకారులు కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, మంచి కొవ్వులను అధికంగా తీసుకోవాలి.

మీకు తెలుసా?

సారా ఇ.గూడ్... మడతపెట్టే క్యాబినెట్ బెడ్‌ను కనిపెట్టారీమె. ఈ మంచాన్ని మడిచేసి, డెస్క్‌గానూ ఉపయోగించుకోవచ్చట. అపార్ట్‌మెంట్లు, చిన్న చిన్న ఇళ్లలో ఇరుకు లేకుండా ఉండేందుకు వీలుగా దీన్ని డిజైన్ చేశారట.



బంగారం - వెండి



8న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,04,170	95,100	1,18,264
విజయవాడ	1,01,285	94,700	1,18,300
ప్రొద్దుటూరు	1,00,750	92,690	1,17,800
రాజమహేంద్రవరం	1,03,310	94,700	1,27,000
విశాఖపట్నం	1,02,940	94,700	1,25,000
తమిళనాడు	-----	94,700	1,27,000






లేస్ అందం... కురులకీ!

సాదా చీర... దానికి హంగులద్దుతూ లేస్ వర్క్... ఒక్క చీరైనా ఇలా చేయించుకోని అమ్మాయి ఉండదు. బ్లవుజు అందాన్ని పెంచడానికీ దీన్ని ఆశ్రయిస్తుంటాం. మరి కురులకు పెడితే ఎలా ఉంటుంది... ఎప్పుడైనా ఇలా ఆలోచించారా? ఓవైపు శ్రావణం, మరోవైపు పెళ్లిళ్లు. వేడుకలకైతే కొదవే లేదు. ఇలాంటప్పుడు మన ఓటు సంప్రదాయ వస్త్రధారణకే! ఆ దుస్తులకు జోడీగా పూలు పెడితేనో, పూలజడ వేస్తేనో, జడబిళ్లలు, జడతోనో అలంకరిస్తే ఆ అందమే వేరు. ఇవన్నీ చూడటానికి బాగానే ఉంటాయి. కానీ... కొద్దిసేపటికే భారంగా తోస్తాయి. మెడంతా పట్టేసినట్లుగానూ అనిపిస్తుంది. అలాగని ఊరికే కురులను వదిలినా, జడవేసినా బాగుంటుందా? దానికీ కాస్త మెరుపుల హంగులుంటేనే కదా అలంకరణ పూర్తయ్యేది! కాబట్టే, ఈ లేస్ బ్రెయిడ్‌లకు ఆదరణ పెరుగుతోంది. గోటాపట్టీ, స్టోన్, పెరల్ లేస్‌లన్నీ వీటికి అనువే! బబుల్ బ్రెయిడ్, సింపుల్ జడ, ఫ్రెంచ్ ప్లీట్, సెమీ, ఫుల్ హెయిర్ లీవ్... ఎంచుకున్న హెయిర్‌స్టైల్ ఏదైనా నప్పేస్తాయి. కావాలంటే ఈ ఫొటోలను చూడండి... ఈ స్టైల్సే అందుకు ఉదాహరణ. బాగున్నాయి కదూ! వేణీనో కొన్ని పూలనో పైన పెట్టేస్తే సరి. జడా మెరుస్తుంది, కోరుకున్న లుక్కూ దొరుకుతుంది. కాబట్టే, అమ్మాయిల నుంచి వధువుల వరకూ ప్రతి ఒక్కరూ ఈ స్టైల్‌ని ఇష్టపడుతున్నారు. ఈ జాబితాలో తారలూ ఉన్నారు. మరి మీ సంగతేంటి? ప్రయత్నిస్తారా ఓసారి? అయితే ఏ వేడుకకు మరి?



భారత్‌లో సంతాన సాఫల్య రేటులో తగ్గుదల... మహిళా సాధికారతకు నిదర్శనం. పిల్లల విషయంలో వాళ్లు నిర్ణయాత్మకంగా మారుతున్నారు. ఒకప్పుడు మధ్య తరగతి మహిళలే విద్య, ఉపాధి గురించి ఆలోచించేవారు. ఇప్పుడు అన్ని వర్గాలవాళ్లూ కెరియర్ గురించి ఆలోచిస్తున్నారు.

- సునీతా నారాయణ్, పర్యావరణవేత్త, సామాజికవేత్త



అలర్ట్‌గా ఉండాలా... అయితే తినండి!

పని ఒత్తిడి, ప్రయాణాలు, ఇంటా బయటా బాధ్యతలు... ఇలా కారణాలేవైనా వాటి ప్రభావం పడేది నిద్ర మీదే. పైగా ఇలాంటి సమస్యలతో సతమతమయ్యేవారికి వీటన్నింటి నుంచీ విరామం దొరికినా ఓ పట్టాన నిద్ర పట్టదు. అలా అని మరుసటి రోజు చేయాల్సిన పనులు వాయిదా వేసుకోలేరు. మరి ఈ నిద్రలేమి తెచ్చే నీరసం దినచర్య మీద పడితే ఇక అంతే. గృహిణులకైతే తిట్లు, కార్యాలయాల్లో డ్రాపవుట్‌లు తప్పవు. అందుకే చేసే పని మీద ధ్యాస కుదరాలంటే... ఒత్తిడీ, ఆందోళనల్ని పక్కకు నెట్టాల్సిందే. దీనికి తినడమే పరిష్కారం అంటున్నారు నిపుణులు. తినమంటున్నారు కదా అని... సమోసాలు, చాక్లెట్లు, బిస్కెట్లు అంటూ అనారోగ్యాల్ని తెచ్చిపెట్టే వాటిని కాకుండా నట్స్, బఠాణీలు, డ్రైఫ్రూట్స్, పండు లాంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వమంటున్నారు. ఇవి మీ ఆరోగ్యంతోపాటూ ప్రస్తుత పరిస్థితి నుంచి బయటపడేందుకు ఉపయోగపడతాయి. వీటిల్లో ఉండే విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్లతో ఆరోగ్యానికి మేలు. తినడమూ వ్యాయామం లాంటిదే. ఇది మీ మెదడుకు పని చెప్పి, మీరు నిరంతరం అలర్ట్‌గా ఉండేందుకు ఉపయోగపడుతుంది. అయితే అతి అనర్థాలకు తావిస్తుంది.

నీ తోడే ధైర్యం!

పండగ కదా... ఇంటికి బంధువులొస్తారు. 'అమ్మాయి ఎలా ఉంది? తట్టుకోవడం కొంచెం కష్టమే...' అంటూ మాట్లాడుకుంటూ ఉంటారు. 'వాళ్లు నా గురించే కదా మాట్లాడుతోంది' అని తమ్ముడిని అడుగుతుందామె. దానికి అతను 'వాళ్లేదో ఆస్తి గురించి మాట్లాడుకుంటున్నారు. నీ గురించి మాట్లాడటం తప్ప వాళ్లకి పనేమీ లేదా ఏంటి?' అని చెబుతాడు. 'ఇంత పెద్దయినా అబద్ధం చెప్పడం రాదు' అని నవ్వేస్తుంది. ఇంతలో వాళ్లంతా ఆమె దగ్గరికి వస్తారు. 'ఆరోగ్యం ఎలా ఉందమ్మా? కడుపుతో ఉన్నావు. ఈ సమయంలో విడాకులంటే కష్టమే. ఒంటరి తల్లిగా ఎలా నెగ్గుకొస్తావో' అంటూ ఏదో చెప్పబోతారు. దానికి 'ఒంటరి తల్లి ఎలా అవుతుంది? పుట్టబోయే బిడ్డకి ముగ్గురు అమ్మలు. మా అక్క ఓ అమ్మ. ఇక నేను... మా... మ... ఇద్దరు అమ్మలకు సమానం. బిడ్డకి ఇక లోటేం ఉంటుంది' అని ప్రశ్నిస్తాడా తమ్ముడు. అంతేకదా! రాఖీ ఉద్దేశమే 'నీకు అన్నివేళలా తోడుంటా'నని సోదరుడు చేసే వాగ్దానం మరి. ఆ అండ దొరికితే ఏ అమ్మాయైనా ఏ స్థితిలోనైనా ధైర్యంగా నిలబడగలదు. అలాంటి బంధాలే 'రియల్' అంటూ రియల్ సంస్థ ఈ క్యాంపెయిన్‌ని తీసుకొచ్చింది. ఇది అందరినీ ఆకర్షించడమే కాదు... అయిదు రోజుల్లోనే ఆరు లక్షలకుపైగా వ్యూస్ అందుకుంది.



ఛాంపియన్



కోహ్లి

తిరిగి బ్యాట్ పట్టిన స్టార్ క్రికెటర్

విరాట్.. రెండు నెలల తర్వాత

లండన్: ఈ ఏడాది ఐపీఎల్ అవ్వగానే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి పెద్ద షాకిచ్చాడు విరాట్ కోహ్లి. ఇప్పటికే టీ20లకు దూరమైన నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్లో ఇక విరాట్ ఆడేది వన్డేలు మాత్రమే. టీమ్‌ఇండియా తర్వాతి వన్డే సిరీస్ అక్టోబరులో కావడం గమనార్హం. ఆ నెల 19-25 తేదీల మధ్య ఆస్ట్రేలియాలో మూడు మ్యాచ్‌ల సిరీస్ ఉంది. అందుకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ.. అప్పుడే విరాట్ సాధన మొదలుపెట్టేశాడు. రెండు నెలల తర్వాత అతను బ్యాట్ పట్టి సాధన చేశాడు. లండన్‌లోని సొంత నివాసం ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్న విరాట్.. నెట్స్‌లో సాధన అనంతరం దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. అందులో కోహ్లీతో పాటు ఐపీఎల్ జట్టు గుజరాత్ టైటాన్స్ సహాయ కోచ్ నయీమ్ అమిన్ ఉన్నాడు. అమిన్ పర్యవేక్షణలోనే విరాట్ సాధన చేశాడు. తనకు సాయపడ్డందుకు కృతజ్ఞతలు చెబుతూ, అతణ్ని కలవడం ఎప్పుడూ బాగుంటుందని వ్యాఖ్యానించాడు కోహ్లి.

అవతారం మారింది..: టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాక విరాట్ కోహ్లి అవతారం మార్చేశాడు. అతను తెల్లటి గడ్డంతో కనిపిస్తున్నాడు. అతడి గడ్డం ముందే నెరిసినప్పటికీ.. దానికి రంగు వేసుకునేవాడు. కానీ ఇటీవలి విరాట్ ఫొటోలను గమనిస్తే.. గడ్డం తెల్లబడే ఉంటోంది. గత నెల లండన్‌లో టీమ్‌ఇండియా ఆటగాళ్లతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న విరాట్, తాను టెస్టులకు గుడ్‌బై చెప్పడంపై స్పందిస్తూ.. 'నాలుగు రోజులకోసారి గడ్డానికి రంగు వేసుకుంటున్నప్పుడు రిటైరవడం ఎలా ఉంటుంది అంటూ' చమత్కరించాడు. ఇప్పుడతను అలా రంగు వేసుకోకుండానే ఫొటోలకు పోజులివ్వడం విశేషం. ప్రాక్టీస్ సందర్భంగా, మరో స్నేహితుడితో కలిసి దిగిన ఫొటోల్లో విరాట్ తెల్లటి గడ్డంతోనే దర్శనమిచ్చాడు.

అర్జున్ గేమ్ డ్రా



అర్జున్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ రెండో రౌండ్లో టాప్‌సీడ్ అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకున్నాడు. శుక్రవారం జోర్డన్ ఫోరెస్ట్ (నెదర్లాండ్స్)తో అతను పాయింట్ పంచుకున్నాడు. నిహాల్ సరీన్-అనీష్ గిరి, మురళీ కార్తికేయన్-అవాండర్ లియాంగ్ మధ్య గేమ్‌లు డ్రాగా ముగిశాయి. రాయ్ రాబ్సన్ చేతిలో విదిత్ గుజరాతి.. విన్సెంట్ కీమర్ చేతిలో ప్రణవ్ పరాజయం చవిచూశారు. 1.5 పాయింట్లతో అర్జున్ ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నాడు. విన్సెంట్ కీమర్ (2) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఛాలెంజర్స్ విభాగంలో ఇనియన్ చేతిలో ద్రోణవల్లి హారిక ఓడిపోయింది. ల్యూక్ మెండోంకాపై అభిమన్యు పౌరాణిక్ నెగ్గాడు. వైశాలి-అధిబన్, దీప్తాయన్-ఆర్యన్, హర్షవర్ధన్-పర్ణేష్ గేమ్‌లు డ్రా అయ్యాయి.

అదరగొట్టిన ఈషా

డబుల్స్‌లో పసిడి, సింగిల్స్‌లో కాంస్యం



ఈషా

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కంద్రపు దుర్గాఈషా సత్తా చాటింది. కొలంబోలో జరిగిన బీడబ్ల్యూఎఫ్ శ్రీలంక జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మహిళల డబుల్స్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. డబుల్స్ తుదిపోరులో దుర్గాఈషా-ఇషిత జంట 21-5, 21-18తో దిల్‌నీ-రనుమి మనాగె (శ్రీలంక) జోడీని ఓడించింది. సింగిల్స్ సెమీఫైనల్లో దుర్గాఈషా 17-21, 25-27తో భారత్‌కే చెందిన లక్ష్య రాజేశ్ చేతిలో ఓడింది. సెమీస్ చేరడం ద్వారా ఆమెకు కాంస్యం దక్కింది.

సంజు దారెటు?



సంజు శాంసన్

దిల్లీ

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టును అయిదు సీజన్ల పాటు సారథిగా నడిపించిన ఆటగాడు సంజు శాంసన్. స్థిరమైన కెప్టెన్ కోసం చూస్తున్న రాయల్స్‌కు అతను సరైన ప్రత్యామ్నాయంగా కనిపించాడు. 2021లో, 25 ఏళ్ల వయసులో కెప్టెన్ అయిన శాంసన్.. ఆ జట్టును బాగానే నడిపించాడు. రెండో కప్పు కోసం సుదీర్ఘ కాలంగా సాగుతున్న నిరీక్షణకు తెరదించకపోయినా.. అంతకు ముందున్న సారథులతో పోలిస్తే మెరుగైన ఫలితాలే రాబట్టాడు. ఇంకా కొన్నేళ్లు రాయల్స్ కెప్టెన్‌గా కొనసాగుతాడనుకున్న శాంసన్.. అనూహ్యంగా ఆ జట్టును వీడుతుండడం చర్చనీయాంశంగా మారింది. తనను విడిచి పెట్టాలని రాజస్థాన్ యాజమాన్యాన్ని సంజు కోరిన నేపథ్యంలో అతను ఆ జట్టుకు దూరమవడం లాంఛనమే. అయితే ఈ ఏడాది ఐపీఎల్ ముందు వరకు రాయల్స్ యాజమాన్యం, కోచింగ్ సిబ్బందితో మంచి సంబంధాలున్న శాంసన్.. ఇప్పుడు ఆ జట్టును వీడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది ప్రశ్నార్థకం. టీమ్‌ఇండియా కోచ్‌గా పదవీ కాలం ముగియడంతో రాజస్థాన్ జట్టుకు తిరిగి శిక్షకుడిగా వచ్చిన ద్రవిడ్‌తో సంజుకు పొసగలేదని తెలుస్తోంది. ఈ సీజన్ ఆరంభంలో గాయంతో ఇబ్బంది పడ్డ సంజు.. కొన్ని మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. ఆ సమయంలో అతణ్ని సంప్రదించకుండా జట్టుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంతో సంజు అసహనానికి గురైనట్లు వార్తలు వచ్చాయి. సూపర్ ఓవర్‌కు దారి తీసిన ఓ మ్యాచ్ సందర్భంగా ఆటగాళ్లందరూ ద్రవిడ్‌తో మంతనాలు జరుపుతుంటే.. సంజు తనకేం పట్టనట్లు దూరంగా ఉండడంతో వీరి మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఓపెనర్‌గా దిగడమే సంజుకు ఇష్టం కాగా.. ఈ సీజన్లో అతణ్ని మూడో స్థానానికి పంపి, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని జైస్వాల్‌కు జోడీగా ఓపెనింగ్‌లో ఆడించడం అతడిని అసంతృప్తికి గురి చేసినట్లు సమాచారం. ఒకప్పటి తరహాలో ఈసారి జట్టులో ఇమడలేకపోయిన సంజు.. ఇది తన టీం కాదన్న భావనకు వచ్చాడని, అందుకే రాయల్స్‌ను వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

తర్వాత ఎక్కడ?

సంజు రాజస్థాన్‌ను వీడటం దాదాపుగా ఖాయమైన నేపథ్యంలో అతని భవిష్యత్తు ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంఛైజీలు అతడి కోసం ప్రయత్నించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. "సంజు వ్యవహారంలో మొదట గుర్తొచ్చే జట్టు చెన్నై. అతడిని తీసుకునేందుకు కోల్‌కతా కూడా సిద్ధంగా ఉంటుంది. సంజు కోసం ఈ రెండు జట్లు పోటీపడటం ఖాయం. కోల్‌కతాకు భారత వికెట్ కీపర్ బ్యాటర్ లేడు. అందుకోసమైనా వాళ్లు శాంసన్ కోసం ప్రయత్నిస్తారు. అతడిని కెప్టెన్‌గా తీసుకుంటే తప్పేంటన్నది రెండో అంశం. కోల్‌కతాకు అజింక్య రహానె చక్కగా సారథ్యం వహించాడు. పరుగులు కూడా సాధించాడు. అయితే బ్యాటర్‌గా రహానె ఓపెనింగ్ చేస్తాడా లేదా మరో స్థానంలో ఆడతాడా అన్నది కొద్దిగా సమస్యే. కోల్‌కతా వదులుకోగలిగిన మరో ఆటగాడు వెంకటేశ్ అయ్యర్. అదే జరిగితే రూ.24 కోట్లు కోల్‌కతాకు అందుబాటులోకి వస్తాయి. ఆ మొత్తంతో వేలంలో చాలా ప్రభావం చూపొచ్చు. ధోని స్థానాన్ని భర్తీ చేయడం కోసం సంజు వైపు చెన్నై చూడొచ్చు. అతడి కోసం రవిచంద్రన్ అశ్విన్‌ను రాజస్థాన్‌కు బదిలీ చేసే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం రాజస్థాన్‌కు స్పిన్నర్ అవసరం ఉంది. గతంలో రాజస్థాన్‌కు ఆడిన అశ్విన్ ఆ లోటును భర్తీ చేయగలడు. కాబట్టి ఈ ప్రతిపాదనను కొట్టిపారేయలేం" అని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు.

చెన్నైకి అశ్విన్ టాటా!



అశ్విన్

చాలా ఏళ్ల తర్వాత ఈ సీజన్ ముంగిట తిరిగి చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులోకి వచ్చిన సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. ఆ జట్టుకు టాటా చెప్పబోతున్నట్లు సమాచారం. తనను జట్టు నుంచి విడుదల చేయాలంటూ చెన్నై ఫ్రాంఛైజీని అశ్విన్ కోరినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆటగాళ్ల నిలుపుదలకు మరో రెండు నెలలే గడువున్నందున జట్టులో తన పాత్ర గురించి సీఎస్కేతో అశ్విన్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. "ఇప్పుడే ఏ ఆటగాడి భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోలేరు. నిలుపుదల గడువు తేదీని ఇంకా ప్రకటించలేదు. కాబట్టి ఇంకా సమయముంది. ఆటగాళ్లతో చర్చలు జరపడం వేలం పాటకు ముందస్తు ప్రణాళికే. సీనియర్ ఆటగాడు అశ్విన్‌తో చర్చలు ఇందులో భాగమే. వచ్చే సీజన్‌కు ముందు జట్టులో అతని పాత్రను అర్థం చేసుకునే పరస్పర చర్చ ఇది" అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. 2025 సీజన్‌కు ముందు మెగా వేలం పాటలో రూ.9.75 కోట్లకు అశ్విన్‌ను చెన్నై కొనుక్కుంది. ఈ ఏడాది 9 మ్యాచ్‌లాడిన అశ్విన్ ఏడు వికెట్లు మాత్రమే తీశాడు. 10 ఓటములు, 4 విజయాలతో పాయింట్ల పట్టికలో చెన్నై చిట్టచివరి స్థానంలో నిలిచింది. 2009 నుంచి 2015 వరకు చెన్నైకి అశ్విన్ ప్రాతినిధ్యం వహించాడు.

ఫైనల్‌కు 10 మంది భారత బాక్సర్లు

బ్యాంకాక్: ఆసియా అండర్-19 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 10 మంది భారత బాక్సర్లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. మహిళల్లో నిషా (54 కేజీ), ముస్కాన్ (57 కేజీ), విని (60 కేజీ), నిషా (65 కేజీ), ఆర్తి కుమారి (75 కేజీ), ప్రాచి (80 కేజీలపైన), మౌసమ్ సుహాగ్ (65 కేజీ), రాహుల్ కుందు (75 కేజీ), హేమంత్ సాంగ్వాన్ (90 కేజీ) సెమీఫైనల్లో విజయాలు అందుకున్నారు. కృతిక (80 కేజీ)కి నేరుగా ఫైనల్ బెర్తు దక్కింది. యషికా (51 కేజీ), ఆకాంక్ష (70 కేజీ), శివమ్ (55 కేజీ), గౌరవ్ (85 కేజీ) సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

పరుగుల వరద

- రచిన్, నికోల్స్, కాన్వే భారీ శతకాలు
- జింబాబ్వేతో రెండో టెస్టులో కివీస్ 601/3



రచిన్ రవీంద్ర

బులవాయో: జింబాబ్వేతో తొలి టెస్టులో 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన న్యూజిలాండ్.. సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టులో ఇన్నింగ్స్ విజయానికి రంగం సిద్ధం చేసుకుంది. తొలి టెస్టులో బ్యాటింగ్‌లో అనుకున్నంతగా రాణించలేకపోయిన కివీస్.. ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారించింది. డెవాన్ కాన్వే (153; 245 బంతుల్లో 18×4), హెన్రీ నికోల్స్ (150 బ్యాటింగ్; 245 బంతుల్లో 15×4), రచిన్ రవీంద్ర (165 బ్యాటింగ్; 139 బంతుల్లో 21×4, 2×6) భారీ శతకాలు బాదడంతో రెండో రోజు ఆట చివరికి ఆ జట్టు 3 వికెట్ల నష్టానికి 601 పరుగుల భారీ స్కోరు సాధించింది. తొలి రోజు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కివీస్ 476 పరుగుల ఆధిక్యంలో ఉంది.

భారత్‌కు సులువైన డ్రా

దిల్లీ: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు సులువైన డ్రా పడింది. అక్టోబరు 6 నుంచి 11 వరకు గువాహటిలో జరిగే ఈ మిక్స్‌డ్ టీమ్ టోర్నీ డ్రాను శుక్రవారం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) విడుదల చేసింది. మొత్తం 37 జట్లను 8 గ్రూపులుగా విభజించారు. గ్రూపు-హెచ్‌లో భారత్, హాంకాంగ్, నేపాల్, ఘనాలకు చోటు దక్కింది. గ్రూపు-ఇలో చైనా, జపాన్, సింగపూర్, బ్రెజిల్, భూటాన్ ఉన్నాయి. గ్రూపులో విజేతగా నిలిచిన జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

క్వార్టర్స్‌లో రమేశ్, కిశోర్, శ్రీకాంత్

చెన్నై: ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు రమేశ్ బుదిహాల్, కిశోర్ కుమార్, డి.శ్రీకాంత్ ఓపెన్ విభాగంలో క్వార్టర్స్ చేరుకున్నారు. మూడో రౌండ్లో బుదిహాల్ 11 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ముందంజ వేశాడు. కిశోర్ 10.14 పాయింట్లు, శ్రీకాంత్ 8.9 పాయింట్లతో క్వార్టర్స్ బెర్తులు సాధించారు. అండర్-18 బాలుర విభాగంలో హరీష్ సైతం క్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు. అండర్-19 బాలికల విభాగంలో ఆద్య సింగ్, దమయంతి మూడో రౌండుకు చేరుకున్నారు.

తుర్క్‌మెనిస్థాన్‌పై భారత్ ఘనవిజయం

యంగూన్ (మయన్మార్): ఏఎఫ్‌సీ అండర్-20 మహిళల ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో భారత్ 7-0తో తుర్క్‌మెనిస్థాన్‌ను చిత్తు చేసింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన భారత్.. వరుస గోల్స్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. కెప్టెన్ శుభాంగి సింగ్, ఎస్.రౌల్ రెండేసి గోల్స్ కొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. శిబాని దేవి (14వ), చాను తొయ్‌జామ్ (35వ), పూజ (65వ) తలో గోల్ సాధించారు. తొలి మ్యాచ్‌లో ఇండోనేషియాతో డ్రా చేసుకున్న భారత్.. ప్రస్తుతం 4 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆదివారం మయన్మార్‌పై భారత్ గెలిస్తే అగ్రస్థానాన్ని ఖరారు చేసుకోవడంతో పాటు ఆసియాకప్ బెర్తు కూడా దక్కించుకోనుంది.

యాషెస్‌లో ఆస్ట్రేలియా 5.. ఇంగ్లాండ్ ౦



మెక్‌గ్రాత్

లండన్: ఈసారి ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌ను తమ జట్టు 5-0తో క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని ఆస్ట్రేలియా దిగ్గజ ఫాస్ట్‌బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ అభిప్రాయపడ్డాడు. భారత్‌తో సొంతగడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-2 డ్రాతో సరిపెట్టుకున్న నేపథ్యంలో మెక్‌గ్రాత్ ఈ మేరకు యాషెస్ ఫలితాన్ని అంచనా వేశాడు. "ఓ సిరీస్ ఫలితాన్ని ఎప్పుడో ఒకసారి మాత్రమే అంచనా వేయగలం. ఈసారి యాషెస్‌లో ఆస్ట్రేలియా 5-0తో గెలవడం కాకుండా వేరే ఫలితం నాకు కనిపించడం లేదు. మా జట్టు మీద నాకు ఎంతో నమ్మకముంది. కమిన్స్, స్టార్క్, హేజిల్‌వుడ్, లైయన్ సొంతగడ్డపై చెలరేగడానికి సిద్ధంగా ఉన్నారు. వారిని ఎదుర్కోవడం ఇంగ్లాండ్‌కు చాలా కష్టం" అని మెక్‌గ్రాత్ పేర్కొన్నాడు. చివరగా 2021-22లో ఆస్ట్రేలియా పర్యటించినపుడు ఇంగ్లాండ్ 0-4తో చిత్తయింది. రెండేళ్ల తర్వాత తమ దేశంలో జరిగిన యాషెస్ సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకుంది. ఈసారి ఆస్ట్రేలియాలో జరిగే యాషెస్ నవంబరు 21న మొదలవుతుంది.

ఆసీస్ అండర్-19 జట్టులో ఆర్యన్, యశ్

మెల్‌బోర్న్: వచ్చే నెల భారత్ అండర్-19 జట్టుతో సొంతగడ్డపై ఆరంభమయ్యే సిరీస్‌లో తలపడే ఆస్ట్రేలియా అండర్-19 బృందంలో భారత మూలాలున్న ఆర్యన్ శర్మ, యశ్ దేశ్‌ముఖ్‌లకు చోటు దక్కింది. ఈ సిరీస్‌లో ఆడే 15 మంది సభ్యుల జట్టును శుక్రవారం క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. విక్టోరియాకు చెందిన ఆర్యన్ బ్యాటర్ కాగా.. న్యూ సౌత్‌వేల్స్‌కు ప్రాతినిధ్యం వహించే యశ్ ఆల్‌రౌండర్. ఈ జట్టుకు సైమన్ బాడ్జ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సెప్టెంబర్ 21, 24, 26 తేదీల్లో భారత్-ఆసీస్ అండర్-19 జట్లు వన్డేలు ఆడతాయి. తర్వాత రెండు నాలుగు రోజుల మ్యాచ్‌ల్లో (బ్రిస్బేన్, సెప్టెంబర్ 30-అక్టోబర్ 3), (మెక్‌కే, అక్టోబర్ 7-10) తలపడతాయి.



శుక్రవారం చెన్నైలో తన సొంత బ్రాండ్ 7ప్యాడిల్స్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్యాడిల్ గేమ్ ఆడుతున్న టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని

పాక్ క్రికెటర్ హైదర్ అలీపై వేటు

మాంచెస్టర్: పాకిస్థాన్ బ్యాటర్ హైదర్ అలీపై పీసీబీ వేటు వేసింది. ఇంగ్లాండ్‌లో అత్యాచారం ఆరోపణలపై 24 ఏళ్ల హైదర్‌ను మాంచెస్టర్ పోలీసులు అరెస్టు చేయడంతో అతనిపై సస్పెన్షన్ విధించింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని పీసీబీ తెలిపింది. ఇటీవల ఇంగ్లాండ్‌లో పాకిస్థాన్ షాహీన్స్ (ఎ- జట్టు) పర్యటన సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పేర్కొంది. "జులై 23న మాంచెస్టర్ పరిసర ప్రాంతంలో సంఘటన జరిగింది. అత్యాచారం ఫిర్యాదు నేపథ్యంలో అతడిని అరెస్టు చేశాం. అనంతరం బెయిల్ ఇచ్చాం. తదుపరి దర్యాప్తు జరుగుతోంది" అని మాంచెస్టర్ పోలీసులు తెలిపారు. విచారణ దశలో అనుమానితుల పేర్లను బ్రిటన్ పోలీసులు బయటకు చెప్పరు. హైదర్‌కు న్యాయ సహాయం అందిస్తామని పీసీబీ తెలిపింది.

వీనస్ తొలి రౌండ్లోనే..



వీనస్

సిన్సినాటి: యుఎస్ ఓపెన్లో మిక్స్‌డ్ డబుల్స్ బరిలో ఉన్న అమెరికా వెటరన్ టెన్నిస్ స్టార్ వీనస్ విలియమ్స్‌కు సిన్సినాటి ఓపెన్లో చుక్కెదురైంది. శుక్రవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 4-6, 4-6తో జెస్సికా బౌజాస్ మానెయిరో (స్పెయిన్) చేతిలో ఓడింది. పునరాగమనంలో డీసీ టోర్నీలోనూ రెండో రౌండ్లో వెనుదిరిగిన 45 ఏళ్ల వీనస్.. తర్వాత సిటీ ఓపెన్లో ప్రిక్వార్టర్స్ వరకు వెళ్లింది. "పునరాగమనంలో అన్నీ అనుకున్నట్లుగా జరగవు. గత వారం నుంచి నాలుగు మ్యాచ్‌లు ఆడా. శారీరకంగా కాస్త అలసటగా అనిపిస్తోంది. ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి సారించాలి" అని వీనస్ తెలిపింది. "వీనస్‌పై నెగ్గడం పెద్ద ఘనత. ఆమెతో ఆడడమే గొప్ప గౌరవం" అని 22 ఏళ్ల బౌజాస్ పేర్కొంది. వీనస్ తొలి గ్రాండ్‌స్లామ్ గెలిచినప్పుడు బౌజాస్ పుట్టకపోవడం విశేషం. ఈసారి యుఎస్ ఓపెన్‌లో ముందుగా నిర్వహిస్తున్న మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లో వీనస్-రిలీ ఒపెల్కా జంటకు వైల్డ్‌కార్డు ఎంట్రీ లభించింది.

రొనాల్డో హ్యాట్రిక్

లిస్బన్: వయసు మీదపడుతున్నా ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో జోరు తగ్గట్లేదు. 40 ఏళ్ల ఈ పోర్చుగల్ స్ట్రైకర్ హ్యాట్రిక్ సాధించడంతో రియో ఏవ్‌తో స్నేహపూర్వక పోరులో అల్ నాసర్ 4-0తో ఘన విజయం సాధించింది. తొలి గోల్‌ను మహ్మద్ సిమాఖాన్ (15వ) చేయగా.. తర్వాత రొనాల్డో మాయ మొదలైంది. 44వ నిమిషంలో ప్రత్యర్థి గోల్‌పోస్టు సమీపానికి దూసుకొచ్చిన రొనాల్డో ఓ మెరుపు షాట్‌తో గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించాడు. 63వ నిమిషంలో హెడర్‌తో మరో గోల్ సాధించిన రొనాల్డో.. 68వ నిమిషంలో పెనాల్టీని లక్ష్యానికి చేర్చి హ్యాట్రిక్ అందుకున్నాడు.

ఆసీస్‌తో సిరీస్ కీలకం



హర్మన్‌ప్రీత్

బెంగళూరు: ఆసియా కప్, ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు ముందు ఆస్ట్రేలియాతో సిరీస్ అత్యంత కీలకమని భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. బలమైన ఆసీస్‌తో మ్యాచ్‌లు భారత జట్టుకు మంచి సన్నద్ధతగా పనికొస్తాయని తెలిపాడు. ఈనెల 15 నుంచి 21 వరకు పెర్త్ హాకీ స్టేడియంలో జరిగే నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్‌తో భారత్ తలపడనుంది. "ఆసీస్‌ను దాని సొంతగడ్డపై ఎదుర్కోవడం ఎప్పుడూ సవాలే. ఈ దశలో మా సన్నాహాలకు అదే అవసరం. ఆసియా కప్ సన్నద్ధతలో ఈ సిరీస్ కీలకమని భావిస్తున్నాం. ఆసియా టోర్నీకి ముందు బలమైన ప్రత్యర్థిపై ఆటగాళ్లను పరీక్షించుకోవడం, లయను దొరకబుచ్చుకోవడంపై దృష్టిసారించాం. మేం మెరుగుపడాల్సిన విభాగాలను గుర్తించడానికి ఈ మ్యాచ్‌లు దోహదపడతాయి. ఆసీస్ వంటి అగ్రశ్రేణి జట్టుతో అధిక తీవ్రతతో జరిగే మ్యాచ్‌ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు.

నాణ్యత బాగుంటే ఎర్ర బంగారమే!



- నిర్దేశిత ప్రమాణాలతో పండించే మిరపకు అధిక ధరలు
- యూకే, ఆస్ట్రేలియాలకు ఎగుమతైన ధర క్వింటాలుకు రూ.32 వేలకు పైనే
- చైనా, బంగ్లాదేశ్‌లలో రూ.9 వేల నుంచి రూ.17 వేల లోపే

ఈనాడు, అమరావతి: ప్రతికూల పరిస్థితులను ఎదిరించారు రైతులు పండించే మిరపకు అధిక ధర దక్కాలంటే నాణ్యత కీలకంగా మారుతోంది. పరిమితికి మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడటే.. సరైన ధర దక్కడం లేదు. సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) విధానాల్లో పండించిన మిరపను అమెరికా, ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాలు గరిష్ఠంగా క్వింటాలుకు రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు వెచ్చించి దిగుమతి చేసుకున్నాయి. అదే సమయంలో భారత్ నుంచి అధికంగా మిరప దిగుమతి చేసుకొనే బంగ్లాదేశ్, చైనా తదితర దేశాలు చెల్లించిన ధర క్వింటాలుకు రూ.9,500 నుంచి రూ.17 వేల లోపే. వాస్తవంగా రైతుకు ఇంకా తక్కువే లభించింది.

అధిక పురుగు మందుల వినియోగంతో అనర్థం

తెలుగు రాష్ట్రాల్లోని మిరప సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తారనే అభిప్రాయం ఉంది. ఉత్పత్తుల పరీక్షల్లోనూ ఇదే విషయం వెల్లడవుతోంది. వాస్తవంగా.. ఎగుమతులకు అనువైన ప్రమాణాల ప్రకారం మిరప సాగు చేస్తే.. ఖర్చులూ తగ్గుతాయి. అమెరికా తదితర దేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులు తమిళనాడు, అసోం తదితర రాష్ట్రాల్లోని మిరపను అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా ఏపీ, తెలంగాణల్లో ఒకటి రెండుచోట్ల రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని సేకరిస్తున్నాయి. కానీ, విత్తనం నుంచి కోతల వరకు ఆ సంస్థల పర్యవేక్షణ ఉంటోంది. సాధారణ ధరతో పోలిస్తే కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా చెల్లిస్తున్నారు. తమిళనాడులోని విరుదునగర్ ప్రాంతంలో పండించే మిరప నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో అమెరికా తదితర దేశాలు కొనుగోలు చేస్తున్నాయని ఎగుమతి వ్యాపారి దినేశ్ చెబుతున్నారు.



గత ఆర్థిక సంవత్సరంలో వివిధ దేశాలకు మిరప ఎగుమతులు.. క్వింటాలుకు సగటు ధరలు

దేశం	ఎగుమతి (టన్నుల్లో)	క్వింటాల్ ధర (రూ.ల్లో)
యూకే	6,325	32,734
ఆస్ట్రేలియా	2,265	32,344
కెనడా	2,857	31,784
అమెరికా	39,466	28,467
థాయ్‌లాండ్	55,103	18,951
మలేసియా	22,539	18,297
ఇండోనేసియా	38,834	16,816
చైనా	2,36,831	16,288
శ్రీలంక	42,974	14,415
[illegible]	9,289	13,301
నేపాల్	12,260	11,169
బంగ్లాదేశ్	1,16,711	9,654
యూఏఈ	61,461	9,943

(స్పైసెస్ బోర్డు గణాంకాల ప్రకారం)

ఆరేళ్లుగా మిరప ఎగుమతి, విలువ, క్వింటాలుకు సగటు ధర

వివరం	2019-20	2020-21	2021-22	2022-23	2023-24	2024-25
మిరప ఎగుమతులు (టన్నుల్లో)	4,96,000	6,49,815	5,57,144	5,16,177	6,01,084	7,15,506
ఎగుమతుల విలువ (రూ.కోట్లల్లో)	6,710	9,241	8,585	10,444	12,492	11,405
క్వింటాలుకు సగటు ధర (రూ.ల్లో)	13,529	14,221	15,408	20,233	20,783	15,940

బహుళ అంతస్తుల నిర్మాణాలకు 72 గంటల్లో అనుమతులు

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు దరఖాస్తు చేసిన 72 గంటల్లో అనుమతులివ్వాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ శుక్రవారం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. 12 అంతస్తుల ఎత్తువ అంతస్తుల్లో (టీడీఆర్ ప్లాట్ కలిపి) చేపట్టే భవన నిర్మాణాలకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా అనుమతుల విషయంలో గడువు నిర్దేశించినట్లు ఆయన పేర్కొన్నారు. "దరఖాస్తులకు సంబంధించిన సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత కమిషనర్, పట్టణ ప్రణాళిక విభాగాధిపతి ప్రతిపాదిత నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన సమాచారం, ఫొటోలు ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌లో 36 గంటల్లో మొదట అప్‌లోడ్ చేయాలి. ఇందులో జాప్యమైతే రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుడి కార్యాలయానికి సమాచారం వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. అప్‌లోడ్ చేసిన సమాచారాన్ని పట్టణ ప్రణాళిక విభాగ సంచాలకుడి కార్యాలయంలో పునఃపరిశీలన రాష్ట్ర కమిటీ సమావేశమై సమీక్షించి అనుమతులివ్వాలి" అని సురేశ్‌కుమార్ ఆదేశించారు. "రెండు దశల్లోనూ పరిశీలన ప్రక్రియ 72 గంటల్లోగా పూర్తి చేయాల్సిందే. సీఆర్డీఏ, వీఎంఆర్డీఏతోపాటు ఇతర పట్టణాభివృద్ధి సంస్థలు, పుర, నగరపాలక సంస్థలు అనుమతులు జారీ చేసే విషయంలో మార్గదర్శకాలు విధిగా పాటించాలి'' అని సూచించారు.

వైకాపాకు, వైఎస్సార్‌కు సంబంధం లేదు: షర్మిల

ఈనాడు, అమరావతి: వైకాపాకు, వైఎస్సార్‌కు సంబంధం లేదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఆయన పేరు పెట్టినంత మాత్రాన వైఎస్సార్ ఏమైనా వారి సొత్తా, పేటెంట్ హక్కా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా పనిచేసి చివరి క్షణం వరకు తన జీవితాన్ని ప్రజల కోసమే త్యాగం చేసిన ప్రజా నాయకుడని శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో కొనియాడారు. అలాంటిది వైకాపాకు, వైఎస్సార్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. "నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గం. దాని చుట్టూ వైకాపా అక్రమంగా వేసుకున్న సెట్టింగులు తొలగించుకోండి.. మాకేం అభ్యంతరం లేదు. తొలగించిన విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నాం'' అని షర్మిల పేర్కొన్నారు.

క్రీడా ప్రతిభా అవార్డులకు దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి జిల్లా నుంచి ఐదు పాఠశాలలకు 'క్రీడా ప్రతిభా అవార్డులు' ప్రదానం చేస్తామని పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 18 లోపు పాఠశాలలు దరఖాస్తులు సమర్పించాలన్నారు. గత విద్యా సంవత్సరం(2024-05)లో సాధించిన క్రీడా ఫలితాల ఆధారంగా ఉత్తమ స్కూళ్లను ఎంపిక చేస్తామని, ఈ నెల 29న అవార్డులను అందజేస్తామని వెల్లడించారు. అభ్యంతరాలను 20న పరిశీలిస్తామని అనంతరం తుది జాబితాను 21న విడుదల చేస్తామన్నారు. క్రీడల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు సమర్పించాలని సూచించారు. ప్రతి క్రీడలో అత్యధిక స్కోరు, మొత్తం స్కోరులో అగ్రస్థానంలో ఉన్న పాఠశాలలు అర్హత సాధిస్తాయని పేర్కొన్నారు.

నీట్ యూజీ కౌన్సెలింగ్ గడువు పొడిగింపు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి దేశంలోని పలు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశాల కౌన్సెలింగ్ గడువును మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ పొడిగించింది. ఇప్పటికే మొదటి విడత కౌన్సెలింగ్ ఐచ్ఛికాల ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగియాల్సి ఉండగా 9వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు పొడిగించింది. 11న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించింది.



వయోభారం త్వరగా పెరగొద్దంటే..

నిజం చెప్పాలంటే- మీపై వయోభారం పెరిగేది కాలం గడుస్తుండటం వల్ల కాదు.. శరీర కదలికలను బాగా తగ్గించడం వల్ల! వ్యాయామం చేయడం మానేసిన రోజు నుంచే మీరు త్వరగా ముసలివారవుతుంటారు. రోజూ నడకకు వెళ్లడం, తరచూ బరువులు ఎత్తడం వంటి చర్యల ద్వారా.. మీ దరికి రాకుండా వయోభారాన్ని చాలాకాలం నిలువరించుకోవచ్చు.

- జేమ్స్ డినికొలాంటోనియో, వైద్యుడు

వాడినది 102.. వదిలేసుకున్నది 954 టీఎంసీలు

• నీళ్లు వృథా అవుతున్న వైనం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ నీటి సంవత్సరంలో కేవలం 69 రోజుల్లో 954 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోయింది. ఇదే సమయంలో గోదావరి, కృష్ణా, వంశధార నదుల కింద ఉన్న ఆయకట్టుకు సాగు వినియోగించుకున్న నీళ్లు 102 టీఎంసీలే. ఇది కాక శ్రీశైలం నుంచి హంద్రీనీవా, ఎస్సార్బీసీ ద్వారా రాయలసీమ జలాశయాలకు మరికొన్ని నీళ్లు మళ్లించారు. ఈ స్థాయిలో నీళ్లు సముద్రం పాలవుతుండటంతో పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు, దాని ప్రయోజనాలపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గోదావరిలో సగటున 3,000 టీఎంసీలు ప్రతి ఏటా సముద్రంలోకి వృథాగా పోతుంటే, కృష్ణాలో అది ప్రస్తుత 60 ఏళ్ల లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే సగటున 712 టీఎంసీలుగా లెక్కించారు. గడిచిన 15 ఏళ్లలో కృష్ణాలో సగం సంవత్సరాల పాటు నీటి కొరత ఏర్పడింది. ఎప్పుడో సీజన్ చివర్లో కొద్ది మొత్తం నీళ్లు వచ్చిన సందర్భాలు అనేకం. కృష్ణాలో ఎగువ ప్రాజెక్టుల నిర్మాణం, ఎగువ రాష్ట్రాల నీటి వినియోగం పెరిగిపోవడంతో 75% విశ్వసనీయత వద్ద జలాల లభ్యతే కష్టమైపోతోంది. ఎగువన నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి వినియోగం ఉంటే ఈ నీళ్లూ కరవే. ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి వరద జలాల సద్వినియోగం ఒక్కటే సరైన మార్గమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రస్తుత నీటి సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకున్నా గోదావరి జలాలు ఇప్పటికే 865 టీఎంసీలు సముద్రంలో కలిసిపోయాయి. పోలవరం బనకచర్ల అనుసంధానానికి మళ్లించాలని ప్రతిపాదిస్తున్నది కేవలం 200 టీఎంసీలే కావడం గమనార్హం.

గోదావరి ఎందుకు ప్రత్యామ్నాయం?

కృష్ణాలోనూ వరద జలాలు మిగిలిపోతున్నా గోదావరి ఎందుకు ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారన్నది కీలకమైన అంశం. కృష్ణాలో వరుస కరవులు సంభవిస్తున్నాయి. 60 సంవత్సరాల పాటు కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్ ఆధారపడదగ్గ పరిస్థితులు కనిపించడం లేదు. మరో వైపు గోదావరిలో 15 నుంచి 25 రోజుల వ్యవధిలోనే 2,500 టీఎంసీలు సముద్రంలో కలిసిపోతున్నాయి. దిగువ గోదావరిలోని మూడు ఉప బేసిన్ల నుంచి అధిక వరద జలాలు లభ్యమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గోదావరిలో అత్యంత దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు వరద జలాలను వినియోగించుకునే హక్కు ఉందనేది రాష్ట్ర వాదన. గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు వినియోగించుకోవాలనేది ఎప్పటిదో ఆలోచన. విభజన చట్టం రూపకల్పన సమయంలోనూ గోదావరిలో ఏపీ ప్రతిపాదిత ప్రాజెక్టుల వివరాలు సమర్పించారు. మరో వైపు వంశధారలో సైతం నీళ్లు వృథాగా పోతున్నా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి సమస్యలు ఎదురవుతున్నాయి. వంశధార ట్రైబ్యునల్ తుది తీర్పు అధికారిక నోటిఫికేషన్ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుండ్లేవు వంటి ప్రాజెక్టుల అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కరించుకుని ముందుకు తీసుకువెళ్లడం కూడా చూడాలి. వైకుంఠపురం, ప్రకాశం బ్యారేజీల దిగువన మరో రెండు బ్యారేజీల నిర్మాణానికి గతంలో ఉన్న ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాలి.


ఈ ఏడాది ...69 రోజుల్లోనే... (అంకెలన్నీ టీఎంసీల్లో)

అంశం	గోదావరి	కృష్ణా	వంశధార	మొత్తం
69 రోజుల్లో సముద్రంలో కలిసిన నీళ్లు	856	87.56	11.21	954.77
సాగుకు సద్వినియోగం చేసుకున్నది	58.91	38.05	5.04	102.00
కిందటేడాది ఇదే సమయానికి వృథా	1,741	15.44	3.24	1,759.68

కృష్ణాలో ఇలా మిగులు (టీఎంసీల్లో)

సంవత్సరం	మిగులు
2011-12	-
2012-13	60.55
2013-14	397.72
2014-15	83.80
2015-16	8.37
2016-17	50.83
2017-18	0.41
2018-19	35.89
2019-20	718.16
2020-21	1,275.74
2021-22	491.29
2022-23	1,331.55
2023-24	62.61
2024-25	870.74

ధరాలీ వరదలపై కార్టోశాట్-2ఎస్ డేటా



గతేడాది జూన్ 13న ధరాలీ గ్రామ ఉపగ్రహ చిత్రం(ఎడమ), ఆకస్మిక వరదలతో ధరాలీలో తుడిచిపెట్టుకుపోయిన సగభాగం. ఈ నెల 7న తీసిన చిత్రం(కుడి)

శ్రీహరికోట, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలీ గ్రామం ఈ నెల 5వ తేదీన వచ్చిన ఆకస్మిక వరదలతో అల్లకల్లోలమైంది. దీనిపై హైదరాబాద్‌లోని ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) శాస్త్రవేత్తలు కార్టోశాట్-2ఎస్ ఉపగ్రహం సాయంతో అధిక రిజల్యూషన్ చిత్రాలు తీసి నష్టతీవ్రతపై అంచనా వేశారు. ధరాలీ సగభాగం తుడిచిపెట్టుకుపోవడంతో పాటు ఇళ్లు, వంతెనలు, రహదారులు ధ్వంసమైనట్లు గుర్తించారు. మిగిలిన భవనాలు బురదలో చిక్కుకున్నాయి. సహాయక చర్యలు చేపడుతున్న అధికారులకు ఈ ఉపగ్రహ చిత్రాలు ఉపయోగపడుతున్నాయి.

శిక్ష నిందితులకా.. నాకా?

• మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత



ఈనాడు-కడప, న్యూస్‌టుడే-పులివెందుల: 'మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితులంతా యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. నేనేమో స్వస్థలానికి రావాలన్నా భయపడుతున్నాను. శిక్ష నిందితులకా.. నాకా అనే విషయం అర్థం కావట్లేదు' అని వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా జయంతి సందర్భంగా పులివెందులలోని ఆయన ఘాట్ వద్ద సునీత దంపతులు శుక్రవారం నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'న్యాయస్థానంలో వాయిదాలకు నిందితులతో పాటు నేనూ హాజరవుతున్నా. ఇంకా ఎన్నేళ్లు న్యాయపోరాటం చేయాలి? దర్యాప్తు పూర్తయిందని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. దర్యాప్తు అసంపూర్తిగా ఉందని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశా. నాన్న హత్య జరిగిన రోజు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి.. పోలీసులను బెదిరించి సాక్ష్యాధారాలన్నీ తుడిపేయించారు. ఇప్పుడు జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా మళ్లీ బెదిరింపులకు దిగుతున్నారు. ప్రజలు.. హింస లేని పులివెందులను చూడాలనుకుంటున్నారు' అన్నారు.

శవయాత్రకూ జగన్ అభ్యంతరాలు

పాత పులివెందుల అంటే మీకు బెదిరిపోయి పనులు చేసే పోలీసులు కావాలా అని అవినాష్‌రెడ్డిని సునీత ప్రశ్నించారు. సీబీఐ అరెస్టు చేయడానికి రాగా.. పోలీసులను అడ్డుపెట్టుకుని కర్నూలులో తప్పించుకోలేదా అంటూ నిలదీశారు. 'నాన్న మృతిచెందిన రోజు శవయాత్ర నిర్వహించాలని అడిగితే మా అన్న (జగన్) వద్దన్నారు. ప్రజలు తక్కువగా వస్తే బాగోదని, దగ్గర మార్గంలో త్వరగా పూర్తిచేయాలనే ప్రయత్నం చేశారు' అని తెలిపారు. అంత్యక్రియలకు ఎవరినీ రానీయకుండా త్వరగా అన్నీ సర్దేశారని చెప్పారు. పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చి పనిచేసే వాతావరణం కల్పించాలని సూచించారు. హత్యా రాజకీయాలు చేసేవారికి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రేమకు ప్రతిరూపం!

విశాఖ బీచ్‌రోడ్డులో ఉన్న అ అపురూపకట్టడం.. పేరు 'జ్ఞానవిలాస్- ప్రేమ నివేదన రూపం'. దీన్ని స్థానికులు 'వైజాగ్ తాజ్' పిలుచుకుంటారు. కురుపాం జమీందారు వైరిచర్ల వీరభద్రరాజు బహదూర్ తన భార్య రాణీ నరసాయమ్మపై ప్రేమతో దీన్ని నిర్మించడంతో ఆ పేరొచ్చింది. ఇప్పుడైతే ఎవరూ పట్టించుకోక ఇలా తుప్పల మధ్య మిగిలిపోయింది.. కానీ, అప్పట్లో ఓ వెలుగు వెలిగింది. విశాఖలో స్థిరపడిన గొడె నారాయణ గజపతి కుమార్తె నరసాయమ్మను ఉత్తరాంధ్రలోని కురుపాం జమీందారైన వీరభద్రరాజుకు ఇచ్చి 1897లో వివాహం చేశారు. ఆరేళ్ల తర్వాత కవలలకు జన్మనిచ్చిన రాణి.. పురిట్లోనే కన్నుమూసింది. ఆ తర్వాత కవలలూ చనిపోయారు. ఆమెను సమాధి చేసిన ప్రదేశంలోనే మొఘల్, రాజస్థానీ నిర్మాణ శైలిలో ఈ ప్రేమ చిహ్నాన్ని నిర్మించారు. 4 వైపులా అలంకరించినట్లు కనిపించేలా ఎత్తయిన రాతి గోపురం దీని ప్రధాన ఆకర్షణ. దానిపై ఆంగ్ల కవితలూ రాశారు. 'ఇక్కడ నా ప్రియమైన లక్ష్మి శరీరం, వీరభద్రరాజు హృదయం ఉంది' అంటూ కవితాత్మకంగా దానిపై పేర్కొన్నారు. 1905లో నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ స్మారకం.. ప్రేమ, భక్తికి చిరునామాగా ఉండాలనుకున్నారు. ప్రేమకు రూపమైన నిర్మాణాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చాలని నగరవాసులు కోరుతున్నారు.



- ఈనాడు, విశాఖపట్నం

తమిళనాడు నూతన విద్యావిధానంలో హిందీకి చోటులేదు

చెన్నై, న్యూస్‌టుడే: హిందీపై జాతీయస్థాయిలో చర్చ జరుగుతున్న వేళ జాతీయ విద్యా విధానానికి (ఎన్ఈపీ)కి కౌంటర్‌గా తమిళనాడు ప్రత్యేకంగా రాష్ట్ర విద్యా విధానం-2025ను తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ శుక్రవారం దీనిని ఆవిష్కరించారు. జాతీయ నూతన విద్యా విధానంలోని త్రిభాషా సూత్రం సహా పలు అంశాలపై తమిళనాడు ప్రభుత్వం తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా రాష్ట్ర విద్యా విధానాన్ని రూపొందించనున్నట్లు గతంలో ఎం.కె.స్టాలిన్ ప్రకటించారు. ఇందుకోసం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యులతో కూడిన కమిటీని 2022లో ఏర్పాటు చేశారు. ఈ కమిటీ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి రాష్ట్ర విద్యావిధానాన్ని రూపొందించి 2024 జులై 1న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నేపథ్యంలో చెన్నైలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 'తమిళ్‌నాడు మానిల కల్వి కొళ్గై-2025-పళ్లి కల్వి' (తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం-2025-పాఠశాల విద్య)ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అందులోని కీలక అంశాలు..



'తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం-2025-పాఠశాల విద్య'ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్

★ తమిళనాడులో తమిళం, ఆంగ్లం అనే ద్విభాషా విధానమే అనుసరించాలి.
★ 10, 12వ తరగతి విద్యార్థులకు మాత్రమే పబ్లిక్ పరీక్షలు.
★ ఈ విద్యా సంవత్సరం నుంచే 11వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రద్దు.
★ ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించవచ్చు.
★ కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విద్యాబోధన అందించాలి.

57.. 67 ఏళ్లు ఉత్సాహానికి అడ్డేది!

మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించిన ఇద్దరు కృష్ణాజిల్లా వాసులు



మౌంట్ ఎల్బ్రస్ పర్వతంపై అనుమోలు ప్రభాకరరావు, బొబ్బా గోపాలకృష్ణ

కానూరు, న్యూస్‌టుడే: ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని ఉత్సాహంగా యూరప్‌లోని అత్యున్నత శిఖరాన్ని అధిరోహించారు ఇద్దరు కృష్ణా జిల్లా వాసులు. పెనమలూరు మండలం తాడిగడప పురపాలక సంఘంలోని పోరంకికి చెందిన అనుమోలు ప్రభాకరరావు(67), వణుకూరుకు చెందిన బొబ్బా గోపాలకృష్ణ (57)లు మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించారు. ఇది సముద్ర మట్టానికి 5,642 మీటర్ల ఎత్తులో ఉంటుంది. వీరు ఈ నెల ఒకటో తేదీన విజయవాడ నుంచి బయలుదేరారు. రష్యాలోని మినె రల్నీ వోడి అనే పట్టణానికి 2వ తేదీన చేరుకున్నారు. తర్వాత పర్వతం సమీపంలోని అజౌ గ్రామానికి వెళ్లి, రెండు రోజులపాటు సాధన చేశారు. 4వ తేదీన బేస్ క్యాంపు వైపు ప్రయాణం మొదలు పెట్టారు. ఎత్తు, అక్కడి వాతావరణానికి అలవాటుపడిన తర్వాత 6వ తేదీ మధ్యాహ్నం మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారు. వీరిద్దరూ 2024లో ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో ఎక్కారు. 2023లో ఎవరెస్టు బేస్ క్యాంప్ వరకు వెళ్లారు.

కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పోలీసు శాఖలోని 14 మంది అధికారులకు కేంద్ర ప్రభుత్వం కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో బి.లక్ష్మీనారాయణ, కె.ఈశ్వరరావు, కె.చౌడేశ్వరి, ఇ.సుప్రజ, కె.వి.శ్రీనివాసరావు, కె.లావణ్యలక్ష్మి, ఎ.సురేష్‌బాబు, డి.హిమవతి, కె.లతామాధురి, పి.వెంకటరత్నం, కె.కృష్ణప్రసన్న, ఎం.సత్తిబాబు, కరీముల్లా షరీఫ్, పి.శ్రీనివాస్ ఉన్నారు.

అల్లూరి జిల్లా పాఠశాలలకు రూ.45 కోట్లు మంజూరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులకు రూ.45.02 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది నవంబరు 2న సీఎం చంద్రబాబు అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులను మంజూరు చేసినట్లు అందులో పేర్కొన్నారు. 85 పాఠశాలల్లో 286 అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టనున్నారు.

అంతర్జాతీయ పాఠశాల వాలీబాల్ క్రీడాకారుల కోసం పోటీలు

అంతర్జాతీయ పాఠశాల వాలీబాల్ చాంపియన్‌షిప్ (అండర్-15) పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు రాష్ట్రంలో ఈ నెల 13 నుంచి పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో 13న, రాష్ట్ర స్థాయిలో 18న బాలబాలికలకు విడివిడిగా పోటీలు ఉంటాయి.

బెదిరింపుల కేసులో వైకాపా నేతలకు నోటీసులు

ఈనాడు, కడప: పార్టీ మారినందుకు బెదిరించడంపై వైకాపా నేతలకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పోలీసులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. పులివెందుల మండలం తుమ్మలపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి వైకాపాను వీడి ఇటీవల తెదేపాలో చేరారు. ఈ నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎంపీ పీపీ రాఘవరెడ్డి, అదే గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి తదితరులు తనను తీవ్ర స్థాయిలో బెదిరించినట్లు విశ్వనాథరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్‌కాల్ డేటా ఆధారాలను కూడా అందజేశారు. వీరందరిపై రెండు రోజుల కిందట పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న భాస్కరరెడ్డి, శివశంకరరెడ్డి కండిషన్ బెయిల్ దృష్ట్యా హైదరాబాద్‌లో ఉన్నారు. ఈ మేరకు పులివెందుల పోలీసులు అక్కడికి వెళ్లి 41ఏ నోటీసులు అందించారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

నా భర్త ఫోన్‌లోని సమాచారాన్ని సిట్ లీక్ చేయకుండా అడ్డుకోండి

'మద్యం' కేసు నిందితుడు వెంకటేశ్‌నాయుడి భార్య వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: తన భర్త విషయంలో మీడియాలో ప్రసారం చేసిన, ప్రచురించిన, వ్యాప్తి చేసిన సమాచారాన్ని తొలగించాలని.. ఇకమీదట ప్రచురణ, ప్రసారం, వ్యాప్తి చేయకుండా నియంత్రించాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసులో 34వ నిందితుడు వెంకటేశ్‌నాయుడి భార్య వాసిరెడ్డి మహిత హైకోర్టులో వ్యాజ్యం వేశారు. మీడియా ట్రయల్ నిర్వహిస్తూ న్యాయ విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారన్నారు. దర్యాప్తు జరుగుతున్న కేసులో నోట్ల కట్టలను సీజ్ చేసినట్లు సమాచారాన్ని లీక్ చేసి, దానిని వ్యాప్తి చేయడంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. తన భర్త నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లోని సమాచారాన్ని సేకరించి సిట్ అధికారులు మీడియాకు లీకులిస్తున్నారని ఆరోపించారు. రహస్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని సంచలనం కోసం మీడియా ప్రసారం చేస్తోందన్నారు. దర్యాప్తు అధికారి, సీఐడీ అదనపు ఎస్పీ శ్రీహరిబాబు తన భర్త ఫోన్‌ను తీసుకున్నారని వివరించారు. సమాచారం లీకు వెనుక ఆయన ఉన్నట్లుగా తాను విశ్వసిస్తున్నానన్నారు. శ్రీహరిబాబుతో పాటు, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సిట్, సీఐడీ అదనపు డీజీ, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

యాసిడ్ తరలిస్తున్న ఆటో బోల్తా

ద్రావణం పడి భార్య మృతి, భర్త పరిస్థితి విషమం



యాసిడ్‌ను నిర్వీర్యం చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

పెదపాడు, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: యాసిడ్ డబ్బాలు తరలిస్తున్న ట్రక్కు ఆటో వెనుక టైర్ పేలి బోల్తాపడింది. ఏలూరు జిల్లా పెదపాడు మండలం తాళ్లమూడి వద్ద పదహారో నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందగా ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు ప్రగతినగర్‌కు చెందిన షేక్ అల్లాభక్షు(52) గుంటూరు నుంచి ఏలూరుకు ట్రక్కు ఆటోలో యాసిడ్ డబ్బాలు తరలిస్తున్నారు. తాళ్లమూడి వద్దకు వచ్చేసరికి వెనుక టైర్ పేలడంతో ఆటో బోల్తా పడింది. దీంతో అల్లాభక్షు, అతని భార్య షేక్ షంషాద్‌లపై యాసిడ్ పడింది. షంషాద్(48)పై ఎక్కువ యాసిడ్ పడడంతో శరీరభాగాలు కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అల్లాభక్షును 108 వాహనంలో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. రహదారిపై పడిపోయిన యాసిడ్ నుంచి పొగలు వస్తుండడంతో హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక శాఖ అధికారులు నీళ్లు చల్లి నిర్వీర్యం చేశారు.

EENADU Vol: 51, Issue: 361 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఆవును రక్షించబోయి.. ప్రాణాలు కోల్పోయిన రైతు



జానకి రామానాయుడు

ఐరాల, న్యూస్‌టుడే: జీవనోపాధి కల్పించే గోవును రక్షించే ప్రయత్నంలో ఓ రైతు మృత్యువాత పడిన విషాద ఘటన ఇది. చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాకర్లవారిపల్లెకు చెందిన జానకి రామానాయుడు(53) ఐదు ఆవులతో పాడి చేసుకుని జీవిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామానాయుడు శుక్రవారం ఆవును దాణా కోసం పొలానికి తోలుకెళ్లారు. అది అక్కడ మేస్తున్న సమయంలో విద్యుత్తు స్తంభం నుంచి బోరుకు వెళ్తున్న కరెంటు తీగ కొమ్ములకు తగిలింది. ఆవును కాపాడాలనే ఆత్రుతతో రామానాయుడు ఆ తీగను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై మరణించారు. ఈ ఘటన గ్రామంలో విషాద ఛాయలు నింపింది.

ఏపీలో 649 కోర్టుల కంప్యూటరీకరణ

18.57 లక్షల కేసుల విచారణలో వీడియోకాన్ఫరెన్స్ వినియోగం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని 649 కిందిస్థాయి కోర్టుల కంప్యూటరీకరణ పూర్తయినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ప్రస్తుతం ఇవన్నీ ఈ-కోర్ట్స్ ప్రాజెక్టుకు అనుసంధానమైనట్లు చెప్పారు. ఆయన శుక్రవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు పుట్టా మహేష్‌కుమార్, మాగుంట శ్రీనివాసులురెడ్డిలు అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం చెప్పారు. 'రాష్ట్రంలోని 188 కోర్టులకు 10 నుంచి 100 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వాన్ సౌకర్యం కల్పించాం. 18.57 లక్షల కేసుల విచారణలో వీడియోకాన్ఫరెన్స్ సౌకర్యం వినియోగించారు. 8.4 కోట్ల కోర్టు రికార్డుల డిజిటలీకరణ పూర్తయింది. ఈ-కోర్టు కార్యక్రమం కోసం ఆంధ్రప్రదేశ్‌కు మూడు దశల్లో మొత్తం రూ. 114.43 కోట్లు విడుదల చేయగా, రూ. 75.41 కోట్లు ఖర్చయింది' అని కేంద్రమంత్రి వివరించారు.



ఒక్క పనిపైనే దృష్టి కేంద్రీకరించండి

మీ ఉత్పాదకతను గణనీయంగా పెంచుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఒకే సమయంలో వేర్వేరు పనులు చేయకుండా, పూర్తిగా ఒక్క పనిపైనే మీ దృష్టిని కేంద్రీకరించడం అలవాటు చేసుకోండి. దానివల్ల- ✦ మీ ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. ✦ మెరుగైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ✦ తక్కువ సమయంలో పని పూర్తవుతుంది. ✦ పని నాణ్యత కూడా పెరుగుతుంది. ✦ మీపై ఒత్తిడి తగ్గుతుంది.

– రాడ్ జోన్స్, గ్రోత్ కోచ్

మోసపోతావు... జాగ్రత్త బ్రో!

- రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌లు
- వీటిలో గదులు, కాటేజీలు బుక్ చేస్తే అంతే సంగతి
- అధికారిక వెబ్‌సైట్‌తోనే యాత్ర సుగమం

ఈనాడు, అమరావతి: సైబర్ నేరగాళ్లు పర్యాటకులను కూడా వదలడం లేదు. హోటళ్లు, రిసార్ట్‌లలో గదులు, కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసేందుకు నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారు. సూర్యలంక రిసార్ట్‌లో కాటేజీల బుకింగ్ పేరుతో మోసం చేసిన తీరు వెలుగులోకి వచ్చినా చాలామంది బాధితులు తాము ఎదుర్కొంటున్న చేదు అనుభవాలు బయటకు చెప్పడం లేదు. నిత్యం అనేకమంది మోసపోతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సందర్శించే ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన హోటళ్లు, కాటేజీలకు గిరాకీ ఉంటోంది. విజయవాడలోని బెర్మ్ పార్క్, బాపట్లలో సూర్యలంక, దిండి, శ్రీశైలం, గండికోట, అరకు, లంబసింగి హరిత హోటళ్లలో గదులు, రిసార్ట్‌లలో కాటేజీల కోసం పర్యాటకులు పోటీ పడుతుంటారు. ఇదే అవకాశంగా భావించిన సైబర్ నేరగాళ్లు వీరిని మోసగిస్తున్నారు.

★ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన హోటళ్లు, రిసార్ట్‌ల పేరు ముందు హరిత అని ఉంటోంది. గతంలో పున్నమిగా ఉన్న పేరును వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు హరితగా మార్చారు. దీంతో హరిత హోటల్స్, రిసార్ట్స్‌గా మారాయి. వీటిల్లో గదులు, కాటేజీల బుకింగ్ కోసం రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) పేరుతో వెబ్‌సైట్ అమలులో ఉంది. దీని ద్వారా అందుబాటులో ఉన్న గదులు, కాటేజీలు బుక్ చేసుకోవచ్చు.

★ అవగాహనలేని రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు కొందరు సొంతంగా ఆన్‌లైన్‌లో గదులు, కాటేజీలు బుక్ చేసుకునేటప్పుడు గూగుల్ ద్వారా సెర్చ్ చేస్తున్నారు. ఏపీటీడీసీ వెబ్‌సైట్ ద్వారా హోటళ్లలో గదులు బుక్ చేస్తే ఇబ్బంది ఉండేదికాదు. హరిత హోటల్ పేరుతో సెర్చ్ చేయగానే పలు నకిలీ వెబ్‌సైట్‌లు సాక్షాత్కరిస్తున్నాయి. వాటిని ఓపెన్ చేయగానే కాటేజీలకు అత్యధిక డిమాండ్ ఉండే సూర్యలంక నుంచి శ్రీశైలం వరకు ఉన్న హోటళ్లలో గదులు, కాటేజీల్లో ఖాళీలు చూపిస్తున్నాయి. హడావుడిగా బుక్ చేసుకుని యూపీఐ ద్వారా డబ్బు చెల్లిస్తున్నారు. ఈ మేరకు గదులు, రిసార్ట్‌లు బుక్ అయినట్లుగా మాయగాళ్లు రసీదులు కూడా జనరేట్ చేసేస్తున్నారు. వాటిని పట్టుకుని హోటల్‌కు వచ్చాక మోసపోయిన విషయం బయటపడుతోంది.

★ మోసాలు పెరుగుతుండటంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ సైతం ఇటీవల అప్రమత్తమైంది. ఏపీటీడీసీ అధికారిక వెబ్‌సైట్‌లోనే గదులు బుక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్‌ల వలలో పడి మోసపోవద్దని స్క్రోలింగ్ పెట్టారు.

★ రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాలకు చెందిన కొందరు సైబర్ నేరగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు. సూర్యలంకలో కాటేజీల కోసం గత ఏడాది జూన్‌లో తెలంగాణ ప్రాంతానికి చెందిన పలువురు నకిలీ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకుని మోసపోయిన కేసులో రాష్ట్ర పోలీసులు ఇటీవల రాజస్థాన్‌కు చెందిన ముఠాను అరెస్టు చేశారు. అనేకమందిని వీరు మోసగించినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది.

చరిత్రకు ఘనమైన సాక్ష్యం.. నిర్వహణ లోపమే శాపం!

కృష్ణా జిల్లా ఘంటశాలలో ఉన్న బౌద్ధ మహాస్తూపం, మ్యూజియంలు ఘనమైన చరితకు సజీవ సాక్ష్యాలు. ఇక్కడ బౌద్ధ శిల్ప సంపదపై పరిశోధనలకు ఆసియా, ఐరోపా ఖండాల నుంచి ప్రొఫెసర్లు, విద్యార్థులు వస్తుంటారు. 2006లో అప్పటి పురావస్తుశాఖ అధికారి జితేంద్రన్ ఈ ప్రాంత విశిష్టతను కాపాడేందుకు కొన్ని పనులు చేపట్టారు. సమీప పొలాల్లో దొరికిన బౌద్ధ శిల్పాలను భద్రపరిచేందుకు మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. బౌద్ధ మహా స్తూపాన్ని పునర్నిర్మించారు. ఎంతో చారిత్రక ప్రాముఖ్యం ఉన్న ఈ కట్టడాలు ప్రస్తుతం దీనావస్థలో ఉన్నాయి. మ్యూజియం భవనం బయట నుంచి చూస్తే వెలవెలబోతూ కనిపిస్తోంది. లోపల కూడా పలుచోట్ల పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. మహా స్తూపం చుట్టూ వర్షపు నీరు చేరడంతో నాచుపట్టి నల్లగా మారిపోతోంది. ఈ సమస్యలను అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో చరిత్ర అధ్యయనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టడాలకు మరమ్మతులు చేసి భావి తరాలకు విజ్ఞానం అందించాలని కోరుతున్నారు.

– ఈనాడు, కృష్ణా, ఘంటసాల, న్యూస్‌టుడే



శిథిలావస్థకు చేరిన ఘంటశాలలోని బౌద్ధ శిల్పకళా మ్యూజియం



నాచుపట్టి నల్లగా మారిన బౌద్ధ మహా స్తూపం



మ్యూజియంలో అపురూప శిల్పాలు

భారత్ అండతోనే రష్యా రెచ్చిపోతోంది: పీటర్ నవరో

వాషింగ్టన్: రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించకపోవడంతోనే ట్రంప్ రెండో సారి 25 శాతం సుంకం విధించాల్సి వచ్చిందంటూ శ్వేతసౌధ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో సమర్థించుకున్నారు. పరస్పర సుంకాలు విధించుకోవడం కంటే ఇది భిన్నమైన అంశమని పేర్కొన్నారు. 'అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోంది. దీంతో పాటు సుంకాలేతర అవరోధాలు సృష్టిస్తోంది. ఈ అసమతుల్య వాణిజ్యంలో భారత్‌కు భారీ స్థాయిలో అమెరికా డాలర్లు చేరుకుంటున్నాయి. ఆ సొమ్ముతో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్లను చంపివేయడానికి ఆ డాలర్లతో రష్యా మరిన్ని ఆయుధాలు సమకూర్చుకుంటుంది. దీంతో ఉక్రెయిన్‌కు రక్షణగా, రష్యా ఆయుధాలను అడ్డుకోవడానికి అమెరికా భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ క్రమాన్ని అర్థం చేసుకున్నందునే అధ్యక్షుడు ట్రంప్... అమెరికా ఆర్థిక ప్రయోజనాలు, దేశ భద్రత పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నారు' అని పీటర్ తెలిపారు. రష్యా నుంచి చైనా కూడా భారీగా చమురు కొనుగోలు చేస్తుంది కదా అని ప్రశ్నించగా....ఆ విషయాన్నీ త్వరలో పరిశీలిస్తామంటూ దాటవేసే ప్రయత్నం చేశారు.

వెబ్ సిరీస్ చూసి.. బాలుడి ఆత్మహత్య

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: అదేపనిగా ఓటీటీలు చూడడం ప్రాణాల మీదకు తెస్తోంది. బెంగళూరులో గాంధార్ (14) అనే బాలుడి ఆత్మహత్యకు జపనీస్ వెబ్ సిరీస్ కారణమని పోలీసులు తేల్చడంతో దిగ్భ్రాంతి చెందడం తల్లిదండ్రుల వంతైంది. సోమవారం రాత్రి భోజనం చేసి, తమ పెంపుడుకుక్క రాకీతో కాసేపు ఆడుకున్న గాంధార్ తన గదికి వెళ్లాడు. 'మీరు నన్ను 14 ఏళ్లు చక్కగా పెంచారు. మీతో కలిసి ఉన్నప్పుడు నేను సంతోషంగా ఉన్నాను. ఇప్పుడు వెళ్లే సమయం ఆసన్నమైంది. మీరు ఈ లేఖ చదివే సమయానికి నేను స్వర్గంలో ఉంటా' అని ఆత్మహత్య లేఖ రాశాడు. బాగా చదువుతూ, బడిలోనూ ఎవరితో గొడవలు లేని బాలుడు.. ఇలా రాయడం పోలీసులను ఆశ్చర్యపరచింది. తాను చూసిన సిరీస్‌లోని ఒక పాత్రధారి బొమ్మను గాంధార్ తన గదిలో గోడపై గీశాడు. సిరీస్‌లో ఒక మాయాపుస్తకంలో హీరో పాత్రధారి.. చెడ్డవాళ్లు చనిపోవాలని వాళ్ల పేరు రాస్తే.. అలాగే జరుగుతుంది. నిత్యం ఆ సిరీస్ మాత్రమే చూసే గాంధార్ దాని ప్రభావంతోనే బలవన్మరణానికి పాల్పడ్డాడని గుర్తించినట్లు పోలీసులు శుక్రవారం ధ్రువీకరించారు.

చిగురు ముడత తెగులును నిరోధించే జన్యువు!

'ఆశ' కంది రకంలో గుర్తించిన ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు

ఈనాడు, హైదరాబాద్: కంది, పెసర, మినుములు, చిక్కుడు వంటి పప్పుదినుసుల పాలిట శత్రువైన చిగురు ముడత తెగులు(స్టెరిలిటీ మొజాయిక్ డిసీజ్)ను నిరోధించే జన్యువును ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా ఈ తెగులు సోకితే మొక్కలలో ఆకులు కుంచించుకుపోయి... కాత, పూత ఉండదు. 90% పంటను కోల్పోవడం జరుగుతోంది. దశాబ్దాల తర్వాత ఈ తెగులును నిరోధించే జన్యువును హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. చిగురు ముడత తెగులుపై సీనియర్ శాస్త్రవేత్త మనీశ్ పాండే నేతృత్వంలో గంగశెట్టి ప్రకాశ్, ఇతర శాస్త్రవేత్తలు విస్తృతస్థాయిలో పరిశోధనలు చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పల్సెస్ రీసెర్చ్(యూపీ), డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(బిహార్), ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(అసోం)ల సహకారంతో కంది సంప్రదాయ రకాలైన 'ఆశ, మారుతి'లపై ప్రయోగాలు జరిపి... చివరికి 'ఆశ' రకంలో ఈ తెగులును నిరోధించే జన్యువును గుర్తించారు. దానికి సీసీఎస్ ఎండీ04 అని పేరు పెట్టారు. దీని ద్వారా దేశం పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధిని సాధిస్తుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సెలవులు వాడుకొని తీర్పులు పూర్తిచేయండి

ఝార్ఖండ్ హైకోర్టు జడ్జీలకు సుప్రీం సూచన

దిల్లీ: ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తులు తమకున్న సెలవుల్ని వాడుకొని పెండింగ్ తీర్పుల రచనను పూర్తి చేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం సూచించింది. పెండింగ్ పనుల పూర్తికి సెలవులు వాడుకోండని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వారిని కోరింది. "61 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజలకు తీర్పులు కావాలి, న్యాయశాస్త్ర సిద్ధాంతాలు కాదు. కక్షిదారుడు కోరుతున్న ఊరటను ఇవ్వగలమా లేదా అన్నది తెలుస్తూ హేతుబద్ధమైన ఆదేశాలు ఇవ్వండి" అని ధర్మాసనం ఝార్ఖండ్ హైకోర్టు తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అజిత్ సిన్హాకు తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తులు తక్షణం చర్యలు తీసుకోవాలి. మూడు నెలల తర్వాత ఈ అంశాన్ని తిరిగి సమీక్షిద్దాం. ఈలోగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకోండి, అని ధర్మాసనం ఆదేశించింది. హోమ్‌గార్డుల నియామకాలకు సంబంధించి ఝార్ఖండ్ హైకోర్టు 2023 నుంచీ ఎలాంటి తీర్పులు వెలువరించలేదని ఫిర్యాదు చేస్తూ కొందరు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరుపుతూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా 28న ప్రతిజ్ఞ దినం: వామపక్ష పార్టీలు


ఈనాడు, అమరావతి: విద్యుత్తు భారాలు, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా విద్యుత్తు ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినమైన ఈ నెల 28ని ప్రతిజ్ఞ దినంగా పాటించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు విజయవాడలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వామపక్ష పార్టీల నేతలు సమావేశమై తీర్మానించారు. "ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముగ్గురు అమరులై 25 ఏళ్లు కావస్తోంది. ఆ ఉద్యమ ఫలితంగా దాదాపు రెండు దశాబ్దాల పాటు విద్యుత్తు ఛార్జీల పెంపునకు ఏ ప్రభుత్వమూ సాహసించలేదు. కానీ, వైకాపా ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రజలపై వేసిన రూ.వేల కోట్ల భారాలను రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అదే విధానాలను కొనసాగిస్తోంది" అని వామపక్ష పార్టీలు ఆరోపించాయి.

ఏపీలో 45 అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు అనుమతి

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల మిషన్ కింద ఆంధ్రప్రదేశ్‌కు 45 అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు మంజూరు చేసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేష్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. 2021-22 నుంచి 2025-26వరకు కేటాయించిన 191 మందిర్‌లకు అదనంగా వీటికి అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

ఈనాడు సినిమా

జడల్... హడల్


నాని

నరకంలోకి నడిచి దాన్ని స్వర్గంగా మార్చేశాడంటూ 'ది ప్యారడైజ్' సినిమాలోని కథా నాయకుడి పాత్రని పరిచయం చేశారు శ్రీకాంత్ ఓదెల. ఆయన దర్శకత్వంలో నాని కథా నాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నాని లుక్‌ని విడుదల చేయడంతోపాటు, ఆయన పోషిస్తున్న పాత్ర వివరాల్ని వెల్లడించింది చిత్ర బృందం. లుక్‌లో రెండు జడలతో కనిపిస్తున్నారు నాని. ఇందులో ఆయన పాత్ర పేరు కూడా జడల్ అని చిత్రబృందం తెలిపింది. లుక్‌లో కత్తులు, బుల్లెట్లు, బ్లేడ్‌లతోపాటు నాని రూపం హడలెత్తించేలా ఉంది. విజయవంతమైన 'దసరా' తర్వాత నాని - శ్రీకాంత్ ఓదెల - సుధాకర్ చెరుకూరి కలిసి చేస్తున్న చిత్రమిది. హైదరాబాద్ - సికింద్రాబాద్ నేపథ్యంలో, ఓ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కీలక పాత్రని పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

డబ్బింగ్ పూర్తిచేసిన బాలకృష్ణ


బాలకృష్ణ, బోయపాటి శ్రీను

'అఖండ 2: తాండవం'తో దసరా బరిలో సందడి చేయనున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథా నాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని బోయపాటి శ్రీను తెరకెక్కించారు. ఎం తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మించారు. సంయుక్తా మేనన్ కథా నాయిక. ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా సెప్టెంబరు 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే నిర్మాణానంతర పనుల్ని చకచకా పూర్తి చేసే పనిలో పడింది చిత్రబృందం. దీనిలో భాగంగా బాలకృష్ణ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్‌ను పూర్తి చేసినట్లు చిత్ర వర్గాలు శుక్రవారం ప్రకటించాయి. సీజీ వర్క్, రీ రికార్డింగ్‌తో పాటు మిగతా సాంకేతిక పనులన్నీ నెలాఖరు కల్లా పూర్తవుతాయని వెల్లడించాయి. ఇప్పటికే చెప్పిన తేదీకే సినిమా విడుదల కానున్నట్లు మరోసారి స్పష్టత ఇచ్చింది చిత్రబృందం. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న ఈ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌లో బాలయ్య రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: సి.రాంప్రసాద్, సంతోశ్ డిటాకే.


అమ్మాయిల గౌరవాన్ని పెంచేలా... 'కానిస్టేబుల్ కనకం'

- ఈ నెల 14న ఈటీవీ విన్‌లో విడుదల


నితిన్, ప్రశాంత్, వర్ష, శ్రీనివాస్ అవసరాల, సత్య సాయిబాబా, హేమంత్ కుమార్, సాయికృష్ణ

'ఆడపిల్ల అబల కాదు సబల' అనే మాటని మేమంతా బలంగా నమ్మి చేసిన సిరీస్ ఇదనీ... ఈ కథ ప్రతి అమ్మాయి గౌరవాన్ని పెంచేలా ఉంటుందన్నారు వర్ష బొల్లమ్మ. ఆమె ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో రూపొందిన సిరీస్ ఇది. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. మేఘలేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలకపాత్రలు పోషించారు. ఆగస్టు 14 నుంచి ఈటీవీ విన్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ట్రైలర్‌ని విడుదల చేశారు. శుక్రవారం చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ "ఈటీవీ విన్ కుటుంబంలో భాగం అయ్యానని చెప్పుకోవడం గర్వంగా ఉంది. గొప్ప కథతో రూపొందిన సిరీస్ ఇది. చూసుకున్న తర్వాత నాకు ఆనందంతో మాటలు రాలేదు. రాజీవ్ కనకాల, అవసరాల శ్రీనివాస్ తదితరులతో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ కథని నాకంటే ఎక్కువగా నమ్మారు సాయికృష్ణ, నితిన్. వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఈ సిరీస్ ఉంటుంది. వర్ష, మేఘతో పాటు ఇతర నటులంతా మంచి అభినయం ప్రదర్శించారు. సురేశ్ బొబ్బిలి సంగీతం ప్రధానబలం" అన్నారు. "చాలా రోజుల తర్వాత మహిళా ప్రధానమైన కథ ప్రేక్షకుల ముందుకొస్తుండడం ఆనందంగా ఉంది. ఇలాంటి కథలు వస్తూనే ఉండాలి. ఇందులో ఓ విభిన్నమైన పాత్రలో కనిపిస్తాన"న్నారు అవసరాల శ్రీనివాస్. మరో మంచి పాత్రలో నటించానని చెప్పారు రాజీవ్ కనకాల. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ మాట్లాడుతూ "ఈటీవీ విన్ జూన్ నుంచి ప్రతి నెలా ఒక విజయం అందుకొంటోంది. సదరన్ ఓటీటీ పరిశ్రమలో ఇలాంటి విజయాలు రావడం ఇదే తొలిసారి. ఇది అందరి గొప్పతనం. మా ప్రయత్నాన్ని మెచ్చి ముందుకొచ్చి ప్రోత్సహించారు చిరంజీవి. ఆయన సహకారం మరిచిపోలేం. ఈ నెల 14న దర్శనాలు మొదలవుతాయి, పూనకాలు రాబోతున్నాయి" అన్నారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ "ఈటీవీ విన్‌లో వస్తున్న మొట్ట మొదటి క్రైమ్ థ్రిల్లర్ కథ ఇది. మళ్లీ మళ్లీ చూసేలా ఉంటుంది. ఈ నెల 14న రెండు పెద్ద సినిమాలు వస్తున్నాయి. వాటిని థియేటర్లో చూడండి, ఈ సిరీస్‌ని ఇంట్లో చూసి ఆస్వాదించండి" అన్నారు. ఈ కార్యక్రమంలో మేఘలేఖ, సుచిత్రతోపాటు ఇతర నటులు, సాంకేతిక బృందం పాల్గొంది.

కనకావతి @ 'కాంతార 1'


రుక్మిణీ వసంత్

కనకావతిగా సినీ ప్రియుల్ని పలకరించేందుకు సిద్ధమవుతోంది నటి రుక్మిణీ వసంత్. 'కాంతార: చాప్టర్ 1' కోసమే ఆమె ఈ పాత్రలోకి మారింది. రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. విజయవంతమైన 'కాంతార' సినిమాకి ప్రీక్వెల్‌గా హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. శుక్రవారం ఈ చిత్రం నుంచి రుక్మిణి పాత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో యువరాణి తరహాలో కనకావతి పాత్రలో ఆమె కనిపించిన తీరు ఆసక్తి రేకెత్తించింది. కదంబ కాలం నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అజనీశ్ లోక్‌నాథ్ సంగీతమందిస్తున్నారు.

వాన జల్లులో పరమ్ సుందరి


జాన్వీ కపూర్


బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా వర్షపు జల్లులలో చిందులేస్తూ ప్రేమ పాటలు పాడుతున్నారు. ఇదంతా వీరిద్దరూ జంటగా నటించిన 'పరమ్ సుందరి' సినిమా కోసమే ఇదంతా. తుషార్ జలోటా దర్శకత్వం వహించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఇప్పుడు మరో పాటను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్రబృందం. 'భీగీ సారీ..' అంటూ సాగుతున్న ఈ గీతంలో జాన్వీ, సిద్ధార్థ్‌ల కెమిస్ట్రీ, స్టెప్పులు అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా జాన్వీ మాట్లాడుతూ.. "వర్షం నేపథ్యంలో రూపొందే పాటలు సినిమాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటాయి. వాటికి ఉండే మాయాజాలమే వేరు. బాలీవుడ్‌లో ఇలాంటి ఎన్నో అద్భుతమైన గీతాల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడీ వర్షం నేపథ్యంలోని పాటలో నేనూ భాగం కావడం ఆనందంగా ఉంద"ని చెప్పుకొచ్చింది. అద్నాన్ సామి, శ్రేయా ఘోషల్ ఆలపించారు. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది.

టొరంటో చిత్రోత్సవాల్లో 'గాంధీ'


ప్రతీక్ గాంధీ

మహాత్ముడి జీవితంపై ఇప్పటికే పలు చిత్రాలు, సిరీస్‌లు రూపొంది ప్రేక్షకుల్ని అలరించాయి. ఇప్పుడు మరో కథ మెప్పించడానికి సిద్ధమైంది. ప్రతీక్ గాంధీ ప్రధాన పాత్రలో నటిస్తున్న వెబ్‌సిరీస్ 'గాంధీ'. హన్సల్ మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. తాజాగా ఈ సిరీస్ టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) 2025కు ఎంపికైంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు ప్రతీక్ గాంధీ. "మేమెంతో ఇష్టంగా రూపొందించిన సిరీస్ ఇది. ఇప్పుడీ సిరీస్‌ను 50వ టొరంటో చిత్రోత్సవాల్లో ప్రదర్శించడం గౌరవంగా ఉంది. ఇందులో కస్తూర్బా పాత్ర పోషిస్తున్న నా భార్య భామినితో తొలిసారి కలిసి నటించడం మరింత ప్రత్యేకమైనద"ని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. స్వాతంత్ర్య కాలం నాటి పోరాటంను ఇందులో చూపించనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 4 నుంచి టొరంటో చిత్రోత్సవాలు మొదలుకానున్నాయి.

దురాశ X త్యాగం


సుధీర్ బాబు

ఓ దుష్టశక్తి దురాశకు.. దైవం అండగా త్యాగానికి సిద్ధపడ్డ లోక రక్షకుడికి మధ్య జరిగే పోరాటాన్ని 'జటాధర'తో తెరపై చూపించేందుకు సిద్ధమవుతున్నారు సుధీర్‌బాబు. ఆయన, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించారు. ఉమేశ్ కుమార్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను కథానాయకుడు ప్రభాస్ శుక్రవారం విడుదల చేశారు. ఇతిహాసాలతో ముడిపడి ఉన్న సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. దురాశ - త్యాగం, చీకటి - దైవత్వం మధ్య జరిగే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉండనుంది. ఇందులో లోక రక్షకుడిగా సుధీర్ బాబు పాత్రను చూపించిన తీరు.. దుష్టశక్తిగా సోనాక్షి పాత్రను మలిచిన విధానం ఆసక్తిరేకెత్తించాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమాని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

మావ పిల్లనిస్తానంటే...!


నాగశౌర్య, విధి

'నా మావ పిల్లనిత్తానన్నాడే...' అంటూ సందడిని షురూ చేశాడు నాగశౌర్య. ఇదంతా ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'బ్యాడ్ బాయ్ కార్తీక్' సినిమా కోసమే! రామ్ దేశిన (రమేశ్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. విధి కథానాయిక. సముద్రఖని, నరేశ్ కీలకపాత్రలు పోషించారు. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'నా మావ పిల్లనిత్తానన్నాడే...' అంటూ సాగే పాటని శుక్రవారం విడుదల చేశారు. హారిస్ జైరాజ్ స్వరకల్పనలోని ఈ పాటని కాసర్ల శ్యామ్ రచించగా, కారుణ్య, హరిప్రియ ఆలపించారు. హుషారైన డ్యాన్స్, నాయకానాయికల మధ్య ఆకట్టుకునే కెమిస్ట్రీతో సాగుతున్న ఈ పాటకి సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోందని సినీ వర్గాలు చెప్పాయి. సాయి కుమార్, వెన్నెల కిశోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్.

థ్రిల్ చేసే బుల్లెట్టు బండి

రాఘవ లారెన్స్ హీరోగా ఇన్నాసి పాండియన్ తెరకెక్కించిన చిత్రం 'బుల్లెట్టు బండి'. కతిరేసన్ నిర్మించారు. వైశాలి రాజ్ కథానాయిక. 80, 90ల్లో డ్రీమ్ గర్ల్‌గా వెలుగొందిన డిస్కో శాంతి 28ఏళ్ల తర్వాత ఈ సినిమాతో తిరిగి తెరపైకి అడుగు పెడుతున్నారు. ఈ చిత్ర టీజర్‌ను హీరో నాగచైతన్య శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇన్నాసి పాండియన్ మాట్లాడుతూ. . "ఇదొక భిన్నమైన సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్. చెన్నై, కేరళలోని పలు అందమైన లోకేషన్లలో చిత్రీకరణ జరిపాం. ఇది తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు. ఈ సినిమాలో ఎల్విన్ లారెన్స్, సునీల్, కాళీ వెంకట్, అరవింద్ ఆకాశ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సామ్ సి.ఎస్ సంగీతమందించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు.


ఎల్విన్ లారెన్స్, రాఘవ లారెన్స్

ప్రేమ.. వారసత్వం


రాజీవ్ కనకాల, శివ కందుకూరి

'చాయ్ వాలా'గా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు శివ కందుకూరి. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రమోద్ హర్ష తెరకెక్కిస్తున్నారు. రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్ పాపుడిప్పు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రాజీవ్ కనకాల కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. "ప్రేమ, వారసత్వం అనే అంశాల చుట్టూ తిరిగే కథ ఇది. కలలు, భావోద్వేగాలతో నిండిన అద్భుతమైన ప్రయాణంగా ఉంటుంది. త్వరలో టీజర్‌ను విడుదల చేస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఆ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా మారడమే జీవితం!


సంతోశ్ శోభన్, మానస

సంతోశ్ శోభన్ హీరోగా అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో అజయ్ కుమార్ రాజు నిర్మిస్తున్నారు. మానస వారణాసి కథానాయిక. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. సరైన ఉద్యోగం లేక చెన్నై నగరంలో ఇబ్బందులు పడే ఓ కుర్రాడి కథ ఇది. ఓ బైక్ జర్నీలో తను ప్రీతి అనే అమ్మాయితో ప్రేమలో పడటాన్ని టీజర్‌లో చూపించారు. "ఒకప్పటి సాధారణ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా మారడమే జీవితం" అంటూ ఆఖర్లో ఇచ్చిన క్యాప్షన్ చిత్ర కథేంటన్నది తెలియజేస్తోంది. ఈ మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఈ చిత్రానికి సంగీతం: ఆదిత్య రవీంద్రన్, ఛాయాగ్రహణం: దినేశ్ పురుషోత్తమన్.

'పెళ్లిలో పెళ్లి'... ఆ మలుపేమిటో!

"ఈ కథలోని మలుపేమిటన్నది నిర్మాతనైనా నాకూ చెప్పలేదు దర్శకుడు. అందరితోపాటే నేనూ థియేటర్‌లో చూడాలనుకున్నా" అన్నారు గణేశ్ కోలి. ఆయన గౌరి ఫిల్మ్స్‌తో కలిసి సుఖకర్త ఫిల్మ్స్ పతాకంపై నిర్మించిన చిత్రం 'పెళ్లిలో పెళ్లి'. శివ సాయి రిషి, సంస్కృతి గోరే, విష్ణు ప్రియ, ఉమా మహేశ్వరరావు, తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీకాంత్ సంబరం దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల హైదరాబాద్‌లో టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సినీ ప్రముఖులు ఆకాశ్ పూరి, తనికెళ్ల భరణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "షోలాపూర్ నేపథ్యంలో సాగే కథ ఇది. మేం మహారాష్ట్రలో ఉంటాం కానీ, తెలుగు భాషని అభిమానిస్తాం. తెలుగు సినిమాల్ని చూస్తుంటాం. మన వైన కుటుంబ కథా చిత్రాల్ని ఎంతగానో ఇష్టపడతాం. ఆ అభిరుచితోనే ఈ సినిమాని నిర్మించా. ఈ కథలోని మలుపే అత్యంత ఆసక్తికరం. అదేమిటో తెరపైనే చూడాలి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మా అందరికీ ఈ సినిమా ఒక భావోద్వేగ ప్రయాణం. అది ప్రేక్షకుల హృదయాల్నీ తాకుతుందనే నమ్మకం మాకుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.



తనికెళ్ల భరణి, ఆకాశ్

చిత్రీకరణలు వద్దు

- ఛాంబర్ ఆదేశాలు

సినిమాల చిత్రీకరణలు పూర్తిగా నిలిపివేయాలని, సినీ కార్మిక సంఘాల నాయకులతోనూ వ్యక్తిగతంగా ఎవ్వరూ సంప్రదింపులు జరపొద్దంటూ తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి నిర్మాతలకి కీలక ఆదేశాలు జారీ చేసింది. స్టూడియోలు, ఔట్‌డోర్ యూనిట్స్ కూడా సేవలన్నింటినీ నిలిపివేయాలని కోరింది. ఆ మేరకు నిర్మాతలకి స్టూడియో యాజమాన్యాలకి మండలి సందేశాల్ని పంపింది. తెలుగు సినీ పరిశ్రమలోని 24 విభాగాల యూనియన్లు ఏకపక్షంగా సమ్మెకు పిలుపునివ్వడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. సినీ కార్మికుల వేతనాల్ని 30% పెంచాలంటూ సినీ కార్మిక సమాఖ్య (ఫిల్మ్ ఫెడరేషన్) పట్టుబట్టడం, నిర్మాతలు అందుకు ఒప్పుకోకపోవడంతో చిత్ర పరిశ్రమలో ప్రతిష్టంభన నెలకొంది. ఈ విషయంపైనే నిర్మాతలకీ, కార్మిక సమాఖ్యకీ మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ సమస్యని పరిష్కరించేందుకు వీరశంకర్ నేతృత్వంలో కో - ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటైంది.

ఈనాడు బిజినెస్

ఎస్‌బీఐ లాభం రూ.21,201 కోట్లు

కలిసొచ్చిన ట్రెజరీ, ఫారెక్స్ ఆదాయాలు

దిల్లీ: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఫలితాల్లో రాణించింది. జూన్ త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన నికర లాభం 9.71% వృద్ధితో రూ.21,201 కోట్లుగా నమోదైంది. ఇందుకు ట్రెజరీ, ఫారెక్స్ ఆదాయాలు కలిసొచ్చాయి. స్టాండలోన్ పద్ధతిన బ్యాంకు నికర లాభం రూ.17,035 కోట్ల నుంచి రూ.19,160 కోట్లకు పెరిగింది.



చల్లా శ్రీనివాసులు శెట్టి

రెపో రేటు తగ్గింపుతో ఎన్ఐఎంపై ప్రభావం: ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 0.33% తగ్గి 3.02 శాతానికి చేరింది. దీంతో నికర వడ్డీ ఆదాయం 0.13% వృద్ధి రూ.41,072 కోట్లకు పరిమితమైంది. ప్రస్తుత జులై-సెప్టెంబరు త్రైమాసికంలోనూ సవాళ్లు ఉండొచ్చు. 2025-26 మొత్తంమీద 3% ఎన్ఐఎమ్‌ను లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. వడ్డీయేతర ఆదాయం 55% పెరిగి రూ.17,346 కోట్లకు పెరగడంతో, బ్యాంక్ లాభాల్లో వృద్ధి సాధ్యమైంది. రుణ వృద్ధి అంచనాను 12 శాతంగా కొనసాగిస్తున్నట్లు శెట్టి పేర్కొన్నారు.

✦ స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.21% నుంచి 1.83 శాతానికి, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.57% నుంచి 0.47 శాతానికి మెరుగయ్యాయి.

ఐటీలో లేఆఫ్‌లు, ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం లేదు: 'అమెరికా టారిఫ్‌లతో ప్రభావితమయ్యే 4-5 రంగాల సంస్థలకు బ్యాంకు రుణాలిచ్చినప్పటికీ.. మొత్తం రుణాల్లో వాటి వాటా 2% లోపే ఉంది. కాబట్టి బ్యాంకుపై పెద్ద ప్రభావం ఉండబోద'ని శెట్టి తెలిపారు. ఐటీ రంగంలో ఉద్యోగులకు లేఆఫ్‌ల ప్రభావం కూడా తమపై పడదన్నారు. తమ వ్యక్తిగత రుణాల్లో అధిక భాగం ప్రభుత్వ ఉద్యోగులవేనని స్పష్టం చేశారు.

పీఎస్‌బీల రికార్డు లాభం

ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లు కలిసి జూన్ త్రైమాసికంలో రూ.44,218 కోట్ల రికార్డు స్థాయి లాభాన్ని నమోదు చేశాయి. 2024-25 ఇదే సమయంలోని రూ.39,974 కోట్లతో పోలిస్తే ఇది 11% అధికం. మొత్తం బ్యాంకుల లాభాల్లో 48% వాటా ఎస్‌బీఐ ఒక్కటే అందించడం విశేషం. తొలి త్రైమాసికంలో పీఎన్‌బీ మినహా మిగతా అన్ని బ్యాంకుల లాభాలు పెరిగాయి. అత్యధికంగా ఐఓబీ 76% వృద్ధిని సాధించింది.

టాటా మోటార్స్ లాభంలో 62% క్షీణత



దిల్లీ: టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.4,003 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.10,587 కోట్లతో పోలిస్తే ఇది 62.2% తక్కువ. అన్ని విభాగాల్లో అమ్మకాలు తగ్గడం కారణం. అమెరికా టారిఫ్‌ల కారణంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) లాభాలు తగ్గడమూ ప్రభావం చూపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,07,102 కోట్ల నుంచి రూ.1,04,407 కోట్లకు తగ్గింది. 'అమెరికా టారిఫ్‌లపై స్పష్టత రావడంతో పాటు, పండగల గిరాకీ పుంజుకుంటే.. రాబోయే రోజుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం. వచ్చే త్రైమాసికాల్లో కంపెనీ (వాణిజ్య-ప్రయాణికుల వాహన విభాగాలుగా) విభజన పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం మరింత కీలకం అవుతుంద'ని కంపెనీ సీఎఫ్ఓ పీబీ బాలాజీ పేర్కొన్నారు.

జేఎల్ఆర్‌పై టారిఫ్‌ల ప్రభావం

ఏప్రిల్- జులైలో జేఎల్ఆర్ ఆదాయాలు 9.2% తగ్గి 6.6 బిలియన్ పౌండ్లకు పరిమితమయ్యాయి. బ్రిటన్, ఐరోపాలో ఉత్పత్తి అయిన కార్లపై అమెరికా సుంకాలు విధించడం ప్రతికూల ప్రభావం చూపింది. అయితే బ్రిటన్- అమెరికా, ఐరోపా సమాఖ్య-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరినందున, రాబోయే త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలు రావొచ్చని కంపెనీ ఆశిస్తోంది.

దేశీయంగా అమ్మకాలు తగ్గాయి

ఏప్రిల్-జూన్‌లో దేశీయంగా ప్రయాణికుల వాహనాల (పీవీ) అమ్మకాలు ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 10.1% తగ్గి 1,24,800కు చేరాయి. ఆల్ట్రోజ్, హ్యారియర్, సఫారీ మోడళ్లలో మార్పుల కోసం, ఆయా వాహనాల అమ్మకాలు నిలిపివేయడం ఇందుకు కారణమయ్యాయి. పరిశ్రమ వ్యాప్తంగా కూడా అమ్మకాలు తగ్గడాన్ని సంస్థ గుర్తు చేసింది. వాణిజ్య వాహన అమ్మకాలు 6% తగ్గి 88,000కు చేరాయి. టాటా మోటార్స్, జేఎల్ఆర్ విద్యుత్ వాహనాల ఉత్పత్తిపై అరుదైన భూ అయస్కాంతాల కొరత ప్రభావం లేదని, సమీప భవిష్యత్తులో కూడా ఉండకపోవచ్చని పీబీ బాలాజీ అంచనా వేశారు.

విక్రమ్-1 రాకెట్ మూడో దశ పరీక్ష విజయవంతం: స్కైరూట్



ఈనాడు, హైదరాబాద్: విక్రమ్-1 అనే తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్న స్కైరూట్ ఏరోస్పేస్, మరొక మైలురాయిని అధిగమించింది. విక్రమ్-1 రాకెట్ మూడో దశ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపింది. కలాం-100 పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం 102 సెకన్ల పాటు కొనసాగింది. అత్యాధునిక ఫ్లెక్స్ నాజిల్‌తో కూడిన ఈ రాకెట్ 60 ఇన్ ఫ్లైట్ ఆపరేటింగ్ ఏరియా నిష్పత్తితో 100 కేఎన్ వాక్యూమ్ థ్రస్ట్‌ను సాధించింది. విక్రమ్-1 రాకెట్ ఫ్లైట్ ఏవియానిక్స్ సూట్, ఆటోమ్యాటిక్ లాంచ్ కంప్యూటర్, మిషన్ కంప్యూటర్ (చిప్‌సెట్ మినహా)లను సొంతంగా అభివృద్ధి చేసినట్లు స్కైరూట్ వెల్లడించింది. ఈ ప్రయోగాన్ని నాగ్‌పుర్‌లోని సోలార్ గ్రూపునకు చెందిన కేంద్రంలో నిర్వహించారు.

ఎన్ఎస్‌డీఎల్ షేరు లాభాల వర్షం

3 రోజుల్లోనే పెట్టుబడిలో సగానికి పైగా ప్రతిఫలం

దిల్లీ: మదుపర్లపై నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) షేర్లు లాభాల వర్షం కురిపిస్తున్నాయి. బుధవారం బీఎస్ఈలో నమోదైన ఈ సంస్థ షేరు ఆ రోజు 17% పెరగ్గా.. గురువారమూ 20% లాభం ఆర్జించింది. శుక్రవారం కూడా బీఎస్ఈలో 15.77% పెరిగి రూ.1300.30 వద్ద ముగిసింది. ఇష్యూ ధర (రూ.800)తో పోలిస్తే మూడు రోజుల్లోనే ఈ సంస్థ షేరు 62.5% పెరిగింది. దీంతో ఐపీఓలో దరఖాస్తు చేసుకుని, షేర్లు పొందిన వారికి.. 3 రోజుల్లోనే తమ పెట్టుబడిలో సగానికి పైగా వెనక్కి వచ్చినట్లయ్యింది. స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన ధర (రూ.880)తో పోల్చినా కూడా 47.20% ప్రతిఫలాన్ని ఎన్ఎస్‌డీఎల్ షేరు పంచింది.

జవాబుదారీతనానికి సారథులుగా స్వతంత్ర డైరెక్టర్లను చూడాలి

సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే

దిల్లీ: స్వతంత్ర డైరెక్టర్ల పాత్రను పునఃనిర్వచించాల్సిన అవసరం ఉందని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. జవాబుదారీతనానికి సారథులుగా వాళ్లను మనం చూడాలని ఇక్కడ జరిగిన ఓ సదస్సులో ఆయన పేర్కొన్నారు. 'గౌరవ నియామకం పొందిన వారుగానో లేదంటే స్నేహపూర్వక విమర్శకులుగానో వాళ్లను చూడటాన్ని ఆపేసి.. జవాబుదారీతనానికి సారథులుగా వాళ్లను మనం పరిగణించాల'ని వివరించారు. స్వతంత్ర డైరెక్టర్లు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడంలో సంకోచించకూడదని అన్నారు. కృత్రిమ మేధ పాలన, సైబర్ దాడులు, పర్యావరణ- సామాజిక- పాలనా (ఈఎస్‌జీ) అంశాల వెల్లడికి సంబంధించి పొంచి ఉండే ముప్పులపై వాళ్లు బాగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

కోడి గుడ్లు



9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	450
వరంగల్	452
విజయవాడ	500
గోదావరి	490
విశాఖపట్నం	500
చిత్తూరు	513

ఎన్ఏసీఎల్ ఎండీగా రఘురామ్ దేవరకొండ

బోర్డులోకి నటరాజన్ శ్రీనివాసన్, శంకర సుబ్రమణియన్



ఈనాడు, హైదరాబాద్: ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్‌లో 53% వాటాను కోరమాండల్ ఇంటర్నేషనల్ సొంతం చేసుకుంది. ఎన్ఏసీఎల్ ప్రమోటర్ల నుంచి వాటా కొనుగోలు కోసం కొంతకాలం క్రితం చేసుకున్న ఒప్పంద ప్రక్రియ పూర్తయినట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ శుక్రవారం వెల్లడించింది. సెబీ నిబంధనల ప్రకారం ఎన్ఏసీఎల్ సాధారణ వాటాదార్ల నుంచి 26% వాటా కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ఇచ్చామని, ఇది కొనసాగుతుందని పేర్కొంది. దీంతో పాటు ఎన్ఏసీఎల్ బోర్డులో మార్పులు చోటుచేసుకున్నాయి. నటరాజన్ శ్రీనివాసన్, ఎస్. శంకర సుబ్రమణియన్, రఘురామ్ దేవరకొండ ఎన్ఏసీఎల్ బోర్డులో డైరెక్టర్లుగా చేరారు. ఈ కంపెనీకి ఎండీ, సీఈఓగా రఘురామ్ దేవరకొండను నియమించారు. గతంలో కోరమాండల్ ఇంటర్నేషనల్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రఘురామ్ పని చేశారు. మురుగప్పా కుటుంబంలోకి ఎన్ఏసీఎల్‌ను సంతోషంగా ఆహ్వానిస్తున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ అలగప్పన్ అన్నారు. వ్యవసాయ రంగానికి ఎరువులు, క్రిమిసంహారక మందులతో పాటు అన్ని రకాల సేవలు అందించటానికి దీర్ఘకాలిక వ్యూహంతో ఎన్ఏసీఎల్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిపారు. కొత్త నాయకత్వంలో ఎన్ఏసీఎల్ మంచి ఫలితాలు సాధిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సీక్వెంట్ సైంటిఫిక్, వియాష్ విలీనంపై 30న వాటాదార్ల సమావేశం

ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు



ఈనాడు, హైదరాబాద్: స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన సీక్వెంట్ సైంటిఫిక్, హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న వియాష్ లైఫ్ సైన్సెస్ విలీనం విషయంలో కీలక ముందడుగు పడింది. రెండు సంస్థల విలీనానికి వాటాదార్ల అనుమతి తీసుకోవటం కోసం ఈనెల 30న అసాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇదే సమావేశంలో అన్‌సెక్యూర్డ్ రుణదాతలు కూడా పాల్గొని, విలీనానికి ఆమోదముద్ర వేయాలని ఎన్‌సీఎల్‌టీ (జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్) ఆదేశాలు ఇచ్చింది. అన్నీ పూర్తయితే ఎన్‌సీఎల్‌టీ నుంచి తుది ఆదేశాలు వస్తాయి. మొత్తం మీద ఇరు సంస్థల విలీన ప్రక్రియ ఈ సంవత్సరాంతంలో పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ 2 కంపెనీల విలీనాన్ని గత ఏడాది సెప్టెంబరులో ప్రకటించినప్పుడే, ఇందుకు 12-15 నెలల సమయం పడుతుందని వెల్లడించడం గమనార్హం. విలీనం తర్వాత ఇంకా మెరుగైన ఫలితాలు నమోదు చేయగలమని సీక్వెంట్ సైంటిఫిక్ ధీమా వ్యక్తం చేస్తోంది.

✦ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సీక్వెంట్ సైంటిఫిక్ ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.441.4 కోట్ల ఆదాయంపై రూ.17.6 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.390.2 కోట్లు, నికరలాభం రూ.9.1 కోట్లే నమోదయ్యాయి. దీంతో పోల్చితే ఆదాయం 13.1%, నికరలాభం 94% పెరిగాయి. వర్ధమాన దేశాల్లో సంస్థ అధిక వృద్ధి నమోదు చేసింది.

✦ వియాష్ లైఫ్ జూన్ త్రైమాసికానికి రూ.352.7 కోట్ల ఆదాయం, రూ.19.3 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంతో పోల్చితే ఆదాయం 3.7% పెరిగింది.

✦ రెండు కంపెనీలు కలిసి జూన్ త్రైమాసికానికి రూ.794.1 కోట్ల ఆదాయాన్ని, రూ.36.9 కోట్ల నికరలాభాన్ని ఆర్జించాయి. ఎబిటా రూ.129 కోట్లు, ఎబిటా మార్జిన్ 16.2 శాతంగా ఉన్నాయి.

✦ రెండు కంపెనీల విలీన ప్రక్రియ అనుకున్న ప్రకారమే సాగుతోందని సీక్వెంట్ సైంటిఫిక్ ఎండీ, సీఈఓ రాజారాం నారాయణన్ అన్నారు. పరిశోధన- అభివృద్ధి, ఉత్పత్తి కార్యకలాపాల్లో రెండు కంపెనీలకు ఉన్న సామర్థ్యాలను గరిష్ఠంగా ఉపయోగించుకునే అవకాశాలు దీనివల్ల కలుగుతాయని వివరించారు.

రాంకీ ఇన్‌ఫ్రా లాభం రూ.77 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జూన్ త్రైమాసికానికి ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.379 కోట్ల ఆదాయం, రూ.77 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.569 కోట్లు, నికర లాభం రూ.71 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం తగ్గినా, నికరలాభం పెరిగింది. కొన్ని సవాళ్లు ఎదురైనా మెరుగైన ఫలితాలు సాధించినట్లు రాంకీ ఇన్‌ఫ్రా ఎండీ వై.ఆర్.నాగరాజ తెలిపారు. భవిష్యత్తులో స్థిరమైన వృద్ధి సాధనకు గట్టి పునాదులు వేస్తున్నామని, ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

తాజ్‌జీవీకే లాభం రూ.36.22 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఆతిథ్య రంగంలోని తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.128.29 కోట్ల ఆదాయాన్ని, రూ.36.22 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.94.70 కోట్లు, లాభం రూ.12.71 కోట్లుగా ఉన్నాయి. రాబోయే త్రైమాసికాల్లో మంచి ఫలితాలు నమోదు చేసేందుకు అవకాశం ఉందని సంస్థ ఛైర్మన్ జీవీకే రెడ్డి తెలిపారు.

విస్తరణ ప్రణాళికల్లో పిరమాల్ ఫైనాన్స్

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) పిరమాల్ ఫైనాన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మరింత విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తోంది. రెండు రాష్ట్రాల నుంచి రుణాలకు గిరాకీ పెరుగుతోందని పిరమాల్ ఫైనాన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ జగదీప్ మల్లారెడ్డి అన్నారు. తెలంగాణలోని 23 నగరాల్లో 29 శాఖలున్నాయని, వీటిని పెంచబోతున్నట్లు తెలిపారు. మొత్తం వ్యాపారంలో తెలంగాణ వాటా 10 శాతమని, ఇక్కడ దాదాపు రూ.5,200 కోట్ల మేరకు పోర్ట్‌ఫోలియో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 30 శాఖలున్నాయని, రూ.2,657.5 కోట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఎక్కువ మంది రూ.10-30 లక్షల రుణాలు తీసుకుంటున్నారని సంస్థ మార్కెటింగ్ హెడ్ అర్వింద్ అయ్యర్ అన్నారు. సిబిల్ ఆధారంగా కాకుండా, రుణగ్రహీతల వ్యాపార కార్యకలాపాలు, కుటుంబ ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రాసిమ్ లాభంలో 34% వృద్ధి

దిల్లీ: గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ఏప్రిల్- జూన్‌లో రూ.2,767.08 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,065.97 కోట్లతో పోలిస్తే ఇది 33.9% ఎక్కువ. సిమెంట్, రసాయనాల వ్యాపారాలు రాణించడం ఇందుకు కలిసొచ్చిందని కంపెనీ తెలిపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.34,609.75 కోట్ల నుంచి 15.9% వృద్ధి చెంది రూ.40,118.08 కోట్లుగా నమోదైంది. ఏకీకృత ఎబిటా 36% పెరిగి రూ.6,430 కోట్లుగా ఉంది. మొత్తం వ్యయాలు 13.9% అధికమై రూ.36,656.89 కోట్లకు చేరాయి. మొత్తం ఆదాయం 15.89% పెరిగి రూ.40,460.18 కోట్లకు చేరింది. స్టాండలోన్ ప్రాతిపదికన.. కార్యకలాపాల ఆదాయం 33.8% వృద్ధితో రూ.9,223.13 కోట్లకు పెరిగింది.

వంటగ్యాస్ సబ్సిడీ కింద రూ.30,000 కోట్లు



దిల్లీ: వాస్తవ ధర కంటే వంటగ్యాస్ సిలిండర్లను తక్కువకు విక్రయిస్తూ, నష్టపోతున్న ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు రూ.30,000 కోట్ల పరిహారం అందించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గత 15 నెలలుగా నష్టపోతున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) కార్పొరేషన్లను ఈ నిధులు 12 విడతలుగా అందనున్నాయి. 2024-25లో వంటగ్యాస్ ధర అంతర్జాతీయంగా అధికంగా ఉంది. ఇప్పుడు కూడా ఎక్కువగానే ఉంటోంది. అయితే ఇంటి అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ల ధరను మాత్రం సవరించనందునే, చమురు సంస్థలకు ఈ విభాగంలో నష్టాలొస్తున్నాయి. ఇందుకు పరిహారంగా ప్రభుత్వం రూ.30,000 కోట్లు ఇస్తుంది కనుక, సంస్థలకు ఊరట కలగనుంది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్	120.17	87.19	1,310	1,010
ఎన్ఐఐటీ	4.37	7.75	84.11	82.47
ఇన్ఫోఎడ్జ్	342.8	258.8	791	676.7
వోఖార్డ్	(108)	(16)	738	739
జేకే టైర్	163.35	218.3	3,868.94	3,639.08
రామ్‌కో సిమెంట్స్	181.58	36.57	2,074	2,093.55
పేజ్ ఇండస్ట్రీస్	200.79	165.22	1,316.56	1,277.51
జీఐసీ ఆర్ఈ	1,752	1,036	13,352	11,964
వోల్టాస్	140.61	335	3,912.29	4,903.91
కమిన్స్ ఇండియా	589	420	2,859	2,262
సన్ టీవీ	529.21	559.32	1,290.28	1,313.55

ఈవీల అమ్మకాలు 93% పెరిగాయ్: ఫాడా



దిల్లీ: విద్యుత్తుతో నడిచే ప్రయాణికుల వాహన (ఈవీ) రిటెయిల్ విక్రయాలు ఈ ఏడాది జులైలో 15,528గా నమోదయ్యాయి. 2024 జులైలో నమోదైన 8,037 ఈవీలతో పోలిస్తే ఈ సంఖ్య 93% అధికమని వాహన డీలర్ల సమాఖ్య (ఫాడా) తెలిపింది. విద్యుత్తు కార్లలో టాటా మోటార్స్ అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థ కార్ల అమ్మకాలు 5,100 నుంచి 6,047కు చేరాయి.


✦ విద్యుత్తు ద్విచక్ర వాహన విక్రయాలు మాత్రం 1,07,655 నుంచి 4% తగ్గి 1,02,973కు పరిమితమయ్యాయి. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ కంపెనీ అగ్రస్థానంలో ఉంది. ఈ కంపెనీ వాహన నమోదులు 19,655 నుంచి 13% పెరిగి 22,256కు చేరాయి.

✦ విద్యుత్తు త్రిచక్ర వాహన విక్రయాలు 63,675 నుంచి 9% అధికమై 69,146కు చేరాయి. ఇందులో మహీంద్రా గ్రూప్ అమ్మకాలే 9,766గా ఉన్నాయి. 2024 జులైతో పోలిస్తే, ఈ సంఖ్య 40% అధికం.

✦ విద్యుత్తు వాణిజ్య వాహన విక్రయాలు 52% వృద్ధితో 1244కు చేరాయి. ఇందులో 333 విక్రయించిన టాటా మోటార్స్ ప్రథమస్థానంలో ఉంది.

✦ ఛార్జింగ్ మౌలిక వసతులు పెరగడం, రుణాలు సులభంగా మంజూరవుతున్నందున, పండగల సీజన్‌లో విద్యుత్తు వాహనాల అమ్మకాలు వృద్ధి చెందుతాయనే ఆశాభావాన్ని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ వ్యక్తం చేశారు.

పీఎం ఇ-డ్రైవ్ పథకం రెండేళ్లు పొడిగింపు



దిల్లీ: విద్యుత్తు వాహనాల ప్రోత్సాహానికి ప్రకటించిన రూ.10,900 కోట్ల విలువైన పీఎం ఇ-డ్రైవ్ పథకం కాలవ్యవధిని ప్రభుత్వం రెండేళ్లు పొడిగించింది. విద్యుత్ బస్సులు, ఇ-అంబులెన్సులు, ఇ-ట్రక్కులు సహా కొన్ని వాహన విభాగాలకు ఈ పథకం 2028 మార్చి వరకు వర్తించనుంది. ఇప్పటివరకు ఈ పథకం కాలవ్యవధి 2026 మార్చిగా ఉంది. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం.. విద్యుత్ ద్విచక్రవాహనాలు, విద్యుత్ రిక్షాలు, ఇ-కార్ట్, విద్యుత్ త్రిచక్ర వాహనాలు (ఎల్5)కు మాత్రం ఈ పథకం 2026 మార్చి 31తో ముగుస్తుంది. ఈ పథకం కోసం రూ.10,900 కోట్లు కేటాయించగా. . ఆ నిధులు అయిపోతే పథకం ముందుగానే ముగుస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

జౌళి పీఎల్ఐ పథకం పునఃప్రారంభం: జౌళి రంగం కోసం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద లబ్ధి పొందేందుకు తాజాగా దరఖాస్తులను ఆహ్వానిస్తూ, సంబంధిత పోర్టల్‌ను ప్రభుత్వం పునఃప్రారంభించింది. ఈ దరఖాస్తుల పోర్టల్ ఈనెల 31 వరకు అందుబాటులో ఉంటుంది.

ఎయిర్‌టెల్‌లో 1% వాటాను రూ.11,227 కోట్లకు అమ్మిన ప్రమోటరు

దిల్లీ: భారతీ ఎయిర్‌టెల్‌లో సుమారు 1% వాటాకు సమానమైన షేర్లను, ఆ సంస్థ ప్రమోటర్లలో ఒకటైన ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ (ఐసీఐఎల్) రూ.11,227 కోట్లకు విక్రయించింది. ఎన్ఎస్ఈ వద్ద లభ్యమవుతున్న బ్లాక్‌డీల్ వివరాల ప్రకారం.. 0.98% వాటాకు సమానమైన 6 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కోటి రూ.1,870.40- 1,871.95 ధరల శ్రేణిలో విక్రయించినట్లు తెలుస్తోంది. శుక్రవారం భారతీ ఎయిర్‌టెల్ షేరు రూ.1,858.70 వద్ద ముగిసింది. అంటే ప్రస్తుత ధర కంటే అధిక ధరకే ఐసీఐఎల్ 1% వాటాను విక్రయించిందన్నమాట. ఈ లావాదేవీ అనంతరం ఎయిర్‌టెల్‌లో ఐసీఐఎల్ వాటా 1.49 శాతానికి తగ్గింది.

50% సుంకం అమలైతే వృద్ధి 6 శాతమే: మూడీస్

దిల్లీ: అమెరికా విధించిన 50% సుంకం అమలైతే కనుక, 2025-26లో భారత వృద్ధి కాస్త నెమ్మదిస్తుందని మూడీస్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. గతంలో అంచనా వేసిన దానికి 30 బేసిస్ పాయింట్లు తగ్గి 6 శాతానికి వృద్ధిరేటు పరిమితమవుతుందని చెబుతోంది. దేశీయంగా బలమైన గిరాకీ, సేవల రంగ వృద్ధి వంటివి భారత్‌పై ఒత్తిడి తగ్గేందుకు కారణమవుతాయని వివరించింది.

సెన్సెక్స్ 80000 దిగువకు

రూ.4.72 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.1933 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు.. రూ.7724 కోట్లు

సెన్సెక్స్ ▼765 79858 | నిఫ్టీ ▼233 24363



సమీక్ష

మన దేశ ఉత్పత్తులపై సుంకాలను 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన వల్ల, మన స్టాక్ మార్కెట్‌కు నష్టాలు తప్పలేదు. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ లాంటి దిగ్గజ షేర్లలో అమ్మకాలు, సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 80,000 పాయింట్ల దిగువకు వచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఆరంభ నష్టాల నుంచి కోలుకుని ఎలాంటి మార్పు లేకుండా 87.58 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.45% నష్టపోయి 66.74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతా దేశాల సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు నష్టాల్లోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.72 లక్షల కోట్లు తగ్గి రూ.440.63 లక్షల కోట్లకు (5.03 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

ఆద్యంతం నష్టాల్లోనే...

బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం రోజు ముగింపైన 80,623.26తో పోలిస్తే 145 పాయింట్ల నష్టంతో 80,478.01 వద్ద ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 79,775.84 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని చేరింది. చివరకు 765.47 పాయింట్ల నష్టంతో 79,857.79 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 232.85 పాయింట్లు కోల్పోయి 24,363.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,585.50 వద్ద గరిష్ఠాన్ని; 24,337.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 742 పాయింట్లు, నిఫ్టీ 202 పాయింట్లు నష్టపోయాయి. దీంతో వరుసగా ఆరో వారమూ సూచీలు నష్టాలతో ముగిసినట్లయ్యింది.

5 మినహా మిగతావి నష్టాల్లోనే

సెన్సెక్స్ 30 షేర్లలో 5 మినహా మిగతా కంపెనీల షేర్లు నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్ 3.41%, టాటా మోటార్స్ 2.19%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.08%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.01%, యాక్సిస్ బ్యాంక్ 1.82%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.65%, అదానీ పోర్ట్స్ 1.6%, ఏషియన్ పెయింట్స్ 1.23%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.12% చొప్పున డీలాపడ్డాయి.

✦ బీఎస్ఈ రంగాల సూచీల్లో స్థిరాస్తి 2.09%, టెలికమ్యూనికేషన్ 1.83%, లోహ 1.8%, వినియోగ వస్తువులు 1.68%, భారీ యంత్రపరికరాలు 1.62%, కమొడిటీస్ 1.55% నష్టపోయాయి.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయంలో రెండంకెల వృద్ధి సాధిస్తామని ఎండీ ప్రకటించడంతో, **లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా** షేరు బీఎస్ఈలో 3.06% పెరిగి రూ.912.55 వద్ద ముగిసింది.

నేటి బోర్డు సమావేశాలు: ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, లిఖితా ఇన్‌ఫ్రా, ఎస్ఎంఎస్ ఫార్మా

ఐపీఓ సమాచారమ్..

✦ **ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ లిమిటెడ్** ఐపీఓ రెండో రోజుకే పూర్తి (100%) స్పందన లభించింది. 1,05,46,297 షేర్లను విక్రయానికి ఉంచగా.. 1,07,80,074 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 1.44 రెట్ల స్పందన లభించింది.

✦ పబ్లిక్ ఇష్యూకు అనుమతి కోరుతూ టైల్స్ తయారీ సంస్థ **వర్మోరా గ్రానిటో లిమిటెడ్** సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించింది. తాజా షేర్ల జారీ ద్వారా రూ.400 కోట్లు సమీకరించాలని అనుకుంటోంది. ఆఫర్ ఫర్ సేల్‌లో 5.24 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.

✦ మెడిస్టెప్ హెల్త్‌కేర్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు ఇష్యూ ధరగా రూ.43ను నిర్ణయించారు. ఈనెల 12 వరకు కొనసాగనుంది. ఐపీఓ అనంతరం ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎమెర్జ్‌లో ఈ షేరు నమోదవుతుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.16.10 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

సంక్షిప్తంగా..

✦ ఆగస్టు 1తో ముగిసిన వారంలో **మన విదేశీ మారకపు నిల్వలు** 9.322 బిలియన్ డాలర్లు తగ్గి 688.871 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇటీవల కాలంలో ఒక వారంలో విదేశీ మారకపు నిల్వలు ఈ స్థాయిలో తగ్గడం ఇప్పుడే.

✦ ఆన్‌లైన్‌లో ఆర్డరిస్తే ఆహార పదార్థాలను డెలివరీ చేసే సంస్థ **జొమాటో**కు బాలీవుడు నటుడు షారూఖ్ ఖాన్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నారు.

✦ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించే పనిలో ఉన్న అమెరికా విద్యుత్ వాహన దిగ్గజ సంస్థ **టెస్లా** దిల్లీలోని ఏరోసిటీలో 8,200 చదరపు అడుగుల వాణిజ్య స్థలాన్ని అద్దెకు తీసుకుంది. తొమ్మిదేళ్ల కాలానికి అద్దెకు తీసుకున్న ఈ స్థలానికి ప్రారంభంలో నెలకు అద్దె రూ.17.22 లక్షలు అని స్థిరాస్తి డేటా విశ్లేషణ సంస్థ సీఆర్ఈ మ్యాట్రిక్స్ తెలిపింది.

✦ ఎంఎస్‌సీఐ ఇండియా సూచీలో **స్విగ్గీ, విశాల్ మెగామార్ట్, వారీ ఇంజినీర్స్, హిటాజీ ఎనర్జీ ఇండియా**ను చేర్చనున్నారు. ఆగస్టు 26న ట్రేడింగ్ ముగింపు తర్వాత ఈ కంపెనీలను సూచీలోకి చేర్చడం అమల్లోకి వస్తుంది.

✦ సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం **రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్**కు చెందిన రెండు అనుబంధ సంస్థలు- బీఎస్ఈఎస్ యమున పవర్ లిమిటెడ్, బీఎస్ఈఎస్ రాజధాని పవర్ లిమిటెడ్‌కు రూ.28,483 కోట్ల విలువైన విద్యుత్ బకాయిలు వసూలు కానున్నాయి. ఈ రెండు విద్యుత్ డిస్కమ్‌ల్లో రిలయన్స్ ఇన్‌ఫ్రాకు 51% వాటా ఉంది. ఈ డిస్కమ్‌లు దిల్లీలో 53 లక్షల కుటుంబాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి.

ఆల్‌రౌండర్‌కి.. అందలం!

మైక్ అందుకుంటే.. మోటివేషనల్ స్పీకర్... కొలువులో చేరితే సత్తా చూపే సృజనశీలి... భారీ పెట్టుబడులతో మొదలైన అంకుర సంస్థల్లో తొంభై శాతం మూతపడుతుంటే, తన స్టార్టప్‌ని మొదటి నుంచే లాభాల బాట పట్టించిన విజేత. అతగాడే 'యాడాన్మో' వ్యవస్థాపకుడు శ్రవంత్ గాజుల. తాజాగా ప్రతిష్ఠాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టాప్-10 సీఈవోలలో ఒకరిగా ఎంపికయ్యాడు. తన విజయప్రస్థానాన్ని 'ఈతరం'తో ఇలా పంచుకున్నాడు.



సంపాదించుకోవడమే కాదు.. సమాజానికి ఇవ్వడమూ శ్రవంత్‌కి తెలుసు. తన మొదటి నెల వేతనం నుంచే ఐదు శాతాన్ని మంచి పనుల కోసం పక్కన పెడుతున్నాడు. విజయవాడ, హైదరాబాద్‌లలో రెండు స్కూళ్లను దత్తత తీసుకొని, భార్యతో కలిసి నిర్వహిస్తున్నాడు. సంస్థలోని మొత్తం 800 ఉద్యోగులకే కాదు.. వారి కుటుంబ సభ్యులకు సైతం పూర్తిస్థాయిలో బీమా సౌకర్యం కల్పించాడు.

- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టాప్ 10 సీఈవోలలో ఒకరిగా ఎంపిక.
- టెడెక్స్ హైదరాబాద్ స్పీకర్.
- బిట్స్ పిలానీ-హైదరాబాద్ 'పెర్ల్' ఫెస్టివల్‌లో విద్యార్థులనుద్దేశించి ఉపన్యాసం.
- 2017 గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌లో 'స్టార్ ఇన్నోవేటర్ ఆఫ్ ది కంట్రీ'గా ఎంపిక.
- స్టార్టప్ యువ ఔత్సాహికుల కోసం లింక్డ్‌ఇన్‌లో పాఠాలు.

షాపింగ్ మాల్స్ లేదా గేటెడ్ కమ్యూనిటీల్లోని లిఫ్టులలో ఉండే డిజిటల్ తెరపై ప్రకటనలు మీరెప్పుడైనా గమనించారా? వీటిలో దేశవ్యాప్తంగా అత్యధిక తెరల్ని నిర్వహించేది 'యాడాన్మో'నే. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలో 26 నగరాల్లో విస్తరించింది సంస్థ. దీని వ్యవస్థాపకుడే శ్రవంత్. సొంతూరు విజయవాడ. బీటెక్‌లోనే సైబర్ సెక్యూరిటీ, వర్చువల్ రియాలిటీ మీద ఇంటర్నేషనల్ పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చాడు. 70శాతం స్కాలర్‌షిప్‌తో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కెంటకీలో ఎం.ఎస్. చేశాడు.

అమీర్‌పేట్ పిలుపు

పీజీ పూర్తయ్యాక ముందు అమెరికాలోనే ఒక చిన్న కంపెనీలో, తర్వాత 'ఫార్చ్యూన్ 500' సంస్థలో చేరాడు. అక్కడికెళ్లాక అతడి దృక్పథమే మారి పోయింది. 105వ అంతస్తులో ఉండేదా సంస్థ. అక్కడి పని విధానం చూశాక 'మన ఆలోచనలూ అంత ఎత్తులో, ఉన్నతంగా ఉండాలి' అనుకునేవాడు. అక్కడ పని చేస్తున్నప్పుడే వచ్చిన 'యాంగ్రీబర్డ్, 'టెంపుల్‌రన్' లాంటి గేమ్స్ బాగా పాపులర్ అయ్యాయి. ఆ స్ఫూర్తితో తనూ సొంతంగా కోడింగ్ నేర్చుకొని మరీ ఒక యాప్ తయారుచేశాడు. అది వైరల్ అయ్యింది. వెంటనే ఇంటర్ స్నేహితుల నుంచి చేతులు కలపమని కాల్ వచ్చింది. వారితో కలిసి 'వెబైల్' అనే స్టార్టప్ ప్రారంభించాడు. అమెరికాలో ఉద్యోగం చేస్తూనే ఖాళీసమయంలో దానికి పని చేసేవాడు. అందులో మంచి భవిష్యత్తు ఉందని అర్థమైంది. దాంతో నెలకు మూడున్నర లక్షల జీతం వదిలి, ఇండియా వచ్చేశాడు.

వెబైల్ సంస్థ అమీర్‌పేట్‌లోనే ఒక చిన్న అద్దె ఫ్లాట్‌లో కొనసాగేది. అది నలుగురితో మొదలై, మూడేళ్లలోనే వందమంది ఉద్యోగులున్న కంపెనీగా ఎదిగింది. మొదటి ప్రాజెక్ట్ సక్సెస్ కావడంతో ఏదైనా సాధించగలననే నమ్మకం కలిగింది. ఇంకొన్ని వ్యాపార పాఠాలు ఒంట బట్టించుకోవాలని ప్రతిష్ఠాత్మక ఐఎస్‌బీలో చేరాడు. అక్కడ 'ఐ దియా' అనే ఫ్లాగ్‌షిప్ ఈవెంట్‌కి సారథ్యం వహిస్తూ ఇన్వెస్టర్ల నుంచి పన్నెండు కోట్ల రూపాయల ఫండ్స్ తెప్పించాడు. 'యంగ్ లీడర్' అవార్డు అందుకున్నాడు. ఐఎస్‌బీలో ఎంబీఏ పూర్తవగానే మైక్రోసాఫ్ట్ సంస్థకు ఎంపికయ్యాడు. అక్కడ కూడా తన సత్తా చూపించాడు. ముఖకవళికల ఆధారంగా లావాదేవీలు జరిపేలా 'ఫేస్ ఏటీఎం' సాఫ్ట్‌వేర్ రూపొందించాడు. ఈ ఆలోచన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకి నచ్చడంతో ఆయనను స్వయంగా కలిసే అవకాశం దక్కింది.

మైక్రోసాఫ్ట్ వదిలి..

మైక్రోసాఫ్ట్‌లో మంచి గుర్తింపు, హోదా ఉన్నా.. ఇంకా కొత్తగా, సొంతంగా ఏదైనా చేయాలని అనుకునేవాడు. మొదట్లో తను అమెరికాలో ఉన్నప్పుడు ప్రతి కారు మీద డిజిటల్ డిస్‌ప్లేలు ఉండటం గమనించాడు. ఈ తెరల్ని పలు కంపెనీలు ప్రచారం కోసం ఉపయోగించేవి. దీన్నే భారత్‌లో అమలు చేసేలా ఒక స్టార్టప్ ప్రారంభించాలనుకున్నాడు శ్రవంత్. ఆలోచనను వెంటనే అమల్లో పెట్టాడు. ముందు ఒక పాత కారు తీసుకున్నాడు. పైన డిస్‌ప్లే పెట్టించి, కొన్ని కంపెనీల తరపున వాణిజ్య ప్రకటనలు ప్రచారం చేయిస్తూ హైదరాబాద్‌లో తిప్పసాగాడు. దీనికోసం డ్రైవర్లను కష్టపడి ఒప్పించాడు. ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులూ తీసుకున్నాడు.



వీటిని చూసి 'బాహుబలి 2' యూనిట్ నుంచి పిలుపు అందింది. నలభై కార్లతో సినిమా ప్రచారం చేయమని చెప్పారు. యాడాన్మోకి అదే మొదటి డీల్. అవకాశం ఇవ్వడమేకాదు.. ఈ కాన్సెప్ట్ నచ్చి దర్శకుడు రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డలు సంస్థలో పెట్టుబడి కూడా పెట్టారు. ఇక మైక్రోసాఫ్ట్ ఉద్యోగం పూర్తిగా మానేద్దాం అనే నిర్ణయానికొచ్చాడు. అప్పటికి తన జీతం ఏడాదికి రూ.45లక్షలు. మంచి హోదాలో ఉన్నాడు. మరోసారి ఆలోచించమని కన్నవాళ్లు చెప్పినా, అడుగు ముందుకే వేశాడు. అదేసమయంలో బొమ్మిరెడ్డి సందీప్ అనే ఫ్రెండ్‌చేతులు కలిపాడు.

కరోనా దెబ్బ

అంతా బాగుంది అనుకుంటుండగానే కరోనా విరుచుకుపడింది. వ్యాపారం పడిపోయింది. దీన్నుంచి ఎలా బయటపడాలి? కొత్తగా ఏం చేయాలి? అని ఆలోచించారు మిత్రులిద్దరూ. అప్పుడే కార్ల టాప్‌లో డిస్‌ప్లే చేసే తెరల్నే గేటెడ్ కమ్యూనిటీల్లో పెట్టాలనుకున్నారు. డిజిటల్ తెరలు, టెక్నాలజీ ఎలాగూ వాళ్ల దగ్గర ఉంది. ఈ మార్పు కోసం చాలానే కష్టపడ్డారు. ముందు సిబ్బందిని ఒప్పించడానికి శ్రమించాల్సి వచ్చింది. కొన్నాళ్లయ్యాక విజయవంతంగా తమ వ్యాపార కోణాన్ని మార్చేశారు. మొదటి వినియోగదారు డెటాల్. ఆ కంపెనీ ప్రకటనను పది గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రదర్శించారు. తర్వాత ఇతర సంస్థలూ ప్రకటనలు ఇవ్వసాగాయి. అలా హైదరాబాద్‌లో మొదలెట్టి, దేశంలోని 26 నగరాలకు విస్తరించారు. ఏడువేలకు పైగా గేటెడ్ కమ్యూనిటీల్లో 50 వేల తెరలు ఏర్పాటు చేశారు. ఇవన్నీ క్లౌడ్‌బేస్డ్ నెట్‌వర్క్‌తో పని చేస్తాయి. ఒక్క చోటు నుంచే అన్నింటినీ ఆపరేట్ చేయొచ్చు. షాపింగ్ మాల్స్, జ్యువెల్లరీ షాపులు, కోవర్కింగ్ స్పేస్‌లు, టెక్ పార్కులు, కార్పొరేట్ బిల్డింగులన్లాంటి జనసమ్మర్దం ఉన్న ప్రదేశాల్లో డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి ప్రచారం చేయడాన్ని 'యాంబియెంట్ మీడియా' అంటారు. యాడాన్మో ఈ విభాగంలో దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉంది. రూ.కోటితో మొదలైన సంస్థ ఏడేళ్లలో రూ.150 కోట్ల కంపెనీగా ఎదిగింది. యాపిల్, రిలయన్స్, అమెజాన్, జొమాటో, స్విగ్గీ, జెప్టోలాంటి కంపెనీలతోపాటు రియల్ ఎస్టేట్, జ్యువెల్లరీ, ఆటోమొబైల్ కంపెనీలు వినియోగదారులుగా ఉన్నారు.

ఈ బంధం ప్రత్యేకం



అన్ని బంధాల్లోకెల్లా అన్నా-చెల్లి, అక్కా-తమ్ముళ్ల బంధం చాలా స్పెషల్. ఒక్కోసారి రిమోట్ కంట్రోల్, ఓటీటీ సిరీస్, స్నాక్స్ కోసం కొట్టుకున్న వాళ్లే.. తమలో ఎవరికైనా ఏదైనా జరిగిందంటే తల్లడిల్లిపోతారు. ఇష్టమైన పదార్థాలు కొసరి కొసరి వడ్డిస్తారు. అవసరమైతే అమ్మలా తినిపిస్తారు. టామ్ అండ్ జెర్రీలా నిత్యం తగువులాడుకునే వాళ్లే ఎవరైనా తమ జోలికి వస్తే మాత్రం ఇద్దరూ ఏకమై అవతలివాళ్ల తాట తీస్తారు. నిత్యం శత్రువుల్లా ఉన్నా సమయం వచ్చినప్పుడు మాత్రం 'బెస్టీ'లు అయిపోతుంటారు. ఇంట్లో చిప్స్ ప్యాకెట్ కోసమో, చికెన్ ముక్క కోసమో పంతాలకు పోయినవాళ్లే.. అవసరాల్లో ఒకరి కోసం ఒకరు ఎంత పెద్ద త్యాగానికైనా వెనకాడరు. తమ్ముడి కోసం తన అవసరాల్నీ వాయిదా వేసు కుంటుంది అక్క. అప్పు చేసైనా, ఆస్తులు అమ్మైనా చెల్లి పెళ్లి ఘనంగా జరిపిస్తాడు అన్న. 'నువ్వు ఈ పరీక్షలో డింకీ కొడతావ్ చూడు', 'రేయ్.. నువ్వు ఎందుకూ కొరగాకుండా పోతావ్‌రా' అని శపించినవాళ్లే.. చిన్న విజయం సాధించగానే ఉప్పొంగిపోతారు. ఆన్‌లైన్ క్లాసులు, గేమ్‌ల కోసం కొట్టుకున్నవాళ్లే పరీక్షల సమయంలో ఒకరికొకరు నోట్స్ రాసి కవర్ చేస్తారు. అమ్మానాన్నల దగ్గర ఒకరిపై ఒకరు చాడీలు చెప్పుకొన్నవారే.. తన్నులు తినే సమయంలో ఒకరికొకరు రక్షణగా నిలబడతారు. పెద్దవాళ్లకు ఓ టెన్షన్‌లా మారిన వాళ్లే.. ఫ్యామిలీలో ఎవరికి ఏ టెన్షన్ వచ్చినా, పెద్దరికంతో సమస్యను హ్యాండిల్ చేయడానికి ప్రయత్నిస్తారు. ఓ అమ్మాయికి అన్నో, తమ్ముడో ఉన్నాడంటే... ఇంటాబయట తనకో భద్రత. ఓ కుర్రాడికి అక్కాచెల్లీ ఉంటే బాధ్యతల్లో భరోసా. అన్ని సమయాల్లో అండగా ఉండే అన్నా-చెల్లెలు, అక్కా-తమ్ముళ్ల బంధం ఎప్పటికీ ప్రత్యేకం.. సదా పదిలం. నేడు **రాఖీ పౌర్ణమి** సందర్భంగా మన తోడబుట్టిన వాళ్లని ఒక్కసారి మనసారా హత్తుకుందాం.

ఈసారి 'సన్‌బర్న్' ముంబయిలో..



సంగీతాన్ని శ్వాసించే.. మ్యూజిక్‌ని ఆస్వాదించే ప్రతి ఒక్కరికీ 'సన్‌బర్న్' గురించే తెలిసే ఉంటుంది. ఇది ఆసియాలోనే అతిపెద్ద మ్యూజిక్ ఫెస్టివల్. 2007 నుంచి సంగీత ప్రియుల్ని ఆకట్టుకుంటోంది. ప్రపంచంలోని ప్రముఖ డీజేలు, పాప్ సింగర్లు, బాలీవుడ్ స్టార్లు ఇందులో పాల్గొంటుంటారు. ఈ సంగీత ప్రవాహంలో అంతా మునకలేస్తుంటారు. ప్రతి ఏడాది భారత్‌లోని గోవా సముద్ర తీరంలో ఈ సంగీత సంరంభం నిర్వహించడం ఆనవాయితీ. ఈ యేడాది పండగ డిసెంబరు 19 నుంచి 21 వరకు ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు కూడా. అయితే ఈసారి వేదిక గోవాలో కాకుండా ముంబయిలో జరగనుంది. టికెట్లు ఆగస్టు 14 నుంచి అందుబాటులో ఉండనున్నాయి.

కాలేజీ కహానీ


కాలేజీలో బెలూన్ బాయ్!



మా తరగతిలో రవి డ్యాన్స్‌లో ఫుల్ ఎనర్జీ చూపించే వాడు. కాకపోతే వాడికి ఓవర్ యాక్షన్ ఎక్కువ. గతేడాది 'ఫ్రెషర్స్ డే' కోసం మేం ఒక ఫన్నీ గ్రూప్ డ్యాన్స్ ప్లాన్ చేశాం. అందులో రవినే ప్రధాన డ్యాన్సర్. 'హే కనులు తెరిచినా కన్నెపిల్లా.. కనులు మూసినా కన్నెపిల్లా.. కవిత రాసినా కన్నెపిల్లా.. కకకక కాలేజీ స్టైలే' అనే పాటకి మేం స్టేజీ మీద డ్యాన్స్ చేయాలి. సగం సాంగ్ అయ్యేవరకు మిగతా డ్యాన్సర్లతో కలిసి బాగానే అదరగొట్టాడు. అయితే ఒక స్టెప్ వేస్తున్నప్పుడు తూలి వెనక ఉన్న డెకరేషన్ బెలూన్లపై పడ్డాడు. ఐదారు బెలూన్లు ఫట్‌ఫట్‌మని పగిలాయి. రవి ముఖం, జుత్తుకి నాలుగైదు బెలూన్ ముక్కలు అంటుకున్నాయి. అవేవీ చూసుకోకుండా లేచి మళ్లీ డ్యాన్స్ చేయసాగాడు. స్టేజీ కింద ఉన్న కొందరు తుంటరి కుర్రాళ్లు.. 'ఇది కాలేజీ స్టైల్ పాట డ్యాన్స్ కాదు.. బెలూన్ బాయ్ డ్యాన్స్ సాంగ్' అంటూ ఆట పట్టించారు. సెమిస్టర్ అయిపోయే దాకా మేమూ వాడిని 'బెలూన్ బాయ్' అని పిలిచాం.

– శ్రీకాంత్

నిజంగానే.. పవర్‌ఫుల్



చాటింగ్ నుంచి బిల్లులు చెల్లించడం దాకా.. ఓటీటీ వెబ్‌సిరీస్‌లు చూడటం నుంచి టికెట్లు బుక్ చేయడం వరకూ.. మనకు అన్ని పనులకూ ఆధారం సెల్‌ఫోనే. అంత ముఖ్యమైన మన ఫోన్‌లో ఛార్జింగ్ లేకపోతే ఎన్నో పనులు ఆగిపోతాయ్ కదా! అందుకే చాలామంది ఎక్కడికైనా వెళ్తుంటే పవర్ బ్యాంక్‌లను క్యారీ చేస్తుంటారు. కానీ వాటిలో అత్యధికం ఫోన్‌కి మించిన పరిమాణంలో ఉంటాయి. ఇవి ఫోన్ కన్నా బరువుగా ఉండటమే కాదు.. ఛార్జింగ్‌కి కూడా కాస్త ఎక్కువ సమయమే తీసుకుంటాయి. ఈ సమస్యలు అన్నింటికీ సమాధానమే.. 'స్నాప్ ఎన్ ఛార్జ్ పోర్టబుల్ ఛార్జర్'. పరిమాణంలో అతి చిన్నగా ఉంటుంది. ఫోన్ ఛార్జింగ్ పోర్ట్‌కి పిన్ అమర్చి, దాన్ని మ్యాగ్నెట్ ద్వారా కొద్దిసేపు జాయింట్ చేస్తే చాలు. కొద్ది నిమిషాల్లోనే ఫోన్ పూర్తిగా ఛార్జ్ అవుతుంది. ఇది పూర్తిగా వైర్‌లెస్, కార్డ్‌లెస్. అన్నిరకాల ఫోన్లనూ ఛార్జ్ చేసుకోవచ్చు. స్టాటిక్ కంపెనీ తయారు చేసిన ఈ పరికరం రెండేళ్ల వారంటీతో వస్తోంది.

ధర రూ.2,500

కొరియన్ సంగీతంలో భారతీయ సునామీ!

మనసుని టచ్ చేసే సంగీతం ఏదైనా వింటే గుండెలు మురిసిపోతాయి... ఆ పాటలో ఊపు ఉంటే పాదాలు వాటికవే నర్తిస్తుంటాయి... అది సంప్రదాయం అయినా.. మనది కాని పాశ్చాత్యమైనా! అందుకేగా మన యంగిస్థాన్‌లు ఈమధ్యకాలంలో కొరియన్ గమకాలకు తెగ ఊగిపోతున్నారు... అంతేకాదండోయ్.. అక్కడి సంగీత ప్రపంచంలో కొందరు భారతీయులు పెను సంచలనం సృష్టిస్తున్నారు. వాళ్లే...


ఆర్టిస్ట్ అరియా



బ్యాండ్: X:IN

కే–పాప్‌లో తాజా సంచలనంగా చెప్పుకొంటున్న పేరు అరియా. ఈ కేరళ అమ్మాయి అసలు పేరు గౌతమి. ఈ బ్యాండ్‌లో చేరేనాటికే తనకి కొరియన్‌లో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం ఉంది. ఈ టాప్ బ్యాండ్‌లో ప్రస్తుతం ప్రధాన వోకలిస్ట్, అత్యంత పిన్న వయస్కురాలు కూడా. కొన్నేళ్లు ఆ మ్యూజిక్ బృందంతో కలిసి సాగాక, ఇప్పుడు సోలోగా ప్రయాణం చేస్తోంది. ఔత్సాహిక కొరియన్ కళాకారులకు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్న అరియాకి భారత్, ఈశాన్య ఆసియాలోనూ మంచి పేరు ఉంది. విపరీతమైన అభిమానులు ఉన్నారు.


ఆర్టిస్ట్ సిద్ధాంత్ అరోడా



బ్యాండ్: జడ్ బాయ్స్

కే–పాప్‌లో తమని తాము నిరూపించుకున్న భారతీయుల్లో ఎక్కువమంది అమ్మాయిలే ఉన్నారు. తొలిసారి ఓ అబ్బాయి పేరు వినిపిస్తుందంటే అది సిద్ధాంత్ అరోడాదే. తను దిల్లీ కుర్రాడు. రణ్‌వీర్‌సింగ్‌ని ఆరాధించే సిద్ధాంత్‌కి ముందునుంచీ మ్యూజిక్ అంటే ప్రాణం. ఎప్పటికైనా గ్లోబల్ ఆర్టిస్టు కావడం అతడి కల. సొంతంగా పలు ఆల్బమ్స్ పాడాడు. అవి చూసే జడ్-బాయ్స్ నుంచి ఆహ్వానం అందింది. వాళ్లతో కొన్నాళ్లు పనిచేశాక, దక్షిణకొరియాలో నెంబర్‌వన్ మ్యూజిక్ బ్యాండ్ బీటీఎస్‌తో కూడా జట్టు కట్టాడు. అంతకుముందు ఎప్పుడూ సీరియస్‌గా మ్యూజిక్ నేర్చుకోని సిద్ధాంత్.. కొరియాకు వెళ్లాక, ప్రాణం పెట్టి సాధన చేశాడు. సియోల్‌లోని ప్రఖ్యాత జమ్సిల్ ఇండోర్ జిమ్నా జియమ్‌లోనూ ప్రదర్శన ఇచ్చాడు.

ఆర్టిస్ట్ శ్రేయా లెంకా



బ్యాండ్: బ్లాక్ స్వాన్

వోకల్‌తోపాటు డ్యాన్స్‌లతోనూ అదరగొట్టే శ్రేయాది ఒడిశాలోని రవుర్కేలా. నాన్నమ్మ పట్టుబట్టి హిందుస్థానీ నేర్పిస్తే.. దాంతోపాటు వెస్టర్న్ మ్యూజిక్, డ్యాన్స్‌నీ ఒక పట్టు పట్టింది శ్రేయా. ఫ్రీస్టైల్, హిప్‌హాప్, కాంటెంపరరీ.. తనకు కొట్టిన పిండే. ఇంటర్ పూర్తయ్యేసరికి కే-పాప్ మ్యూజిక్‌కి ఫిదా అయిపోయింది. PSYను బాగా ఆరాధించేది. బీటీఎస్, ఎక్సోలాంటి మ్యూజిక్ బ్యాండ్‌లు అంటే పిచ్చి. దాంతో యూట్యూబ్‌లో చూస్తూనే కొరియన్ డ్యాన్స్, వోకల్స్ నేర్చుకుంది. 2021లో కొరియన్ టాప్ బ్యాండ్ 'బ్లాక్‌స్వాన్' కొత్త సభ్యుల కోసం ఆడిషన్స్ నిర్వహించారు. వెంటనే సియోల్‌కి ఎగిరిపోయింది. నాలుగువేల మందితో పోటీ పడి ఆ బృందంలో చోటు దక్కించుకుంది. దీనికోసం మూడు నెలలపాటు రాత్రింబవళ్లు కష్టపడి కొరియన్ నేర్చుకుంది, ప్రాక్టీస్ చేసింది. ఆ బ్యాండ్‌తో కొన్నాళ్లు కలిసి పని చేశాక, ప్రస్తుతం సొంతంగా ఆల్బమ్‌లు చేస్తోంది. తను ఇప్పుడు అక్కడ టాప్ కేపాప్ ఐడల్.

ఆర్టిస్ట్ ప్రియా మజుందార్



బ్యాండ్: జడ్ గర్ల్స్ పయోనీర్

శ్రేయా కన్నా ముందే కొరియన్ పాప్ ఐడల్‌గా ప్రపంచానికి పరిచయమైన పేరు ప్రియాంకా మజుందార్. గళం, స్టేజీ పర్‌ఫెర్మాన్స్‌తో అదరగొట్టే ప్రియాంకాది అస్సాం. మొదట్లో కొరియాకే పరిమితమైన 'జడ్ గర్ల్స్ పయోనీర్' మ్యూజిక్ బ్యాండ్ ఆసియా మొత్తం విస్తరించాలని అనుకుంది. అప్పటికే కే-పాప్ సంగీతానికి ఫిదా అయిన ప్రియాంకా.. తన ఆటపాటలతో మెప్పించి ఆ బృందంలో చోటు దక్కించుకుంది. తర్వాత ఈ బ్యాండ్ ఏడుగురు సభ్యుల్లో అత్యంత పాపులారిటీ సంపాదించుకుంది. కే-పాప్ ఐడల్‌గా మారాలనుకునే వేలమంది అమ్మాయిలకు రోల్‌మోడల్‌గా మారింది. ప్రస్తుతం తను సొంతంగానే కెరియర్‌లో దూసుకెళ్తోంది. గ్లోబల్ ఆర్టిస్టులతో కలిసి పని చేస్తోంది.

మేం ప్రేమికులం కాదు..!

మనసులో మాట

ఒక అమ్మాయి, అబ్బాయి సన్నిహితంగా ఉంటే వారిద్దరి మధ్యా ఏదో ఉన్నట్టా..? నాలుగైదుసార్లు కలిసి తిరిగితే ప్రేమికులు అయిపోతారా? ఇవేం సంకుచిత ఆలోచనలు? నా కెరియర్ నిలబెట్టిన మంచి మనసున్న అమ్మాయి జీవితం ఇలాంటి అపార్థాలకు అతలాకుతలం అవడం నన్ను కలచివేస్తోంది.

కోడింగ్‌తో ఈ ప్రపంచాన్ని ఏలాలి అని కలలు కన్నవాడిని. ఇంటర్లోనే సొంతంగా యాప్‌లు తయారు చేసిన టాలెంట్ నాది. ఇంజినీరింగ్‌లో నన్నంతా 'జీనియస్' అనేవాళ్లు. నా క్లాస్‌మేట్స్ ఎందరికో 'ప్రాజెక్ట్ వర్క్'లో సాయం చేశా. అలాంటి నాకు నాలుగైదు కంపెనీలైనా పిలిచి ఉద్యోగాలిస్తాయి అనే నమ్మకం ఉండేది. ప్చ్.. అవేవీ జరగలేదు. ఏమైందోగానీ ప్రతి ఇంటర్వ్యూలో ఫెయిలయ్యా. జాబ్ రిజెక్షన్ మెయిళ్లతో నా ఇన్‌బాక్స్ నిండిపోయేది. మరోవైపు ఇంట్లోవాళ్ల ఆశలన్నీ నామీదే ఉండేవి. ఉద్యోగం వస్తే నాన్నకు చేదోడుగా ఉంటాననీ, చెల్లి మెడిసిన్ కలలు నెరవేరుస్తాననీ. ఏడాది వరకూ ఏ జాబ్ రాకపోవడంతో జీవితమంతా చీకట్లు అలముకుంటున్న బాధ.. ఆ గాఢాంధకారంలో నా కలలు కరిగిపోతున్న భావన. 'అసలు నాకు ఉద్యోగం వస్తుందా?' అనే అనుమానం కూడా మొదలైంది. ఆ సమయంలో దేవతలా ఆదుకుంది నా సీనియర్ మానస (పేరు మార్చాం).

లింక్డ్‌ఇన్‌లో దొరికిందామె. ఓ ప్రముఖ కంపెనీలో టెక్ లీడ్‌గా ఉంది. మెసేజ్ పెడితే స్పందించింది. కెఫేలో కలిశాం. 'ఫైనలియర్‌లో నీ గురించి పాజిటివ్‌గా విన్నాను విజయ్.. కోడింగ్ పోటీల్లో ప్రైజులు కూడా గెలిచావటగా. మరి నీకు జాబ్ రాకపోవడమేంటి?' అంటూ ఆశ్చర్యపోయింది. నా వరుస వైఫల్యాల కథంతా ఆమె ముందుంచా. అంతా విని పెద్దగా నిట్టూర్చింది. 'నీలో టాలెంట్‌కి కొదవ లేదు. కాకపోతే నిన్ను నువ్వు నమ్మడమే మానేశావు అనిపిస్తోంది. ఇకపై నిన్ను నేను గైడ్ చేస్తా' అంది. మాట వరసకి అనడమే కాదు.. ఎక్కడైనా వేకెన్సీ ఉంటే చెప్పేది. వాటికెలా సిద్ధం కావాలో వివరించేది. పొద్దంతా డ్యూటీ.. రాత్రి జూమ్‌లో నాతో మాక్ ఇంటర్వ్యూలు చేయించడం.. తన ఓపికకి దండం పెట్టాలనిపించేది.

మూడు నెలల తర్వాత తను రెఫర్ చేసిన కంపెనీ నుంచి ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. నా బ్యాడ్‌లక్.. అదేరోజు అమ్మకి ఆరోగ్యం బాగా లేక ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి. అప్పుడూ 'నేను చూసుకుంటాలే విజయ్.. ఈ ఉద్యోగం మీ అమ్మ కల కూడా. వెళ్లు..' అని చెప్పి పంపింది. అప్పటికే నా స్కిల్స్ మెరుగు పడటం, కోడింగ్ బాగుండటంతో ఆ ఉద్యోగానికి ఎంపికయ్యా. మంచి ప్యాకేజీ. సంతోషంతో నా కళ్లలో నీళ్లు తిరిగాయి. అమ్మ ఆరోగ్యం కుదుటపడ్డాక మానస దగ్గరికి వెళ్లి మనసారా 'థాంక్స్' చెప్పా. తర్వాత ఇద్దరం ఉద్యోగాల్లో బిజీ అయిపోయాం.

ఆర్నెల్లయ్యాక అనుకుంటా. 'విజయ్ నాకు పెళ్లి కుదిరింది' అని వాట్సప్ చేసింది. నాకు చాలా హ్యాపీగా అనిపించింది. నా జీవితాన్ని నిలబెట్టిన తనకి మంచి గిఫ్ట్ ఇవ్వాలనుకున్నా. కానీ ఆ అవకాశం రాలేదు. కొద్దిరోజులకే.. మానస వాట్సప్‌లో బాధాకరమైన డీపీలు, స్టేటస్‌లు పెట్టసాగింది. ఏమైందో తెలుసుకుందామని ఓరోజు ఫోన్ చేశా. పెళ్లి క్యాన్సిల్ అయ్యిందని బావురుమంది. అంతకన్నా దారుణం ఏంటంటే.. మా ఇద్దరి మధ్య లవ్ నడుస్తుందనే ఆ అబ్బాయి మానసతో సంబంధం వదులుకున్నాడట. అది తెలియగానే నా నోట మాట రాలేదు. మేం కలిసిన ఆరేడు సందర్భాల్లో మా మధ్య కనీసం 'లవ్' అనే పదం కూడా ప్రస్తావనకు రాలేదు. తను నాకు సాయం చేసింది అనే కృతజ్ఞతాభావం ఉండేది, అంతే. మరి మా గురించి తనకి ఎవరు అలా చెప్పారోగానీ.. తనకు తానే అలాంటి నిర్ణయానికి రావడం ఏంటి? ఇదే విషయం ఇద్దరం వెళ్లి తనని నిలదీద్దాం అన్నా. 'వద్దులే విజయ్.. వాడో అనుమానపు పిశాచి అని ముందే తెలియడం సంతోషం. కానీ ఇంతదాకా వచ్చి, చెడిపోయిందని అమ్మానాన్నలు బాగా బాధపడటమే చూడలేకపోతున్నా' అంది. తమ పాత ప్రేమల గురించి పెళ్లిచేసుకోబోయే అమ్మాయిలు, అబ్బాయిలు నిర్భయంగా చర్చించుకుంటున్న రోజులివి. అలాంటిది ఎవరి మాటో విని, కుదిరిన సంబంధం వదులుకున్న ఆ ప్రబుద్ధుడిని ఏమనాలి? మరో అమ్మాయి విషయంలోనైనా అతగాడు ఇలా చేయకుండా ఉండాలని కోరుకుంటున్నా.

– విజయ్



పెళ్లి చూడాలంటే టికెట్!

ఒక థియేటర్‌కి వెళ్లి సినిమా చూడాలన్నా, ఒక సర్కస్‌లో వినోదం పొందాలన్నా టికెట్ కొని వెళ్లాల్సిందే. కానీ ఒక పెళ్లికి వెళ్లి కొత్త జంటకు శుభాకాంక్షలు చెప్పడానికి కూడా టికెట్ కొనుక్కోవాలంటే షాకింగ్‌గా ఉంటుంది కదూ! ఇందులో వింత, విడ్డూరాలేం లేవు బాస్. ఫ్రాన్స్‌లో ఇప్పుడిదో ట్రెండ్. అక్కడ పెళ్లిళ్లు అంటే వ్యక్తిగత కార్యక్రమం, బంధుమిత్రులకు ఆహ్వానం అందే వేడుక మాత్రమే కాదు. ఆసక్తి ఉన్న ఎవరైనా పరిచయం లేని ఎవరి వివాహానికైనా హాజరు కావొచ్చు. వేడుకలు, విందులో పాల్గొనవచ్చు. వాళ్ల సంప్రదాయాలు తెలుసుకోవచ్చు. సంగీతాన్ని ఆస్వాదించవచ్చు. కొత్త పరిచయాలు



కూడా చేసుకోవచ్చు. కాకపోతే కొంత మొత్తం చెల్లించి టికెట్ తీసుకోవాలి. 'ఇన్విటిన్' అనే సంస్థ ప్యారిస్‌లో ఇలాంటి ట్రెండ్ ప్రారంభించింది. పెళ్లి చేసుకోబోయే కొందరు కొత్త జంటలను సంప్రదించి, ఆన్‌లైన్‌లో టికెట్ అమ్మకాల ట్రెండ్‌కి తెర తీసింది. పెళ్లిళ్లలో జరిగే ఆర్భాటాలను బట్టి ఈ పెయిడ్ గెస్టులు ఒక్కొక్కరు రూ.10వేల వరకు చెల్లించి పెళ్లిలో పాల్గొనాలి. వాళ్లు డ్రెస్ కోడ్ కూడా పాటించాల్సిందే. అన్నట్టు ఈ వింత ట్రెండ్ భారత్‌లోకి కూడా వచ్చేసింది. 'జాయిన్ మై వెడ్డింగ్' అనే ఒక స్టార్టప్ కంపెనీ భారత్‌లో జరిగే పెళ్లిళ్లకు ఇలాంటి రుసులు వసూలు చేస్తోంది. అయితే ఇది కేవలం విదేశీ యాత్రికుల కోసం మాత్రమే. ఇక్కడ జరిగే పెళ్లిళ్లు చూడాలనుకునే ఆసక్తి ఉన్న విదేశీయులు దాదాపు రూ.13 నుంచి రూ.21వేల వరకు చెల్లించి మన పెళ్లిళ్లకు హాజరు కావొచ్చు.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



✦ 2025, ఆగస్టు 4-8 వరకు భారత్ పర్యటనకు వచ్చిన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు? **జ:** ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్

✦ అత్యధిక కాలం కేంద్ర హోం మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. అయితే ఆయన ఎన్నిరోజులు ఈ పదవిలో ఉండి రికార్డు నెలకొల్పారు? **జ:** 2258 రోజులు

✦ దేశంలో తొలిసారి టూరిస్ట్ క్యారీయింగ్ కెపాసిటీ (ఎంత మేరకు పర్యాటకులను అనుమతించగలదో, ఆ సామర్థ్యాన్ని లెక్కించడం) అధ్యయాన్ని ఏ రాష్ట్రం చేపట్టింది? **జ:** ఉత్తరాఖండ్

✦ డ్రోన్ ప్రహార్ పేరుతో భారత సైన్యం ఎక్కడ సైనిక విన్యాసాలను నిర్వహించింది? **జ:** అరుణాచల్‌ప్రదేశ్ (రయాంగ్)

✦ ఇటీవల మొబైల్ కాల్‌కు 30 ఏళ్లు పూర్తి అయ్యాయి. అయితే ఎప్పుడు మొదటి మొబైల్ ఫోన్ కాల్ కోల్‌కతా నుంచి దిల్లీకి వెళ్లింది? **జ:** 1995, జులై 31

✦ 'లోర్డ్స్ ఆఫ్ లవ్ అండ్ సెయింట్ గోరఖ్‌నాథ్' పుస్తక రచయిత ఎవరు? **జ:** నళిన్ వర్మ, లాలూప్రసాద్ యాదవ్

✦ 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రం ఏది? **జ:** 12th ఫెయిల్

✦ జాతీయ చేనేతదినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు? **జ:** ఆగస్టు 7

మరింత సమాచారం



తక్కువ ఖర్చుతో తరగని శక్తి!

గ్రామాల్లో లభించే సేంద్రియ వ్యర్థాలతో తయారయ్యే ఇంధన వాయువే బయోగ్యాస్. ఇదొక తరగని శక్తి వనరు. పశువుల వ్యర్థాలు, పంటల అవశేషాలు, నీటిలో పెరిగే కలుపు మొక్కలు, మురుగు నీరే దీనికి ముడి సరకు. స్థానికంగా, సులువుగా, తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ శక్తి వనరును వంటకు, విద్యుదుత్పత్తికి, ఇతర ఇంధన అవసరాలకు సమర్థంగా వినియోగించుకోవచ్చు. పల్లెల్లో పారిశుద్ధ్యానికి, దేశంలో పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే బయోగ్యాస్ ఉత్పత్తి విధానం, ఇందు కోసం నిర్మిస్తున్న ప్లాంట్ల రకాలు, దేశంలో వినియోగం తీరుతెన్నుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. బయోగ్యాస్ వినియోగ రూపాలు, దీంతో ఉన్న విస్తృత ప్రయోజనాలను, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలను, వాటి లక్ష్యాలను తెలుసుకోవాలి.

జీవ ఇంధనం - బయోగ్యాస్

బయోగ్యాస్‌ను గోబర్‌గ్యాస్ లేదా డైజెస్టర్ గ్యాస్ అంటారు. మురుగు నీరు, పేడ, మొక్కలు, వ్యవసాయ అవశేషాలు, ఆహార, మున్సిపల్ వ్యర్థాలు మొదలైన సేంద్రియ పదార్థాలు గాలిరహిత స్థితిలో కుళ్లిపోవడం ద్వారా ఉత్పత్తి చేసిన వాయువును బయోగ్యాస్ అంటారు. ఇది కొన్ని వాయువుల మిశ్రమం. దీని ఉత్పత్తి సాంకేతికతను బోస్వెల్ అనే శాస్త్రవేత్త కనుక్కున్నారు. ✶ సాధారణంగా పశువుల వ్యర్థ పదార్థాలైన పేడ, నీరును 4:5 లేదా 1:1 నిష్పత్తిలో కలిపి, బయోగ్యాస్ ప్లాంటులో నింపి గాలి సోకకుండా మూత బిగించి పెట్టాలి. ఈ మిశ్రమ పదార్థం 37°C వద్ద కిణ్వన ప్రక్రియకుగురై పులిసిపోవడంతో వాయువు ఉత్పత్తి అవుతుంది. దీనినే బయోగ్యాస్/ డైజెస్టర్ గ్యాస్ /గోబర్ గ్యాస్ అని పిలుస్తారు.

బయోగ్యాస్‌లో ఉండే వాయువులు: మీథేన్ 60%-70%, బొగ్గుపులుసు వాయువు 30%-40%, నైట్రోజన్ 9%, హైడ్రోజన్ 1%, హైడ్రోజన్ సల్ఫైడ్ 0.1%-0.5%, ఆక్సిజన్ 0.5%. వీటితోపాటు కొన్నిసందర్భాల్లో నీటిఆవిరి, సల్ఫర్ సమ్మేళనాలు, అమ్మోనియా, ఇతర కాలుష్యకారక వాయువులు కూడా ఉంటాయి. ✶ బయోగ్యాస్‌లో ఎక్కువగా ఉండే వాయువు మీథేన్. దీనికి దహనశీలత ఉండటంతో అనేక రంగాల్లో ఇంధనంగా ఉపయోగిస్తారు.

బయోగ్యాస్ ఉత్పత్తికి కావాల్సిన ముడి పదార్థాలు: ❉ ఆవు పేడ లేదా పశువుల పేడ (ఒక కిలో సుమారు 40 లీ. బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుంది.) ❉ మురుగునీరు ❉ పంట అవశేషాలు ❉ కూరగాయల వ్యర్థాలు ❉ నీటిలో పెరిగే కలుపు మొక్కలు ❉ పౌల్ట్రీ రెట్టలు, పాడిపరిశ్రమ, ఆహారశుద్ధి వ్యర్థాలు.

బయోగ్యాస్ ప్లాంటులోని భాగాలు: వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో సాధారణంగా బయోగ్యాస్ తక్కువ పరిమాణంలో ఉత్పత్తి అవుతుంది. ఆవు పేడ, ఇతర వ్యవసాయ వ్యర్థాలను శుద్ధి చేసే వాయురహిత డైజెస్టర్‌ను బయోగ్యాస్ ప్లాంటు అంటారు. దీనిని సాధారణంగా ఇటుక, సిమెంటుతో నిర్మిస్తారు. ఈ ప్లాంటులో మిక్సింగ్ ట్యాంకు, ఇన్‌లెట్ ఛాంబర్, డైజెస్టర్, అవుట్‌లెట్ ఛాంబర్, ఓవర్ ఫ్లో ట్యాంకు ఉంటాయి.

1) **మిక్సింగ్ ట్యాంకు:** దీనిని ఎత్తులో ఇటుక, సిమెంటుతో నిర్మిస్తారు. ఈ ట్యాంకులో ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, ఇతరత్రా జీవవ్యర్థాన్ని నీటిలో కలుపుతారు.

2) **ఇన్‌లెట్ ఛాంబర్:** ఇది మిక్సింగ్ ట్యాంకు కంటే పెద్దగా ఉంటుంది. ఇది మిక్సింగ్ ట్యాంకును డైజెస్టర్‌కు కలుపుతుంది.


3) **డైజెస్టర్:** ఇది వాయురహిత కిణ్వప్రక్రియ జరిగే ప్రాంతం. బయోగ్యాస్ ప్లాంటులోని అతిపెద్ద గది. దీని పైభాగంలో ఒక వాల్వ్ ఉంటుంది. అక్కడి నుంచి ఉత్పత్తయ్యే బయోగ్యాస్ అవసరానికి అనుగుణంగా విడుదలవుతుంది.

4) **అవుట్‌లెట్ ఛాంబర్:** దీనిని డైజెస్టర్‌తో కలుపుతారు. కిణ్వప్రక్రియ తర్వాత మిగిలిపోయే స్లర్రి (ముద్ద), ఎరువును సేకరిస్తుంది.

భారతదేశంలో బయోగ్యాస్ పితామహుడు - జష్ భాయ్ జె.పటేల్

బయోగ్యాస్ ఉపయోగాలు

☛ దీనిని సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వంటగ్యాస్‌గా వినియోగిస్తారు. ☛ విద్యుత్తు ఉత్పత్తికి ఉపయోగపడుతుంది. ☛ నీటిని వేడి చేయడానికి, గదిని వెచ్చగా ఉంచే పరికరాల్లో వాడతారు. ☛ రవాణా వాహనాల్లోనూ ఉపయోగించవచ్చు. **ఉదా:** స్వీడన్‌లో 'అమండా బయోగ్యాస్ రైలు'. ☛ బయోగ్యాస్ ఉత్పత్తి చివర్లో స్లర్రి (ముద్ద) వస్తుంది. దీనిని సేంద్రియ ఎరువుగా ఉపయోగిస్తారు. ☛ వీధిదీపాలను వెలిగించేందుకు వాడవచ్చు. ☛ హైడ్రోజన్ ఇంధన బ్యాటరీల్లో కూడా వినియోగిస్తారు.



మొదటి బయోగ్యాస్ ప్లాంటును ఎస్.వి. దేశాయ్ అనే సామాజికవేత్త ముంబయిలో 1951లో స్థాపించారు.

భారతదేశంలో బయోగ్యాస్ రంగం: ప్రపంచంలోనే అత్యధికంగా దేశంలో దాదాపు 300 మిలియన్ల పశుసంతతి ఉంది. రోజుకు 3 మిలియన్ టన్నుల పేడ ఉత్పత్తి అవుతుంది. అలాగే వ్యవసాయ వ్యర్థాల లభ్యతా ఎక్కువే. వీటితో బయోగ్యాస్ ప్లాంట్లు నిర్మించి ఇతర ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించొచ్చు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాల్లో బయోగ్యాస్ ఉత్పత్తి, వినియోగం పెంచేందుకు 'గృహలక్ష్మి' పథకాన్ని 1953, 1955లో ప్రారంభించింది. ఈ కార్యక్రమం గురించి ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ప్రజలకు అవగాహన కల్పించింది.



దేశంలో సుమారు కోటి 20 లక్షల బయోగ్యాస్ ప్లాంట్లు స్థాపించవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటి వరకు సుమారు 50 వేల ప్లాంట్లు నిర్మించారు. బయోగ్యాస్ ఉత్పత్తిలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలో బయోగ్యాస్ ఉత్పత్తి, వినియోగంలో చైనా మొదటి స్థానంలో ఉండగా తర్వాత వరుసగా అమెరికా, థాయ్‌లాండ్, ఇండియా ఉన్నాయి.

బయోగ్యాస్ ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించే ప్రభుత్వ కార్యక్రమాలు: ✦ బయోగ్యాస్ పవర్ జనరేషన్. ✦ నూతన జాతీయ బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల కార్యక్రమం. ✦ ఇటీవలి కాలంలో (2022, ఆగస్టు 04) విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కోసం బయోగ్యాస్ ఆధారిత రీఛార్జ్ స్టేషన్‌ను ముంబయిలో ఏర్పాటు చేశారు.

వివిధ రకాల బయోగ్యాస్ ప్లాంట్లు

1) **దీనబంధు బయోగ్యాస్ ప్లాంటు:** దేశంలో ఇలాంటి ప్లాంట్లు చాలా ప్రాచుర్యం పొందాయి.
2) గాయత్రి మోడల్ ప్లాంటు
3) తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ మోడల్
4) **నీరి మోడల్:** నాగ్‌పుర్‌లో నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించింది.
5) **బేలూరు మఠం నమూనా:** బేలూరు మఠం వద్ద రామకృష్ణ మిషన్‌లో స్వామి విముక్తానంద ఈ నమూనాను అభివృద్ధి చేశారు.
6) **జనతా రకం బయోగ్యాస్ ప్లాంటు:** దీని నిర్మాణ వ్యయం చాలా తక్కువ.
7) ప్రగతి మోడల్ ప్లాంటు..



ఆసియాలోనే అతిపెద్ద బయోగ్యాస్ ప్లాంటును హైదరాబాద్ సమీపంలోని దమ్మాయిగూడ వద్ద రామ్‌కీ కంపెనీ ఏర్పాటు చేసింది.

ప్రయోజనాలు

✦ బయోగ్యాస్‌తో కాలుష్యం ఉండదు. ఇది పర్యావరణ అనుకూల హరిత ఇంధనం.
✦ ఇది పునరుత్పాదక శక్తివనరు. వికేంద్రీకరణ ఇంధనంగా ఉపయోగిస్తారు.
✦ నేల, నీరు, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుంది.
✦ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతి. అంటే ఆర్థికంగానూ అనుకూలమైంది.
✦ బయోగ్యాస్ ప్లాంటు నిర్మాణానికి తొలి పెట్టుబడి తక్కువ.
✦ ఇది వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. అన్ని తరగతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.
✦ అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా ఉపయోగపడుతుంది.
✦ ఎక్కడికక్కడే స్థానికంగా ఉత్పత్తి చేసి, గృహ వినియోగం కోసం సులభంగా పంపిణీ చేయవచ్చు.
✦ గ్రామీణ ప్రజలకు బయోగ్యాస్ అనుకూలమైన ఇంధనం. గ్రామాల్లో సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడకుండా చేస్తుంది. అటవీ సంరక్షణకు సహాయపడుతుంది.
✦ బయోగ్యాస్ వాడకం గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరుస్తుంది.
✦ గ్రామాల్లో వంట ఇంధన కష్టాలను తీరుస్తుంది. మహిళలకు కంటి, ఊపిరితిత్తుల వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది.
✦ బయోగ్యాస్ వినియోగంతో శిలాజ ఇంధనాలను పొదుపు చేయడమే కాకుండా, వాటి దిగుమతిని తగ్గించవచ్చు.



దేశంలో అతిపెద్ద బయోగ్యాస్ ప్లాంటు గుజరాత్‌లోని 'మెథాన్'లో ఏర్పాటైంది.

సీబీజీ (కంప్రెస్డ్ బయోగ్యాస్): బయోగ్యాస్‌లో ఉన్న CO_2, N_2, H_2, SO_2 లను వేరుచేసి మిగిలిన వాయువుపై అధిక పీడనం కలిగించినప్పుడు ఏర్పడే దానిని కంప్రెస్డ్ బయోగ్యాస్ అంటారు. శాస్త్రవేత్తల అభిప్రాయంలో సీబీజీలో 90% లేదా అంతకంటే ఎక్కువ మీథేన్ వాయువు ఉండాలి. సీబీజీని రవాణా రంగంలో ఇంధనంగా ఉపయోగిస్తారు. దేశంలో సీబీజీ ఉత్పత్తికి ప్రభుత్వం SATAT (సస్టెయినబుల్ ఆల్టర్నేటివ్ టువార్డ్ ఎఫర్డబుల్ ట్రాన్స్‌పోర్టేషన్) పథకాన్ని ప్రారంభించింది. ఆసియాలోనే అతిపెద్ద సీబీజీ ప్లాంటును పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. మరో ప్లాంటును అస్సాంలోని సోనాపుర్ వద్ద నిర్మిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద మరిన్ని సీబీజీ ప్లాంట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రయోజనాలు: ❉ పేడ, ఇతర వ్యర్థాలను ఆదాయ వనరుగా పరిగణించే విధంగా రైతులను ప్రోత్సహించడం. ❉ వంట, వీధిదీపాలకు వినియోగించే శక్తి వినియోగంలో స్వావలంబనను పెంచుకోవచ్చు. ❉ చమురు కంపెనీలకు మార్కెట్లో స్థిరమైన ఇంధన సరఫరాను అందిస్తుంది. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే వ్యాపారవేత్తలకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది.

గోబర్ధన్ (GOBAR-DHAN): ఈ పథకం పూర్తిపేరు 'గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయోఆగ్రో రిసోర్స్ - ధన్'. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా రూ.10,000 కోట్ల నిధులతో 2018, ఏప్రిల్‌లో ప్రారంభించారు.

ఉద్దేశం: ❉ గ్రామీణ ప్రాంతాల్లో పశువుల వ్యర్థ పదార్థాల నుంచి రైతులకు ఆదాయాన్ని చేకూర్చడం.



రచయిత:
ఈదుబిల్లి వేణుగోపాల్

ఐటీఆర్ దిద్దుబాటు గడువు నాలుగేళ్లు!

ఆర్థిక వ్యవస్థలో పన్నులు ఒక ప్రధాన భాగం. వీటిని వ్యక్తులు, సంస్థలపై చట్టప్రకారం విధిస్తారు. ప్రభుత్వానికి ముఖ్య ఆదాయం పన్నుల రూపంలోనే వస్తుంది. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని అంశాలపై పన్నులు విధిస్తాయి. ప్రజలందరి జీవితాలను ఈ పన్నుల వ్యవస్థ ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. దేశంలో ఉన్న ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, వాటి చరిత్ర, విధిస్తున్న విధానం, ప్రస్తుత రేట్లు, వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబులు, పరిమితులు, మినహాయింపులు, పన్ను ఆదా పెట్టుబడులు తదితర వివరాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. ఆదాయ పన్ను చట్టంలోని ముఖ్యమైన సెక్షన్లు, వివిధ కమిటీలు చేసిన పన్ను సంస్కరణ సిఫార్సులు, పన్నులపై ఆర్థికవేత్తల అభిప్రాయాలను అర్థం చేసుకోవాలి.



ప్రభుత్వ విత్తశాస్త్రం - పన్నుల వ్యవస్థ


డాల్టన్


1. ప్రభుత్వ విత్తశాస్త్ర పితామహుడిగా కింది వారిలో ఎవరిని పేర్కొంటారు?
   1) క్రౌథర్ 2) ఆడమ్ స్మిత్ 3) డాల్టన్ 4) టోబిన్
2. 2024లో విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను ఎంతవరకు తగ్గించారు?
   1) 25 శాతం 2) 35 శాతం 3) 40 శాతం 4) 45 శాతం
3. భారతదేశంలో ఆదాయ పన్నును ఏ ప్రాతిపదికన అమలు చేస్తున్నారు?
   1) పురోగామి పన్ను 2) అనుపాతపు పన్ను 3) తిరోగామి పన్ను 4) ఏదీకాదు
4. 2025-26 బడ్జెట్‌లో అంకుర సంస్థ (స్టార్టప్)లకు ఎప్పటివరకు పన్ను ప్రయోజనాల పొడిగింపునకు మద్దతు లభించింది?
   1) 2027, ఏప్రిల్ 1 2) 2030, ఏప్రిల్ 1 3) 2040, ఏప్రిల్ 1 4) 2035, ఏప్రిల్ 1
5. 2023-24లో ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్ ఫర్ఫార్మెన్స్ సూచీ (ఎల్‌పీఐ)లో భారత్ స్థానం?
   1) 44వ 2) 45వ 3) 38వ 4) 37వ
6. 2025-26 బడ్జెట్‌లో మధ్య తరగతికి ప్రయోజనం చేకూర్చే వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబు పునర్వ్యవస్థీకరణలో ఎంతవరకు వార్షిక ఆదాయంపై పన్ను మినహాయించారు?
   1) రూ.15 లక్షలు 2) రూ.12 లక్షలు 3) రూ.14 లక్షలు 4) రూ.16 లక్షలు
7. 2025-26 బడ్జెట్‌లో నవీకృత ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్ దిద్దుబాటు) దాఖలు గడువు 24 నెలల నుంచి ఎన్ని నెలలకు పెంచారు?
   1) 38 2) 58 3) 60 4) 48
8. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత పన్నులు స్థూలదేశీయోత్పత్తిలో ఎంత శాతం?
   1) 13.9 2) 12.9 3) 11.9 4) 10.9
9. భారతదేశంలో మొదటిసారిగా ఆదాయపు పన్ను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
   1) 1860 2) 1870 3) 1880 4) 1890
10. కింది వాటిలో ప్రగతిశీల పన్నుగా దేన్ని పిలుస్తారు?
   1) కస్టమ్స్ పన్ను 2) అభివృద్ధి సర్‌ఛార్జ్‌లు 3) అమ్మకపు పన్ను 4) ఆదాయ పన్ను

ఇండియన్ ఎకానమీ

11. ఉత్పత్తి ప్రతి దశలో ఏ పన్ను విధిస్తారు?
   1) వ్యాట్ 2) ఆదాయ పన్ను 3) కస్టమ్స్ డ్యూటీ 4) జీఎస్టీ
12. రిలయన్స్ సంస్థ విదేశాల నుంచి ఒక ఉత్పత్తిని దిగుమతి చేసుకుంటే దానిపై ఎలాంటి పన్ను విధిస్తారు?
   1) వ్యాట్ 2) కస్టమ్స్ డ్యూటీ 3) ఆదాయపు పన్ను 4) కార్పొరేషన్ పన్ను
13. కింది పన్నుల్లో కేంద్ర ప్రభుత్వం విధించిన ఏ పన్నును రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుంది?
   1) వ్యాట్ 2) ఆదాయ పన్ను 3) స్టాంప్ డ్యూటీ 4) కార్పొరేషన్ పన్ను
14. భారతదేశం ఏ దేశపు జీఎస్టీ నమూనాను ఎంచుకుంది?
   1) యూఎస్ఏ 2) కెనడా 3) యూకే 4) చైనా
15. కింది వాటిలో ఏది పన్ను ఆదా పెట్టుబడి కాదు?
   1) గృహరుణం అసలు తిరిగి చెల్లింపు
   2) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్
   3) జీవిత బీమా ప్రీమియం 4) స్థిర డిపాజిట్లు
16. పన్ను విధించదగిన ఆదాయం పెరిగిన కొద్దీ పన్ను రేటు తగ్గితే దాన్ని ఎలా పిలుస్తారు?
   1) ప్రోగ్రెసివ్ టాక్సేషన్
   2) తిరోగమన పన్ను విధానం
   3) దిగజారిన పన్ను విధింపు
   4) దామాషా పన్ను విధానం
17. ఒక వ్యక్తి అందించే విరాళాన్ని ఆదాయ పన్ను చట్టం-1961లోని ఏ సెక్షన్ ప్రకారం పన్ను విధించదగిన ఆదాయం నుంచి తగ్గిస్తారు?
   1) సెక్షన్-80 ఇ 2) సెక్షన్-80 డి 3) సెక్షన్-80 జి 4) సెక్షన్-80 సి
18. స్థూల ఆదాయం లెక్కించడంలో ఎన్ని ఆదాయ శీర్షికలున్నాయి?
   1) ఆరు 2) ఐదు 3) మూడు 4) రెండు
19. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1990 2) 1975 3) 1985 4) 1950
20. 2025-26 బడ్జెట్ ప్రకారం ఆదాయ పన్ను ద్వారా రూపాయి రాక ఎన్ని పైసలు?
   1) 24 పైసలు 2) 22 పైసలు 3) 17 పైసలు 4) 18 పైసలు
21. 2025-26 బడ్జెట్‌లో చిన్న ఛారిటబుల్ ట్రస్ట్‌లు/ సంస్థల రిజిస్ట్రేషన్ వ్యవధి ఐదేళ్ల నుంచి ఎన్నేళ్లకు పెంచారు?
   1) 20 2) 10 3) 15 4) 8
22. వెల్త్ ట్యాక్స్ చట్టం, 1957 ప్రకారం సంపద పన్ను రద్దు చట్టం ఏ సంవత్సరంలో చేశారు?
   1) 2018 2) 2015 3) 2020 4) 2012
23. ఆదాయపన్నుకు సంబంధించి పన్నురేట్లు, స్లాబ్‌లు ఏ కమిటీ సిఫార్సుల ఆధారంగా తగ్గించారు?
   1) విజయ్ కేల్కర్ 2) రాజా చెల్లయ్య 3) టి.టి.కృష్ణమాచారి 4) కాల్డర్
24. 'ప్రణాళికల్లో తక్కువ ఖర్చు చేసేది ఉత్తమ ప్రణాళిక అని, పన్నులో తక్కువ పన్ను విధించేది మంచి పన్ను' అని ఏ ఆర్థికవేత్త అభిప్రాయం?
   1) ఆడమ్ స్మిత్ 2) జె.బి.సే 3) సెలిగ్‌మాన్ 4) డాల్టన్
25. 2025-26 బడ్జెట్ ప్రకారం వేతనజీవులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000 నుంచి ఎంతకు పెంచారు?
   1) రూ.లక్ష 2) రూ.75,000 3) రూ.85,000 4) రూ.65,000
26. కింది వాటిలో కాల్డర్ కమిటీ సిఫార్సు చేయని పన్నును గుర్తించండి.
   1) వ్యయంపై పన్ను 2) సంపద పన్ను 3) బహుమతి పన్ను 4) కార్పొరేషన్ పన్ను
27. కింది పన్నులో పన్ను తొలిభారం ఒకరిపైన, అంతిమభారం మరొకరి పైన పడితే అలాంటి పన్నును ఎలా పిలుస్తారు?
   1) ప్రత్యక్ష పన్ను 2) అనుపాతపు పన్ను 3) పరోక్ష పన్ను 4) ఏదీకాదు
28. జీఎస్టీతో రాష్ట్ర స్థాయిలో విలీనమైన పన్నుల్లో కింది వాటిలో సరైంది గుర్తించండి.
   1) వినోద పన్ను 2) ఆక్ట్రాయ్ పన్ను 3) ప్రకటన పన్ను 4) పైవన్నీ
29. నోబెల్ గ్రహీత టోబెన్ ఏ పన్నును విధిస్తే దేశానికి పన్ను ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు?
   1) అంతర్జాతీయ లావాదేవీలు
   2) ఉత్పత్తులు 3) విరాళాలు
   4) ఎన్ఆర్‌ఐల ఆదాయం



30. ప్రొఫెసర్ రాజా చెల్లయ్య కమిటీ కింది ఏ పన్నును ప్రవేశపెట్టాలని సిఫార్సు చేయలేదో గుర్తించండి.
   1) వ్యవసాయ ఆదాయంపై పన్ను
   2) కార్పొరేషన్ పన్ను
   3) విలువ ఆధారిత పన్ను 4) సేవా పన్ను
31. కింది వాటిలో పరోక్ష పన్ను రూపం ఏది?
   1) ఆదాయ పన్ను 2) సంపద పన్ను 3) కార్పొరేషన్ పన్ను 4) అమ్మకం పన్ను
32. వ్యక్తిగత స్వభావం ఉన్న బహుమతులు గరిష్ఠంగా ఎంత మొత్తం నగదు రూపంలో స్వీకరించడం ఆదాయంగా పరిగణనలోకి రాదు?
   1) రూ.20,000 2) రూ.30,000 3) రూ.50,000 4) రూ.60,000
33. కింది వాటిలో పన్నులపై నియమించిన కమిటీలకు సంబంధించి సరైంది గుర్తించండి.
   1) రేఖి కమిటీ - పరోక్ష పన్నులు
   2) కె.ఎన్.రాజ్ కమిటీ - వ్యవసాయ ఆదాయంపై పన్ను
   3) విజయ్ కేల్కర్ - జీఎస్టీ 4) పైవన్నీ
34. పన్ను నియమాల గురించి మొదట వివరించిన ఆర్థికవేత్త?
   1) జె.బి.సే
   2) ఆడమ్ స్మిత్
   3) షుంపీటర్
   4) రాబిన్స్



35. కింది వారిలో సర్‌ఛార్జ్‌ని కార్పొరేషన్ పన్నుగా మార్పు చేసినవారు?
   1) డి.ఆర్.గాడ్గిల్
   2) షణ్ముగం శెట్టి
   3) జాన్ ముత్తాయ్
   4) విరల్
36. సేవా పన్నును ప్రవేశపెట్టాలని సూచించినవారు?
   1) విజయ్ కేల్కర్ 2) రాజా చెల్లయ్య 3) కె.ఎన్.రాజ్ 4) భూతలింగం
37. కింది వాటిలో కేంద్రమే విధించి, వసూలు చేసి, వినియోగించే పన్నును గుర్తించండి.
   1) ఆదాయపు పన్ను 2) కార్పొరేషన్ పన్ను 3) స్టాంప్ డ్యూటీ 4) టర్మినల్ పన్ను
38. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు ప్రారంభించింది?
   1) 2020-21 2) 2022-23 3) 2023-24 4) ఏదీకాదు
39. వర్చువల్ డిజిటల్ ఆస్తులపై పన్ను విధింపు ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
   1) 2020 2) 2025 3) 2022 4) 2024
40. పన్ను చట్టాల అమలుపై సమీక్షకు ఏర్పాటైన ట్యాక్స్ అడ్మినిస్ట్రేటివ్ సంస్కరణల కమిషన్ (టార్క్)కు ఛైర్మన్‌గా వ్యవహరించినవారు?
   1) డాక్టర్ పార్థసారథి షోమ్
   2) విజయ్ కేల్కర్
   3) అమితాబ్ కాంత్
   4) డాక్టర్ విజయ్ మాలిక్
41. కింది వాటిలో ప్రత్యక్ష పన్నులకు సంబంధించి సరైంది గుర్తించండి.
   1) 2023-ఆదాయపన్ను రిబేట్ పొందడానికి ఆదాయపు పన్ను పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల పెంపునకు అమలు.
   2) 2024 - అన్ని రకాల ఇన్వెస్టర్లపై ఎంజల్ ట్యాక్స్ రద్దు ప్రకటన.
   3) 2021 - కొత్త ఈ-ఫైలింగ్ పోర్టల్ ప్రారంభం.
   4) పైవన్నీ
42. 2017, సెప్టెంబరు 1న కొత్త ప్రత్యక్ష పన్నుల చట్టాన్ని రూపొందించడానికి కన్వీనర్‌గా కింది ఎవరి ఆధ్వర్యంలో ఏర్పాటైంది?
   1) అరవింద్ మోదీ
   2) ముఖేశ్ పటేల్
   3) జె.సి.శ్రీవాస్తవ
   4) గిరిష్ అహూజా

సమాధానాలు

1-3; 2-2; 3-1; 4-2; 5-3; 6-2; 7-4; 8-3; 9-1; 10-4; 11-1; 12-2; 13-3; 14-2; 15-4; 16-2; 17-3; 18-2; 19-3; 20-2; 21-2; 22-2; 23-2; 24-2; 25-2; 26-4; 27-3; 28-4; 29-1; 30-1; 31-4; 32-3; 33-4; 34-2; 35-3; 36-2; 37-2; 38-1; 39-4; 40-1; 41-4; 42-1.

బ్రిటిష్ పాలనపై ధిక్కార స్వరం..
గదర్ విప్లవోద్యమం!

బ్రిటిష్ వారి అకృత్యాలు, దమనకాండలతో విసిగిపోయిన భారతీయులు ఒక్కతాటిపైకి వచ్చారు. వారికి వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు. దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో కొందరు శాంతియుత చర్చలు, నిరసనలు తదితర పద్ధతుల్లో పోరాటం చేస్తే, మరికొందరు విప్లవవాద ధోరణిని అనుసరించారు. భరతమాత స్వేచ్ఛ కోరుతూ విదేశాల్లోనూ ఉద్యమం చేసినవారున్నారు. పత్రికలను స్థాపించి, ఆంగ్లేయుల ఆధిపత్యంపై ధిక్కార స్వరం వినిపించారు. స్వతంత్ర భారతావని కోసం విదేశాల్లో ఏర్పాటైన పార్టీలు, కమిటీలు, చేపట్టిన కార్యక్రమాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

భారత స్వాతంత్ర్యోద్యమం: విదేశాల్లో భారత విప్లవకారులు

గదర్ పార్టీ - లాలా హర్‌దయాళ్

లాలా హర్‌దయాళ్ 1884 అక్టోబరు 14న దిల్లీలో జన్మించారు. ఈయన పూర్తి పేరు లాలా హర్‌దయాళ్ సింగ్ మాథూర్.

✦ పంజాబ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసి, 1905లో పంజాబ్ నుంచి ఉపకార వేతనం పొంది ఇంగ్లండ్‌కు వెళ్లారు.

✦ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో విద్యనభ్యసించారు. ఐరోపా ఖండంలో శ్యామ్‌జీ కృష్ణవర్మతో కలిసి పలు బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయుధ విప్లవాన్ని ప్రచారం చేశారు. కొన్ని నెలలు ఫ్రాన్స్‌లో ఉండి పిదప అమెరికా వెళ్లారు.

✦ లాలా హర్‌దయాళ్ విదేశాల్లో నివసించే భారతీయులను విప్లవవీరులుగా మార్చేందుకు శాన్‌ఫ్రాన్సిస్కోలో 1913 నవంబరులో గదర్ పార్టీని స్థాపించారు.



✦ గదర్ అంటే తిరుగుబాటు అని అర్థం. భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి, వారిని దేశం నుంచి తరిమివేయడమే ఈ పార్టీ లక్ష్యం.

✦ ఈ పార్టీ అధ్యక్షుడిగా సోహాన్ సింగ్ బక్నా ఎన్నికయ్యారు. గదర్ పత్రిక ద్వారా విప్లవ ప్రచారాలను విస్తృతంగా కొనసాగించేవారు. ఈ పార్టీ సమావేశాలు లాస్‌ఏంజెల్స్, ఆక్స్‌ఫర్డ్, వియన్నా, వాషింగ్టన్, షాంఘైల్లో జరిగాయి.

✦ గదర్ ఉద్యమం దేశవిదేశాలకు వ్యాపించింది. భాయ్ పరమానంద్, సోహాన్ సింగ్ బక్నా, హర్నామ్ సింగ్‌లు ఈ ఉద్యమంలో లాలా హర్‌దయాళ్‌కు సహాయసహకారాలు అందించేవారు.

✦ బ్రిటిష్ ప్రతినిధి పిర్యాదు వల్ల అమెరికన్ అధికారులు హర్‌దయాళ్‌ను నిర్బంధించారు. వలస చట్టం ప్రకారం విచారణ అనంతరం బెయిల్‌పై విడుదలైన ఆయన అమెరికా నుంచి జెనీవా (స్విట్జర్లాండ్) చేరారు. అక్కడ శ్యామ్‌జీ కృష్ణవర్మ, వీరేంద్ర చటోపాధ్యాయ, తారకనాథదాస్, చంపక రామన్‌పిళ్లై, చంద్ర చక్రవర్తి, బర్కతుల్లా మొదలైనవారితో కలిసి విప్లవ కార్యకలాపాలు కొనసాగించారు.

✦ విప్లవ భావాలున్న అనేక మంది యువకులు గదర్ పార్టీలో చేరారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యాక పార్టీకి చెందిన దాదాపు 3 వేల మంది భారతదేశంలోకి ప్రవేశించారు.

✦ 1915 ఫిబ్రవరి 21న విప్లవదినంగా ప్రకటించారు. కానీ సరైన నాయకత్వం లేకపోవడం, వీరి సమాచారం బ్రిటిష్ ప్రభుత్వానికి తెలియడంతో విప్లవకారులు అరెస్టు చేశారు. అనేక మంది కఠిన శిక్షలు అనుభవించాల్సి వచ్చింది.

✦ గదర్ పార్టీలో ఆంధ్రాకు చెందిన దర్శి చెంచయ్య కొన్ని వారాలపాటు పని చేశారు.

✦ లాలా హర్‌దయాళ్, మరికొంత మంది విప్లవకారులు జర్మనీకి వెళ్లి అక్కడ తమ కార్యక్రమాలను కొనసాగించారు.

✦ బెర్లిన్‌లో భారత స్వాతంత్ర్య పోరాట నిర్వహణకు జర్మనీ మద్దతుతో 'ఇండియన్ ఇండిపెండెన్స్ కమిటీ'ని స్థాపించారు. కానీ మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోవడంతో హర్‌దయాళ్ కార్యక్రమాలు నిలిచిపోయాయి.

✦ లాలా హర్‌దయాళ్ Our Education Problem, Though on Education, Social Conquest of Hindu Race అనే రచనలు చేశారు.

✦ ఈయన 1939 మార్చి 4న అమెరికాలో మరణించారు.

బర్కతుల్లా (1854-1927)



ఈయన అసలు పేరు: అబ్దుల్ హాఫీజ్ మహమ్మద్ బర్కతుల్లా. గదర్ పార్టీ స్థాపకుల్లో ఒకరు.

❖ 1854 జులై 7న భోపాల్ (మధ్యప్రదేశ్)లో జన్మించారు.

❖ ఇంగ్లండ్ వెళ్లి అక్కడి భారత జాతీయవాదులతో సన్నిహిత సంబంధాలు ఏర్పర్చుకున్నారు. లాలా హర్‌దయాళ్, రాజమహేంద్ర ప్రతాప్‌లతో కలిసి పనిచేశారు.

❖ భారతదేశానికి తిరిగి వచ్చి స్వదేశీ ఉద్యమ సమయంలో బెంగాల్ విప్లవకారులతో కలిసి పనిచేశారు.

❖ 1904లో యూనివర్సిటీ ఆఫ్ టోక్యోలో ప్రొఫెసర్ ఆఫ్ హిందుస్థానీగా నియమితులయ్యారు.

❖ ఈయన శ్యామ్యూల్ లూకాష్ జోషితో కలిసి పాన్ ఆర్యన్ అసోసియేషన్‌ను స్థాపించారు.

❖ ఈయన 'ఇస్లామ్ ఫ్రెటర్నిటీ' అనే పత్రికను ప్రచురించారు. అయితే బ్రిటిష్ ప్రభుత్వ ఒత్తిడితో జపాన్ ప్రభుత్వం ఈ పత్రికను నిషేధించింది.

❖ బ్రిటిష్ వ్యతిరేక ప్రచారాన్ని ఉద్ధృతంగా కొనసాగించడం వల్ల జపాన్‌లో ప్రముఖ వ్యక్తిగా పేరొందాడు. టోక్యోలో విదేశీ భాషల స్కూళ్లలో ఉర్దూ అధ్యాపకుడిగా పనిచేశారు. కానీ జపాన్ ప్రభుత్వం ఈయన్ను ఉద్యోగం నుంచి తొలగించింది.


❖ 1914లో బెర్లిన్ వెళ్లి అక్కడ ఇండియన్ నేషనల్ పార్టీలో సభ్యుడిగా చేరారు. ఆఫ్గనిస్థాన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

❖ జర్మనీలో లాలా హర్‌దయాళ్, డా. చంపకరామన్ పిళ్లై మొదలైన విప్లవకారులతో కలిసి ఇండియన్ ఇండిపెండెన్స్ కమిటీలో పనిచేసిన ఆయన జర్మనీలో 'నయా ఇస్లాం' అనే పత్రిక సంపాదకుడిగా ఉన్నారు.

❖ బర్కతుల్లా తన రచనల ద్వారా భారతీయ యుద్ధ ఖైదీల్లో బ్రిటిష్ వ్యతిరేక భావాలను రేకెత్తించారు. భారత స్వాతంత్ర్యోద్యమాన్ని సమర్థిస్తూ ఐరోపా దేశాల్లో పర్యటించారు. 1927 సెప్టెంబరు 20న అమెరికాలో మరణించారు.

❖ ఈయన గౌరవార్థం భోపాల్ యూనివర్సిటీ పేరును 1988లో 'బర్కతుల్లా యూనివర్సిటీ'గా మార్చారు.

రాజమహేంద్ర ప్రతాప్‌సింగ్



భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ విప్లవకారుడు రాజమహేంద్ర ప్రతాప్‌సింగ్. రచయిత, సంపాదకుడిగా, తాత్కాలిక ప్రభుత్వ ప్రెసిడెంట్‌గా స్వాతంత్ర్యం కోసం కృషి చేశారు.

▮ ఈయన 1886 డిసెంబరులో ఉత్తర్‌ప్రదేశ్‌లో జన్మించారు. మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజ్‌లో విద్యనభ్యసించారు (ప్రస్తుతం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ).

▮ 1906లో కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. అక్కడ అనేకమంది నాయకులను కలిసి, స్వదేశీ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. దాదాభాయ్ నౌరోజీ, బాలగంగాధర్ తిలక్, మహారాజా ఆఫ్ బరోడా, బిపిన్ చంద్రపాల్‌ల ఆశయాలను పుణికిపుచ్చుకున్నారు.

▮ 1909 మే 24న 'ప్రేమ్ మహావిద్యాలయ'ను బృందావన్‌లో స్థాపించారు.

▮ 1915 డిసెంబరు 1న ఈయన అధ్యక్షతన తాత్కాలిక భారత ప్రభుత్వ స్థాపన జరిగింది. విదేశాల్లో స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాల్లో ఇది ఒక ముఖ్యఘట్టం. అనంతరం విదేశాలకు వెళ్లి బెర్లిన్‌లోని ఇండియన్ సొసైటీలో చేరారు.

▮ 1915లో టర్కీ - జర్మన్ ప్రతినిధి వర్గంతో కలిసి జర్మన్ చక్రవర్తిని కలిశారు. వారు సాయం చేసినట్లయితే భారత సాయుధ పోరాటం సులభమని వారికి విన్నవించారు.

▮ 1929 జపాన్‌లో వరల్డ్ ఫెడరేషన్ అనే మాస పత్రికను ప్రారంభించారు. ఆల్ ఇండియా జాట్ మహాసభ, ఇండియన్ ఫ్రీడమ్ ఫైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.

▮ 1932లో ఈయన నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ బహుమతికి నామినేట్ అయిన మొదటి విప్లవకారుడు ఈయనే.

▮ 'My life story' పేరుతో ఒక పుస్తకం రచించాడు. 1940 జపాన్‌లో Executive Board of Indiaను ఏర్పాటు చేశారు.

▮ 1946లో భారతదేశానికి తిరిగి వచ్చి 1957 - 1962 మధ్యకాలంలో ఎంపీగా పనిచేశారు.

▮ 92 ఏళ్ల వయసులో 1979 ఏప్రిల్ 29న మరణించారు.



రచయిత
డాక్టర్ వి. రాజ్‌మహ్మద్
అసోసియేట్ ప్రొఫెసర్

Word of the Day

736

Rambunctious

Telugu meaning: అట్టహాసమైన, అనియంత్రిక

English meaning: The word rambunctious (ర్యాంబంక్షియస్) is an adjective that describes someone or something that is uncontrollably energetic, noisy, or difficult to manage.


Synonyms: Boisterous, Unruly

Antonyms: Quiet, Restrained

Usage: **1.** The rambunctious children turned the living room into a playground within minutes.

2. Though his behaviour was rambunctious, it came from a place of genuine excitement and joy.

కరెంట్ అఫైర్స్



హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా 2025, ఆగస్టు 7న దిల్లీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని, ప్రసంగించారు. భారత వ్యవసాయ రంగంలో చతుర్విధ లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వామినాథన్‌కు నివాళిగా ప్రత్యేక నాణేన్ని, పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.



భారత్ దిగుమతులపై ఇప్పటికే 25% సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాన్ని 50 శాతానికి పెంచారు. అదనంగా జరిమానా, సుంకంగా దీన్ని పేర్కొంటూ 2025, ఆగస్టు 6న కార్యనిర్వాహక ఉత్తర్వుపై ఆయన సంతకం చేశారు. గతంలో ప్రకటించిన 25 శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచే అమల్లోకి వచ్చాయి. కొత్తగా విధించిన అదనపు 25% సుంకాలను ఆగస్టు 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. రష్యా నుంచే చమురును దిగుమతి చేసుకుంటున్న చైనా, తుర్కియేలపై మాత్రం ఎలాంటి అదనపు భారాన్ని మోపలేదు. చైనాపై 30 శాతం, తుర్కియేపై 15 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి.

మన దేశం నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.37.02 లక్షల కోట్ల (437.42 బిలియన్ డాలర్లు) విలువైన ఎగుమతులు జరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఫియో) 2025, ఆగస్టు 5న వెల్లడించింది. ఇందులో 116.33 బిలియన్ డాలర్ల (రూ.9.83 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులతో గుజరాత్ అగ్రస్థానంలో ఉందని తెలిపింది.

మయన్మార్ అధ్యక్షుడు మైయింట్ స్వే (74) దీర్ఘకాల అనారోగ్యం కారణంగా 2025, ఆగస్టు 7న నేపిడాలో మరణించారు. ఆంగ్ సాన్ సూకి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వాన్ని నాలుగేళ్ల క్రితం సైన్యం కూలదోసిన తరవాత ఆయన తాత్కాలికంగా దేశాధ్యక్ష పదవిని చేపట్టారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం


ఆగస్టు 9
చరిత్రలో ఈనాడు

ఆదివాసీ జాతుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా ఆగస్టు 9న 'అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం'గా (International Day of the World's Indigenous Peoples) నిర్వహిస్తారు. నాగరిక సమాజానికి దూరంగా అడవులు, కొండ ప్రాంతాల్లో నివసించే వారు గిరిజనులు. వీరు ఒక ప్రాంతానికి పరిమితమైన లేదా ప్రాచీన కాలం నుంచీ ఒకే ప్రదేశంలో జీవనాన్ని సాగిస్తుంటారు. అందుకే వీరిని ఆదివాసులు అని కూడా పిలుస్తారు. వీరికి ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయి. వేట లేదా వ్యవసాయం వీరి జీవన విధానం. ప్రపంచం ఇంత అభివృద్ధి చెందినా నేటికీ 60శాతం గిరిజనులు అరణ్యాల్లోనే ఉంటున్నారు. అడవులు, ప్రకృతి పరిరక్షణలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రపంచీకరణ ఫలితంగా వారి జీవనం ప్రభావితం అవుతోంది. వాటిని అధిగమించడంతోపాటు వారి సంస్కృతి, హక్కులను కాపాడటం గురించి ప్రభుత్వాలు, ప్రజలను చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

▮ ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో 47.6 కోట్ల మంది ఆదివాసులు నివసిస్తున్నారు. ప్రపంచ జనాభాలో వీరు 6% కంటే తక్కువే ఉన్నారు. వీటిలో 5000 కంటే ఎక్కువ విభిన్న సమూహాలు/తెగలు ఉన్నాయి. భూమిపై 200 గిరిజన తెగలు కారడవుల్లో నివసిస్తున్నాయి. ఇందులో సుమారు వంద వరకు అమెజాన్ అడవుల్లో ఉన్నాయి.

▮ మన దేశంలో 705 గిరిజన తెగలు ఉన్నాయి. దేశ జనాభాలో వీరి వాటా సుమారు 9%.

▮ అమెరికన్ మానవ శాస్త్రవేత్త లూయిస్ హెన్రీ మోర్గాన్ ప్రపంచంలో తొలిసారిగా ఆదివాసీల జీవన విధానంపై పరిశోధనలు చేసినవారు. ఈయన 'ది ఏన్షియంట్ సొసైటీ' అనే గ్రంథాన్ని రచించారు. భారతదేశంలో గిరిజనుల జీవనవిధానంపై పరిశోధనలు చేసినవారు వెన్నెలకంటి రాఘవయ్య. ఈయన గ్రంథం 'ట్రైబ్స్ ఇన్ ఇండియా'.



చారిత్రక నేపథ్యం:

ఆదివాసీ ప్రజల హక్కులను పరిరక్షించే లక్ష్యంతో మొదటిసారి ఐక్యరాజ్య సమితి 1982, ఆగస్టు 9న జెనీవాలో ఒక సమావేశాన్ని నిర్వహించింది. దీనికి ప్రేరణగా ఏటా ఆ తేదీన 'అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం'గా నిర్వహించాలని 1994, డిసెంబరులో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానించింది.

☛ 2025 నినాదం: Indigenous Peoples and AI: Defending Rights, Shaping Futures

విజయానికి సోపానాలు.. వర్తమాన అంశాలు!

వివిధ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ విభాగంలో మన చుట్టూ జరిగే ముఖ్య సంఘటనలపై ప్రశ్నలు అడుగుతారు. మీ ప్రిపరేషన్‌కు సాయపడేలా అన్ని ముఖ్యమైన విషయాలను అంశాల వారీగా ఎప్పటికప్పుడు ఈప్రతిభ వెబ్‌సైట్, యాప్ ద్వారా అందించడంతోపాటు సమాచారాన్ని మరింత విశ్లేషణాత్మకంగా మంత్లీ ఈ-బుక్ రూపంలోనూ మీ ముందుకు తెస్తోంది 'ఈనాడు ఈప్రతిభ'. యాప్, వెబ్‌సైట్ రెండింటిలోనూ వీటిని చదవొచ్చు. 2025, జులైలో జరిగిన ముఖ్య సంఘటనలను గమనిస్తే..

జాతీయం

ప్రయాణికులకు రైల్వే సేవలన్నింటినీ ఒకేచోట అందించే సూపర్ యాప్ 'రైల్‌వన్' అందుబాటులోకి వచ్చింది.

దినోత్సవాలు

దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తేదీకి గుర్తుగా ఏటా జులై 1న 'జీఎస్టీ దినోత్సవం'గా నిర్వహిస్తారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

గైడెడ్ క్షిపణి వ్యవస్థతో పాటు శక్తిమంతమైన ఆయుధాలు, నిఘా వ్యవస్థలు కలిగిన యుద్ధనౌక ఐఎన్ఎస్ తమాల్ భారత నౌకాదళంలో చేరింది.

నివేదికలు - సర్వేలు

ఆర్థిక సమానత్వంలో ప్రపంచంలోనే భారత్ నాలుగో స్థానంలో ఉన్నట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక వెల్లడించింది.

✦ ప్రపంచంలో విద్యార్థులకు అనుకూలంగా ఉండే అగ్రశ్రేణి 130 నగరాల్లో దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నైలకు చోటుదక్కింది.



ఇతర అంశాలు, పూర్తి సమాచారంతోపాటు మాదిరి ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో ఉద్యోగాలు

ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసీఎల్) వివిధ విభాగాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 550. దరఖాస్తు ఫీజు రూ.850. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జూనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రాయ్‌బరేలీ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. అర్హులైన అభ్యర్థులు 2025 ఆగస్టు 20న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

డిప్లొమా, యూజీ, పీజీ, సర్టిఫికెట్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ జి. రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2025-26 విద్యా సంవత్సరానికి దూరవిద్య విధానంలో (ఫేజ్-1) అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 15 సెప్టెంబరు 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 9) చివరి తేదీ

▮ టీఐఎఫ్ఆర్‌లో 23 వర్క్ అసిస్టెంట్ పోస్టులు. టెన్త్, ఐటీఐ, బీఈ/ బీటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▮ హెచ్ఎస్ఎల్ విశాఖపట్నంలో 47 ఉద్యోగాలు. డిగ్రీ, బీటెక్/బీఈ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Profit & Loss

Directions (Qs. 1 - 10): *Which of the following statement(s) is/are correct?*

1. I. The cost price of 21 articles is equal to the selling price of 18 articles. The profit percentage is 16(2/3)%.

II. A shopkeeper buys an article for Rs.480 and sells it at a loss of 12%. The selling price is Rs.422.4.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

2. I. A shopkeeper buys 15 pens for Rs.300 and sells them at a profit of 20%. The selling price per pen is Rs.28

II: The cost price of 28 articles is equal to the selling price of 21 articles. The profit percentage is 33(1/3)%.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

3. I. A trader buys 25 notebooks for Rs.750 and sells them at a profit of 25%. The selling price per notebook is Rs.40.

II. The cost price of 32 articles is equal to the selling price of 24 articles. The profit percentage is 33(1/3)%.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

4. I. The successive discounts of 10%, 15% and 20% is equivalent to a single discount of 38.8%.

II. The successive discounts of 12%, 20% and 25% is equivalent to a single discount of 47.2%.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

5. I. A shopkeeper marks his goods at 30% above the cost price and allows a discount of 20% on the marked price. His gain percentage is 4%.

II. A dealer marks his goods at 20% above the cost price and allows a discount of 15% on the marked price. His gain percentage is 2%.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

6. I. On purchase of articles worth Rs.12,000, a shopkeeper offers a flat discount of Rs.600 to his customers. Further, by shopping using a credit card, he gives an additional discount of 8%. If a customer purchases articles worth Rs.12,000 using a credit card, he has to pay Rs.10,488.

II. On purchase of articles worth Rs.15,000, a shopkeeper offers a flat discount of Rs.1,000 to his customers. Further, by shopping using a credit card, he gives an additional discount of 10%. If a customer purchases articles worth Rs.15,000 using a credit card, he has to pay Rs.12,500.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

7. I. A shopkeeper marks a jacket at Rs.4,800 and allows a discount of 15%. If his cost price is Rs.3,600, his profit percentage is 12.5%.

II. The percentage profit earned by selling an article for Rs.3,600 is the same as the percentage loss incurred by selling the same article for Rs.2,400. The cost price of the article is Rs.3,000.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

8. I. The difference (in Rs.) between a discount of 25% on Rs.4,800 and two successive discounts of 20% and 10% on the same amount is Rs.96.

II. A shopkeeper marks his goods at 40% above cost price and allows a discount of 25% on the marked price. His gain percentage is 5%.

A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

9. I. The marked price of a calculator is Rs.2,000. It is sold at two successive discounts of 15% and 5%. The final selling price is Rs.1,615.

II: The marked price of a table is Rs.3,000. It is sold at two successive discounts of 20% and 10%. The final selling price is Rs.2,160.

A) Only I C) Only II
C) Both I and II D) Neither I nor II

10. I. A vendor claims to sell rice at Rs.60/kg, which costs him Rs.62/kg, but he gives only 950 g instead of 1 kg. His approximate percentage profit is 5.26%.

II. A shopkeeper claims to sell almonds at Rs.800/kg, which costs him Rs.820/kg, but he gives only 980 g instead of 1 kg. His approximate percentage profit is 2.04%.

A) Only I B) Only II
C) Both I and II
D) Neither I nor II

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

సాగరగర్భంలో ఆగర్భశత్రువుల సమరనాదం!



రష్యా, అమెరికాలు కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. నిశ్శబ్దంగా సాగర గర్భంలో సంచరించే అణు జలాంతర్గాముల సాక్షిగా రణగొణ ధ్వనులకు దిగాయి. బలప్రదర్శనకు ఈ సబ్‌మెరైన్లను ఎంచుకున్నాయి. రష్యా సమీపంలో వీటిని మోహరిస్తామని ట్రంప్ హెచ్చరిక చేయగా.. మా వద్ద కూడా ఆ తరహా ఆయుధాలు తగినన్ని ఉన్నాయని రష్యా పార్లమెంటు సభ్యుడు విక్టర్ వోడోలాట్‌స్కీ తీవ్రంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల అమ్ములపొదిలో అణు జలాంతర్గాములు ఎన్ని ఉన్నాయన్నది ఆసక్తికరం. అమెరికా, రష్యాల వద్ద నిర్దిష్టంగా ఎన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయన్నదానిపై స్పష్టత లేదు. అమెరికా వద్ద 70 వరకూ, రష్యా వద్ద 63-64 సబ్‌మెరైన్లు ఉండొచ్చని అంచనా.

ఎందుకీ జలాంతర్గాములు

అణు జలాంతర్గాములు శక్తిమంతమైన యుద్ధసాధనాలు. నిశ్శబ్దంగా సాగర గర్భంలో సంచరిస్తూ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తుంటాయి. వీటిని గుర్తించి, నాశనం చేయడం చాలా కష్టం. వీటికి పదేపదే ఇంధనం నింపుకోవాల్సిన అవసరం లేదు. వీటిలోని అణు రియాక్టర్ 15-20 ఏళ్లపాటు నిరాటంకంగా పనిచేస్తుంది. సిబ్బందికి అవసరమైన సరకుల కోసమే తీరానికి రావాల్సి ఉంటుంది. ఈ లక్షణాల వల్ల అణ్వస్త్రాలను దాచడానికి ఈ జలాంతర్గాములు అనువైన వేదికలు. ప్రత్యర్థి వద్ద ఉన్న ఇలాంటి జలాంతర్గాములే.. ఒక దేశాన్ని అణ్వాయుధ దాడికి దిగకుండా నిలువరిస్తుంటాయి. ఒక దేశం.. మరో దేశంపై అణ్వస్త్రాలను ప్రయోగించి, నేలపై ఉన్న ఆ దేశ అణ్వాయుధాగారాన్ని పూర్తిగా నాశనం చేసినా సాగరంలో అణ్వస్త్రాలు కలిగిన జలాంతర్గాములు ఎక్కడో ఉంటాయనే భయమే అణు యుద్ధానికి దిగకుండా చూస్తుంది.

ఎన్ని రకాలు?

అమెరికా, రష్యాలు అణ్వస్త్ర బలాన్ని చాటుకునేందుకు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములు (ఎస్ఎస్‌బీఎన్)పై బాగా ఆధారపడుతున్నాయి. వీటిని బూమర్లు అని కూడా పిలుస్తారు. వీటి ఉత్తేజం వేగం, మధ్యమ కాదు. దీర్ఘకాలం పాటు సముద్ర గర్భంలో దాగి ఉండి.. ప్రత్యర్థి అణు యుద్ధానికి దిగితే ప్రతీకార దాడులు చేస్తుంటాయి.

● ఫాస్ట్ ఎటాక్ జలాంతర్గాములు (ఎస్ఎస్ఎన్)నూ ప్రధాన పోరాట సాధనాలుగా ఈ దేశాలు ఎంచుకుంటున్నాయి. ఇవి కూడా అణుశక్తితో నడుస్తాయి. ఇవి శత్రు యుద్ధనౌకలపై దాడులు, వాటి కదలికలపై నిఘా వంటివి చేయగలవు.

అమెరికా శక్తి..

ఎస్ఎస్‌బీఎన్‌లు: అమెరికా నౌకాదళంలో ఒహాయో తరగతి ఎస్ఎస్‌బీఎన్‌లు అత్యంత శక్తిమంతమైనవి. శత్రువు కంటపడకుండా రహస్యంగా సాగర జలాల్లో సంచరించే స్టెల్త్ సామర్థ్యం వీటి సొంతం. అత్యంత కచ్చితత్వంతో అణు వార్‌హెడ్లను ప్రయోగించగలవు. ఇవి దీర్ఘకాలం పాటు గస్తీ తిరగగలవు. ఒక్కో జలాంతర్గామి 20 ట్రైడెంట్ క్షిపణులను మోసుకెళ్లగలదు. ఇవి బహుళ హైడ్రోజన్ బాంబు వార్‌హెడ్‌లను కలిగి ఉంటాయి.

ఎస్ఎస్ఎన్‌లు: ఈ తరగతి కింద వర్జీనియా, సీవుల్ఫ్, లాస్ ఏంజెలెస్ తరగతి జలాంతర్గాములు అమెరికా అమ్ముల పొదిలో ఉన్నాయి. వీటిలో సంప్రదాయ వార్‌హెడ్‌లు కలిగిన తోమహాక్, హార్పూన్ క్షిపణులు, ఎంకే-48 టోర్పిడోలు ఉంటాయి. ఇవి సాగరంలో శత్రు యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుని మందుపాతరలను అమర్చగలవు. సముద్రంలో ప్రత్యేక బలగాల ఆపరేషన్లకు వీలు కల్పించే వెసులుబాటు వర్జీనియా తరగతిలో ఉంది. ఒక్కో సీవుల్ఫ్ జలాంతర్గామి 50 వరకూ టోర్పిడోలను మోసుకెళ్లగలదు. లాస్ ఏంజెలెస్ తరగతి సబ్‌మెరైన్లు వేగం, గోప్యతకు పెట్టింది పేరు.

ఏవి ఎన్ని ఉన్నాయి?

● ఒహాయో తరగతికి చెందిన మార్పులు చేసిన నాలుగు ఎస్ఎస్‌జీఎన్‌లు అమెరికా వద్ద ఉన్నాయి. వీటిలో అణు వార్‌హెడ్‌లు ఉండవు. సంప్రదాయ పేలోడ్లు కలిగిన తోమహాక్ క్రూజ్ క్షిపణులు ఉంటాయి.

వర్జీనియా తరగతి: 24

సీవుల్ఫ్ తరగతి: 3

లాస్ ఏంజెలెస్ తరగతి: 24

రష్యా: తగ్గేదేలే!

ఎస్ఎస్‌బీఎన్‌లు: రష్యా అమ్ములపొదిలో 14 వరకూ ఎస్ఎస్‌బీఎన్‌లు ఉన్నాయి. వీటిలో ఎనిమిది బొరెయ్, ఆరు డెల్టా-4 తరగతి జలాంతర్గాములు ఉన్నాయి. ఒక్కో బొరెయ్ తరగతి సబ్‌మెరైన్ 16 బులావా క్షిపణులను, ఆరు 533 ఎంఎం టోర్పిడో లాంచర్లను కలిగి ఉంటుంది. ఇవి శత్రు జలాంతర్గాములను విధ్వంసం చేసే రాకెట్లు, మందుపాతరలను ప్రయోగించగలవు.

● డెల్టా-4 తరగతి జలాంతర్గాముల్లో 16 సినేవా బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయి. సముద్రంలో రష్యా అణ్వస్త్ర సామర్థ్యానికి ఇవే వెన్నెముక.

ఎస్ఎస్ఎన్‌లు: రష్యా వద్ద నాలుగు యాసెన్ తరగతి అణు అటాక్ సబ్‌మెరైన్లు ఉన్నాయి. మునుపటి తరం జలాంతర్గాముల కన్నా ఇవి చిన్నగా ఉంటాయి. ఒక్కో ఖైటీ ఐదు 3ఎం54-1 కలిబర్ క్షిపణులను లేదా నాలుగు పి-800 32-40 ఒనిక్స్ మిసైళ్లను కలిగి ఉంటుంది. వీటి సాయంతో దీర్ఘశ్రేణి భూతల దాడులు చేయవచ్చు. నౌకా విధ్వంసక సామర్థ్యాలూ వీటికి ఉన్నాయి. త్వరలో జిర్కాన్ హైపర్‌సోనిక్ క్షిపణులనూ ప్రయోగించే సామర్థ్యాన్ని ఇవి సమకూర్చుకోనున్నాయి.

● రష్యా వద్ద అకులా తరగతి ఎస్ఎస్ఎన్‌లు ఐదు ఉన్నాయి. వీటిని సైలెంట్ కిల్లింగ్ మెషీన్లుగా అభివర్ణిస్తారు. ఇవి కలిబర్, ఒనిక్స్ లేదా గ్రానిట్ క్షిపణులు, టోర్పిడోలను కలిగి ఉంటాయి.

ఎవరిది పైచేయి?

అమెరికా: ప్రపంచవ్యాప్త విస్తృతి

జలాంతర్గాముల సంఖ్యాపరంగా అమెరికా, రష్యాల మధ్య మధ్య తేడా స్వల్పమే. వీటి మోహరింపులు, మోసుకెళ్లే ఆయుధాలు వంటి అంశాలే వాటి వాస్తవ శక్తిని ప్రతిబింబిస్తాయి. మోహరింపు, దీర్ఘ కాలం సముద్రంలో ఉండే సత్తా వంటి అంశాల్లో అమెరికాది పైచేయి. ఆ దేశ జలాంతర్గాములు ప్రపంచవ్యాప్తంగా సంచరిస్తుంటాయి. అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లో గస్తీ తిరుగుతుంటాయి. ప్రత్యర్థుల జలాంతర్గాములపై నిఘా, మిత్ర పక్షాలతో సంయుక్త విన్యాసాలు వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటుంటాయి. తద్వారా ప్రపంచవ్యాప్తంగా జరిగే ఘర్షణల్లో అవి వేగంగా స్పందించే సత్తాను కలిగి ఉన్నాయి.

రష్యా: కొన్ని ప్రాంతాలకు పరిమితం

రష్యా మాత్రం తన జలాంతర్గాములను ఆర్కిటిక్, ఉత్తర అట్లాంటిక్, పసిఫిక్ ప్రాంతాల్లో మోహరిస్తోంది. ఇటీవల అవి నాటో కూటమి దేశాల తీర ప్రాంతాల్లో సంచరించాయి. కొన్ని సందర్భాల్లో అమెరికా తీరానికి చేరువలో కనిపించాయి.

సాంకేతికంగా పోటాపోటీ

అమెరికా అణు జలాంతర్గాముల్లో లార్జ్ అపెర్చర్ బౌ అరే వంటి అధునాతన సోనార్ వ్యవస్థలు ఉన్నాయి. అందువల్ల వాటికి మెరుగైన ట్రాకింగ్, డిటెక్షన్ సామర్థ్యం ఉంటుంది. రష్యా కూడా వేగంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. 1990లలో ఆ దేశ జలాంతర్గామి వ్యవస్థ గందరగోళంగా ఉండేది. గత కొన్నేళ్లలో అది మెరుగుపడింది. అమెరికా సబ్‌మెరైన్లలో కనిపించే సోనార్ వ్యవస్థలనూ అమర్చుకుంటోంది. ఆర్థిక ఇబ్బందులు, అంతర్జాతీయ ఆంక్షలున్నప్పటికీ రష్యాలోని సెవ్‌మాష్ షిప్‌యార్డ్ ఏటా 1-2 అణు జలాంతర్గాములను ఉత్పత్తి చేస్తోంది. ఇదే పద్ధతి కొనసాగితే.. అమెరికా, రష్యాల సబ్‌మెరైన్ బలాబలాల మధ్య తేడా బాగా తగ్గిపోతుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలపై 'సుప్రీం' అసంతృప్తి




దిల్లీ: బృందావన్‌లోని బాంకే బిహారీ ఆలయానికి సంబంధించి యూపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అలహాబాద్ హైకోర్టు జారీచేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. హైకోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'మితి మీరిన భాష' ఎందుకు వాడాల్సివచ్చిందని అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ప్రశ్నించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన 'బాంకే బిహారీజీ ఆలయం ట్రస్ట్ ఆర్డినెన్స్'ను సవాలుచేస్తూ దాఖలుచేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం జులై 21, ఆగస్టు 6న ఆదేశాలను జారీ చేసింది. "ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేయడం ద్వారా యూపీ ప్రభుత్వం పాపానికి ఒడిగట్టిందని హైకోర్టు పేర్కొంది. హైకోర్టు ఇలాంటి మితిమీరిన భాషలో వ్యాఖ్యలు చేయవచ్చా" అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు అనవసరమైన వ్యాఖ్యలు చేసిందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక చట్టం రాజ్యాంగ బద్ధతను పరిశీలించేందుకు డివిజన్ బెంచి ఏర్పాటు చేయడం ఆనవాయితీ, కానీ ఈ కేసులో ఏక సభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది అని జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. యూపీ ప్రభుత్వ ఆర్డినెన్స్‌పై విచారణ జరిపే బాధ్యతను డివిజన్ బెంచ్‌కు అప్పగించే విషయం పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది.

బీఎన్ఎస్ సెక్షన్ 152ను సవాలుచేస్తూ సుప్రీంలో పిటిషన్

● ఇది బ్రిటిష్ భావజాలానికి ప్రతీక అన్న పిటిషనర్

దిల్లీ: ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) స్థానంలో అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 152ను సవాలుచేస్తూ ఓ మాజీ సైనికాధికారి సమర్పించిన పిటిషన్‌పై విచారణ చేపట్టడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకారం తెలిపింది. ఈ సెక్షన్ ఐపీసీలో రాజద్రోహ నేరానికి సంబంధించిన సెక్షన్ 124(ఏ)కు ప్రతిరూపమని, ఇది బ్రిటిష్ పాలనా కాలంనాటి భావజాలానికి అద్దంపట్టే చట్టమని రిటైర్డ్ మేజర్ జనరల్ ఎస్.జి.వోంబట్కెరె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌పై విచారణను ఐపీసీలోని సెక్షన్ 124(ఏ)(రాజద్రోహం)ను సవాలుచేస్తూ దాఖలైన దరఖాస్తులతో కలిపి చేపట్టాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం నిర్ణయించింది. బీఎన్ఎస్ గత సంవత్సరం అమలులోకి రాగా అంతకు ముందు నమోదై పెండింగులో ఉన్న కేసులన్నిటికీ ఐపీసీ వర్తిస్తున్న విషయం తెలిసిందే. వివిధ రూపాల్లో ఉద్దేశపూర్వకంగా దేశ సార్వభౌమాధికారానికి, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారికి జీవిత ఖైదు లేదా ఏడేళ్ల వరకూ కారాగార శిక్షతో పాటు జరిమానా విధించాలని బీఎన్ఎస్‌లోని సెక్షన్ 152 నిర్దేశిస్తోంది. ఐపీసీలో రాజద్రోహ నేరానికి సంబంధించిన సెక్షన్ 124(ఏ)లో మాటల్ని మార్చి ఈ సెక్షన్‌ను రూపొందించారని పిటిషన్ దారుడు పేర్కొన్నారు.

సైఫ్ అలీఖాన్ ఆస్తి వివాదంలో హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే



దిల్లీ: ప్రముఖ బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కుటుంబానికి సంబంధించిన దశాబ్ద కాలం నాటి ఆస్తి వివాదాన్ని పునర్విచారణ కోసం ట్రయల్ కోర్టుకు బదిలీ చేస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం గత జూన్‌లో జారీచేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర స్టే విధించింది. భోపాల్ సంస్థానానికి చివరి పరిపాలకుడైన నవాబ్ హమీదుల్లా ఖాన్ ఆస్తి ఆయన కుమార్తె సాజిదా సుల్తాన్‌కు చెందుతుందని ట్రయల్ కోర్టు 2000 సంవత్సరం ఫిబ్రవరి 14న తీర్పు వెలువరించింది. ఆ తీర్పు ప్రకారం ఆస్తి భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడీకి, ఆయన భార్య నటి షర్మిళా ఠాగూర్‌కు, వారసులు సైఫ్ అలీ ఖాన్, సారా అలీఖాన్, తదితరులకు చెందుతుంది. అయితే చివరి నవాబు ప్రైవేటు ఆస్తి పంపకం న్యాయబద్ధంగా జరగలేదని ఇతర బంధువులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి స్పందించిన మధ్యప్రదేశ్ హైకోర్టు కేసుపై తిరిగి విచారణ జరపాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పుపై తాజాగా సుప్రీంకోర్టు స్టే విధించింది. నవాబు ఆస్తి ముస్లిం పర్సనల్ లా పరిధిలోకి రాదని, అది ఆయన కుమార్తె సాజిదా సుల్తాన్‌కు రాజ్యాంగ నిర్దేశానుసారం లభించిందని ట్రయల్ కోర్టు 2000 సంవత్సరంలో వెలువరించిన తీర్పులో పేర్కొంది. 1960లో నవాబు మరణానంతరం భారత ప్రభుత్వం క్రికెటర్ పటౌడీ తల్లి సాజిదా సుల్తాన్‌ను ఆయన సింహాసనానికి, ఆస్తికి వారసురాలిగా ప్రకటించింది.

ఆటిజం బాధితుల బాగోగులపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

దిల్లీ: ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ వంటి నాడీసంబంధ రుగ్మతలతో బాధపడుతున్నవారి సంక్షేమాన్ని అలక్ష్యం చేస్తున్నారనే ఫిర్యాదుపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ తదితరుల స్పందన తెలపాలని సుప్రీంకోర్టు శుక్రవారం కోరింది. నాడీ రుగ్మతలతో బాధపడుతున్నవారి బాగోగులకు సంబంధించి 1999లో తెచ్చిన నేషనల్ ట్రస్ట్ చట్టం, తదితర చట్టాలను సవ్యంగా అమలు చేయడం లేదని యాక్షన్ ఫర్ ఆటిజం అనే సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. నాడీ రుగ్మతల బారినపడినవారి సంక్షేమం చూసుకోవలసిన బాధ్యత రాజ్యాంగం, అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం మన వ్యవస్థలపై ఉందని గుర్తుచేసింది. రైళ్లలో, విమానాశ్రయాలల్లో ఆటిజం బాధితుల పట్ల ఎలా వ్యవహరించాలో సిబ్బందికి శిక్షణ ఇవ్వడం లేదని తెలిపింది. దీనిపై కేంద్రంతోపాటు మొత్తం అయిదు శాఖలు, సంస్థలకు సుప్రీం నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 29కి వాయిదా వేసింది.

ఎయిరిండియాపై పనిగట్టుకుని దావా వేయతగదు: సుప్రీం

దిల్లీ: ఎయిరిండియా సంస్థ అనుసరిస్తున్న భద్రతా ప్రమాణాలను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని స్వతంత్ర సంఘంతో తనిఖీ చేయాలన్న ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) స్వీకరించడానికి సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. పిటిషన్‌దారు నరేంద్ర కుమార్ గోస్వామి పిల్‌ను ఉపసంహరించుకుని, తన ఫిర్యాదును సంబంధిత సంస్థకు నివేదించాలని సుప్రీం ద్విసభ్య ధర్మాసనం సూచించింది. "ఇటీవల ప్రమాదానికి గురైన ఎయిరిండియానే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? నియంత్రణ సంస్థ పర్యవేక్షణే కావాలనుకుంటే ఇతర విమానయాన సంస్థల భద్రతా ప్రమాణాల గురించి కూడా మీ పిటిషన్‌లో ప్రస్తావించవచ్చు కదా" అని పిటిషన్‌దారును సుప్రీం ప్రశ్నించింది. దానికి పిటిషనర్ బదులిస్తూ తాను ఎయిరిండియా దురదృష్టకర ఘటనకు బాధితుణ్నని వివరించారు. అప్పుడు సుప్రీం న్యాయమూర్తులు తాము కూడా ప్రతివారం విమానాల్లో ప్రయాణిస్తామనీ, ఇటీవల విషాదకర ఘటనను చవిచూసిన విమానయాన సంస్థపై పనిగట్టుకుని దావా వేయడం సరికాదని వ్యాఖ్యానించారు.



రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో శుక్రవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందికి రాఖీలు కడుతున్న మహిళలు



భారతీయ వస్త్రధారణ బాగాలేదా!

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీలోని పీతమ్‌పురా ప్రాంతంలో గల ఓ రెస్టారెంటుకు వెళ్లిన ఈ జంటకు చేదు అనుభవం ఎదురైంది. మీ దుస్తులు బాగాలేవంటూ సిబ్బంది అనుమతి నిరాకరించి, ఇలా బయటే ఆపేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో దిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఘటనను తీవ్రంగా పరిగణించి, దర్యాప్తునకు ఆదేశించినట్లు మంత్రి కపిల్‌మిశ్ర 'ఎక్స్'లో వెల్లడించారు. ఈ వ్యవహారంపై రెస్టారెంటు యజమాని నీరజ్ అగర్వాల్ క్షమాపణలు కోరుతూ వీడియో విడుదల చేశారు.

సుంకాల మోతతో ప్రమాదంలోకి అమెరికా-భారత్ భాగస్వామ్యం

● అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు గ్రిగోరీ మీక్స్ వ్యాఖ్య

న్యూయార్క్: భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల మోత అమెరికా-భారత్ మధ్య ఉన్న బలమైన భాగస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని అమెరికన్ కాంగ్రెస్ ప్రముఖ సభ్యుడు, డెమోక్రాట్ నేత గ్రిగోరీ మీక్స్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "అమెరికా-భారత్ మధ్య ఆర్థిక, లోతైన వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. అయితే ట్రంప్ విధించిన సుంకాల మోతతో ఏళ్ల నుంచి ఉన్న అమెరికా-భారత్‌ల బలమైన భాగస్వామ్యం ప్రమాదంలో పడుతోంది. ఈ సమస్యను రెండు దేశాలు పరస్పర గౌరవంతో పరిష్కరించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు న్యూయార్క్‌కు చెందిన భారత సంతతి పారిశ్రామికవేత్త అల్ మాసన్ మాట్లాడుతూ.. డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ అనుభవజ్ఞులైన నేతలని, వారిద్దరూ నైపుణ్యం కలిగిన వారని, ఇద్దరి మధ్య స్నేహం సంప్రదాయ దౌత్యాన్ని మించి కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఫెడరల్ దళాల చేతికి అమెరికా రాజధాని భద్రత

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో పెరుగుతున్న హింసాత్మక దాడులు, నేరాలను కట్టడి చేయడానికి ఫెడరల్ భద్రతా దళాలను వినియోగించాలని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. తదనుగుణంగా వచ్చే వారం నగరంలో ఫెడరల్ దళాలు పహరా కాస్తాయని వైట్ హౌస్ గురువారం ప్రకటించింది. అవసరమనుకుంటే మరి కొంతకాలం దీన్ని పొడిగిస్తారు. వాషింగ్టన్‌లో శాంతిభద్రతల బాధ్యత ట్రంప్ ఆశిస్తున్నట్లు ఫెడరల్ దళాల చేతికి రావాలంటే, 1973లో పార్లమెంటు ఆమోదించిన హోమ్ రూల్ చట్టాన్ని రద్దుచేయాల్సి ఉంటుంది. అది అనుకున్నంత తేలిక కాదు.

పౌరసత్వం త్యజిస్తున్న భారతీయులు

● ఏటా సగటున 1.49 లక్షల మంది

● గత మూడేళ్లలో ఏటా 2 లక్షలమందికి పైనే

ఈనాడు, దిల్లీ: గత 14ఏళ్లలో 20,86,037 మంది భారతీయులు సుమారు 135 దేశాలకు వలస వెళ్లి అక్కడి పౌరసత్వాలు తీసుకున్నారు. ఆ క్రమంలో స్వదేశ పౌరసత్వాన్ని వదులుకున్నారు. కాంగ్రెస్ ఎంపీ కేసీవేణుగోపాల్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్ శుక్రవారం ఈమేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కరోనా తీవ్రస్థాయిలో ఉన్న 2020లో మినహాయించి మిగిలిన అన్ని సంవత్సరాల్లోనూ భారతీయ పౌరసత్వం వదులుకున్నవారి సంఖ్య ఏటా లక్షకుపైగానే నమోదైంది. గత మూడేళ్లలో ఇలాంటివారి సంఖ్య ఏటా 2లక్షలు దాటింది..

2022లో గరిష్ఠంగా 2.25 లక్షలమంది మాతృదేశాన్ని శాశ్వతంగా వీడివెళ్లిపోయారు. ప్రస్తుతం కొనసాగుతున్న మేధోపరమైన ఆర్థిక వ్యవస్థలో ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్న నేపథ్యంలో కొందరు వ్యక్తిగతంగా పౌరసత్వాన్ని వదులుకొని వెళ్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. విజయవంతమైన, ప్రగతిశీల, ప్రభావశీల భారతీయ జనావళి దేశానికి గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌గా మారిన భారతీయ సంతతి నుంచి దేశం చాలా లబ్ధి పొందుతోందని, వారికున్న నైపుణ్యాలు దేశానికి ఉపయోగపడుతున్నాయని కేంద్ర మంత్రి సభకు తెలిపారు.

సం॥	పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య	సం॥	పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య
2024	2,06,378	2019	1,44,017
2023	2,16,219	2018	1,34,561
2022	2,25,620	2017	1,33,049
2021	1,63,370	2016	1,41,603
2020	85,256	2015	1,31,489
		2014	1,29,328
		2013	1,31,405
		2012	1,20,923
		2011	1,22,819

న్యాయవ్యవస్థపై విశ్వాసం అచంచలం

● వీడ్కోలు సభలో జస్టిస్ ధూలియా




దిల్లీ: దేశంలో న్యాయ వ్యవస్థపై నమ్మకం ఎన్నటికీ సడలబోదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా అన్నారు. శనివారం పదవీ విరమణ చేయనున్న జస్టిస్ ధూలియా తన గౌరవార్థం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ప్రసంగించారు. దేశంలో స్వేచ్ఛకు, న్యాయానికి సుప్రీంకోర్టు ఎప్పటికీ పరిరక్షణ కల్పిస్తూ పథనిర్దేశం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో ఏర్పాటైన లాంఛన ధర్మాసన కార్యకలాపాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశం నలుమూలల నుంచి వచ్చే నిరంతర కేసులకు, న్యాయవాదులకు తాను అలవాటు పడిపోయానని, పదవీ విరమణ అనంతరం "నా హిందుస్థాన్"ను మిస్ అవుతానని న్యాయమూర్తి ధూలియా అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి. అంజారియాలు ఈ ధర్మాసనంలో పాలు పంచుకున్నారు. 'నేను నా హిందూస్థాన్‌ను మిస్ కాబోతున్నాను అని మా ఆవిడకు ఈ ఉదయం చెప్పాను" అని జస్టిస్ ధూలియా అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ జస్టిస్ ధూలియా సేవల్ని కొనియాడారు. అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. 1960, ఆగస్టు 10న జన్మించిన జస్టిస్ ధూలియా న్యాయమూర్తులు, స్వాతంత్ర్య యోధుల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. తాత స్వాతంత్ర్య సమరయోధుడు. 1986లో ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఆయన 2008లో ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జన్మతః పౌరహక్కుకు మరో జడ్జి సమర్థన

గ్రీన్ బెల్ట్: అమెరికా గడ్డపై జన్మించిన వలసదారుల పిల్లలకు జన్మతః అగ్రరాజ్య పౌరసత్వం ఇచ్చే విధానాన్ని అధ్యక్షుడు ట్రంప్ రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని మేరీల్యాండ్ రాష్ట్రంలో ఫెడరల్ జడ్జి డెబొరా బోర్డ్ మన్ గురువారం రూలింగ్ ఇచ్చారు. అమెరికా రాజ్యాంగానికి జరిగిన 14వ సవరణ తాత్కాలిక వీసాదారుల, అక్రమ వలసదారుల సంతానానికి కూడా జన్మతః పౌరసత్వ హక్కును ఇస్తోంది. అయితే ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అధ్యక్ష పదవి చేపట్టగానే ఆ హక్కును రద్దుచేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వు ఫిబ్రవరి 19 నుంచి అమలులోకి వస్తుందని ప్రకటించారు. కానీ, 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం లభించే జన్మతః పౌరసత్వ హక్కును సమర్థిస్తూ తాజాగా జడ్జి బోర్డ్ మన్, ఆమెకు ముందు ముగ్గురు జడ్జిలు రూలింగ్ ఇచ్చారు. స్థానిక కోర్టులు దేశమంతటికీ వర్తించే తీర్పులు ఇవ్వరాదని జూన్‌లో సుప్రీంకోర్టు పేర్కొన్న తరవాత ఈ నాలుగు రూలింగ్‌లూ వెలువడటం గమనార్హం.

అమెరికా ప్రత్యక్ష జోక్యంతోనే భారత్-పాక్ మధ్య శాంతి

● అగ్రరాజ్య విదేశాంగ శాఖ మంత్రి రుబియో



న్యూయార్క్, దిల్లీ: భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరినప్పుడు అమెరికా నేరుగా జోక్యం చేసుకొని శాంతిని పునరుద్ధరించిందని అగ్రరాజ్య విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. ఓ అమెరికా టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. "అధ్యక్షుడు ట్రంప్ భారత్-పాక్ యుద్ధాన్ని అడ్డుకొని శాంతి నెలకొల్పారు. దీంతోపాటు కంబోడియా-థాయ్‌లాండ్, అజర్‌బైజాన్-ఆర్మేనియా ఘర్షణలు 30 ఏళ్లుగా కొనసాగుతున్న రువాండా-కాంగో పోరును సైతం ఆపగలిగాం. అలాగే ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి కోసం ప్రయత్నిస్తున్నాం" అని రుబియో అన్నారు.

ట్రంప్, రుబియో వ్యాఖ్యలను మోదీ ఎందుకు ఖండించరు?: కాంగ్రెస్

భారత్-పాకిస్థాన్ యుద్ధాన్ని అమెరికానే ఆపినట్లు ట్రంప్, రుబియో చేసిన వ్యాఖ్యలను ఖండించడానికి ప్రధాని మోదీ ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ జైరాం రమేశ్ ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించారు. "అమెరికా మధ్యవర్తిత్వంతోనే భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ జరిగిందని మే నెల 10వ తేదీన రుబియో మొట్టమొదటిసారిగా ప్రకటించారు. అప్పటి నుంచి ట్రంప్ 34 సార్లు ఇవే వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు మళ్లీ రుబియో ఇవే ప్రస్తావిస్తున్నారు. దీనిపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

జులై 1 నాటికి ఇజ్రాయెల్‌లో 6,774 మంది భారతీయులు

● కేంద్రమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడి

దిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంఘర్షణ మొదలైనప్పటి నుంచి ఈ ఏడాది జులై 1 నాటికి మొత్తం 6,774 మంది భారతీయ కార్మికులను ఇజ్రాయెల్ తమ దేశంలో పని నిమిత్తం నియమించుకుందని కేంద్రప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ మేరకు రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. "ఉపాధి నిమిత్తం సురక్షిత వలసలకు సంబంధించి భారత్-ఇజ్రాయెల్ మధ్య 2023 నవంబరులో ద్వైపాక్షిక ఒప్పందం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ సంవత్సరం జులై 1 నాటికి 6,774 మంది భారతీయ కార్మికులు ఇజ్రాయెల్‌లో ఉన్నారు. వీరిలో నిర్మాణ రంగంలో 6,730 మంది ఉండగా, 44 మంది సంరక్షకులుగా పనిచేస్తున్నారు" అని వెల్లడించారు. ఇదిలా ఉండగా ప్రైవేటు మార్గాల్లో మరో 13,400 మంది భారతీయ కార్మికులు ఇజ్రాయెల్ వెళ్లినట్లు తెలుస్తోంది.

'చైనా మెగా డ్యాం' పరిణామాలను పరిశీలిస్తున్నాం

● రాజ్యసభకు తెలిపిన ప్రభుత్వం

దిల్లీ: టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నది(యార్లంగ్ త్సాంగ్పో నదిగా పిలుస్తారు)పై చైనా తలపెట్టిన మెగా డ్యాం నిర్మాణానికి సంబంధించిన పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో గురువారం ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టు గురించి 1986లో తొలిసారిగా జనబాహుళ్యానికి తెలిసిందని, అప్పటి నుంచే ఈ డ్యాం నిర్మాణానికి చైనాలో సన్నాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 'చైనా నిర్మిస్తున్న ఈ జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రణాళికలను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలిస్తోంది. మన ప్రయోజనాలను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. డ్యాం దిగువ ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల రక్షణ, జీవనోపాధికి సంబంధించి తగు చర్యలు చేపడుతుంది. 2006లో ఏర్పాటైన సంస్థాగత నిపుణుల స్థాయీ యంత్రాంగం పరిధిలో, అలాగే దౌత్య మార్గాల ద్వారా చైనాతో సరిహద్దు నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చిస్తోంది" అని సింగ్ పేర్కొన్నారు.


చైనాలో వరద బీభత్సం.. 17 మంది మృతి

బీజింగ్: చైనాలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గడిచిన 48 గంటల్లో భారీ వర్షాల కారణంగా గాన్సు ప్రావిన్స్‌లోని యుజోంగ్‌లో వరదలు, కొండచరియలు విరిగి పడి 17 మంది మృతిచెందారు. మరో 33 మంది గల్లంతయ్యారు. వరదల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. అనేక పట్టణాలు నీట మునిగాయి. వరదల్లో గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

రాయి ఢీకొనడంతో లోయలో పడిన కారు

● ఆరుగురి మృతి

శిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఓ కారు ప్రమాదానికి గురి కావడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితో పాటు మరో వ్యక్తి మృత్యువాతపడ్డారు. రాజేష్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గురువారం రాత్రి తన కుటుంబంతో కలిసి కారులో వస్తుండగా, కొండ ప్రాంతం నుంచి పడిన ఓ రాయి వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన కారు 500 మీటర్ల లోయలో పడింది. ఈ దుర్ఘటనలో రాజేష్, అతని భార్య హన్సో(36), కుమారుడు దీపక్ (15), కుమార్తె ఆర్తి(17) బావమరిది హిమరాజ్‌తోతోపాటు లిఫ్ట్ అడిగి కారులో ఎక్కిన మరో వ్యక్తి కూడా చనిపోయారు.



రాష్ట్రంలో వాస్తవ క్యాన్సర్ కేసులు వెలుగులోకి వచ్చేనా?

- ఎన్‌సీడీ-3.0లో కొరవడిన స్పష్టత
- 4.0 సర్వేకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వం
- 200 నుంచి 28 ప్రశ్నలకి కుదింపు

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో క్యాన్సర్ కేసుల తీవ్రతకు.. సేకరిస్తున్న అధికారిక లెక్కలకు పొంతన కుదరడం లేదు. గతేడాది నవంబరులో ప్రారంభమైన ఎన్‌సీడీ (అసంక్రమిత వ్యాధుల)-3.0 సర్వే ఫలితాలపై సందేహాలున్నాయని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సైతం ఇటీవల పేర్కొన్నారు. సుదీర్ఘ ప్రశ్నావళి, సిబ్బందిలో నైపుణ్య లోపం, ఏఎన్‌ఎంలు తదితర సిబ్బందికి ఇతర పని ఒత్తిళ్లతో ఎన్‌సీడీ-3.0 సర్వే నామమాత్రంగా సాగుతోందన్నది ఒక కారణమైతే.. క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన లేకపోవడం, ఆ వ్యాధి ఉందని తేలితే సామాజికంగా ఇబ్బందులు ఎదురవుతాయని వారు భావించడం మరో కారణమని తెలుస్తోంది. దాంతో వాస్తవ పరిస్థితిని అంచనా వేయడానికి ఈ సారి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో తీవ్ర రక్తపోటు, మధుమేహం పీడితులను గుర్తించడానికే ఈ సర్వే పరిమితం కాగా.. తొలిసారిగా 3.0 సర్వేలో క్యాన్సర్ బాధితులనూ గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చికిత్స-సమర్థ సేవలకు ఆ రంగంలో నిపుణుడైన డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ప్రభుత్వం సలహాదారుగానూ నియమించింది. ముందుగా స్క్రీనింగ్ పరీక్షల ద్వారా తీవ్రత గుర్తించేలా ఈ సర్వే చేపట్టింది. ఇప్పటికి 70 శాతం పూర్తయిన ఈ సర్వేలో సరైన ఫలితాలు రాలేదని సర్కారు పేర్కొంది. దాంతో ఆగస్టు కల్లా దీనిని ముగించి.. సెప్టెంబరు నుంచి ఎన్‌సీడీ-4.0 సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో క్యాన్సర్ బాధితుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించనుంది.

ప్రజలు సహకరిస్తేనే..

ఎన్‌సీడీ-3.0 సర్వేలో 200 ప్రశ్నలతో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యం, ఆహార అలవాట్లపై అవగాహన పెంచుతూ, వివిధ రుగ్మతలపై సిబ్బంది ఆరా తీశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 150 ప్రశ్నలకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మరో 50 ప్రశ్నలు జోడించింది. అయితే, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలకు ఒక్కో ఇంటి దగ్గర ఇన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టడం కష్టమవుతోంది. దీనికి తోడు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలకు మహిళలు ముందుకు రావడం లేదన్న వాదనా వినిపిస్తోంది. దాంతో ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి 200 ప్రశ్నలకు బదులు.. ఈ సారి 28 ప్రశ్నలే ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో మూడు ప్రశ్నల ద్వారా తీవ్ర రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షల రీడింగ్ నమోదు చేస్తారు. మిగిలిన 25 ప్రశ్నలు నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై ఉంటాయి. తాజా నిర్ణయంతో క్షేత్రస్థాయి సిబ్బందికి కొంత వెసులుబాటు దక్కినా.. ప్రజలు సైతం సర్వేకు సహకరిస్తేనే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఏటా 30 వేల వరకు మరణాలు..

అధికారిక గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో క్యాన్సర్‌తో ఏటా 30 వేల మంది వరకు చనిపోతుండగా 75 వేల వరకు కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి.

ఎన్‌సీడీ-3.0 సర్వే ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో క్యాన్సర్ బాధితులు ఇలా..

క్యాన్సర్ బాధితులు	20,596
నోటి క్యాన్సర్	5,141
రొమ్ము క్యాన్సర్	8,446
గర్భాశయ క్యాన్సర్	7,009

- ఎన్‌సీడీ-3.0 సర్వేలో నోటి క్యాన్సర్ అనుమానిత కేసులు 1.04 లక్షలు గుర్తించి, పరీక్షల అనంతరం ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ (పీవోయూ)లకు 1,673 మందిని రిఫర్ చేశారు. 48,380 రొమ్ము క్యాన్సర్ అనుమానిత కేసుల్లో 1,789 మందిని, గర్భాశయ క్యాన్సర్ అనుమానిత కేసుల్లో పరీక్షల అనంతరం 886 మందిని పీవోయూకు పంపించారు.
- సెప్టెంబరు 15 నుంచి 4.0 సర్వే రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రారంభిస్తారు. క్యాన్సర్ కేసుల గుర్తింపులో సీహెచ్‌వోలను కీలకం చేసి.. ఏఎన్‌ఎంల భాగస్వామ్యంతో సమగ్రంగా సర్వే పూర్తిచేయనున్నారు. అందులో భాగంగా ఇప్పటికే మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు.

- ఈనాడు, అమరావతి

భాజపాలోకి గువ్వల బాలరాజు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భాజపాలో చేరడం ఖాయమైంది. భారాస నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న బాలరాజు.. ఇటీవలే ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో భేటీ కావడంతో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. భారాసలో తనకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడం, రాజకీయ పరిణామాలు, భాజపాలో చేరేందుకు ఉన్న ఆసక్తి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తనతో బాలరాజు భేటీ అయ్యారని, కమలం పార్టీలో చేరనున్నారని రామచందర్‌రావు మీడియాకు వెల్లడించడంతో భాజపాలోకి బాలరాజు ఎంట్రీపై స్పష్టత వచ్చింది. ఈ నెల 10న బాలరాజు భాజపా రాష్ట్ర కార్యాలయంలో తన అనుచరులతో భాజపాలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.





నీరందించకుండానే.. నీటిపాలు

31 ఏళ్ల క్రితం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మినీ ఎత్తిపోతల పథకం అక్విడక్టు పైపులైను ఒక్కసారి కూడా నీరందించకుండానే గురువారం రాత్రి భారీ వర్షానికి కుప్పకూలింది. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలోని మల్లేశ్వరం గ్రామం వద్ద కృష్ణా వెనకజలాల నుంచి నీటిని తోడి ఎంగంపల్లితండా-మల్లేశ్వరం గ్రామాల పరిధిలో 550 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని 1994లో నిర్మించారు. అప్పట్లో నీటిని తోడేందుకు మోటార్లు, విద్యుత్తు కనెక్షన్ ఇచ్చినా.. ప్రభుత్వాలు మారడం, నాసిరకం పనులతో ఒక్కసారి కూడా వినియోగించలేదు. ఏళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరి భారీ వర్షానికి రెయిలింగ్, పైపులైను సహా ఆరు అక్విడక్టు పిల్లర్లు కూలిపోయాయి.

- న్యూస్‌టుడే, పెంట్లవెల్లి



ఇతరులు చేయలేని పనులు చేయండి!

మీరు జీవితంలో విజయం సాధించాలనుకుంటే.. అత్యధికులు చేయలేని పనులు చేయండి. అవేంటంటే-

- ఉదయం త్వరగా నిద్రలేవడం
- పనులు వాయిదా వేయకపోవడం
- రోజూ పౌష్టికాహారం తీసుకోవడం
- కఠిన సంభాషణల్లో పాల్గొనడం
- ఇతరులపై ఫిర్యాదులు చేయకపోవడం
- కంఫర్ట్‌జోన్‌ను వీడటం

- చార్లెస్ మిల్లర్, కాపీరైటర్

మానవ రహిత మీటర్ రీడింగ్ దిశగా విద్యుత్తు సంస్థ

- తెలంగాణలో ప్రయోగాత్మకంగా కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో అమలు

భగత్‌నగర్, న్యూస్‌టుడే: మానవ ప్రమేయం లేకుండా మీటర్ రీడింగ్‌ను సేకరించే విధానం వైపు తెలంగాణలోని ఉత్తర డిస్కం అడుగులేస్తోంది. దీనికోసం కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో 'ఆటోమెటిక్ రీడింగ్(ఏఎంఆర్)ను ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తోంది. మొదటి దశలో వీటిని పరిశ్రమల్లో బిగిస్తున్నారు. ఈ విధానం విజయవంతమైతే విస్తరించనున్నారు. పరిశ్రమల్లో రీడింగ్‌ను... హైవోల్టేజీ(హెచ్‌టీ) విద్యుత్తు వాడుకునే కేటగిరీలో 55 హెచ్‌పీ మించి సామర్థ్యముంటే ఏడీఈ స్థాయి అధికారి, 55 హెచ్‌పీ సామర్థ్యంలోపుంటే ఏఈ స్థాయి అధికారి సేకరిస్తారు. నాన్ స్లాబ్ రీడింగ్‌ను లైన్‌ఇన్‌స్పెక్టర్లు, స్లాబ్ రీడింగ్‌ను ప్రైవేట్, జూనియర్ లైన్‌మెన్‌లు సేకరిస్తున్నారు.

- కరీంనగర్ జిల్లాలో 992 హెచ్‌టీ సర్వీసులు, 750 తక్కువ సామర్థ్యమున్న పారిశ్రామిక సర్వీసులు ఉన్నాయి. పారిశ్రామిక మీటర్లలో ఆటోమెటిక్ రీడింగ్ ఇన్‌స్ట్రుమెంట్(ఎంఆర్ఐ) ఉంటుంది. దీని సహకారంతో అధికారులు విద్యుత్తు వినియోగాన్ని సేకరిస్తున్నారు. పరిశ్రమల్లోని మీటర్‌కు ఏఎంఆర్ పరికరాన్ని బిగిస్తే... మీటర్‌లోని రీడింగ్‌ను ఎప్పటికప్పుడు వరంగల్‌లోని సెంట్రల్ సర్వర్‌కు వెళుతుంది. ఈ యంత్రంలోని 4జీ సిమ్ వేదికగా డేటా వరంగల్‌కు చేరుతుంది. 'మీటరులో విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా, హెచ్చుతగ్గులున్నా డేటా సెంటర్‌కు సమాచారం వస్తుంది. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలో 25 సర్వీసులకు ఈ యంత్రాన్ని బిగించాం. మిగతా సర్వీసులకు బిగించనున్నాం' అని ఎస్ఈ మేకల రమేశ్‌బాబు తెలిపారు.



ఏఎంఆర్ పరికరం బిగించిన మీటర్



డేటా ఆపేసినా.. ఇంటర్నెట్ కాల్ వస్తోందా?

- అది సైబర్ మోసగాళ్ల 'సిమ్ బాక్స్' దందా కావచ్చు
- గోల్డెన్ ట్రయాంగిల్ ముఠాల సరికొత్త మాయ

ఈనాడు, హైదరాబాద్: సైబర్ మోసగాళ్లు రోజుకో కొత్త విధానంలో పంజా విసురుతున్నారు. మీ సెల్‌ఫోన్‌లో డేటా ఆఫ్‌లో ఉన్నా ఇంటర్నెట్‌కాల్ కనెక్ట్ అవుతుందా...? అంటే లేదనేదేగా మీ సమాధానం. కానీ అది కొంతవరకే నిజం. సైబర్ మోసగాళ్లు కనికట్టు చేస్తే అది సాధ్యమే. అదే 'సిమ్ బాక్స్' మోసం. మయన్మార్, కంబోడియా, లావోస్‌లతో కూడిన గోల్డెన్ ట్రయాంగిల్ కేంద్రంగా శిబిరాలు నడుపుతున్న చైనా ముఠాలు ఇప్పుడు సిమ్ బాక్స్ దందాకు తెరతీశాయి. అక్కడి నుంచి కాల్ చేసినా సరే భారత్‌లో నుంచే మాట్లాడినట్లుగా భ్రమింపజేసేందుకు ఈ కుయుక్తులకు పాల్పడుతున్నాయి. కొద్దిరోజుల క్రితం మంచిర్యాల జిల్లా జన్నారంలో పోలీసులు పట్టుకున్న ముఠా విచారణలో విస్మయకర కోణాలు వెలుగులోకి వచ్చాయి. కంబోడియా నుంచి ఈ దందా సాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఒకేసారి 1024 మందికి కాల్స్

నేరగాళ్లు విదేశీకాల్స్‌ను వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్(వీవోఐపీ) పరిజ్ఞానంతో లోకల్‌కాల్స్‌గా మార్చి మాట్లాడిస్తుంటారు. లైసెన్స్ పొందిన అంతర్జాతీయ లాంగ్-డిస్టెన్స్ ఆపరేటర్(ఐఎల్‌డీవో) నెట్‌వర్క్‌కు చిక్కకుండా రౌటర్‌ల సహాయంతో ఇలా చేస్తుంటారు. దీంతో ఆ కాల్‌కు లోకల్‌కాల్ ఛార్జీలే వర్తిస్తాయి. తద్వారా టెలికం సర్వీస్ ప్రొవైడర్లకు పెద్దమొత్తంలో నష్టం వాటిల్లుతుంది. ఈ తరహా కుయుక్తులనే ఇప్పుడు గోల్డెన్ ట్రయాంగిల్‌లోని చైనా సైబర్‌ముఠాలు అనుసరిస్తున్నాయి. నాగాలాండ్, అస్సాం, మణిపుర్... తదితర ఈశాన్య రాష్ట్రాల నుంచి సిమ్‌కార్డులను సమకూర్చుకొని దేశవ్యాప్తంగా విస్తరించిన తమ ఏజెంట్లకు వాటిని సరఫరా చేస్తున్నాయి. ఒకేసారి వందల సంఖ్యలో కాల్స్ లేదా ఎస్ఎంఎస్‌లు చేసేందుకు సిమ్‌బాక్స్ దోహదం చేస్తుంది. ఒక సిమ్‌బాక్స్‌లో కనిష్ఠంగా 16... గరిష్ఠంగా 1,024 సిమ్‌కార్డుల వరకూ అనుసంధానించే అవకాశముంది. అంటే ఒకేసారి గరిష్ఠంగా 1,024 మందికి కాల్స్ చేసే అవకాశం ఉంటుంది. గోల్డెన్‌ట్రయాంగిల్ శిబిరాల్లోని ముఠాలు ఫోన్ చేస్తే ఇక్కడి సెటప్‌ల ద్వారా లోకల్‌కాల్స్‌గా మారి సైబర్ బాధితులకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ కాల్ అయినప్పటికీ.. సెల్‌ఫోన్ డేటా ఆఫ్‌లో ఉన్నప్పటికీ.. కాల్ కలిసే అవకాశముండటంతో చైనాముఠాలు సైబర్‌మోసాలకు ఈ పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది.

'సంచార్‌సాథీ'లో ఫిర్యాదుకు అవకాశం

అంతర్జాతీయ కాల్స్ గనక లోకల్ నంబరుతో వచ్చినప్పుడు సాధారణంగా సెల్‌ఫోన్ తెరపై 'నో నంబర్' అని చూపిస్తుంది. అలాగే గుర్తు తెలియని నంబరుకు ముందు గనక +91 అని ఉంటే బ్యాంకు వివరాలడిగితే సైబర్ మోసంగా అనుమానించాలి. డీవోటీకి చెందిన https://sancharsaathi.gov.in/ పోర్టల్‌లో రిపోర్ట్ చేయొచ్చు. అలాగే 1963 లేదా 1800110420 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. ఇప్పటివరకు ఈ పోర్టల్‌కు ఉమ్మడి రాష్ట్రాల నుంచి 20,323 ఫిర్యాదులు అందాయి.

కక్షసాధింపుతో ఫిర్యాదు.. ఫలితం 20 ఏళ్ల న్యాయపోరాటం

ఏసీబీ అప్పీలును కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఓ వ్యక్తి కక్షసాధింపుతో చేసిన ఫిర్యాదు ఫలితంగా జూనియర్ అసిస్టెంట్ 20 ఏళ్లు న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. సికింద్రాబాద్ డివిజన్ అదనపు కమిషనర్ కార్యాలయం పన్నుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.అర్షిత్‌కుమార్ రూ.500 ముడుపులు తీసుకుంటుండగా 2005లో పట్టుకున్నారు. బేగంపేటకు చెందిన బి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఇల్లు కొనుగోలు చేసి మ్యుటేషన్ కోసం పత్రాలు సమర్పించగా అర్షిత్‌కుమార్ రూ.500 డిమాండ్ చేస్తూ ఫైలును పెండింగ్‌లో ఉంచారు. దీంతో ఆ వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ట్రాప్ చేసి 2005 ఏప్రిల్ 21న పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏసీబీ కేసును కొట్టివేస్తూ 2013లో తీర్పు వెలువరించగా ఏసీబీ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ ఇటీవల విచారణ చేపట్టారు. ఏసీబీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ముడుపులు తీసుకునే సమయంలో ఫిర్యాదుదారుకు చెందిన ఫైలు అధికారి వద్ద లేదన్న కారణంగా ఏసీబీ కోర్టు కేసును కొట్టివేయడం సరికాదన్నారు. అర్షిత్‌కుమార్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫైలు పెండింగ్‌లో లేనపుడు ముడుపులు ఇవ్వడం, తీసుకోవడం అన్న ప్రశ్నే తలెత్తదని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి కక్షసాధింపు, దురుద్దేశంతో ఫిర్యాదు చేసినట్లు ఫిర్యాదుదారే అంగీకరించారని, అలాంటప్పుడు కింది కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ ఏసీబీ అప్పీలును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సైబర్ నేరాల్లో తెలంగాణకు పదో స్థానం

ఈనాడు, హైదరాబాద్: సైబర్ నేరాల్లో తెలంగాణ రాష్ట్రం పదో స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పరిస్థితి కాస్త మెరుగైంది. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటకలు ఈ ఏడాది కూడా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇండియన్ సైబర్‌క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు దేశంలో నమోదైన సైబర్‌నేరాల జాబితాను విడుదల చేసింది. మిగతా రాష్ట్రాల్లో సైబర్ నేరాలు పెరుగుతుండగా తెలంగాణలో కాస్త తగ్గుముఖం పట్టడం గమనార్హం.

ఈ ఏడాది జూన్ వరకు అత్యధికంగా సైబర్ నేరాలు నమోదైన మొదటి 10 రాష్ట్రాలు

రాష్ట్రం	నేరాలు
మహారాష్ట్ర	1,60,633
ఉత్తర్‌ప్రదేశ్	1,48,219
కర్ణాటక	1,02,896
దిల్లీ	89,646
గుజరాత్	88,383
తమిళనాడు	80,258
రాజస్థాన్	65,222
హరియాణా	66,083
బిహార్	58,857
తెలంగాణ	58,176

- గత ఏడాది(జనవరి నుంచి డిసెంబరు) మహారాష్ట్ర 3,03,173 నేరాలతో మొదటిస్థానంలో నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్ 3,01,057, కర్ణాటక 1,69,384, ఉత్తరాఖండ్ 1,67,892, తమిళనాడు 1,33,427, తెలంగాణ 1,23,447 సైబర్ కేసులతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- ఈ ఏడాది దేశంలో మొదటి ఆరు నెలల్లో రికార్డుస్థాయిలో 12,47,393 సైబర్ నేరాలు నమోదయ్యాయి. అంటే గంటకు దాదాపు 288 మోసాలు జరుగుతున్నాయి.
- తెలంగాణలో సైబర్‌నేరాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

కణాల పునరుత్పత్తి వైద్య పరిశోధనకు బయోవరం కిట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రాణాధార మందుల తయారీలో కీలకమైన కణాల పునరుత్పత్తి ప్రయోగాలకు ఉపకరించే రీ-ఏజెంట్ కిట్లను హైదరాబాద్‌కు చెందిన బయోవరం అంకుర సంస్థ శుక్రవారం ఆవిష్కరించింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఆస్పైర్ బయోనెస్ట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కె.ఐ.వరప్రసాదరెడ్డి, ఫాబా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ పల్లు రెడ్డన్న ఐదు రకాల కిట్లను ఆవిష్కరించారు. వ్యాధి నిర్ధారణ, వైద్య చికిత్సలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ కిట్లను తీసుకొచ్చామని బయోవరం ప్రధాన కార్యకలాపాల అధికారి అపర్ణ రాచమల్లు తెలిపారు. ఈ కిట్లలో కీలకమైంది 'డాడ్ కిట్'. ఇందులోని రీ-ఏజెంట్లు క్యాన్సర్ నియంత్రణ మందుల తయారీపై పరిశోధన చేస్తున్న వారికి ఉపయోగపడనున్నాయి. క్యాన్సర్ వ్యాధిగ్రస్థులపై మందును ప్రయోగిస్తున్నప్పుడు ఈ కిట్‌లోని రీ-ఏజెంట్లు రెండు విధాలుగా పనిచేస్తాయి. క్యాన్సర్ తగ్గేందుకు మందును శరీరంలోకి పంపించినప్పుడు క్యాన్సర్ కణాలు ఎలా చనిపోతున్నాయి? వీటితోపాటు ఇతర కణాలు కూడా క్షీణిస్తున్నాయా? అని రీ-ఏజెంట్లు గుర్తిస్తాయి. బయోవరం వ్యవస్థాపకులు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ లైఫ్‌సైన్సెస్ మెడికల్ డివైజెస్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రావు సంకినేని, భవ్య కన్‌స్ట్రక్షన్స్ సంచాలకుడు సుధాకర్ నల్లపనేని తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు దూరంగా ఆదిమ జాతులు

- తెలంగాణలోని గోండుల్లో 36.6శాతం, చెంచుల్లో 36.3శాతం నిరక్షరాస్యత
- సెస్ అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని గిరిజన వర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ఆదిమ గిరిజన జాతులు నివసించే ప్రాంతాల్లో రోడ్లు, రవాణా ఏర్పాట్లు చేసి, అవసరమైన చోట పాఠశాలలు నిర్మించాలని తాజాగా ఓ అధ్యయనం సూచించింది. గిరిజన వర్గాల్లో విద్య, ప్రభుత్వ పథకాల గురించి నిరంతరం అవగాహన కల్పించి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో స్థానికంగా ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. తద్వారా ఆర్థికంగా అభివృద్ధితో పాటు గిరిజన విద్యార్థుల్లో డ్రాపవుట్ల రేటు తగ్గించవచ్చని తెలిపింది. ప్రభుత్వ విధానాల తయారీలో గిరిజన నాయకుల్ని భాగస్వామ్యం చేయాలని సూచించింది. తెలంగాణలోని గిరిజన విద్య, ఉపాధి తదితర అంశాలపై సెస్ బృందం అధ్యయనం చేసింది.

గిరిజన వర్గాల్లో డ్రాపవుట్లు ఇలా...

గోండు	44.2శాతం
కోయ	31.2శాతం
చెంచు	60.9శాతం
కొలాం	43.8శాతం
లంబాడి	34.8శాతం

ముఖ్యాంశాలు ఇలా...

తెలంగాణలో 32 గిరిజన సమూహాలు ఉన్నాయి. ఆదిమజాతి గిరిజనుల్లో అక్షరాస్యత తక్కువ. పేదరికం అధికం. విద్య, ఉపాధిపై అవగాహన కొరవడింది. గోండుల్లో 36.6శాతం, చెంచుల్లో 36.3శాతం నిరక్షరాస్యత నెలకొన్నట్లు అధ్యయనంలో భాగంగా చేపట్టిన సర్వేలో తేలింది. ప్రాథమిక విద్యలో చెంచు, కొలాం వర్గాలు ముందున్నా ఆ తరువాత ఉన్నత విద్యలో ప్రాతినిధ్యం తక్కువ.

- ఆదివాసీలలో చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని పట్టణ ఉపాధికి సిద్ధం చేయడం లేదు. విద్య, ఉపాధి ప్రాధాన్యాన్ని గుర్తించడం లేదు.
- నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఆ కోర్సు పూర్తికాకముందే మధ్యలో వదిలేస్తున్నారు. పలువురు యువత గిరిజన ప్రాంతానికి అవతల ఉపాధికి వెళ్లడానికి ఇష్టపడటం లేదు. కొందరు పట్టణాల్లోని ఉద్యోగాల్లో ఇమడలేక తిరిగి వెనక్కు వచ్చేస్తున్నారు.
- పదో తరగతి తరువాత డ్రాపవుట్లు గిరిజనుల్లో అధికంగా ఉన్నాయి.
- ఉన్నత చదువులకు పట్టణాలకు పంపిస్తే అక్కడి అలవాట్లతో సంప్రదాయ సంస్కృతి దెబ్బతింటుందన్న భయం నెలకొంది. దాంతో యుక్తవయసు రాగానే చదువు మాన్పించి కుటుంబ సభ్యులు పిల్లల్ని తమ వెంట కూలిపనులకు తీసుకెళ్తున్నారు.
- చెంచు, కొలాం, గోండులకు వ్యవసాయ భూమి లేకపోవడంతో ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. సరైన నివాస గృహాలు, ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడంతో వివక్ష ఎదుర్కొంటున్నారు.



పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

భారతీయ రైల్వేను ప్రైవేటీకరించే ప్రణాళిక లేదు

ఈనాడు, దిల్లీ: భారతీయ రైల్వేను ప్రైవేటీకరించే ప్రణాళికేదీ తమకు లేదని రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అన్ని రైల్వేలను, ఉత్పత్తి యూనిట్లు, వర్క్‌షాపులు భారతీయ రైల్వేలో అంతర్భాగమేనని స్పష్టంచేశారు. రైల్వేట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ, రోలింగ్‌స్టాక్ అంతా రైల్వేశాఖ యాజమాన్య పరిధిలో ఉందని చెప్పారు. రైళ్ల, స్టేషన్ల నిర్వహణ, రైళ్ల ఆపరేషన్ అంతా రైల్వేనే చేస్తుందని స్పష్టంచేశారు.

పీఎం కిసాన్ కింద ఏపీ రైతులకు మూడేళ్లలో రూ.9,191 కోట్ల చెల్లింపు

పీఎం కిసాన్ పథకం కింద 2022 ఏప్రిల్ నుంచి 2025 జులై మధ్య చెల్లించిన 10 వాయిదాల్లో ఆంధ్రప్రదేశ్ రైతుల ఖాతాల్లోకి రూ.9,191.26 కోట్లు వేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

ఎయిమ్స్ కేంద్రాల్లో సగటున 41.01% పోస్టులు ఖాళీ

- 51.13% ఖాళీలతో మూడోస్థానంలో మంగళగిరి
- 27.32%తో చివరి నుంచి రెండోస్థానంలో బీబీనగర్

ప్రతిష్ఠాత్మక వైద్య విద్యాసంస్థలుగా చెప్పుకొనే 19 ఎయిమ్స్‌ల్లో సగటున 41.01% బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో మదురై(73.22%), రాజ్‌కోట్(58.47%), మంగళగిరి(51.13%) తొలి మూడు స్థానాలను ఆక్రమించాయి. తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్ 27.32% ఖాళీలతో చివరి నుంచి రెండోస్థానంలో నిలిచింది. విద్యార్థి-టీచర్ నిష్పత్తి భోపాల్, భువనేశ్వర్, నాగ్‌పుర్(2.66:1)లలో బాగుంది. గోరఖ్‌పుర్(5.43:1), దేవ్‌ఘడ్(4.14:1), మంగళగిరి(4.13:1)ల్లో తేడా ఎక్కువగా ఉంది. బీబీనగర్‌లో ఇది 3.57:1గా ఉంది. ఎయిమ్స్ భోపాల్ 77%, రాయ్‌పుర్‌లో 62% మంది బోధనా సిబ్బంది పనిచేస్తున్నారు. మంజూరుచేసిన పోస్టుల ప్రకారం అత్యధిక పోస్టులు భర్తీచేసిన ఎయిమ్స్ ఇవి రెండే. తమిళనాడు మదురైలో మాత్రం 183 పోస్టులకుగాను కేవలం 49 మాత్రమే భర్తీ అయ్యాయి. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర వైద్యశాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ ఇచ్చిన సమాధానం ఈ విషయాన్ని వెల్లడించింది.

కేటాయింపుల ప్రకారం ఎరువుల సరఫరా

- ఏపీకి అందుబాటులో తగినన్ని నిల్వలు

దేశంలోని అన్ని రాష్ట్రాలకూ కొరత లేకుండా నెలవారీగా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పంట సీజన్ ప్రారంభం కాక ముందు వ్యవసాయశాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి ఎరువుల అవసరాన్ని అంచనా వేస్తుందని పేర్కొన్నారు. దాని ప్రకారం రాష్ట్రాలు, నెలల వారీ అంచనాలను కేంద్ర వ్యవసాయ శాఖ తమకు అందిస్తుందని చెప్పారు. ఆ లెక్కలను బట్టి అవసరాలకు తగ్గట్టు రాష్ట్రాలకు ఎరువులను కేటాయిస్తామని వివరించారు. ఎరువుల బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలపై రాష్ట్రప్రభుత్వాలు చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 1 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 577 తనిఖీలు నిర్వహించినట్లు వివరించారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వల విషయంలో రెండు షోకాజ్ నోటీసులు జారీచేసి, లైసెన్స్‌లు రద్దుచేసినట్లు చెప్పారు. నాసిరకం ఎరువులపై ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వుల అమలుకు గడువు కోరుతూ.. ఏపీ వైద్య మండలి రివ్యూ పిటిషన్

ఈనాడు, అమరావతి: విదేశీ వైద్య గ్రాడ్యుయేట్ల (ఎఫ్ఎంజీ) రిజిస్ట్రేషన్ల విషయంలో న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు మరికొంత సమయం ఇవ్వాలని ఏపీ వైద్య మండలి (ఏపీఎంసీ) హైకోర్టును గురువారం అభ్యర్థించింది. ఎఫ్ఎంజీల ఇంటర్న్‌షిప్ వ్యవధిపై స్పష్టత కోరుతూ రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను వైద్యారోగ్యశాఖ మంత్రి కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. విదేశీ వైద్య విద్యార్థుల రిజిస్ట్రేషన్లలో జాప్యాన్ని సవాలు చేస్తూ గతంలో కొందరు విద్యార్థులు వేర్వేరుగా హైకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఓ విద్యార్థి విషయంలో జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా భారత రాయబార కార్యాలయం నుంచి ధ్రువీకరించుకుని నెల రోజుల్లో శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలని ఏపీఎంసీని హైకోర్టు ఆదేశించింది. మరో నలుగురు దాఖలు చేసిన వ్యాజ్యంలో.. ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా అమలయ్యే ఎన్ఎంసీ నిబంధనలతో ఎఫ్ఎంజీల రిజిస్ట్రేషన్ల వ్యవహారం ముడిపడి ఉన్నందున హైకోర్టు ఉత్తర్వుల అంశాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఎన్ఎంసీ దృష్టికి తీసుకెళ్లారు. ఆన్‌లైన్‌లో చదివిన ఎఫ్ఎంజీలకు ఆఫ్‌లైన్ క్లాసులు ఎన్నిరోజులు అవసరం..? ఆయా దేశాలు జారీచేసే ప్రత్యామ్నాయ స్టడీ సర్టిఫికెట్‌లో ఎలాంటి వివరాలు పొందుపరచాలన్నది స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ఎన్ఎంసీ ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్‌తోపాటు.. ఆన్‌లైన్ స్టడీ భర్తీకి ఒకటి లేదా రెండేళ్లు అదనంగా క్లినికల్ శిక్షణ తప్పనిసరి అని తేల్చి చెప్పింది. ఈ అదనపు శిక్షణ కాలం వారి పాస్‌పోర్టు ఎంట్రీల ఆధారంగా నిర్ణయిస్తామని వెల్లడించింది. విదేశీ విద్యాలయాలు జారీచేసే సర్టిఫికెట్లలో అకడమిక్, క్లినికల్ కోర్సుల వివరాలు, అధ్యయన కాలం ఉండాలని, వీటిని ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు ధ్రువీకరించాలని పేర్కొంది. విదేశీ వైద్య విద్యార్థుల ఇంటర్న్‌షిప్ నిబంధనల అమలులో రాజీకి తావులేదని ఎన్ఎంసీ స్పష్టంచేయడం, న్యాయస్థానం ఆదేశాల అమలుకు గడువు సమీపించడంతో ఏపీఎంసీ రివ్యూ పిటిషన్ వేసినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది.

మూడు వ్యవసాయ ల్యాబ్‌లకు ఎన్ఏబీఎల్ గుర్తింపు

ఈనాడు, అమరావతి: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని మూడు ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్) గుర్తింపు లభించింది. నెల్లూరులోని జీవ, సేంద్రియ ఎరువుల నాణ్యత నియంత్రణ ప్రయోగశాల, బాపట్లలోని ఎరువుల నియంత్రణ ప్రయోగశాల, కర్నూలులోని పురుగుమందుల పరీక్ష కేంద్ర ప్రయోగశాలలకు ఈ గుర్తింపు దక్కింది. వ్యవసాయరంగంలో నాణ్యతా ప్రమాణాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వీటికి ఈ గుర్తింపు లభించిందని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ప్రయోగశాలలకూ ఎన్ఏబీఎల్ గుర్తింపు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.